నారాయణమూర్తి, భోగరాజు

చంద్రగుప్త, లేక ఉద్దండ చాణక్యము

Madras, 1913

Record no. 744

Nārāyaṇamūrti, Bhōgarāju.

Candragupta, lēka uddaṇḍa Cāṇakyamu

Madras, 1913

Record no. 744

నారాయణమూర్తి, భోగరాజు.

చంద్రగుప్త, లేక ఉద్దండ చాణక్యము : చరిత్ర విషయికమగు నవల / భోగరాజు నారాయణమూర్తిచే రచింపబడినది. - 1. కూర్పు. - Madras : వావిళ్ళ రామిస్వామిశాస్త్రులు అండ్ సన్స్, 1913.

viii, xxiv, 291 p. ;18 cm.

Record no. 744

Nārāyaṇamūrti, Bhōgarāju.

Candragupta, lēka uddaṇḍa Cāṇakyamu : caritra viṣayikamagu navala / Bhōgarāju Nārāyaṇamūrticē racimpabaḍinadi. - 1. kūrpu. - Madras : Vāviḷḷa Rāmisvāmiśāstrulu aṃḍ Sans, 1913.

viii, xxiv, 291 p. ;18 cm.

Record no. 744

744

ಚಂದ್ರಗುಪ್ತ

129
5178

ఆంధ్ర గ్రంథరత్నమాల

మూఁడవ రత్నము.

చంద్రగుప్త

లేక

ఉద్దండచాణక్యము.

(చరిత్రాత్మకమగు నవల)

గ్రంథకర్త:

నారాయణమూర్తి.

ఆంధ్రగ్రంథరత్నమాల
3-వ రత్నము.

Chandra Gupta

చంద్రగుప్త

(చరిత్రవిషయికమగు నవల.)

భోగరాజు. నారాయణమూర్తిచే
రచింపఁబడి

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
ఆదిసరస్వతీనిలయ ముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడినది.

మొదటి కూర్పు.

1913.

[వెల రూ. 1-4-0

రాజపోషకులు.

శ్రీనాయని. వేంకటరంగారావు బహద్దరువారు
మునగాల.

శ్రీకందుకూరి. బాలసూర్యప్రసాదరావుపంతులు బహద్దరువారు
ప్రసాదనగరము (దేవాది).

శ్రీరాజా విశ్వేశ్వరనిశ్శంక బహద్దరువారు
సంగమువలస.

శ్రీపుక్కెళ్ల. తమ్మయ్యనాయుడుగారు
బారున.

పోషకులు.

బెందాళము. లచ్చయ్యనాయుడుగారు
సుండపల్లి.

అంకితము.

సీ. విజ్ఞానచంద్రికా•విబుధమండలశిరో
భూషణుండే మృదు•భాషణుండు ?
మాతృభాషాసతీ•మానసక్లేశని
వారణుం డేశుభ•కారణుండు ?
చారిత్రకాజ్ఞాన•సాంద్రతిమిరలోక
బాంధవుం డేశ్రిత•బాంధవుండు ?
ఆంధ్రగీర్వాణ మ•హారాష్ట్రహూణ వా
క్కోవిదుం డే సుక•లావిదుండు ?
తే. ఆ కొమర్రాజకుల కల•శాంబునిధి సు
ధాకరుండు; సదా విబు•ధాకరుండు
మహిత వేంకట లక్ష్మణా•మాత్యమౌళి
కతఁల భక్తిని దీని నం•కిత మొనర్తు.

ఇట్లు,
గ్రంథకర్త.

ఆంధ్రమహాజనులకు

విజ్ఞప్తి.

తానొకటిఁ దలఁచిన యెడల దైవ మింకొకటిఁ దలచును గదా? మా ఆంధ్రగ్రంథరత్నమాలలో ప్రథమరత్నముగాఁ బ్రకటింపనెంచిన యీచంద్రగుప్తను, తృతీయగ్రంథముగా నైనఁ బ్రకటించు భాగ్యము మాకిన్నాళ్లకు లభించినది. దుష్టుల వలన మహారణ్యములోఁబడి మృత్యువు నోటినుండి తప్పించుకొని కడకు సింహాసనమెక్కుట కెన్నియో కష్టము లనుభవించిన చంద్రగుప్తుని చరిత్రమగుటచేఁ గాఁబోలు నీగ్రంథము గూడ నెన్నియోకష్టము లనుభవించి నేటి కాంధ్ర దేశమున సంచరింపఁ గలిగినది? "చంద్రగుప్త మాకింకదక్కదు" అని మొదటినుండియు నిరాశతోనున్న మాకు ఈగ్రంథము లభించుటయే కాక ప్రకటించుభాగ్యము గూడఁ గలిగినందునఁ బూర్వపు కష్టములన్నియుఁ బ్రస్తుతానందము వలన మేము మఱచి పోయితిమి. కావున వానినెల్ల నిందువ్రాయఁజాలము.

స్వకార్యభంగమునకైన నోర్చి శ్రమయనక మహారాష్ట్రిభాషలోనున్న యీకథారత్నమును తెనుఁగున మాకు

వినిపించి మాచే నీగ్రంథమును వ్రాయించిన మ-రా-రా-శ్రీ, జి. గోపాలస్వామి అయ్యరుగారికి మాకృతజ్ఞతా వందనము లర్పించుచున్నారము. కలదోసములను చదువరులు మన్నింతురుగాక.

ఇట్లు,
గ్రంథకర్త.

విషయసూచిక.

మొదటిభాగము.

విషయము. పుట.

ఆంధ్రగ్రంథరత్నమాల

బరంపురము.

అచ్చుకొరకు సిద్ధముగనున్న గ్రంథములు.

1. చరిత్రవిషయికమైన యొకపద్యకావ్యము. అత్యద్భుతముగ నుండును.

2. సంఘదురాచారములవలన నాంధ్రదేశమునకుఁ గలుగుచున్న కష్టములను దెలుపు మనోహరమగు నొకనవల. అద్వితీయము.

3. ఆంగ్లేయభాషలో సయితము నిట్టి యుద్గ్రంథము లదాయను సందియముఁ గల్గించు చరిత్రాత్మక మగునొక నవల.

☞ కారణాంతరములచే మీఁద వివరించినగ్రంథముల నామములు పేర్కొనకుండుటకుఁ జదువరులు మన్నింతురుగాక. గానిని ముందుముందు తెలియఁజేసెదము.

ఇట్లు
కార్యదర్శి.


దరఖాస్తు ఫారము.

అయ్యా!

నన్నుఁ దమగ్రంథమాలలో శాశ్వతపు చందాదారునిగాఁ జేర్చుకొని మీరుప్రకటించు గ్రంథములన్నియు నెప్పటి కప్పుడు నాకు వి. పి. మూలముగఁ బంపుచుండవలెను. ప్రవేశ రుసుము 2 అణాలు నిందుతో బంపినాను. లేదా వి. పి. తోఁ గలిపి వసూలు చేయవచ్చును.

పేరు..
హోదా..
గ్రామం..
పోస్టు.................. జిల్లా ....

సంతకము.



సుందరీ ! కూ్రరాత్ముఁడనై నేనుచేసిన యపరాధమును క్షమించి నన్ను మన్నింపుము.

చంద్రగుప్త

ఉపోద్ఘాతము.

I.

వత్సలాభము.

"అన్నన్నా ! ఎంతకష్ట మెంతకష్టము? సర్వేశ్వరుండు వీరిహృదయములు వజ్రములతో నిర్మించెనుకాబోలు? దినదినము నీమ్లేచ్ఛులయార్భాటములు మితిమీఱుచున్నవి కాని యెన్నఁటికిని శాంతివహింపకున్నవి. అన్నా ! ఆర్యావర్తవాసుల కెట్టిగతి సంభవించినదో చూచితివికదా?"

"తమ్ముఁడా! రాజ్యకాంక్ష యుక్తాయుక్తములఁ దలఁపనీయదు. ఏక్షణమున శత్రువులు దమరాజ్యములపైఁ బడుదురో యని ప్రాణములరచేతుల నిడికొని సామంతభూకాంతు లందఱు దినము దీర్ఘాయువుగాఁ గడపుచున్నారు. రాజులే యిట్టి దీనదశయందుండ నింకఁ బ్రజలకష్టములకు మేర లేదుకదా?"

"ఔనౌను. ఇంతియకాక యీగ్రీకువారు యజ్ఞదీక్షాపరు లగుటచేత గోవధఁగూడఁ జేయుచున్నారఁట. అందుచే నెవ్వరును దమతమగోవులను మేఁతకుఁ బంపుట మాని యిండ్లలోనే కట్టి మేపుకొనుచున్నారు."

"మఱియొకసంగతి. మాతృభూమి యగుమనయార్యావర్త దేశము నందంతట గ్రీక్కుసామ్రాజ్యమును స్థాపించి ఆర్యవంశజు లగుమహారాజుల నెల్లఁ దనకు సామంతులుగఁ జేసికొని నిరంకుశముగఁ బరిపాలింప నుద్దేశించిరియే గ్రీక్కుప్రభు వగుసికందర్‌ఫాదుషా (**Alexander the Great**)

యిచ్చటఁ బ్రవేశించెను. మనదురదృష్టముచేతను వానియదృష్టముచేతను వాని మనోరథ మిప్పటికి సానుకూలముగనే యున్నది."

"ఏమిసానుకూలముగ నున్నది. రాజులను, ప్రజలను బాధించుట దక్క వాని కెట్టిప్రయోజనమును గలుగలేదుకదా?"

"అయ్యో! నాయనా! ప్రయోజనము లేకేమి? గాంధారరాజ్యమును, పంజాబుదేశమును దనవశముఁజేసికొనుటయే కాక అక్కడక్కడ నున్నపల్లెలుఁ బట్టణములు నాక్రమించి యవనులు విఱ్ఱవీఁగుచున్నారు. ఇంత కన్న నింకేమి కావలయును?"

"అన్నా! మాటలసందడి నడుగ మఱచితిని. పర్వతరాజేమో మరల ఘామసాను శరణువేడుకొనెనఁట నిజమేనా?"

"ఔను. నిజమే. పవిత్రవంతమగు నార్యవంశమున జనించినవాఁడే యయ్యు మాతృదేశాభిమాన మింతయైన లేక మూర్ఖుఁడగుపర్వతరాజు తన్ను మ్లేచ్ఛు లోడించి తనరాజ్య మాక్రమించి రనుపౌరుష మీషణ్మాత్రమును లేక సాటిభూపాలుర నవ్వెదరను లజ్జయైనఁ జెందక "నే ననిశమ్మును నీశత్రులలోఁ జేరి నీరాజకార్యములకుఁ దోడగుచు హిందూదేశసామ్రాజ్యసంపాదనయందు నీకు శక్తివంచనలేక సాహాయ్యమొనర్చెదను గాన నన్ననన్యునిగా భావింపక నీమిత్రకోటిలో నొక్కనిగా నెంచి నారాజ్యమును మరల నాస్వాధీనమును జేయఁ బ్రార్థించుచున్నాఁడ" అని వేడుకొనఁగా అలగ్జాండరు వానిసాహాయ్య మపేక్షించి యందుల కంగీకరించెను" "దుర్మార్గుఁడు - దుర్మార్గుఁడు."

"దుర్మార్గుఁడు కావుననే పరపక్షమునఁ జేరెను. ఐనను ఏమహానుభావుఁడైన బయలుదేఱి యీదేశద్రోహుల నందఱ శిక్షించి మాతృదేశము నుద్ధరింపఁడా?"

అని యొకనాఁటిసాయంకాల మాఱున్నర గంటలకు హిమవత్పర్వత ప్రాంతస్థితారణ్యసమీపమునం గలయొక గొల్లపల్లెయం దొకయింటియరుగు

పైఁ దాటాకులచాఁప వేసికొని కూర్చుండి యిరువురు గొల్లవాండ్రు సంభాషించుచుండిరి. వారిచుట్టును గల మఱికొందఱు గోపాలు రామాట లాలకించుచు మధ్యమధ్యఁ దమకుఁ దోచినతెఱంగు తాముగూడఁ బ్రసంగించుచుండిరి. పున్నమ యగుట నన్నాఁటిరేయి షోడశకళాపరిపూర్ణుండగు రాకానిశాకరుం డాకాశభాగం బలంకరించి తనశ్వేతకాంతుల మల్లెపూలవలె భూమండలమునం దంతట వెదజల్లుచుండెను. పిండియారఁబోసిన ట్లెల్లెడల నిండిన పండువెన్నెలలవలనఁ గలిగిన యానందముచేతనో, లేక సాయంకాలమునుండియు నొక్కతీరున సలుపుచువచ్చిన దీర్ఘసంభాషణముచేతనో కాని వారు పరవశులై కాలము మఱచి యెప్పటికిని లేవక యదే తీరున నచ్చటనే కాలముఁబుచ్చుచుండిరి. ఆనాఁ డట్లు వారు సంభాషించుకొనుచునుండఁ గొంతసేపున కెచ్చటనుండియో యొకగోపబాలుఁడు పరుగుపరుగున నచ్చటి కరుదెంచి సంభాషించుచున్నవారిలోఁ గడువృద్ధుఁడగు తనజనకునిం గాంచి.

"నాయనా! సాయంకాలమునుండియు వెదకుచున్నాఁడను మన లేఁగదూడ యెచ్చటను గానరాకున్నది. ఏమైనదో తెలియదు" అని వచింపఁ దోడనే యావృద్ధుఁ డదరిపడి లేచి యత్యాతురముతో "అఁ— మనలేఁగదూడ యేమైనది? రెండుగంటలక్రింద నీచేరువనే మేయుచుండఁ జూచితినే! ఇంతలో నేమయ్యెను? చక్కఁగా వెదకితివా? అని యాలేఁగపైఁ దనకుఁగల యనురాగమంతయు నుట్టిపడునట్లు సారెసారె కాందోళనముతో నడుగుచుండ నాగోపబాలుఁడు తన యజాగ్రత్తకుఁ దండ్రి యేమనునో యనుభయముచేతనో దూడ కానరాకున్నది కదా యను దుఃఖముచేతనో వానికేమియుఁ బ్రత్యుత్తరమీయక కన్నీరుఁగార్చుచు నచ్చటనే నిలిచియుండెను. ఇంక నధికసంభాషణం బప్రయోజనం బని తలంచి యప్పుడే యాముసలిగొల్లఁడు లేచి తనకన్న నించుమించుగ రెండుమూఁడుమూర లెక్కుడుపొడవు గలయొక చేపాటికఱ్ఱను చేతనూని తదన్వేషణార్థము బయలుదేఱెను. పరిపరివిధములఁ దన కత్యంతప్రియ మగు లేఁగదూడను

ముద్దుపేరులతోఁ బిల్చుచు రవంతయు విసుగూనక శ్రమయనక పోయిపోయి యాపల్లెకు సమీపమునంగల యరణ్యమునఁ బ్రవేశించి గట్టులు, మిట్టలు, పల్లములు, బావులు నన్నియు నతిజాగరూకతతో వెదకెనుగాని పాపమా లేఁగ వాని కెచ్చటను దృగ్గోచరము కాలేదు.

"అక్కటా! నేఁ డెంతటి దుర్దినము? దాని నే క్రూరజంతువు తన కాహారముగఁ జేసికొనెనో కదా? అట్లుకానిచో భూతదయాహీను లై, క్రూరమతావలంబకు లై దుర్మార్గసంచారు లై ప్రాణకోటికత్యంతసంతాపముఁ గల్గించుచున్న మ్లేచ్ఛులే తమయజ్ఞకార్యార్థ మాదూడను గొనిపోయి యుందురు. అ దెట్లు జరుగును? సాయంకాలమువఱకు నీ సమీపముననే మేయుచుండెనుగదా? ఇంతలో నేద్రోహి దాని నపహరింపఁగలఁడు? ఇదిగాక గోమేధమునకు లేఁగదూడ యేల? ఏమో? యుక్తాయుక్తవిహీనులకు ధర్మవిచక్షణ మెక్కడ? భూతదయ యెక్కడ?......కాదుకాదు.. త్రోవఁ దప్పి యిదెక్కడనో చిక్కుపడి యుండును..... త్రోవఁదప్పిన నింతదూరము వెదకితి నెచ్చటను గానరాదా? ఏదో దుష్టమృగము దానినిఁ గడుపునఁబెట్టుకొని యుండును. అయ్యో! ఇన్నాళ్లు దాని నెంతముద్దుగఁ బెంచితిని ఆ ఋణానుబంధము నేఁటితోఁ దీఱిపోయెను కాఁబోలు!"

అని యమ్ముసలి పలువిధములఁ దనలో వితర్కించి విచారించుచు వెదకలేక విసుగుజనించుచున్నను లేగపైఁ గలయనురాగము త్రెంచుకొనలేక, త న్నావేశించిన యాశాపిశాచము వెనుకకుఁ దిరుగనీయక యూరక యీడ్చుకొని పోవుచుండ నయ్యరణ్యమునందంతట సంచరించుచుండెను. అట్లుపోవంబోవ ననతిదూరముననే యవ్వెన్నెల కాంతియం దొకచిన్నగుట్ట వానికి దృగ్గోచరమయ్యెను. దానిపై కెక్కి నలువంకలఁ గలయఁజూచిన యెడలఁ జుట్టుపట్టుల నెచ్చటనైన దూడ కాన్పించునేమో యనుభ్రాంతిచేత నాముసలి గొల్లఁ డచ్చటికిఁ బోయి చేతం గలచేపాటికఱ్ఱను నేల నానుచు మెల్లమెల్లఁగ నాగుట్టనెక్కి యెల్లెడలఁ జక్కఁగఁ బరిశీలించెను. కాని అంతమాత్రమున వానికార్యము ఫలింపలేదు. ఏమిచేయుటకు నెందుఁ

బోవుటకును దోఁపక యూరక పిచ్చివానివలెఁ గొంతవఱ కచ్చటనే నిలిచి తదుపరి ఆగుట్టదాఁటి రమారమి నూఱుగజములు నడచుసరి కచ్చట రెండు మార్గములు వానికిఁ గాన్పించెను. అం దొకటి మగధరాజ్యమునకును రెండవది హిమాలయపర్వతమునకును పోవును. బుద్ధిపూర్వకముగఁ దాను మగధమార్గమునఁ బ్రవేశింపలేదుకాని దీర్ఘాలోచనపరుఁడై యుండుటచే ననాలోచితముగ నాదారినే యనుసరించి నాలుగైదడుగుల నిడుసరికి, స్వగతవిచారము హృదయమునకు దూరమై భయంకరమై యొడలెల్ల ఝల్లుమని గుండియలు దడదడఁగొట్టుకొనునట్టు లెచ్చటనుండియో యొకశిశురోదనమాగొల్లని కర్ణపుటంబులఁ దటాలునఁబడియె. తోడనే యతఁడు ముందు పాదమిడక అచ్చటనే నిలిచి యదివఱకే మతి చెడి తిరుగుచున్నవాడు గాన నారోదనము నిక్కమో లేక లీలగాఁ దనచెవులకుఁ బొడకట్టెనో యని మొదట సందేహించెను. కొంతమాలినయాసందేహ మెంతోసేపు వానిహృదయమున నిలువలేదు. అతిజాగరూకతతో నాతఁడాధ్వని మరలమరల విని విని యాశ్చర్యనిమగ్నమానసుఁడై,

"ఔరౌరా! నిర్మానుష్యమై, క్రూరమృగసంచారమైన యీమహారణ్యమున నింతరాత్రివేళ శిశురోదనము వినవచ్చుటకుఁ గారణ మేమై యుండును? కంఠమునుబట్టి చూడ మగ శిశువువలెఁ దోఁచుచున్నాఁడే. అదికాక యీ రోదనము మిక్కిలి స్వల్పదూరమునుండియే వినవచ్చుచున్నది. బాటసారు లెవరైన మార్గాయాసమున నీప్రాంతమున బసచేసికొని యుండిరా? ఎంతమాత్రమును కాదు. ఈకీకారణ్యమున నీదుష్టమృగసంకులమున నిలచుటకైన వలనుకాని యీనిశాతకంటకశిలామయప్రదేశమున భార్యాపుత్రులతో నివసించి యేపాంథుఁడు ప్రాణములపై నాశ వదలుకొనును?"

అని సదయహృదయుఁ డగునమ్ముసలిగొల్లఁ డుల్లమునఁ బరిపరితెఱంగులఁ దలపోసి యచ్చటనుండి బయలుదేఱి శిశురోదన మేప్రక్కనుండి వినవచ్చుచుండెనో ఆప్రక్కకు నడువసాగెను. మిక్కిలి వైశాల్యము

గల్గి యయ్యరణ్యభాగ మెంతోదూరమువఱకు దట్టముగ నల్లుకొనిన తన దీర్ఘశాఖలచేత నాక్రమించి తా నాక్రమించిన యావరణమంతయు నంధకారమయముఁగావించి దృఢములై కడునున్నతముగఁ బెఱిగిన పలువిధములగు నూడలం గల్గి, కాకఘూకగృధ్రదర్వీకరానీకమ్ముల కాకరమై, భూతభేతాళశాకినీఢాకినీప్రముఖభయంకర భూతగణమ్ముల కావాసమో యనునట్లు లోకగొప్పవటవృక్ష మాసమీపముననే యుండెను. పటుతరభయదాయకం బైన యవ్వటకుటజముం గాంచిన నెంతటివానికైన గుండెలు తటతటలాడక మానవు. కాని సహజధైర్యవంతుఁ డగుటయే కాక, తత్ప్రాంతారణ్యసంచార మనుదినము నలవాటుపడిన దగుట గొల్లఁడు భీతిల్లక తిన్నగ నాచెట్టుక్రిందకుఁ బోయి యిటునటుఁ జూచుచుండెను. ఆకుల సందులనుండియుఁ, గొమ్మలమధ్యనుండియుఁ గొంచెముకొంచెముగ వెలువడుచుండిన చంద్రకాంతియం దావృక్షముక్రింద నొకప్రక్క దట్టముగఁ గట్టఁబడిన మెత్తని యొకపర్ణశయ్యపై వెల్లకిలబరుండి యూరక కాళ్లఁజేతులఁ దన్నుకొనుచుఁ గంఠముబొంగుపోర, కడుపు పొంగిపోవ నేడువలేక యేడువ లేక యేడ్చుచు నొకశిశువడవిపాలై దిక్కులేక పడియుండెను. వాని మెడలో వ్రేలాడఁ గట్టఁబడిన రక్షాబంధమొక్కటి తక్క వేఱునగ లేమియు లేవు. మెల్లమెల్లఁగ నాతఁడా ప్రదేశమును జేరి దీనుఁడైనయబ్బాలునిం గాంచి యాశ్చర్యమానసుఁడై వాని దీనదశ కెంతయో వగచుచుఁ దనరెండుచేతుల నాబాలునందుకొని యెత్తుకొనఁబోవుసరి కాపర్ణశయ్యనుండి యించుమించుగ మూఁడుమూరలు పొడవుగల యొకకాలసర్పము తటాలునఁ బైటకువచ్చి చెంతనున్న యొకపొదలోనికిఁ బాఱిపోయెను. ఆహా దిక్కులేనివారికి దేవుఁడే శరణ్యుండుకదా? ఆదీనబాలకుని యాక్రందనధ్వని విని కరుణాపూరితాంతరంగుఁడై తద్రక్షణార్థమై యవతరించిన యాశ్రితావనదీక్షాపరుం డగునాగోపాలుఁడో యన నాగోపాలుఁ డాబాలునిఁ దన యక్కునఁ జేర్చుకొని యవ్వటవృక్షముం దాఁటి యావలకువచ్చి, యానాఁడాకసమ్మునఁ బదారుకళల నుదారుఁడై వెలుంగుచున్న సుధాకరుని బురడించు నాబాలుని ముద్దుమొగముఁ గనులారఁగని పట్టరాని ప్రేమతో

"హాకుమారా! నీ వెవ్వఁడవు? నీముఖలక్షణములఁజూడ రాచబిడ్డవలెఁ దోఁచుచుంటివే? నాయనా! అన్యాయముగ నో రెఱుంగనిపసికూనవగుని న్నీఘోరారణ్యమునఁ గ్రూరమృగములవాతఁ బడఁద్రోసిన మోసకాండ్రెవ్వరు? అయ్యో తండ్రీ! నేఁడు నే నిట్లు రాకుండిన నీగతి యేమైయుండునో కదా? సర్వేశ్వరుండు నీకుఁ బూర్ణాయు వొసంగెను. మఱియొకవిధమున నెట్లు జరుగును?"

అని తనలోఁ దా ననుకొనుచుఁ దనవచ్చినమార్గమునుబట్టి యాతఁడు పోవుచుండెను. భగవదనుగ్రహమున మార్గమధ్యముననే తాను వెదకఁబోవు తీఁగె కాళ్లకుఁ జుట్టికొనునట్లు ఆముసలివాని లేఁగదూడ లేడిపిల్లవలె చంగుచంగున నిటునటు గంతులిడుచు రెండుచెవులు ముందునకు నిగిడ్చి తోఁకఁ బైకెత్తి యోరచూపులఁ దనయజమానునిం గాంచి మెల్లమెల్లగఁ జేరవచ్చెను. తోడనే యతఁడమందానందమున దానిని మెల్లగ దువ్వి చేరఁదీసి పట్టుకొని రెండవవైపున భుజముపై వేసికొని "ఓకైలాసనాథా! ఇది యంతయు నీమాయయేకదా? ఈయరణ్యమునఁ బడియున్న శిశువును నా కప్పఁజెప్పవలయు నని నీవే నాలేఁగదూడను దాఁచివేసి న న్నిచటకు రప్పించితివి. సర్వేశ్వరా సర్వజ్ఞుండ వగునీ వెఱుఁగని సంగతు లేమున్నవి?" అని తనలో ననుకొనుచు నావృద్ధగోపాలుఁడు కొంతసేపునకు నిజగృహమునఁ బ్రవేశించెను.

ఉపోద్ఘాతము.

II.

దరిద్రబ్రాహ్మణుఁడు.

ఆనాఁటనుండియు నావృద్ధగోపాలుఁ డాబాలునిపైఁ నధికానురాగమూని కన్నకుమారునికన్న నెక్కుడుగ నాదరించి పోషించుచుండెను. శుక్లపక్షశీతాంశునికరణి నాబాలకుఁడు దినదినప్రవర్ధమానుఁడై తోడి బాలకులతో నాడుకొనుచుఁ దన నిజవృత్తాంత మొకింతయైన నెఱుఁగక తన్ను బోషించుచున్నవారే తలిదండ్రు లని భావించి యెల్లర కల్లారుముద్దుగఁ బెరుగుచు దాదాపుగఁ బదునాలుసంవత్సరముల నవమన్మథుఁ డయ్యెను.

ఈకాలమందే గాంధారరాజ్యమునకు రాజధానియైనతక్షశిలానగరమున నొకదరిద్రబ్రాహ్మణుఁడు కాఁపురము సేయుచుండెను. వానిపేరు విష్ణుశర్మ. ప్రాయము రమారమి ముప్పదిసంవత్సరములకు మించియుండదు. గొప్పవిద్వాంసుఁడే కాని మిక్కిలి దరిద్రుఁడు. వాని శరీరాకారమును ముఖలక్షణములును జూచిన వారు అతఁడు బ్రహ్మజ్ఞానము గలమహామహుఁడని యనకపోరు. తపశ్శాలియుఁ దేజశ్శాలియు నగునావిప్రోత్తముఁడు పాప మొక చిన్నపర్ణశాలఁ గట్టుకొని తనతల్లితోఁగూడ నందే నివసించుచుండెను ప్రాయమంతయును గడిపి జరాభారపీడిత యగుచు వినవీనులును, కనఁగన్నులును లేక చావునకు సిద్ధముగనున్న ఆముసలి తల్లి తక్క వాని సంరక్షణమున కింకెవ్వరును దిక్కులేరు. మానవకోటి కెల్ల సర్వేశ్వరుండు నియమించినప్రధానవిధులలో మాతృసేవకు మించిన యుత్తమ ధర్మమింకొకటి లే దని యెఱింగినవాఁ డగుట నావిప్రోత్తముఁడు నిత్యమును దల్లిగారి నధికభక్తిం గొల్చుచుఁ దన్ను నవమాసములు మోసి కని

పెంచి పెద్దఁజేసి విద్యాబుద్ధులఁ జెప్పించినయామె ఋణమును గొంతయైనఁ దీర్చుకొనుటకుఁ బ్రయత్నించుచుండెను. వానిమాతృభక్తికిని సేవలకును మిక్కిలి సంతసించి యప్పు డప్పు డామె "నాయనా! నీవు చిరంజీవి వగుదువు గాక. అశ్వమేధాదిసమస్తయాగములఁ జేసిన మహానుభావులకైన నీకుఁ గల్గినపుణ్యము గలుగదు. దారాపుత్త్రాదుల విడిచి ఘోరారణ్యముల ననేకశతసంవత్సరములు తపస్సుచేసి యార్జించినతపోమాహాత్మ్యమునకైన భంగ ముండవచ్చునుగాని నీమాతృభక్తిమాత్ర మెన్నఁటికిని నిష్ఫలము గాదు. కుమారా! నిర్భాగ్యురాల నగు నేను బ్రతికియున్నంతకాలమే కాని నాతదనంతరమున నీకేకష్టము లుండవు నీవెట్టికార్యముఁ దలపెట్టినను జయము గల్గును. రాజాధిరాజులచేసైతము పూజింపఁబడుదువు సుమా" అని యాదర ముట్టిపడునట్లు పలుకుచుండెను.

ఒకనాఁడు సూర్యోదయమునకుఁ బూర్వమే తనమామూలుప్రకారముగ విష్ణుశర్మ లేచి, రాత్రి రెండుఝాములవఱకును క్షయదగ్గుచేతను, శూలనొప్పిచేతను బాధపడి యెట్టో నిద్రించిన తన ముసలితల్లిని లేపుట కిష్టములేక భుజముపై నొకయంగవస్త్రమును బడవేసికొని, చేత నొక కమండలమును దాల్చి వీథితలుపు దగ్గఱఁ జేరవేసి బయలుదేఱి తిన్నగ నదికేఁగి ప్రాతఃకాలస్నానము నొనర్చి తనకిలవేల్పగు కైలాసనాథునిఁ గూర్చి కొంతవఱకు జపముఁజేసికొని, మొగమున నలఁదిన విభూదిరేకలును, మెడలో ధరించినరుద్రాక్షమాలికలును, కరంబునఁ గలకమండలమును, నిక్కమైన యీశ్వరభక్తుఁ డని చాటుచుండ సూర్యోదయమైన రెండుమూఁడుగడియలకు నిజగృహమును జేరవచ్చెను. కాని తాను స్నానమునకుఁ బోయినప్పుడు మూసినతలుపు, యిప్పటికిని మూసియేయుండుటచేతఁ దన తల్లి యింకను మేల్కొనలేదని యెంచి పాదములతోఁ దటాలునఁ గవాటమును లోనికిఁద్రోసి యింటఁబ్రవేశించి, "అమ్మా నీశరీరమున నెట్లున్నది? రాత్రి నిద్రపట్టినదా? లేలే చాలప్రొద్దెక్కినది వేళఁదప్పినచో నౌషధము గుణమీయదుసుమా" అని తల్లిని మేల్కొలుపనెంచెను. కాని

యామె వానికిఁ బ్రత్యుత్తర మీయలేదు. నిర్మలనదీజల పూరితమ్మగు కమండలువు దేవతార్చనపీఠమువద్ద నుంచి, మెడలోని రుద్రాక్షమాలిక నొకగోడకొయ్యకుఁ దగిలించి, భుజముపైఁ గలతడి యంగవస్త్రమును పెరటిలో నొకదండెమున నారవేసి తాను స్నానముజేసినవస్త్రము విడిచి పొడిబట్టధరించి మెల్లఁగఁ దల్లిమంచమువద్దకువచ్చి "అమ్మా! అమ్మా! చాలప్రొద్దెక్కినది లేలే" అని మరలలేపెను. ఈసారికూడ నామె మాఱు పలుకనందునఁ జేతితో నతఁడు రెండుమూఁడుసారులు తట్టెను. ఏకారణముననోకాని తల్లిశరీరమును స్పృశించినంతనే విష్ణుశర్మ భయభ్రాంతుఁడై మొగము వెలవెలబార నూరక తత్తరపడుచు గద్గదస్వరముతో "అమ్మా! అమ్మా!" అని మరలమరలఁ బిలిచి యామెనాడిఁ బరీక్షించి గుండెలపైఁ జెయివైచి చూచెను. ఎట్టి ధైర్యవంతులకైనను మాతృవియోగము దుర్భరమే కదా? సకల శాస్త్రవిశారదుఁడే యయ్యు, వేదాంతవేత్తయే యయ్యు, వైరాగ్యసంపన్నుఁడే యయ్యు మనవిష్ణుశర్మ యప్పుడు పొరలి పొరలి వచ్చుచున్న దుఃఖము నాపుకొనలేక మృతకళేబరముపైఁ బడి కొంత వఱకు విలపించెను. తనతల్లి రాత్రి క్షయచేత మిక్కిలి బాధపడుటయు, నామెకుఁ దగినయుపచారములఁ జేసి తాను పరుండఁబెట్టుటయు దక్క నామె యెప్పుడు ప్రాణము విడిచినదో విష్ణుశర్మ యెఱుఁగఁడు.

జరాభారపీడిత యగుతనముదుసలితల్లి కష్టము లింతకాలమునకు గట్టెక్కెనని మనవిష్ణుశర్మ తనలోఁదానె యోదార్చుకొని యెట్టకేలకు సాధ్యమైనంతధైర్యము వహించి యుత్తరక్రియార్థము స్వదుఃఖమించుక యెడముంచక తీఱినదికాదు. పరామర్శకులు వచ్చి యోదార్చినకొలఁది దుఃఖ మధిక మగుట లోకమున నైజమేకదా? కాని మనవిష్ణుశర్మకుమాత్ర మట్టి యాపద్బాంధవు లెవ్వరును లేకపోవుటచేతనే యాదుఃఖపాశము తనంతట తానే మెల్లగ విడుదలయయ్యెను. అందుచేతనే ఆమె కగ్నిసంస్కారాదిక్రియలు విధ్యుక్తవిధానముగ నిర్వర్తించి యాబ్రాహ్మణోత్తముఁడు మాతృఋణవిముక్తుఁడయ్యెను.

తల్లిగారిమరణానంతరమున నెంతోకాలమువఱకు విష్ణుశర్మ తక్షశిలానగరమున నుండలేదు. ఇందుకుఁ గారణముకూడ లేకపోలేదు. ఆర్యమహారాజులనెల్లఁ దనకు సామంతులుగఁ జేసికొని హిందూదేశము సర్వము నాక్రమించి యేకచ్ఛత్రముగఁ బరిపాలింప వన్యదేశీయుఁ డగుఅలగ్జాండరు వచ్చి యదివఱకే సింధు పంజాబు మొదలగుదేశములతోఁబాటు గాంధారరాజ్యముగూడ జయించె నని మాచదువరులకు మొదటిప్రకరణములోనే తెలిసియుండవచ్చును. గాంధారరాజ్యము తనకుఁ జేచిక్కినతరువాత అలగ్జాండరు తక్షశిలానగరమే రాజధానిగఁ జేసికొనెను. విఖ్యాతివహించిన గొప్పగొప్పనగరములలోఁ దక్షశిలానగరమునుగూడఁ బేర్కొనవచ్చును గాని గ్రీకువారిచేతిలోఁ బడినప్పటినుండియు దానియౌన్నత్యమునకును, ఆధిక్యతకును గొంచెము భంగముగల్గినదని చెప్పకతీఱదు. పరదేశీయులై మాతృదేశస్వాతంత్ర్య మపహరింపవచ్చిన గ్రీకువారిసేవఁజేయలేక యెందఱో దేశాభిమాను లప్పటికేమియును జేయలేమిఁ దమపౌరుషమును గట్టిపెట్టి కొందఱడవులఁజేరియు మఱికొందఱు పల్లెలకుఁ బోయియు నివసించుచుండిరి. ఇంకెందఱో వృద్ధులగుజననీజనకులను భార్యలను పసిబిడ్డలను వేఱొకచోటునకీడ్చుకొనిపోలేక మ్లేచ్ఛులయార్భాటముల నెట్లో సహించుకొని తక్షశిలానగరమందే యుండిపోయిరి. ఇందువలన విష్ణుశర్మకూడఁ దనముసలితల్లియాటంకముచేతనే యెందును బోలేక ఆపట్టణమందే నివసింపవలసివచ్చె నని వ్రాయ నవసరములేదుకదా? మ్లేచ్ఛులు తక్షశిలానగరము నాక్రమించుకొనినప్పటినుండియు విష్ణుశర్మ కందుండుట కేవల మయిష్టమై యుండెను. కాని వృద్ధమాత జీవించియున్నంతవఱకు నాతఁ డెందును గదలలేకపోయెను. లేనియెడల ధనుర్విద్యయం దభినవద్రోణాచార్యుఁడై సమస్తశాస్త్రముల నెఱిఁగి చక్కనిరాజనీతి నెఱిఁగి శత్రునిర్మూలనోపాయమెఱిఁగి మాయలు మర్మములు నెఱిఁగి రాజాధిరాజులవలె మహీరాజ్యమునుగూడఁ బరిపాలింపదక్షుఁడగు మహానుభావుఁడు మన విష్ణుశర్మ యూరకుండువాఁడేనా? పవిత్రవంతమగు మనయార్యహిందూ

మహాదేశముననితర దేశీయులగుగ్రీక్కులు ప్రవేశించిన యప్పటినుండియు వానికను లెఱ్ఱవాఱియే యుండెను. వానిగుండెలు తటతటఁగొట్టుకొనుచునే యుండెను వాని హృదయ మాలోచించుచునే యుండెను. కాని పాపము కాలమంతయు గడపి జరాభారపీడితయై రేపో నేఁడో యని యున్న ముసలి ముద్ద నెవ్వరిపాలు జేసి యేకష్టములఁ బెట్టి పోఁగలఁడు? తల్లిగారి యనంతర మున నుత్తముఁ డగు నేరాజునైన నాశ్రయించి శాస్త్రసంపన్నుఁ డగుటచే వానియొద్దనాస్థానపండితపదవి సంపాదించి యారాజునే యాధారముగఁ జేసికొని క్రమక్రమముగఁ దక్కిన రాజులందఱికి నైకమత్యముఁ గల్గించి యనేకరహస్యోపాయముల వారి కెఱిఁగించి ధైర్యము గఱపి, ప్రోత్సాహ పఱచి, గ్రీక్కులను మెల్లఁగ వచ్చినదారినే తమదేశమునకుఁ బంపి యార్యావర్తనమునంతటి నుద్ధరింపవలె నని యాతఁ డప్పుడు తలపోయుచుండెను.

రానురాను మాతృదేశోద్ధారణోల్లాస మంతకంత కధికమగుటచే వృద్ధమాతృమరణక్లేశము క్రమక్రమముగ క్షీణింప నొకనాఁడు విష్ణుశర్మ యిట్లు తలపోయ జొచ్చెను. “నిశ్చితకార్యక్రమమున కనుకూలమగుసమయ మాసన్నమైనది. జరాభారముచేఁ జాలకాలము బాధపడినను అంత్యకాలమున మాత్రము మాతల్లి యనాయాసముగఁ బ్రాణమువిడిచెను. ఇది సంతోషమేకాని ప్రాణమువిడుచునప్పుడు నేను దగ్గఱనున్నచో నామె కడసారి మాట లేమిచెప్పునో కదా?............సరిసరి ఇది వెట్టిభ్రాంతి కాని చెప్పుటకేమున్నది? నాకుఁ జెప్పవలసినమాటలు బ్రతికియున్నప్పుడే యనేకమారులు నాతోఁ జెప్పుచుండెను. నాయుద్దేశముగూడ నదియేకదా ? కటకటా! ఏరాజ్యము జూచినను పండిన పొట్లపండువలెఁ జీవచెడి మ్లేచ్ఛుల వాతఁ బడి ధ్వంసమగుటకు సిద్ధముగనున్నది. ఇంక రాజులా ? అన్యాయముగ జనించిన పరస్పరవిరోధముల నొకరినొకరు నాశనము జేయఁజూచువారును, ఆర్యావర్తమే మయిపోయినను లక్షింపక స్వార్థపరులై తమ కేలోపమును గల్గకుండ మ్లేచ్ఛులనాశ్రయించి వారికి సాహాయ్యమొనర్చువారును, చేతులారఁ దమరాజ్యముల శత్రువులకు ధారపోసి, యుండనూరును తినఁ

దిండియు లేక దీనులై చరియించువారునై యున్నారుకదా ? హా ! ఆర్యావర్తమతల్లీ ! నీకుమారుల దీనావస్థఁజూచుచునే నూరకుంటివేల ? అన్యాయముగ మమ్మందఱ మోసపుచ్చి మాసిద్ధాన్నములఁ బాడుచేసి నిన్నపహరింపవచ్చిన యీదుష్టులపై నీ కేలయాగ్రహము వొడమదు ?..............ఆఁ మేలు మేలు కైలాసనాథుని యనుగ్రహమున మంచి యుపాయమే తోఁచినది. ఇందువలన నామనోభీష్టము నెరవేరఁగలదని తలంచెద. ప్రస్తుతము గల రాజులందఱిలో మగధరాజు మిక్కిలి గట్టివాఁడు. అసంఖ్యసేనాసమన్వితుఁడు. సామంతభూకాంతులు కొందఱు వానిదయ సంపాదింపఁ బ్రయత్నించుచుందురు. ఇదిగాక పాటలీపుత్రముపై గ్రీక్కులు కన్నువేసియున్నవారుకదా ? కావున మగధేశ్వరుని మెల్లఁగఁ బురికొల్పి చక్కనియుపాయము లెఱింగించి కొందఱకుఁ బనిసేయవలసియున్నది. నే నాశ్రయింపఁ దలఁచినరా జిట్టివాఁడేకదా కావలయును ?”

ఆమరునాఁడే విష్ణుశర్మ తక్షశిలానగరము విడిచి మగధరాజ్యమునకుఁ బ్రయాణమగుటకు నిశ్చయించెను. కాని పురాతనమునుండియుఁ దన యింట నున్న యసంఖ్యములగు తాళపత్త్రగ్రంథములన్నియు నేమిచేయవలెనో వానికిఁ దోఁపలేదు. వందలకొలఁది నున్నయాగ్రంథముల మోసికొనిపోవుటకు వీలుకాదు. విడిచిపెట్టుటకు మనసొల్లదు. ఏమిత్రునైన బ్రతిమాలి వానియొద్ద దాఁచియుంచుటకు నమ్మకము చాలదు. ఆనాఁడే కాక యీనాఁడైనను మఱేనాఁడైనను పరహస్తమునఁ బడినపుస్తకము తిరిగివచ్చుటదుర్లభమేకదా ?. కడ కేమిచేయుటకును దోఁపక యనేకశాస్త్రములతోఁ గూడియుండిన యాతాళపత్త్రగ్రంథసందోహమంతయు నొకకట్టఁగట్టి, విష్ణుశర్మ తనతో మిక్కిలి మైత్రివహించి యప్పుడప్పుడు తనవద్దకు శాస్త్రసందేహము నివారించుకొనుటకై వచ్చుచుండిన యొకబ్రాహ్మణకుమారున కప్పఁజెప్పి తాను మరలఁ గొలఁదిదినములలోనే వచ్చి తీసికొనెద నని యు నంతవఱకు భద్రముగఁ గాపాడవలయుననియు మఱిమఱి చెప్పి యతఁడు మగధరాజ్యమునకు రాజధాని యైనపాటలీపుత్రమునకు వచ్చెను.

మగధేశ్వరుఁడు విద్యాభిమానియుఁ బండితాదరణమనస్కుఁడు నగుట నతనియాస్థానమున ననేకపండితులును కవులునుండిరి. ఇదిగాక క్రొత్తగ నెవరైన విద్వాంసులు వచ్చిన వారినిఁ దగురీతి నారాజు సన్మానించి యాదరించుచుండెను. ఈసంగతి విష్ణుశర్మ యెఱింగినవాఁడగుట నొకనాఁడు మధ్యాహ్నమున మగధరాజు పండితపరివేష్టితుఁడై కొలువులో నున్నపుడు సమయముఁ గనిపెట్టి యచ్చటికి యథేచ్ఛగఁ బోయి రాజును దర్శించి యాతని నాశీర్వదించుచు నొక శ్లోకమును జదివి కట్టెదుట నిలువంబడెను. రాజు వానికవిత్వచాతుర్యమునకును, పాండిత్యాతిశయమునకును, అత్యానందమును బొంది యాబ్రాహ్మణునిఁ దనప్రక్కనే యొకయున్నతాసనమున నాసీనునిం జేసి మిక్కిలి ప్రేమతో ననేకవిధముల బహూకరింపఁ జొచ్చెను. ఒక్క రాజే కాక యాసభలో నున్నపండితులు గూడ నావిద్వాంసుని కలాకౌశల్యమున కత్యద్భుతమొందిరి. కాని దీనుఁడగు నావిష్ణుశర్మపై నాపండితమండలమున కచిరకాలములోనే యమితమైన యాగ్రహము నసూయయు నొక్కమారుగ జనించినవి. తమసాటి పండితునిఁ దమకన్న నెక్కుడుగఁ దమరాజు గౌరవించుట తమకవమానమనియే వారందఱు భావించుకొని పండ్లు పటపటఁ గొఱుకుచు వాఁడెంతగౌరవమును బొందెనో యంతియవమానము రాజుచేతనే చేయింపవలయునని తమలోఁదాము గుసగుసలాడుకొనఁజొచ్చిరి. ఔరా అసూయాబీజముచే జనించిన పండితకలహభూజము పూర్వమునుండియు మనదేశమున వ్యాపించియున్నదే కాని యిప్పుడు క్రొత్తగా పుట్టినది కాదు. మీఁదవ్రాసిన యీయొక్క కారణమే కాక విష్ణుశర్మపై వారికసూయజనించుట కింకొక కారణముగూడ నున్నది. మగధరాజు దర్శనార్థమే పండితులు వచ్చినను తొలుత నాస్థానపండితుల నాశ్రయించి వారిదయ సంపాదించి వారిసాహాయ్యమున రాజుగారినిఁ జూచుట వాడుకయై యుండెను. కాని పాపమీవెఱ్ఱిబ్రాహ్మణుఁ డాసంగతి యెఱుంగక యాపండితమండలమునకు మహాద్రోహ మొనర్చిన వాఁ డయ్యెను. ఇంతియే కాక లోపలిగుట్టు మఱి

యొకటి కలదు. తొలుత విష్ణుశర్మ రాజునెదుట నుచ్చరించిన యాశీర్వాదశ్లోకమును బట్టియే యతఁడు తమకన్న రెండింతలు గొప్పపండితుఁడనియు, వానిని రాజు తనవద్ద నుంచుకొనినయెడలఁ దమజీవనమునకు భంగము గల్గుననియుఁగూడ వారంద ఱూహించిరి. వారియవస్థ యట్లుండ రాజుమాత్రమమితానందపరవశుఁడై విష్ణుశర్మను జూచి

"పండితోత్తమా నీపాండిత్యమునకు నేనమితానంద మొందితిని. తమనామాక్షరము లెవ్వి? తమకాఁపుర మేపురము?"

అని యడుగ విష్ణుశర్మ వినయముతో

"నాపేరు విష్ణుశర్మ యందురు. నాకాఁపురము తక్షశిలానగరము"

అని ప్రత్యుత్తరమిచ్చెను. అంతతో విడుపక రాజు వానితో నింకేమియో సంభాషింపఁదలఁచెను గాని, యింతలో నాపండితులలోనుండి యొకమహానుభావుఁడు లేచి రాజుతో

"దేవా! దేవర క్షమింత్రుగాక. ఈవిప్రుఁడు పండితుఁ డగుట వాస్తవమే కాని యెందులకు వచ్చెనో యెందుండి వచ్చెనో కనుఁగొనక గౌరవించుట ధర్మము గాదు"

"ధర్మము కాకేమి? వీనికాఁపురము తక్షశిలానగర మని యిప్పుడు చెప్పినది వినలేదా?"

"రాజేంద్రా! వినక పోలేదు. వినియే మనవిసేయుచున్నాను. తక్షశిలానగరమునుండి వచ్చినవాఁ డేకార్యముకొఱకు వచ్చెనో తమ రూహింపఁజాలకున్నారు. దేవర క్షేమముఁ గోరుట మాకు విధిగాన మనవిచేయుచున్నాను. ఇదివఱ కనేక సంవత్సరములనుండి మ్లేచ్ఛులు మన రాజ్యము నపహరింపఁ బ్రయత్నించుచుండుట తమకుఁ గ్రొత్తసంగతి కాదు కదా? అందుచేఁ దమరు విద్యాభిమాను లని యెఱింగి మనరాజ్యమునఁ గల రాజకీయరహస్యముల నెల్ల గ్రహించి రమ్మని మ్లేచ్ఛరాజీబ్రాహ్మణపండితు

నకు ధనాశఁ గల్గించి తమవద్దకుఁ బంపించెను. ఇంకమీఁద దేవరవారి చిత్తము ”

అని చెప్పి కూర్చుండెను. వెంటనే మఱియొకఁడు లేచి,

“ మహాప్రభూ ! ఇతఁడు పల్కినదంతయు నిక్కము. మ్లేచ్ఛరాజు తమయొద్ద లోకమాయపండితునిఁ బంపుననియు, నతఁడు తక్షశిలానగరము నుండి వచ్చుననియు, రెండుదినముల క్రిందటనే మనపట్టణమున వదంతి పుట్టినది. అది శ్రీవారు వినియుండక పోవచ్చును. ఇతఁడు నిజముగ నాశ్రితుఁడే యైనయెడలఁ దొలుత మాస్నేహముఁ జేసియే యుండును. మేమే వీనినిఁ దమదర్శనమునకుఁ గొనివచ్చి యుందుము. ఇదివఱ కెందఱెందఱో పండితులు తమదర్శనమున కెట్లు వచ్చుచుండిరో యెఱుఁగరా? ”

అని మొదటవాఁడు చెప్పినదానిని మఱింత బలపఱచి సమర్థించెను. చెప్పుడుమాటల కెట్టివారైనఁ జెవియొగ్గెదరు కదా? వారిమాటలు వినినతోడనే రాజున కనుమానమంకురమై విష్ణుశర్మయెడలఁ గలగౌరవమంతయు ద్వేషముగా మాఱిపోయెను. అందుచే రాజు వానిం గాంచి

“ అయ్యా! నీవు శత్రురాజునొద్ద నుండి వచ్చిన కపటోద్యోగివఁట యిందులకేమి సమాధానముఁ జెప్పెదవు? ”

అని యడిగెను. కాని యీసంగతులన్నియు వినుచుండుటచే విష్ణుశర్మ యాశ్చర్యనిమగ్నమానసుఁడై దేహమంతయుఁ గంపమొంద గుండెలు దడదడఁ గొట్టుకొనఁ దనకు జనించిన నిష్కారణనింద కెంతయో కుందుచు నోట మాట రాక వాని కేమియుఁ బ్రత్యుత్తరమీయలేక పోయెను. అంతట మగధరాజు మరల వానిం గాంచి బిగ్గరగ,

“ మాటాడవేమయ్యా! నీవు తగినసమాధానముఁ జెప్పి మాకు నమ్మకము పుట్టింపనిదే యీయాసనముపైఁ గూర్చుండ నర్హుఁడవు కావు. ఈపండితులలో నీ వెవ్వరినైన నెఱుఁగుదువా? ”

“ అయ్యా! నే నిం దెవ్వరి నెఱుఁగను ”

“ పోనిమ్ము. ఈపాటలీపుత్రమున నీ వెఱిఁగినవాఁ డొక్కఁడైన నున్నాఁడా? ”

“ లేఁడు. నే నీయూరి కెన్నఁడును రాలేదు. ఇది నాకుఁ గ్రొత్త.”

“ అట్లైన నీపై మోపఁబడిననేరము నీ వెట్లు తప్పించుకొనఁగలవు? నీకు సాక్షు లెవ్వరు? ”

“ నిర్మలమైననాయంతఃకరణమే నేను ద్రోహిని కానను టకు సాక్షి. ఈయపనిందఁ దప్పించుకొనుటకు నా కిప్పు డేమార్గమును లేదు.”

అని పలుక రాజు వానిననుమానపురుషునిగా గ్రహించి యపరిమితాగ్రహ మొంది,

“ ఛీ మూర్ఖా! నీవు దొంగవలె నున్నావు. మ్లేచ్ఛసేవకుఁడవై మారాజ్యమునఁ గలగుట్టు సంగ్రహింపవచ్చిననీ కిప్పుడే కఠినదండన విధించి యుందునుగాని బ్రాహ్మణుఁడ వని విడిచితిని. నీవిక్కడ నుండఁదగవు పొమ్ము. ”

అని సురాగ్రహమునఁ దూలనాడెను. ఇంతవఱకును శాంతము వహించినవిష్ణుశర్మ రాజు తన్నుఁ దూలనాడినతోడనే యొడలు గడగడవడఁక, జడముడివీడఁ, గనులెఱ్ఱఁజేసి దిగ్గున నాసనమునుండి క్రిందికుఱికి మీసము ద్రిప్పుచు నందఱు వినుచుండ.

“ ఔరౌరా! ధర్మాధర్మములఁ బరిశీలించురాజవై యుండి యొక బ్రాహ్మణాధముని నీచోక్తుల విని సకలశాస్త్రకోవిదుఁడ నగునన్నుఁ బరిభవించినందుకుఁ బ్రతిఫల మొందకపోవుసుమా! ఇదే వినువిను. ఇంత దుర్మదంబున నొడలెఱుంగనిమీనందవంశమును నే నచిరకాలములోనే నిర్మూలముఁ జేసెదను. ఛీ? అట్లు చేయనినాఁడు హిమవత్పర్వతప్రాంతమున కేఁగి యచ్చట నగ్నిహోత్రజ్వాలలయందుఁ బడి దేహత్యాగము గావించుకొనెద. ఇదియే నాదారుణమైనప్రతిజ్ఞ. నేటనుండియు నీతఁడు విష్ణుశర్మకాఁడు.”

అని యింక నేమేమో పలుకుచు నాతఁడు రాజద్వారములన్నియు దాఁటి యతిత్వరలో నావలకుఁ బోయెను. అతఁ డొకపిచ్చివాఁ డని యెంచి రాజును తదితరులునుగూడ వానిమాటల యం దంతగా లక్ష్య ముంచలేను.

ఉపోద్ఘాతము.

III.

గొల్లపిల్లలు.

అట్లు మగధరాజుచేత సభామధ్యంబునఁ బూర్ణంబుగ నవమానింపఁ బడి విష్ణుశర్మ నందవంశమును విధ్వంసమొనర్చెదనని నిర్భయముగ దారుణ మైనప్రతిజ్ఞఁ గావించుకొనినతరువాత నతఁడు పాటలీపుత్రమున నొక్క క్షణమైన నుండక వెంటనే తక్షశిలానగరమునకుఁ బోవలయు నని ప్రయాణమయ్యెను. హృదయాంతర్గతక్రోధరస ముబ్బి పొంగిపొరలి శరీరమునం దంతటఁ బ్రవహించుచున్నదో యన వానియొడలంతయు మార్గాయాసమునఁ జెమటతోఁ దడిసి స్నానముజేసినట్టులయ్యెను. దీర్ఘాలోచనమున నతఁడు తనశరీరమే మఱచి త్రోవఁదప్పి యత్యాశ్రమము స్వీకరించినవానివలె వెనుకకుఁదిరిగిచూడక యదేవిధముగఁ బోయిపోయి సాయంకాలము నాలుగున్నరగంటలగుసరికి విష్ణుశర్మ హిమవత్పర్వతప్రాంతకాంతారమునకుఁ జేరువనున్నయొకగొల్లపల్లెఁ బ్రవేశించెను. ఈగొల్లపల్లె చమువరుల కిదివరకొక సారి పరిచయమైనదేకాని క్రొత్తదికాదు. ఆపల్లెయందు విశాలమైనయొక ప్రదేశమునఁ గొందఱు గొల్లపిల్లవాండ్రు గూడి కడువినోదకరమగునొక యాట నాడుకొనుచుండిరి. కాని యాయాటమాత్ర మిప్పటిబాలకు లాడుకొను నాటవంటిదికాదు. వారందఱు రెండుభాగములుగ విభజింపఁబడి దూరమున వరుసగా నిలుపంబడియుండిరి. ఇరుతెగలవారికినిఁ జేతులలోఁ గోలలు విండ్లు నున్నవి. ఒండొరుల కపాయము గల్గకుండునట్లు వారొకరి పైనొకరు తమయాయుధములఁ బ్రయోగించుకొనుచుండిరి. మొదటివరుస యం దున్నవారిలో నొక్కొక్కఁడు నిజముగ గాయము తగిలిపడిపోయి నట్లే భూమిపైఁబడి కొట్టుకొనుచుండెను. తమసైన్యమునఁ జాలభాగము

నశించినంతనే శత్రువు లెట్లుపారిపోయెదరో యట్లే కొంతసేపునకు మొదటి వరుసయం దున్నవారందఱు బిరబిరఁబాఱిపోవుచుండిరి. వారిని వెంటనంటి రెండవభాగమువారు పరుగుపరుగున వెంబడింపఁజొచ్చిరి.

విష్ణుశర్మ యిచ్చటఁ బ్రవేశించినప్పటినుండియు నాయాటఁ గడు వినోదముగఁ జూచుచుండెను. కాని కొంతసేపునకు వానిదృష్టి రెండవవరుసయం దున్నయొకసుందరబాలకు నాకర్షించి హృదయమున నెన్నియో సందేహములును నూతనవిచారములును గల్గింపఁదొడఁగెను. ఆబాలునిసుందరాకారమును, చక్కనిముఖలక్షణములును జూచినవారు అనంగుఁడను నపకీర్తిఁబాపుకొన సశరీరుఁడై భూలోకమున నవతరించిన నవమన్మథుఁడే యని యనకపోరు. విష్ణుశర్మ వానిని సమీపించి యేమేమో పలుకరింప నెంచెనుగాని యింతలో నాతఁడే తనతోడివారితోఁగూడఁ బరుగిడుచుఁ దనచెంతనుండియే పోవుట తటస్థించినందున నాబ్రాహ్మణుఁడు పరుఁగిడుచు వచ్చినయాబాలుని చేయిఁ దటాలునఁ బట్టుకొని ఆఁపివేసి యిట్లుసంభాషించెను.

“కుమారా! మీయాడుచున్నయాటకుఁ బే రెయ్యది?”

“ఇదియా? ఇదిమ్లేచ్ఛసంహారరణక్రీడ. ఇదిగోమ్లేచ్ఛులు పాఱిపోవుచున్నారు నన్నువిడువిడు.”

“కుమారా! ఇందులో మ్లేచ్ఛు లెవరు?”

“అదిగో! ముందుపరుఁగిడుచున్నదే మ్లేచ్ఛసైన్యము. మాది ఆర్యసైన్యము. నే నిప్పుడే పోయి వారందఱి నుక్కడించి యార్యావర్తదేశమున స్వతంత్రరాజ్యమును స్థాపింపవలయును.”

ఈసంభాషణములోనే విష్ణుశర్మ కాబాలునియరచేతియందు దివ్యమైనయొకరేఖ దృగ్గోచరమయ్యెను. అతఁడు సాముద్రికశాస్త్రజ్ఞుఁడగుట దానిని మరలమరలఁ బరీక్షించి “ఔరౌరా! యీతఁడు గొప్పపిల్లవానివలెఁ

గనఁబడుచుండెనే? వీనికిఁ జక్రవర్తిలక్షణము లెచ్చటనుండి వచ్చెనో?” అని యత్యంతాశ్చర్యమొందెను. ఇంతలోఁ గొందఱు గొల్లపిల్లవాండ్రకుఁ గరబంధనములువేసి వారినీడ్చుకొని మఱికొందఱచ్చటికే వచ్చి సుందరాకారుఁ డగునాబాలకునిం గాంచి చేతులుమోడ్చి, “మహారాజా! దేవర యాజ్ఞానుసారముగ నీమ్లేచ్ఛుల బంధించి కొనివచ్చితిమి. ఇంకఁ దమసెలవెట్లో యట్లే చేసెదము.” అని పలుక నాబాలుఁడు చిఱునవ్వు నవ్వుచు విష్ణుశర్మను జూచి సిగ్గున మొగము వాల్చుకొని యూరకుండెను. అది కనిపెట్టి విష్ణుశర్మ మందహాసమున “కుమారా! సిగ్గేల? నీవు మహారాజుపాత్రఁ గైకొంటివికదా? కావున నీయనుచరుల కేమి యాజ్ఞాపించెదవో యాజ్ఞాపింపుము. నేనును వినియెదను” అని పలికెను. తోడనే యాబాలుఁడు వారలఁ గాంచి “ఆర్యసైనికులారా! నేఁటియుద్ధమున మీరు జూపినపౌరుషమునకు మే మధికానంద మొందినాము. మీరు పడినప్రయాస తీఱునట్లు మీకందఱకు నుచితబహుమానములనొసంగి తుష్టులఁజేసెదము. రేపు సభలోఁ బెద్దలతో నాలోచించి యీమ్లేచ్ఛులకుఁ దగినశిక్ష విధింపఁబడును. అంతవఱకును వీరిని జెఱలో నుంచవలయును” అని యాజ్ఞాపింప వారందఱు నందుండి వెడలిపోయిరి. తోడనే విష్ణుశర్మ యధికానురాగమున “మేలు కుమారా! మేలు” అని వానినిఁ గౌఁగిలించుకొని మరల నిట్లు ప్రసంగించెను.

“కుమారా! ఆడుకొనుట కెన్నియో యాటలుండ నిట్టియాట నాడుకొనుచుండి రేల?”

“అయ్యా! మాకు మొదటినుండియు నిట్టివే యలవాటు”

“ఈయాట వీరందఱికి నెవ్వరు నేర్పిరి?”

“నేనే నేర్పినాఁడను”

“నాయనా! నీ వెవ్వరికుమారుఁడవు?”

“నేను గొల్లపిల్లవాఁడను”

"మీతండ్రి యెక్కడ నున్నాడు"

"అదిగో! ఆయింటి గుమ్మములోఁ గూర్చుండి చేదువారను త్రాడుగా నల్లుచున్నవృద్ధుఁడే మాతండ్రి"

అని ప్రత్యుత్తరమిచ్చి యాబాలుఁడు తనతోడివారితోఁగూడ నాడుకొనుటకుఁ బోయెను. అప్పటినుండియు విష్ణుశర్మముఖ మొకతీరైనకళవహించి యందువలనఁ గొంతయానందమును, ఏదో కొంతసందేహమును బైకిఁదోఁపించుచుండెను. అప్పుడు విష్ణుశర్మ బయలుదేఱి గుమ్మములోఁ గూర్చుండి త్రాడల్లుచున్న ముదుసలిగొల్లనివద్దకుఁ బోవ నతఁడు తటాలున లేచి నమస్కరించి "మహాత్మా! తమ రెవరు? దీనుల మగుమాపాలిట సాక్షాత్కరించినకైలాసనాథునివలెఁ దోఁచుచున్నారు. స్వామీ! తమకుఁ దగిన యుపచారముల మే మొనర్పఁజాలము. మమ్ము క్షమించి యీచాఁపపైఁ గూర్చుండుఁడు."

"ఓయీ! నే నిప్పుడు మీమన్నన లొందవలయు నని రాలేదు. మీయతిథిపూజ కిది సమయముగాదు. నే నొకకార్యార్థము నీయొద్దకు వచ్చితిని."

"బ్రాహ్మణోత్తమా! మా కంతభాగ్యమా? మావలనఁ దమ కేమి కార్య మగును? ఈయల్పుఁడు తమ కేమిసహాయ్య మొనర్పఁగలఁడో సెలవిండు"

"సరే! పరోపకారమున కల్పానల్పములతోఁ బనిలేదు. నే నీప్రాంతమున నొకక్షణముక్రింద నొకసుందరాకారు నీక్షించితిని. అతఁడు నీకుమారుఁడట నిజమేనా?"

"మహాత్మా! నిక్కమే! నా కట్టికుమారుఁ డున్నాఁడు"

"అట్టిశుభలక్షణలక్షితుఁడు మీగొల్లకొలమున నెట్లు జనించెను?"

"నాకు జనింపలేదు. ఈయరణ్యమున నొకరహస్యప్రదేశమున దొరకెను.

"ఎట్లు దొరకెను? ఎప్పుడు దొరకెను?"

"అయ్యా! నేనొకనాఁటి పూర్ణిమాదివసంబునఁ దప్పిపోయినలేఁగకై వెదకుచుండ నొకమఱ్ఱిచెట్టుక్రింద నాశిశువు రోదన మొనర్చుచుండెను. అది విని వానిని నేను భద్రముగఁ గొనివచ్చి కడుముద్దుగఁ బెంచుకొనుచుంటిని. నేఁటికి దాదాపుగఁ బదునాఱువత్సరము లయ్యెను."

"ఆదొరకినప్పుడు వానియొద్ద నేమైనవస్తువు లున్నవా?"

"మెడలోనిరక్షరేకు తప్ప మఱెట్టివస్తువులును లేవు."

"నే నొకమాఱా రక్షరేకును జూడవచ్చునా?"

"అభ్యంతరమేమి?"

అని లోనికిఁ బోయి యొకకుండలో దాఁచియుంచిన రక్షరేకును గొనివచ్చి యాగొల్లఁడు విష్ణుశర్మ కొసంగెను. దానినిఁ జక్కఁగఁ బరిశీలించి యందొకప్రక్క నేమో యక్షరములు చెక్కఁబడియుండుటఁ గాంచి చదివి విష్ణుశర్మ యత్యాశ్చర్యమునఁ బరవశుఁడై కొంతవడికట్టులే నిలచిపోయెను. తదనంతర మాతఁడు,

"ఓయీ! నీవు కడుంగడు ధన్యుఁడవు. నీపూర్వజన్మ సుకృతఫలమ్మున నిట్టిరాకుమారుఁడు నీకు లభించెను. కాని పాప మెంతకాలమిట్లు వానిని విద్యావిహీనునిఁ జేసి యుంచెదవు? ఆబాలుని నాకప్పగింపుము. సమస్తవిద్యలు నేర్పి వాని నచిరకాలములో నే మహామహునిఁజేసి యనేక మహాకార్యములు వానిచేఁ జేయించెదను."

"అయ్యా! క్షమింపుఁడు. నాకంఠమునఁ బ్రాణమున్నంతకాలము వాని నన్యుల కొసఁగఁజాలను"

"అటుకాదటుకాను. ఆబాలునకుఁ జక్రవర్తిలక్షణము లున్నవి. మాతృదేశము నుద్ధరింప నవతరించినమహావిష్ణువలె నాతఁడు కనఁబడుచున్నాఁడు. అట్టివానిని నిష్కారణ మీగొల్లపల్లెయందూరును పేరును లేక పడవేసి యేల పాడుచేసెదవు? కావున నామాటవిని వానిని నాకొసంగుము. నేను బాగుచేసెదను."

"అయ్యా! నిజమేకాని వానిని విడిచి నేనొక్కక్షణమైనను మని యుండఁజాలను. దయచేసి నన్ను మన్నింపుఁడు."

"లేమలేదు. దీనికి నీవంగీకరింపకతీఱదు. పోనిమ్ము. కొంతకాలమై నను వానిని నాయొద్ద నుండనిమ్ము. సకలవిద్యలు నేర్పి మఱలనీయొద్దకుఁ బంపివేసెదనులే"

అని విష్ణుశర్మ వాని ననేకవిధముల నిర్బంధింపఁ బాప మాముసలి గొల్లఁ డెట్టకేల కంగీకరింపక తీఱినదికాదు. ఇంతలో నాబాలుఁడుకూడ నచ్చటికే వచ్చెను. విష్ణుశర్మ వానినిఁ జేరఁదీసి ముద్దుపెట్టికొని,

"కుమారా! నీ కన్నివిద్యలు నేర్పెదను నాతోడవచ్చెదవా?

"అన్నివిద్యలు ననఁగా? ధనుర్విద్యకూడ నేర్పెదరా?"

"ఓహో! నీకు ధనుర్విద్య కావలెనా? సరే నీ కదియే ముఖ్యముగ నేర్పెదనులే. నావెంటరా"

"అయ్యా! ధనుర్విద్యయే నేర్పినచో నవలీలలో మ్లేచ్ఛులనందఱఁ బాఱఁదోలి యీయరణ్యమునందంతట గొప్పదుర్గముఁ గట్టించి మగధరాజు వలె స్వాతంత్ర్యరాజ్యమును స్థాపింపకుందునా?"

"కుమారా! మగధరాజువలె నని యననేల? నిన్నుఁ దీసికొనిపోయి మగధసింహాసనముమీఁద నే కూర్చుండఁబెట్టెదను."

చంద్రగుప్త

మొదటిభాగము.

ప్రకరణము. 1.

ప్రయాణము.

శ్రీమదఖండసౌభాగ్యవిరాజితంబగు మనభరతఖండంబునంగల పర్వతసంఘములలో విఖ్యాతివహించినపర్వతరాజము హిమాలయపర్వతమే కదా? తత్పర్వతప్రాంతారణ్యమున నొకభాగమందు గొప్పయాశ్రమ మొండు కలదు. ఆకాలమునఁ బ్రజలెల్లరు దానినిఁ జాణక్యాశ్రమ మని వాడుకొనుచుండిరి. ఆయాశ్రమమునకుఁ బ్రక్కనే చిన్నసెలయేఱు ప్రవహించుచుండెను. అది యతివేగముగఁ బ్రవహించుచుండినదే యయ్యు నాశ్రమసమీప ప్రదేశ మించుకయెత్తుఁ గల్గియుండుటచేత నచ్చటమాత్రము రవంత మాంద్యమును వహించెను.

"సారములేనియల్పులవలె గర్వపోతులుకాక ఘనులు సర్వదా వినయశీలురే" యను నిశ్చయోక్తి, యసంఖ్యములగుమధురఫలములభారముచే నేలపైకి వంగినదీర్ఘశాఖలతోఁ గూడుకొని తదాశ్రమమునకుఁ జుట్టునుదట్టముగ నావరించిన వృక్షసంఘములఁ జూచినవారికి జ్ఞప్తికి రాకమానదు. త్రాగుటకు నిర్మలసారోదకమును, తినుటకు మామిడిపండ్లు, జామపండ్లు, అరఁటిపండ్లు పనసపండ్లు, సీతాఫలములు మొదలగుఫలములును విచ్చలవిడిగా లభించుచు, నన్నివిధముల నాప్రదేశము నివాసయోగ్యమై యుండుటయే యయ్యరణ్యభాగ మంతయు వెదకివెదకి చాణక్యుఁడు తనయాశ్రమ

మక్కడ నిర్మించుకొనుటకుఁ గారణమైనది. ఆశ్రమనాథుం డగుచాణక్యుఁడు మహాతేజస్వియేకాని, యపారవిద్వాంసుఁడేకాని, మిక్కిలికోపిష్టి. నిరంతరమును వానికన్నులయం దగ్నిజ్వాలలు ప్రజ్వలించుచునే యుండును. వేదాధ్యయనమునందేమి శాస్త్రములయందేమి యతఁడు సాటిలేనినేర్పరి. వాని యొద్ద ననేకబ్రాహ్మణకుమారులును, పెక్కుమందిభిల్లబాలకులును, మిక్కిలి శ్రద్ధతో విద్యాభ్యాసము చేయుచుండిరి. చాణక్యుఁడు సమస్తశాస్త్రసంపన్నుఁ డగుటచే నెవరి కేశాస్త్రమం దభిరుచియో వారి కాయాశాస్త్రములు నేర్పుచుండెను. క్షత్త్రియకుమారులుగూడ నెందఱో వానియొద్ద ధనుర్విద్య నత్యుత్సాహమున నేర్చుకొనుచుండిరి. ఇట్లెల్లవిధముల రాజిల్లుచుండుటచేతనే మనపురాణములలో వినుచుండుపూర్వపువసిష్ఠవిశ్వామిత్రాదుల యాశ్రమములవలె నీయాశ్రమముగూడఁ బ్రశంసనీయమై యుండెను. తపోమహాత్మ్యమునందును శాస్త్రకౌశల్యమందును నాఁటివసిష్ఠవిశ్వామిత్రప్రముఖులవలెనే మనచాణక్యమహామునిగూడ మిక్కిలి యోగ్యుఁడు. విశ్వామిత్రుఁడొక్కక్షత్త్రియులకే విలువిద్య నేర్పెను కాని మనచాణక్యుఁడు వీరు వారు నను భేదములేక నన్నివర్ణములవారికిని గఱపుచుండెను. ఇంతియకాక కౌశికుఁడు రామలక్ష్మణుల ధనుర్విద్యాపారంగతులఁజేసి వారిచే లోకకంటకులగు దుష్టదానవులమర్దింపఁజేసి దేశము నుద్ధరించినట్లే తానుఁగూడ దిక్కులేనియొకబీదరాచపిల్లవానినిఁజెంతఁజేర్చుకొని వానికి సకల విద్యలు నేర్పి దుష్టుల సంహరింపఁజేసి కడకు సార్వభౌమునిఁజేసి యార్యావర్తమంతయు నేకచ్ఛత్రముగ వానిచే నేలింపవలయునని చండశాసనుం డగుమన చాణక్యుఁడు కంకణముఁగట్టుకొనెను. ఎప్పుడు చూచినను, అతఁ డేదో యొకటి తనలో నాలోచించుచునే యుండుచుండెను. అందుచే నొక్కొక్కప్పుడు తనలో,

“ఆహాహా! ఎంతదారుణ మెంతదారుణము? ఎంతరాజ్యమదాంధత? విద్వాంసుఁడననియైనఁ దలంపక ఎవఁడో యొకబ్రాహ్మణాధముని నీచోక్తులు విని సత్యాసత్యవిచక్షణహీనుఁడై నిండుకొలువులో నన్నుఁ బరిభవించిన

గర్వాంధకారుఁడు మగధరా జింకెంతకాలము రాజ్యమేలునో చూచెదఁ గాక. వానివంశమును విధ్వంసమొనర్పకయె యీచాణక్యుఁడు గుండెపైఁ జేయివైచికొని హాయిగ నిద్రించునా? ఓమగధేశ్వరా! తొందరఁబడకుము తొందరఁబడకుము. ఈచాణక్యుఁ డచిరకాలములోనే నీవొనర్చినదానికిఁ బ్రతీకార మొనర్పబోవుచున్నాఁడు. అయినను నీరాజ్య మరాజకముగాకుండ మగధరాజ్యసింహాసనాసీనార్హుఁ డగురాకుమారుఁ డొకఁడు నాయొద్దనే పెరుగుచున్నవాఁడులే” అని మీసముఁ దువ్వుచు నతఁడు రోషావేశపరవశుఁడై పలుకుచుండెను.

తాను స్వయముగానే చాణక్యుఁడు “చాణక్యనీతి” యను నొక నీతిశాస్త్రమును వ్రాసి దానినిఁ దనశిష్యులకుఁ జెప్పుచుండెను. చాణక్యుఁడు మొట్టమొదట నల్పవయస్కుఁడును, అనల్పతేజశ్శాలియు సుగుణాలంకారుఁడు నగునొకరాకుమారునకును ఒకభిల్లబాలునకును మాత్రమే విలువిద్య నేర్పుచుండెను. కాని యతఁడు నిష్పక్షపాతబుద్ధితో నధికానురాగమున నల్పకాలములోనే యన్నివిద్యలను నేర్పఁగలజాణ యని యెఱిఁగి అనేక విప్రబాలకులును క్షత్త్రియబాలకులును వాని నాశ్రయించి చదువుకొనుచుండిరి. అచిరకాలములోనే చాణక్యునికీర్తి యెల్లెడల వ్యాపించుటచే దూరదేశములనుండిసైతము విద్యార్థులు వచ్చివానికడ విద్యాభ్యాసముఁ జేయుచుండిరి. కొంతకాలమునకుఁ జాణక్యుఁడు కొండగుహలయందును అడవులయందును సంచరించుభిల్లులనందఱఁజేరఁదీసి తనచతురవర్తనమునఁ దనవశముఁజేసికొని వారందఱకు విలువిద్య నేర్పుచుండెను. ఇట్లొక్కసంవత్సరములోనే మొదట నిరువురతోఁ బ్రారంభించిన చాణక్యపాఠశాల యిప్పుడు వేలకొలఁదిశిష్యులకు విద్యాప్రదం బై యుండెను. శిష్యులందఱు నతిశ్రద్ధతో నెవరిపాఠములు వారు చదువుకొనుచున్నప్పుడు వారందఱిని చాణక్యుఁడు జూచి హృదయ ముప్పొంగ నచిరకాలములోనే తనమనోభీష్టమీడేఱునని యమందానంద మొందుచుండెను. ఇంతియేకాక వారిచాకచక్యమును విద్యయందుఁగలపట్టుదలయు గురుభక్తియు సాహసధైర్యములును

గాంచి తాను నిశ్చయించుకొనిన కార్యమునందు తనకుఁ దనశిష్యులు వలసినంతసాహాయ్యమొనర్పఁగల రని యాతనికి విస్తారముగ ధైర్యము గల్గెను. శౌర్యధైర్యపరాక్రమములయం దాతనిశిష్యుల కెవ్వరును సాటి లేరు. ధనుర్విద్యానిపుణు లగుతనశిష్యుల వెంటఁ గొని రణరంగంబున శత్రుకోటినిఁ బరాభవించుటయే యాతనిముఖ్యోద్దేశము. కాని శత్రుసైన్యముకన్న నాతనిసైన్యము మిక్కిలి స్వల్పము. ఇదియునుఁగాక మగధరాజు మిక్కిలి గట్టివాఁడు. ఆర్యావర్తమునఁ బూర్వోత్తరభాగములును, పశ్చిమమునఁ గొంతభాగమును ఆర్జించినచతురుఁడు. అసంఖ్యసేనాసమన్వితుఁడు. తనశిష్యులెంతగొప్పవారైనను ఇంతస్వల్పసైన్యముతో నంతవానిని జయించుట సాధ్యమేకదా? ఈవిచారమే పాపము మనచాణక్యుని నిరంతరము బాధించుచు వచ్చెను.

ఒకనాఁడు చాణక్యుఁడు స్నానముఁజేసి జపతపాదులనిర్వర్తించుకొనుటకై కమండలమును కృష్ణాజినమును గైకొని యేటికిబయలుదేరెను. శిష్యులందఱుఁగూడ వచ్చుటచే స్నానముఁజేసినయెడలఁ దనజపమునకు భంగముగల్గు నని యెంచి చాణక్యుఁడు వారందఱకొఱకు నింకొకరేవు నిర్మించి తానుస్నానముఁజేయుప్రదేశమున కెవ్వరును రాకుండునట్లు కఠినముగ నాజ్ఞాపించెను. తనకొఱకుఁ బ్రత్యేకముగ నొకరేవుండుటచేతనే జపమునకుఁగాని యప్పుడప్పుడు సేయుకార్యాలోచనమునకుఁగాని భంగము లేకుండ నిశ్శబ్దముగ నుండుచుండెను. కాని ద్రోణాచార్యునకు అర్జునునివలెనే తనకు ముద్దుశిష్యుఁడును, ప్రియశిష్యుఁడు నగుచంద్రగుప్తునకుమాత్రము చాణక్యుఁడట్టియాటంకముఁ గల్గింపలేదు. తనతో మాటాడవలసివచ్చినప్పుడు స్నానముఁజేయుచున్నప్పుడే కాక నిశ్చలుఁడై సమాధిలో నున్నప్పుడుగూడ లేపిమాటాడుటకు వాని కధికారమిచ్చెను. చతురతయందును విద్యాబుద్ధులయందును శిష్యులందఱకన్నఁ జంద్రగుప్తుఁడు మెఱుఁగు గలవాఁడగుటచేతఁ దా నేదైనఁ గార్యాలోచనమునం దున్నప్పుడు వారందఱయొద్దఁ బాధము లప్పగించుకొమ్మని చంద్రగుప్తునకే నియోగించుచుండెను. తాను తలపెట్టిన

మహాకార్యముఁ గొనసాగించుకొనుటకుఁ దనముద్దుశిష్యుని ముఖ్యాధారునిఁగాఁజేసికొని చాణక్యుఁడు నిజకృతప్రతిజ్ఞాపరిపూర్తికై యుపకథానాయకుండగు చంద్రగుప్తునే మిక్కిలి నమ్ముకొనియుండెను. అతఁడు చంద్రవంశపురాజకుమారుఁడగుటచేతను, మహారణ్యమునఁ జంద్రకాంతియందు గుప్తముగ దొరకఁబడినవాఁడగుటచేతను, వానికిఁ జంద్రగుప్తుఁడని యాతఁడు నామకరణముఁజేసెను. చాణక్యుఁడు తలఁచిన కార్యమునందుఁ బట్టుదలగలవాఁడును, దీర్ఘాలోచనపరుఁడును, కార్యవేదియు నగుటచే ఒక్కచంద్రగుప్తునిచేతనే తనకార్యమంతయు నెఱవేఱుట దుర్లభ మని యెంచి ఆనాఁడు శ్రీరాముఁడు దుష్టరావణవధార్థము వానరసైన్యముల జతపరచుకొనినట్లు తానుఁగూడ నడవులలో నివసించు భిల్లులను, మాతంగులను, చండాలులను, తనవశముఁజేసికొని, వారికి విలువిద్య నేర్పవలసి వచ్చెను.

ఆనాఁడు చాణక్యుఁ డట్లు స్నానమునకై యేటికిఁబోవుచుండ దైవవశమున వానిహృదయమున కేదియో యొకయుపాయము పొడకట్టెను. తోడనే యతఁడు సంతోషాతిశయమునఁ బెద్దకేకవేసి చప్పట్లు చఱచి తనలో "వాహ్వా వాహ్వా కైలాసనాథుఁడు నాకెట్టియుపాయముఁ దోఁపించెను? ఇదియేకదా? చాణక్యప్రతిజ్ఞాపరిపూర్తికై ముఖ్యోపాయము?... ....ఏమిచెప్పవమా? ఇంతప్రొద్దెక్కినను చంద్రగుప్తుఁడు వేఁటకై పోయి యింకను రాకున్నవాఁడు? అని యింక నేమేమో యనుకొనుచు ఏటికిఁ బోయి స్నానముఁజేసి జపముఁజేసికొనుటకై గట్టుపైఁ గృష్ణాజినము వేసి కొని యందుపైఁగూర్చుండెను. కాని వానిహృదయ మన్యథాప్రవర్తించుచుండుటచేత నానాఁడు సమాధియందు వాని కంతగా శ్రద్ధ గలుగలేదు. వ్రేళ్లతో జపమాలికనుద్రిప్పుచునే యుండెను కానిమనసులో నేమను కొనుచుండెనో వానికే తెలియును. ఇంతలో నెవరో తనవైపునకుఁ బరుగుపరుగున వచ్చుచున్నట్లు అడుగులచప్పుడు వినఁబడఁ జాణక్యుఁడు కన్నులు విప్పిచూచుసరికి అతఁడు వానికిఁ బ్రియశిష్యుఁడగు చంద్రగుప్తుఁడే ఎంతో దూరమునుండి పరుగునవచ్చుచుండినట్లు వానిమొగమంతయు వాడి యొడ

లెల్లఁ జెమటచేఁదడిసి పాదములు ధూళిధూసరములై యుండెను. వానివెనుక నిరువురుభిల్లబాలకులు గూడనుండిరి. చంద్రగుప్తుఁడు గురువుగారికిఁ బాదాభివందనమాచరించి కట్టెదుట నిలువఁబడి ముకుళితకరకమలుఁడై కడు వినయముతో

"గురూజీ! నేఁడు మనయాశ్రమసమీపమున నొకపెద్దయడవిపంది వచ్చినది. అంతపెద్దజంతువును ఈయరణ్యమున మన మిదివఱ కెన్నఁడును జూచియుండము. దానిని నేనవలీలఁ దునుమాడితిని. కాని అబ్బా! దాని మొండిప్రాణ మెకింతకు బోయినదికాదండీ"

అనిపలుక వానివెనుకనున్నభిల్లులలో నొకఁడు ముందునకు వచ్చి "గురూజీ! నేఁడు మనచంద్రగుప్తునివేఁటఁజూచి మేమందఱ మత్యద్భుత మొందితిమి. ప్రతిదినముకన్న నేఁ డీతఁడు మృగయావినోదమునఁ దనభుజపరాక్రమమంతయు బూర్ణముగ—"

అని యేమోచెప్పఁబోవుచుండ నింకొకఁడు ముందునకు వచ్చి "గురువుగారూ! ఇంతయెందుకండీ? మనచంద్రగుప్తుఁడు నేఁడాయడవిపందిని వేఁటాడుచున్నప్పుడు మాయావేషధరుండగు శంకరునితోఁ బోరాడిన నాఁటియర్జునుఁడే మాకందఱకు జ్ఞప్తికివచ్చెను."

అనిపలుకఁ జాణక్యుఁడు మందహాసమునఁ జంద్రగుప్తునిఁ గని "వత్సా! చంద్రగుప్తా! నీపరాక్రమమును విని నేను మిక్కిలి సంతసించితిని కాని యింతమాత్రమున నీవు తృప్తిఁబొందకూడదుసుమా! ఇదేపాటి కార్యము? ముందుముం దింతకన్నను గొప్పకార్యములు చేయవలసియున్నవి. అందులో నిది శతాంశమైనను కాదు. సరే దీనికేమిలే నేనిప్పుడు నీతోఁ గొంచెమురహస్యముగ మాటాడవలసియున్నది. ఇచ్చటఁ గూర్చుండుము"

అని భిల్లబాలకులఁగాంచి "మీరందఱు నింక ఆశ్రమములోనికిఁ బొండు నేను పిల్చినప్పుడు మరల రావచ్చును" అని వారినిఁ బంపివేసి చంద్రగుప్తునితో నిట్లు సంభాషించెను.

"వత్సా! చంద్రగుప్తా! నే నిప్పు డొకకార్యము మీఁద గ్రామాంతరమునకుఁ బోయి యందు నాలుగుమాసము లుండవలసివచ్చినదిసుమీ!"

"దేవా! ఏగ్రామమునకు?"

"ఏగ్రామమోయెఱుఁగవా నాయనా! నేనుపోవలసినగ్రామము పాటలీపుత్రముకన్న వేఱేమున్నది?"

"గురువర్యా! అట్లయిన నేనుఁగూడ మీతో వచ్చెదను సెలవా?"

"కుమారా! నీవు పాటలీపుత్రమునకు నాతో వచ్చుట కిది సమయము కాదు. మొదట నేను పోయి వచ్చి తరువాత నిన్నుఁదీసికొనివెళ్లెదను."

"అబ్బ! మిమ్ము విడిచి నే నొక్కక్షణమైన నుండలేను. నేను గూడ వచ్చెదను."

"వద్దువద్దు. కుమారా! నేనెందుల కిప్పుడు పాటలీపుత్రమునకుఁ బోవుచున్నానో నీవెఱిఁగియేయుందువు. నాయనా! నేను పడుప్రయాసమంతయు నిన్నుఁజక్రవర్తినిఁజేయుటకేకదా? ఇంతకన్న నాకింకేమిపని యున్నది? వత్సా! మగధరాజ్యసింహాసనముపై నిన్నెప్పుడు కూర్చుండఁ బెట్టెదనో యప్పుడుకదా నేనుధన్యుఁడనయ్యెదను? అప్పుడేకదా నాచేసిన ప్రతిజ్ఞ పూర్తియగును? కుమారా! అప్పుడేకదా నేనుపడినప్రయాసమంతయు సార్థకమగుట? ఇన్నిసంగతులు నీవెఱిఁగియు నిట్టిపంతముఁబట్టుటుచితముగాదు. ఇంతియకాక నీవు కొన్నిరాజధర్మము లింకను నేర్చుకొనవలసియున్నవి. అందుచేత నే నేవచ్చువఱకు నీనాల్గుమాసములును మన యాశ్రమమంతయుఁబరిపాలించుచుండుము. వేలకొలఁదినున్న విద్యార్థులందఱు నిన్నుఁగొల్చుచుందురు. నేను వచ్చి నీపరిపాలనానిపుణత్వమును జూచి వెంటనే నిన్నుఁ జక్రవర్తినిఁ జేసెదను. ఈరహస్యములన్నియు నీమనస్సులో నుంచుకొనుము. నీవుమాత్రము నాతో నిప్పుడు రావీలులేదు."

ఇంతవఱకుఁ జెప్పినతరువాతఁ బాపము! చంద్రగుప్తుఁడేమియును మాటాడలేకపోయెను. తన్ను విడిచియుండుట చంద్రగుప్తునకెంతమాత్ర

ము నిష్టములేదని చాణక్యుఁడు గ్రహించెను కాని కాలయాపన మిష్టయుంక త్వరలోనే తనకార్యములన్నియు నెఱవేర్చుకొనుటకు వానివిడిచియే పోనిలసివచ్చెను. తాను దలపెట్టినదెట్టికార్యమైనను భంగముగాకుండ నెఱవేర్చుటయేకదా చాణక్యునిముఖ్యవ్రతము. అందుచే నాతఁ డాపుడునాఁడే తనయాశ్రమమును విడిచి నాలుగుమాసములు గడపి వచ్చుటకై పాటలీపుత్రమునకు బయలుదేఱెను.

ప్రకరణము. 2.

పా ట లీ పు త్ర ము.

చాణక్యుఁడు బయలుదేఱి పాటలీపుత్రమునఁ బ్రవేశింపకమున్ను యీనగరమునుగూర్చి మాచదువరులకుఁ గొంత తెలుపవలసియున్నది. ప్రస్తుతము బేహారనిపిలువఁబడుచున్న దేశమే పూర్వము మగధరాజ్యమని చరిత్రకారులు వ్రాసియున్నారు. ఇప్పుడు మనము విహరింపఁబోవుపాటలీపుత్రమీరాజ్యమునకే రాజధానియైయుండెను. మగధరాజ్యము పురాణములలో మిక్కిలిప్రసిద్ధిఁగాంచినది. కాని పాటలీపుత్రముమాత్రము మగధరాజ్యమునకు మొదటినుండియు రాజధానియైయుండలేదు. కొంతకాలము రాజగృహమును మఱికొంతకాలము మహాగోవిందుఁడనుశిల్పిచేఁ గట్టఁబడినగిరివ్రజదుర్గమును తరువాత వైశాలీనగరమును ఈదేశమునకుఁ గ్రమముగ రాజధానులై యుండుచుండెను. శిశునంగునికుమారుఁడగు కాలాశోకుఁడు రాజ్యముచేసినప్పుడే మగధదేశరాజధాని పాటలీపుత్రమునకు మార్పఁబడియెను. పుష్పపుర మనునామాంతరముగలపాటలీపుత్రమును విఖ్యాతిఁ జెందిన గొప్పగొప్పపట్టములలో నొకటి యనిచెప్పవలసియున్నది. దాని ప్రక్కనే మనహైందవులచే నేటికిని పుణ్యతీర్థమనివాడఁబడుచున్న పవిత్రమగుగంగానది పాఱుచుండెను. ఎటుచూచినను 5 క్రోసులపొడవును 5 క్రోసులవెడల్పును గల్గి మహోన్నతములైన సౌధపరంపరలతోడను, మిక్కిలివైశాల్యముగల రాజవీథులతోడను, త్రినేత్రునకైన భేదింపనలవికాని ప్రాకారకుడ్యములతోడను, రణరంగమున నించుకైన వెనుదీయనిభటాగ్రేసరులతోడను, ధనుర్విద్యావిశారదు లగురాజవీరులతోడను, నిత్యమును దాండవమాడుచుండినపాటలీపుత్రమునుగూర్చి యెంతవ్రాసినను వ్రాయ

వచ్చును. మనకథాకాలమునాఁటి కీనగరమును ధననందుఁ డనునొకరాజు పరిపాలించుచుండెను. అతఁడు వయస్సునందేకాక విద్యాబుద్ధులయందుఁ గూడఁ గడువృద్ధుఁడు. రాజ్యపాలనానిపుణత్వమునం దతఁడు మిక్కిలి పేరుపొందెను. యాచకులఁ జాలుచాలుననిపించు దానమును, శాత్రవుల శరణుశరణనిపించు పరాక్రమమును, విద్వాంసుల మేలుమేలనిపించుపాండిత్యమును, గల్గుటచేతనే ధననందునికీర్తి యెల్లదేశములయం దెల్లవారి కర్ణపుటంబుల నిరంతరముఁ గాఁపురముసేయుచుండెను. కాని పాపము తనప్రజలకుమాత్ర మించుకతఁడయిష్టుఁడు కావలసివచ్చినది. కాలవశముచేత నొకానొకప్పుడు ధననందుఁ డన్యాయముగ నొకస్త్రీని చెఱసాలలోఁ బెట్టించి యామెశిశువును బలవంతముగఁ జంపించుటచేఁ బ్రజలందఱికిని వానిపైఁ గలరాజభక్తి స్వర్వమునుపోయి యొకవిధమైనయసూయ జనించినది. కాని వానిముఖ్యామాత్యుఁడగురాక్షసుఁడుమాత్రము రాజునెడల భక్తివిశ్వాసములఁ గలిగి యాతని కభిమానుఁడై యుండెను. అతఁడు రాజు నితఁడు మంత్రియనుభేదములేకయే యిరువురును ఏకమాతృగర్భోద్భవులగునన్నదమ్ములచందమున నొకరినొకరు ప్రేమించుకొని యొండొరులయోగక్షేమములరయుచు మిక్కిలి మైత్రితో మెలఁగుచుండిరి. అమాత్యరాక్షసునియందుఁ దనకధికానురాగముండుటయే కాక రాజ్యకార్యములయందుఁ దనరాజ్యమునం గలవారిలో నెవరిపైని లేనినమ్మకము వానిపై నుండుటచే ధననందుఁడు రాజ్యభారమంతయు నమాత్యరాక్షసునిపైనే పెట్టెను. అందుచే రాజుతోపాటు రాక్షసునిపైఁగూడఁ బ్రజలలోఁ గొందఱ కసూయ జనించిన దని వేఱుగ వ్రాయనక్కఱలేదు. ప్రజలుకానీ రాజకీయోద్యోగస్థులుకానీ ఏవిషయమునైనఁగూర్చి యమాత్యరాక్షసునితోడనే చెప్పుకొనవలసివచ్చుటచేత నది కొందఱ కిష్టములేకుండనుండెను. అందుచేతనే రాజకార్యములు చక్కఁగాఁ జరుగుటలేదు. రాజ్యకార్యనిర్వహణమునందసమానచాతురీధురీణుఁడగుట నమాత్యరాక్షసుఁడు రాజ్యమునం దెట్టి కలతలుఁ బుట్టనీకుండ నెప్పటికప్పు డణఁగించుచుండెను. రాక్షసుఁ డెంత

కాలము నందరాజ్యమున నుండునో అంతవఱకు నారాజ్యమును కన్నెత్తి చూచుటకైన శత్రువులకు వీలులేదు. వానిపేరన్న వారికి సింహస్వప్నమే! అమాత్యరాక్షసుఁడు విద్యాధికుఁడును, విశ్వాసపాత్రుఁడును, కార్యవేదియు, సామ్రాజ్యపరిపాలనాచతురుఁడును అగుటచే ధననందుఁడు తానేకార్యమును దలపెట్టినను వానిసలహా లేనిదే యిదివఱకెన్నఁడును చేయలేదు. అమాత్యునిపైఁ దనకున్నంతయధికవిశ్వాసము లేకపోయెను. ధననందుఁడు తనసేనానాయకునిపైఁగూడఁ గొంతనమ్మకమును గల్గియుండెను. తాను తలపెట్టినకార్యము లప్పుడప్పుడు వానితోఁగూడఁ జెప్పుచుండెను. రాజ్యభారము మంత్రిమీఁదను, సైన్యభారము సేనానాయకునిమీఁదను, బెట్టుకున్న నాతఁ డంతకాలము రాజ్యముఁ జేసియే యుండఁడు. నందరాజ్యరహస్యము లింకను ననేకములున్నవి. కాని మాచదువరులు వానినెల్ల ముందుముందు తెలిసికొనఁ గలరు. గావున నింతతోఁ జాలించి మనము ప్రస్తుత కథాభాగమును ప్రారంభింతము.

ఒకనాఁటిరాత్రి పాటలీపుత్రము చూపరులకతిమనోహరముగ నలంకరింపఁబడెను. ఒక్క పుష్పులయంగడితప్ప రాత్రియెనిమిదిగంటలకుకాక మునుపే వర్తకులందఱుఁ దమతమయంగళ్లు మూసివేసికొనిరి. రాజవీథులన్నియుఁ జిత్రముగఁ బలువిధములగుదీపములచే నలంకరింపఁబడెను. మేడలన్నియు రంగులచేతను, తోరణములచేతను, చిత్రపటములచేతను, శృంగారింపఁబడినందున నిసుక వేసినరాలకుండునట్లు ప్రజలుగుంపులుగుంపులుగఁ గూడి యావినోదములన్నియుఁ జూచుచుండిరి. స్త్రీపురుషులందఱును వస్త్రాలంకారభూషితులై యానాఁడెన్నఁడునులేని యమందానందమొందుచుండిరి. జగదామోదకరుఁడగు శీతలమందగంధవహుఁడుఁగూడఁ గంగానదీనిర్మలోదకతరంగసంఘముల హాయిగ మజ్జనమాడి, పుష్పపురోద్యానవనవాటికలయం దొక్కింత విహరించి, తదారామస్థితవివిధకుసుమనికరపరిమళముల నాఘ్రాణించి, కడుమనోహరముగఁ బాటలీపుత్రరాజవీథులయందుఁ బ్రవేశించి యెల్లరయుల్లమ్ము లత్యుత్సాహమొందున ట్లెల్లెడల

స్వేచ్ఛావృత్తిఁదాండవమాడుచుండెను. మాలాకారులు ప్రతివీథియందును దిరుగుచుఁ దాము కడువిచిత్రముగఁ గూర్చినపూలదండల నెల్లరకు విక్రయించుచుండిరి. వారితోఁ జేరము కుమారనందునఁ గొందఱు తిన్నగఁబూల యంగడికే పోయియచ్చటఁ దమయిచ్ఛకునచ్చినపూలదండలనెన్ని కొని తెచ్చుకొనుచుండిరి. ఎన్నిపనులైనఁగట్టిపెట్టి ప్రత్యేకముగఁదమమొగములను తెల్లగఁ దాంబాళములవలెఁదోముకొని, తరువాత చక్కనితిలకములు దిద్ది, పాదములుసైతముఁ గనఁబడకుండఁ జీరాడునట్లు చలువఁజేసిన తెల్లని వస్త్రముల ధరించి కనులకుసన్ననికాటుక దిద్ది, కంఠములఁబూలమాలికలఁ దాల్చి, కరములయందు వెండిబెత్తములఁగైకొని, రాజవీథులయం దెడతెఱిపి లేకుండ నూరక యటునిటుఁదిరుగుచుఁ బనియును తీరుబాటునులేని శృంగారపురుషులయడావిడియే యారాత్రి యందఱికన్న నెక్కుడుగ నుండెను. నవరత్నభూషణభూషితశరీరలై పూలమాలికలను పన్నీరుచే నింపఁబడినబంగారుకలశములను బట్టుకొని పౌరకాంతామణు లెల్ల సౌధోపరిభాగంబుల నిలిచి తొంమకొఱకో యెదురుచూచుచుండిరి. ఎచ్చటనైనఁ జిన్నశబ్దము వినిపించినంతమాత్రమునఁ బ్రజలెల్లరు గుంపుగుంపులుగఁగూడి యావంకకుఁబరుఁగిడుచుండిరి. ఎచ్చటఁజూచినను లక్షలకొలఁది నున్న దీపములకాంతులెల్లెడలఁ బ్రకాశించుచుండుటచే నానాఁడు పాటలీపుత్రమంతయు సువర్ణమయమైనట్లుకానవచ్చుచుండెను.

ఇట్లుండఁ గొంతసేపున కొకదిక్కునుండి ఢంకానగారాలు మ్రోగించుచున్నట్లు ఢమఢమయనునాదము ప్రజలకెల్లర కాకస్మికముగ వినఁబడఁజొచ్చెను. తోడనే పౌరులందఱు "యువరాజుగారు వచ్చుచున్నారు యువరాజుగారు వచ్చుచున్నారు" అని ఘొల్లునఁ గేకలువేయుచు నాప్రక్కకుఁ బరుఁగుపరుగనఁ బోవసాగిరి. అంతకంతకు నాదము ప్రబలమై నగరవాసులకు మఱింతస్పష్టముగ వినవచ్చుచుండెను. జనులెల్లరు నత్యుత్సాహమున బరుఁగెత్తి చూచుసరికి, పాటలీపుత్రమునకుఁ జిట్టచివరనున్న యొకరాజభవనమునుండి గొప్పయుత్సవము బయలుదేఱి పట్టణములోనికి

వచ్చుచుండెను. అంతకంతకాయుత్సవము సమీపించుసరికి ఢంకానగారాల ఢమఢమారావములు, వందిమాగధుల స్తోత్రనాదములును, పౌరవారంబుల జయజయశబ్దములును, భూసురోత్తముల మంగళాశీర్వాదధ్వానములును, గాయకుల మనోహర మంగళగీతనినాదంబులును, హయహేషలును, గజబృంహితంబులు, నేక మైభూమ్యాకాశములఁ గప్పి వినువారికర్ణపుటంబులు భేదించుచుండెను. కురంగములవలెఁ దమనాల్గుపాదముల భూమిపై మోపక కడుచిత్రముగ నడచి వచ్చుచున్న గుఱ్ఱాలపై నెక్కి మొదటఁ గొందఱు సరదారులు బయలుదేఱిరి. వారివెనుక లెక్కింప నశక్యములైన కాల్బలములును వానివెనుక నాయుధపాణులై బారులు గట్టివచ్చుచున్న రాజభటాగ్రేసరులును, వారివెనుక దివ్యాంబరాలంకార శోభితాంగులగు సామంత భూకాంతులును, గాయకవందిమాగధ బృందంబులును, రాజసేవకులును, సేనానాయకులును, క్రమముగ వచ్చుచుండఁ జిట్టచివరఁ బట్టపేనుఁగుపైఁ గట్టఁబడిన బంగారపు టంబారిలో వధూసహితుఁడై పట్టుపరుపులపైఁ గూర్చుండి యువరాజు వచ్చుచుండెను. ఇట్లాయుత్సవము రాజవీథులన్నియుఁ గడచి కోటవైపునకుఁ బోవుచుండెను.

ప్రకరణము. 3.

మురాదేవి.

ఆనాఁటిరాత్రి పాటలీపుత్రమున జరిగిన మహోత్సవము ప్రజల కత్యుత్సాహకరమైయుండెనని మీఁదిప్రకరణములోనే వ్రాసితిమి. కాని యా యుత్సవమేదియో మాచదువరుల కిదివరకుఁ దెలియదు. అది యువరాజు పట్టాభిషేకము. అందుచేతనే రాజువిషయమై ప్రజలకుఁ గొన్ని కొన్ని కారణములచే వ్యతిరేకభావమున్నను ఆనాఁడుమాత్ర మాద్వేషమును వారందఱు మఱచి యత్యుత్సాహమున యువరాజునకుఁ బట్టాభిషేకోత్సవముఁ జేయుచుండిరి. అంతరంగమున నెన్ని ద్వేషములున్నను రాజు తలపెట్టినకార్యములకుఁ బ్రజలను ప్రజలు తలపెట్టినకార్యములకు రాజును, తోడుపడక తీఱదుకదా! పౌరులందఱుఁ దమతమగృహముల నలంకరించుకొని యువరాజు ఊరేఁగుచున్నప్పుడు జయజయధ్వనులతో బయలు దేఱిరయె కాక, పౌరకాంతామణులుఁగూడ సౌధోపరిభాగంబుల నిలచి యాతనిపైఁ బూలసరముల విసరుచు బంగారుకలశములతోఁ బన్నీరుఁ జల్లుచు మంగళహారతు లొసంగుచు ననేకవిధములఁ దమరాజభక్తిని వెల్లడించిరి. జనుల దీర్ఘదృష్టులన్నియు యువరాజువంకనే యుండెను. నగరమున నెచ్చటఁ జూచినను యువరాజు పట్టాభిషేక విషయక ప్రసంగమే. అట్లుత్సవమంతయు బయలుదేఱి కోటసింహద్వారమువద్దకు వచ్చుసరికి దృష్టిదోష పరిహారార్థమై యువరాజుముందర ననేకమహిషములును మేషములను దేవికి బలి యీయఁబడినవి. యువరాజు కోటలోఁ బ్రవేశించిన వెంటనే యంతఃపురకాంతామణులెల్ల రాతనిపై సేసలుజల్లి చిరంజీవివి గమ్మని యాశీర్వదించిరి. పట్టణములోని వారేకాక కోటలోని బాలురును

గూడ స్త్రీలును పురుషులును తా మానాఁడొందిన యానంద మిదివఱ కెన్నఁడును బొంద లేదని ముచ్చటించుకొనుచుండిరి. కాని యువరాజునకుఁ బట్టాభిషేకము జరుగుచున్నప్పుడు ప్రజలానందించుటంత యాశ్చర్యకరమైన సంగతికాదు.

ఏకారణముచేతనోకాని యానాఁటిరాత్రి రాజమందిరమున నొక మూలఁ బాప మొకయనాథస్త్రీ స్తంభమునకు జేరగిలి కూర్చుండి మాసిన చీర ధరించుకొని నిరస్తభూషణయై తలవెండ్రుకలు విరియఁబోసికొని కన్నీరు మున్నీరుగాఁ బ్రవహింప యూరక వెక్కివెక్కి రోదనమొనర్చుచుండెను. ఆమె నోదార్చుటకుఁగాఁబోలు నొకదాసి చెంతనే యుండి కన్నీరు పైఁటకొంగుతో నొత్తుచు నేమేమో చెప్పుచుండెను. పట్టణమంతయు నాదినమున మహానందమున నోలలాడుచుండ నామె యొక్కతెయే యిట్లు రోదనముసేయుచుండుటఁజూడ నిందుల కేదో యొకమహాకారణ ముండితీఱవలయుఁ గదా? ఆమెవయస్సు రమారమి ముప్పదియైదు సంవత్సరములకు లోపేకాని యంతకుమించియుండదు. ఆమె నోదార్చుచున్న దాసి మిక్కిలి ప్రౌఢవలెఁ గనఁబడుచున్నది. ఆదాసి యెన్నివిధముల బోధించుచున్నను నాకాంతామణి తనరోదనముమానక నేలపైఁబడి దొర్లుచుండెను. ఆమె దుఃఖమునకుఁగారణము మనకుఁ దెలియకున్నది. తన కెన్నియో యుపచారములు జేసి యనేక విధములబోధించుచున్న దాసినిఁ జూచి యాకాంత కన్నీరుఁగార్చుచు "ఓసీ! బృందమాలా! నీవెంతయో దార్చినను ప్రాణమున్నంతవఱకు నన్నీదుఃఖము బాధించుచునేయుండును. అయ్యయ్యో ఎంతనిర్భాగ్యురాలనైతిని. ఇంతగర్భశోకము నాకుఁ గల్గుటకుఁ బూర్వజన్మమున నెన్నిపాపములు చేసితినోకదా? కటకటా! బృందమాలా! ఇంక నా కేది దిక్కు? అయ్యో! నాచిన్నారిచిట్టికంద, నా ముద్దులమూట, నాకన్నెల వన్నెకాఁడు, నాముద్దులకుమారుఁడే బ్రతికియున్న నేఁడు జరిగినపట్టాభిషేకము వానికే జరిగియుండునుకదా? అక్కటా యీనిర్భాగ్యురాలి కంతభాగ్యమా? నాకుమారునకుఁ గావలసిన పట్టాభిషే

కోత్సవమింకొకని కగుచుండఁ గన్నులారఁజూచి యెట్లోర్వఁగలను? నా ప్రాణములనెట్లు భరింపఁగలను? పొంగి పొంగి పొరలి వచ్చుచున్న యీ దుఃఖసముద్రము నెట్టు లాపఁగలను?

బృందమాలా! నాకింకేదియైనఁ ద్రోవఁజూపవా? నీకుఁగూడ నేను శత్రురాలనైతినా! అయ్యయ్యో మహారాజునకు ముద్దులభార్యనైయుండి యేమిపాపముఁ జేసితినోకాని కడకు దాసికన్న హీనురాలనైతిని. హా బృందమాలా! సకలసౌభాగ్యవినిర్జితదేవేంద్రుఁడగు నంతటికిరాతమహారాజునకు లేకలేక గల్గినముద్దులపట్టినై, మగధరాజ్యలక్ష్మీధురంధరుండగు నంతటి మహారాజును గాంధర్వవివాహంబునఁ జేపట్టి, కడ కెంతనీచస్థితికి వచ్చితినే. శ్రీహరీ! ఎంతపాప మెంతపాపము? బృందమాలా నాపాలిటయమదూతలవలె నాసవతులు నన్నుఁజూచి యోర్వలేక తమకన్న రాజు నాపై నధికానురాగముఁ జూపుచున్నందున నన్నెట్టులైన మోసపుచ్చనెంచి నేను నిజమైన కిరాతమహారాజు కుమారికను గాననియు, శూద్రస్త్రీయైన యొక దాసిపుత్రిక ననియుఁ బట్టణమ్మున వదంతిఁబుట్టించి నాపైఁ బెద్దయపనింద మోపి, నానాథుని హృదయమును ద్రిప్పి వేసిరి. అక్కటా న్యాయాన్యాయ విచారదక్షుండయ్యు, సకలసామ్రాజ్య పరిపాలననిపుణుండయ్యు, నా దురదృష్టవశమున నానాథుఁడు సత్యాసత్యముల విచారింపక నాసవతులు పన్నినమాయ యనియైన నూహింపక నిష్కారణముగ నన్నుఁ జెఱసాలలో బంధించి నాకుమారుని బలవంతముగఁ బురుటిలోనే చంపించెను. అయ్యయ్యో కాలమహిమ" అని మురాదేవి తలఁచుకొని తలఁచుకొని మఱింత రోదనము సేయుచుండ బృందమాల యామెనోదార్చుచు "దేవీ గడచినసంగతులన్నియు ఎందుల కూరక యుల్లేకరువుపెట్టెదవు? నీచరిత్ర మెవ్వ రెఱుఁగరమ్మా వెఱ్ఱిదానా? కాలవశముచేత నెట్టివారికైనఁ గష్టములు రాకపోవు. కాని యిట్టి యాపత్సమయములయందే ధైర్యముండవలయు. రాఁబోవుమోస మేదియో గ్రహింపక నీవిట్లూరక యేడ్చుచున్న నేనెంతని యోదార్పఁ గలనుచెప్పుమా? యువరాజు పట్టాభిషేకము జరుగు

చున్న సుదినమున నీ విట్లమంగళకరముగ రోదనము సేయుచున్నావని రాజు వినినయెడల నిన్నూరక విడుచునా? అమ్మా! రాజుచిత్త మెప్పటి కెట్లో యెవరు గ్రహింపఁగలరు? ఈసంగతివిన్నచో నాతఁడు నిన్నెంతమాత్రమును క్షమింపఁడు. తన కుమారుని పట్టాభిషేకదినమున నెవ్వరిని విచారముతో నుంచఁగూడదని యెంచియేకదా నేఁటికి పదునాఱుసంవత్సరములనుండి కారాగృహవాసముఁ జేయుచున్న నిన్నుఁగూడ ఖైదీలందఱతోపాటుగ, రాజు విడిపించెను? దేవీ! అన్నిసంగతు లెఱింగిననీ కెవరు చెప్పఁగలరు? నీవే యాలోచించుకొనుము. రాజున కాగ్రహము పుట్టించి మరలఁ ఖైదులోఁబడకుము. ఇదిగాక నాఁటనుండి నీకీకోటలో ననేకులు శత్రువులున్నారు. వారెవరైనను నీయమంగళ రోదనమును విని రాజున కెఱిగించినఁ గొంపమునుఁగును. కావున నింక దుఃఖముఁ జాలింపుము. జరిగినదేమో యిదివరికే జరిగిపోయినది. ఇంక లేచి నా వెంటరా! నీవుగూడ వారండములోఁ గూర్చుండి పట్టాభిషేకోత్సవమును జూడుము".

"బృందమాలా! ఏ మనుచున్నావు? నాకొంప మునుఁగుననియా? మునుఁగవలసినదేదో యిదివఱకే మునిఁగినది. ఇంకను మునుఁగవలసినదేమున్నది? కావున నాకింకేమియును భయములేదు. ఒకవేళ నారోదనము వినిన రాజుమాత్రము నాకేమి శిక్ష సేయఁగలఁడు? అన్యాయముగ నన్నుఁ జెఱలోఁ బెట్టించి నాకుమారుని బలవంతముగఁ జంపించి యాతఁడు చేయవలసిన శిక్ష యిదివఱకే చేసెను? ఇంతకన్నను కఠినశిక్ష వేఱేమున్నది? ఒకవేళ నన్నురిదీయుఁడు మనెదవా? అట్లైన నేధన్యురాలనే! దిక్కులేని యీ పాడుబ్రతుకుకన్న నాకదియే సౌఖ్యకరమైనది ఎవరైన విని రాజుతోఁ జెప్పి నదాఁక యెందుకు? నేనిట్లు రోదనము సేయుచున్నానని నీవే పోయి యాతనితోఁ జెప్పుము. నాకేమియును భయములేదు. నేను చావునకు సిద్ధముగానే యున్నాను"

ఆమాటలు బృందమాల విని యామెకేమియును బ్రత్యుత్తరమీయ లేకపోయెను. బ్రతికియుండినయెడల న్యాయముగ నాఁడు జరిగినపట్టాభిషేక మామెకుమారునకే జరిగియుండుననియు నిక్కముగ నట్టులే జరిగియున్నఁ బాప మాబిడ యెంతయానందించునో యనియు బృందమాలకూడఁ దనలో విచారించుచు నామెకేమియునుసమాధానమును జెప్పలేక యొక్కింతసే పూరఊరకుండెను. ఈలోపున ముర తనలో నేమేమో యాలోచించుకొని బృందమాలను జూచి యిట్లు పలుకఁ జొచ్చెను.

“బృందమాలా! మాటాడవేమే? సరే జరిగినదేదియో యిదివఱకే జరిగినది. ఏమియును జేతకాని మూర్ఖురాలివలె నిట్లేడ్చుచునుండిన, నేకార్యమగును? వేయేల? ఓసీదాసీ! అన్యాయముగ నాకుమారుని జంపించి నాకనులముందఱ నేధనానందుఁడే యువరాజునకుఁ బట్టాభిషేకముఁ జేసెనో ఆయువరాజునకు నే నీమగధరాజ్యము దక్కనిచ్చెద ననుకొంటివా? నేఁటినుండి ప్రయత్నించుచు నెన్నివిఘ్నములైనఁ గల్పించి యెట్టి సాహసములకైనఁ బాల్పడి యెంతప్రయాసమునకైన నోర్చి, వానిని రాజ్య పదభ్రష్టునిఁ జేసెదను. నీవే చూచెదవు. ఇది ముమ్మాటికిని నిశ్చయము. అయ్యయ్యో! మొదటినుండియు నాకీయుద్దేశమున్న నామనోభీష్టమిదివఱకే నెఱవేఱి యుండునుకదా? ఇంతకాలమును వృథా గడపితిని. ఇంత ఘోరము జరుగునని మందమతినై తొలుత గ్రహింపఁజాలనైతిని. నల్లగానున్నవన్నియు నీళ్లును, తెల్లగానున్నవన్నియుఁ బాలు నని నమ్మికొని నిష్కారణముగ మోసపోతిని. బృందమాలా! కాని యిఁకమీఁద మాత్ర మట్లుకాదుసుమా? నా యమాయకత్వమును విడిచి నఖశిఖాపర్యంతమును విషపూరితనై యీపైనిఁజరించెదను. నాచతురత్వమంతయుఁజూపి యార్యపుత్రునిహృదయ మపహరించి, పూర్వమువలె నన్నేలుకొనునట్లు చేసికొని, వానిచేతనే నాకార్యములన్నియుఁ జేయించెదను. అకారణముగ నాపై నపనింద మోపి నన్నింతదుఃఖపెట్టిన నాసవతులగర్వం బడంగించి నాప్రాణేశ్వరుఁడు కలలోనైన వారిమొగమును దొంగిచూడకుండునట్లు గావించెదను. న్యాయముగ నాకుమారుఁ డనుభవింపవలసినసిద్ధాన్న మపహరించి, విఱ్ఱవీఁగుచున్న యీదుష్టయువరాజును గద్దెపై నుండి నానాథునిచేతనే క్రిందికీడ్పించి మాతండ్రిగారి వంశములో నున్నయేవీరపురుషునైన రప్పించి రాజుచేతనే వానిని సింహాసనముపైఁ గూర్చుండఁబెట్టఁజేసెదను. ఒకవేళ నందులకు ధననందుఁడంగీకరింపనియెడల, నాతనినిగూడ మగధరాజ్యమునుండి యావీరపురుషునిచేతనే పాఱఁదోలించి, నందవంశమంతయు ననామకమగునట్లు విధ్వంసముఁ గావించెదను. బృందమాలా! వినుచుంటివా? ఇదియే నాదారుణమైన ప్రతిజ్ఞసుమా? దీనిని నెఱవేర్పఁజాలనినాఁడు భయంకరమైన యగ్నిగుండంబునఁబడి దేహత్యాగము గావించుకొనెదను. అంతియకాని యీరాజు మహిషులయందు దేనికుమారునకును మగధరాజ్యమును దక్కనీయను. నామాటలన్నియును శిలాక్షరము లని నమ్ముము. నాకార్యమునకు ధననందుఁ డంగీకరించెనా సరి. లేనియెడల మాయూరునుండి యుద్ధవీరులఁదెప్పించి యితఁడు నన్నుఁబెట్టినదుఃఖమునకుఁ బగఁదీర్చుకొనెదను. నన్నింతయవమానించిన మహారాణులందఱు నాపదదాసికలయ్యెదరు. ఇంతకన్న నింకఁ జెప్పవలసినదేమియును లేదు పొమ్ము. నాదుఃఖమంతయు నొకమూలకుఁద్రోసి నాహృదయమును కఠినపాషాణమొనర్చుకొని సంచరించెదను. నా కింకేవిచారమును లేదు ఆగ్రహమును లేదు. నాముఖప్రీతివాక్యములు, నామురిపెంపులు, నాముద్దులు, రాజుముందర నీవే చూచెదవు. నామనోభీష్టము నెఱవేఱుటతప్ప నా కింకేమియు నవసరము లేదు. చేయఁబోవు నన్నిటినిఁజూచుచు నీవు నాయొద్దనే యుండుము. ఒకవేళ నీ కిష్టములేకున్న నాశత్రుపక్షములోనికిఁ బోయి చేరుము. ఇన్నాళ్లవఱకును నిష్కపటసంచారిణినై, నిర్మలాంతరంగనైన, యీముర, యీక్షణమునుండియు, విషము, కల్మషము, నసూయ, టక్కులు, మాయలు, మంత్రములు, నన్నియు వహించి ప్రవర్తించుచుండును. ఇంక నిది పూర్వపుముర కాదుసుమా.”

ఈమాటలన్నియు విన్నపిదప యామె క్రొత్తమురాదేవివలెనే బృందమాలకుఁ దోఁచెను. ఇట్లద్భుతముగ మాఱుపోయిన యీ క్రొత్తమురాదేవి యొక్క విచిత్రకార్యక్రమమంతయు మాచదువరులు ముందుముందు దెలియఁగఁగలరు.

ప్రకరణము. 4.

బుద్ధిభిక్షుఁడు.

ఆశ్రమమును విడిచి కొన్నిదినములకు చాణక్యుఁడు మగధరాజ్యమునఁ బ్రవేశించెను. పాటలీపుత్రమును సమీపించినకొలఁదిని వాని యాలోచనము లంతకంత కధికమగుచు హృదయమును మఱింత కలఁత వెట్టుచుండుటచే, నతఁడు మాటిమాటికినిఁ దనలో "కైలాసనాథుని యనుగ్రహమున్న నా కార్యములన్నియుఁ ద్వరలోనే నెఱవేఱవచ్చును గాని, ఒక విషయముమాత్రము నా కసాధ్యమై యేయుపాయమును హృదయమున స్ఫురింపనీయకున్నది. చాకచక్యమునందేమి, విలువిద్యయందేమి, చంద్రగుప్తుఁడు మిక్కిలి సమర్థుఁడే! ఎంతసమర్థుఁడైనను, ఒక్కనిచేత నెన్ని కార్యములు చేయింపఁగలను? ఇది కష్టసాధ్యమే కదా? ధనుర్విద్యయందు నేర్పుగల్గిన కొందఱు శిష్యులు నాకున్నవారు కాని, ఉండియు నేమిలాభము? అస్త్రములా? శస్త్రములా? యుద్ధమునకు వలయు నుపకరణము లేమియును లేవు. ఇట్టిస్థితియందుండి నేను మగధరాజుతోఁ గయ్యమునకుఁ గాలుదువ్వుట యొఱఁగియొఱఁగి నూతిలో నుఱికినట్లే కదా? ఇందు కేమిచేయవలెను...............బలే! ఇదికదా యుపాయము? ఇదే కదా కార్యాలోచనము? చండశాసనుఁడగు చాణక్యుని కార్యము భంగమగుట దివాకరనిశాకరులు దారులు తప్పుటే. పాటలీపుత్రమున నేను బ్రవేశించిన తరువాత మొట్టమొదట నీయుపాయము ననుసరించియే కార్యమును కొనసాగించుకొనవలయును. ధననందుని యంతఃపుర రహస్యములన్నియుఁ గనిపెట్టఁ గలిగితినా, తీఁగఁ గదపినఁ దుప్పంతయుఁ గదలునట్లు పైసంగతులుగూడ నప్రయత్నముగ గ్రహింపవచ్చును." అని నిశ్చయించుకొని

కొంతసేపునకుఁ జాణక్యుఁడు పాటలీపుత్రమును సమీపించి గంగానది యొడ్డున నిసుకనేలయందు నడచుచుండెను. పట్టణమున మాత్ర మాతని నెఱిఁగినవా రెవ్వరును లేరు. ఇదికూడ తనకార్యమునకు గొంత సహాయకారి యనియే యాతఁడెంచుకొనెను. మూఁడు సంవత్సరముల క్రింత నొక్కమారుమాత్ర మతఁడు పాటలీపుత్రమునకు వచ్చెను. కాని యెంతోకాలముండలేదు. అందుచేతనే వాని నెవ్వరితోడను బరిచయము కలుగలేదు. ప్రస్తుతము చాణక్యుని యుద్దేశ మీపురమునఁ బ్రచ్ఛన్నముగ సంచరింప వలయుననియే. ఆకారణమునఁ దన కనుకూలమగు బస యెచ్చట లభించునో యని యాతఁ డాలోచించు కొనుచుండెను.

ఆనాఁ డట్లు చాణక్యుఁడు దీర్ఘాలోచనమందు మునిఁగి గంగానది సైకతస్థలమున నడచివచ్చుచుండ మార్గమధ్యమున వాని కొకబుద్ధభిక్షుఁ డెదురయ్యెను. దీర్ఘక్రోధామశితలోచనుండును, దీర్ఘాలోచన నిమగ్నుండును, విముక్తదీర్ఘకబరీభరుండును, నగునవచాణక్యునిఁ జూచి బుద్ధభిక్షుఁ డతివినయముతో నమస్కారముఁ జేసెను కాని యతనిదృష్టి వేఱేయున్నందున, ఆ వందనము నందుకొనక, తనదారిని తాను వచ్చుచుండెను. చాణక్యుని ముఖలక్షణములను వానినడకతీరును అప్పుడప్పుడు తనలోఁ దాను మాటాడుకొను మాటలను, గనిపెట్టి భిక్షుఁడు నవ్వి వానిచెంత కేఁగి "బ్రాహ్మణోత్తమా. నావందన మందుకొనక నన్నుఁ దిరస్కరించినను నాకుఁ గోపము లేదు. మీ రన్యథా భావింపక మా కైలాసనాథమందిరమున బసచేసి మా యాతిథ్యము నంగీకరింపవలయును" అని యడిగెను. ఆభిక్షుఁడు మిక్కిలి వృద్ధుఁడు. వానిమాటలయం దెంతో యనురాగమున్నట్లు చాణక్యునకుఁ దోఁచెను. ఇంతవఱకును దాను పాటలీపుత్రమున నెక్కడ బసచేయవలయునో యని స్థలముకొఱకు విచారించుచున్నవాఁడు గావున, చాణక్యుఁడు వెంటనే భిక్షుని యాతిథ్యమున కంగీకరించి కైలాసనాథమందిరమున బసచేయుటకు నిశ్చయించుకొనెను. ఆకాలమున నుత్తరహిందూస్థానములో నప్పటి కింకను బౌద్ధమతము వ్యాపించియుండలేదు. ఈమతమునుగూర్చి అచ్చటివారి కెవ

రికిని అంతగా శ్రద్ధలేకపోయినది. ఒకరిద్దఱు బ్రాహ్మణులును ఒకరిద్దఱు క్షత్రియులును కొందఱు శూద్రులును మాత్ర మీధర్మ మవలంబించినట్లు కనఁబడుచున్నది. బౌద్ధమతావలంబనము గొందఱ కిష్టమైనను ఆమతమును స్వీకరించుటకుమాత్రము సాహసింపరైరి. మఱికొందఱు దానిని కేవలము ద్వేషించుచుండిరి. అందులో ముఖ్యులు బ్రాహ్మణులే! బౌద్ధమతస్థుల పేరుచ్చరించినంతమాత్రముననే పాపము సంభవించునని వారితలంపు. కాని యీమతమును పాడుచేయుటకు మాత్ర మెవ్వరును తలపెట్టలేదు.

చాణక్యుఁడు తాను పాటలీపుత్రమునకు రాఁగానే తొలుతఁ దనకు బుద్ధభిక్షుని దర్శనమగుటయు నాతఁడే తన కాశ్రయ మిచ్చి యాదరించుటయు నంతగా శుభసూచకము లని భావింపలేదు. కాని కార్యవేదులు ఛాందసులవలె శుభాశుభసూచకముల నంతగాఁ బాటింపరుకదా? తానేకార్యమును బూని పాటలీపుత్రమునకు వచ్చెనో యీకార్యము నెఱవేఱుటకు నెచ్చటనైన గుప్తముగానుండి తనప్రతిజ్ఞ నెఱవేర్చుకొనుటదప్ప మనచాణక్యుని రెండవవిచార మింకొకటి లేదు. ఇంతియకాక అతఁడు కేవలము ఈశ్వరభక్తుఁ డగుటచే, తన కిలవేల్పగు కైలాసనాథుని మందిరమున నాశ్రమము దొరకుట చాణక్యునకుఁ గొంత సంతోషమే కలిగించెను. ఈసంగతులన్నియు విచారించియే యతఁడు బుద్ధభిక్షుని యాతిథ్యమున కంగీకరించెను.

కైలాసనాథమందిరము మిక్కిలి సుందరమైనదే కాక అతివైశాల్యమును గలిగియుండెను. దాని యావరణములోనే, వెనుకప్రక్క ననేకజాతులపూలమొక్కలుగల యొకపూలతోఁట కలదు. అందులో నచ్చటచ్చట చిన్నచిన్న దేవాలయములు కట్టఁబడినవి. ఇంతియేకాక, అతిథుల స్నానపానాదుల కనుకూలమైన చక్కని జలాశయముగూడ నొకటియుండెను. దాని నప్పుడు పుష్కరిణి యనుపేర వాడుచుండిరి. పాటలీపుత్రమునకు బ్రక్కను ప్రవహించుచున్న గంగానదీజలమే యీపుష్కరిణికిఁ

పెట్టుచుండిరి. కర్మనిష్ఠులకును తపోనిష్ఠులకును మిక్కిలి యవసరములైన చిన్నచిన్న మంటపము లాదేవాలయోద్యానవనము దనేకము లున్నవి. ఇంతసౌఖ్యకరమైనప్రదేశము తనకు లభించు నని మొదట చాణక్యుఁ డనుకొనలేదు. ఆశ్రమమునఁ బ్రవేశించిన తరువాత బౌద్ధుఁడు వాని ననేకవిధముల నాదరించుచుండెను. కాని అతనివలనఁ దన కెంతయుపకార మవసరమో యంతకు దప్ప నెక్కుడు ఉపకారము మనచాణక్యుఁ డంగీకరింపలేదు. ఆనాఁడు బౌద్ధుఁడు వాని నాశ్రమమునకుఁ గొనివచ్చి సత్కరించి వెంటనే "బ్రాహ్మణోత్తమా! తమ కేమేమి కావలయునో సెలవిచ్చిన ...." అని యింక నేనేమో యడుగఁబోవుచుండ, చాణక్యుఁడు "అయ్యా! నా కిప్పుడేమియు నవసరము లేదు. నాజపము పూర్తియైన తరువాత వలసినవి, నేనే యడిగెదను" అని ప్రత్యుత్తర మిచ్చి తాను స్నానముచేసి సమాధియందుఁ గూర్చుండెను. వెంటనే తనవద్ద భోజనము సేయుట వాని కిష్టము లేదని బౌద్ధుఁడు గ్రహింపఁ గలిగెను. అయినను అంతతో విడువక చాణక్యుఁడు సమాధినుండి లేచిన తనలో నేమేమో యాలోచించుకొనుచున్నప్పుడు మరల వచ్చి "అయ్యా! జపమయినదా? అని యడిగెను. చాణక్యుఁడు వానికిఁ దిరస్కారభావమునఁ బ్రత్యుత్తర మీయఁదలంచెను కాని, కార్యవేదియగుటచే మరల శాంతించి తనకార్యసాధనమునకు ముందు ముందాతనివలన నెట్టిసాహాయ్య మొందవలయునో యని తనబుద్ధి మార్చుకొనవలసెను. సమయము వచ్చినప్పుడు భిక్షాధికారి మొదలు లక్షాధికారివఱకు నందఱు స్నేహముండి తీరవలయును. బ్రహ్మసృష్టియందు గడ్డిపోఁచ మొదలు ప్రతివస్తువును ఒకొక్కప్పుడు మానవున కుపకరించుచుండును. చాణక్యుఁడు గొప్పనీతిశాస్త్రజ్ఞుఁ డగుటచే నింతదూర మాలోచించి మెల్లఁగా బౌద్ధునితో "అయ్యా! నాకొఱకు మీరు ప్రయాసపడవద్దు. ముందు మీరు నడవండి మీవెనుకనే నేనును వచ్చుచున్నాను" అని ప్రత్యుత్తర మిచ్చి వానిని బంపివేసి తాను గొంతసేపునకు బయలుదేఱెను. వానిని జూచి భిక్షుఁడు తనయాసనమునుండి లేచి ఏమి ఫలాహారము

కావలయునో యని చాణక్యు నడిగెను. పూర్వమువలెనే చాణక్యుఁడు "అయ్యా! మీకు వృథాయాస మెందుకండీ? నావద్ద ద్రవ్య మున్నది నావెంట నొకపరిచారకునిఁ బంపినయెడల బజారునకుఁ బోయి నాకు వలసినవస్తువులను నేనే కొనితెచ్చుకొనెదను. మీ రిదివఱకు జేసినమహోపకారమునకే యెంతో సంతసించుచు మీఋణ మెట్లు తీర్చుకొనఁగలనో యని చింతించుచున్నాను. విన్నారా! ఇఁక మీరు నాకొఱకు తాపత్రయ మొందకండి"

"అయ్యయ్యో! మీ రిట్లనుట ధర్మముగాదు సుమండీ? దానములలోకెల్ల నన్నదానము శ్రేష్ఠమైన దని శాస్త్రములు చెప్పుచున్నవి. కావున నట్టిమహాప్రసాదమును తిరస్కరించుట న్యాయముగాదు. ఇదియె కాక అతిథియై వచ్చినప్రతివానిని సకలవిధముల నాదరించిపూజింపవలయు నని భగవాన్ శ్రీగౌతములవారు మా కాజ్ఞాపించియున్నవారు. మీయట్టియుత్తమబ్రాహ్మణుల కతిథిసత్కారము చేయుటకన్న మాజన్మసాఫల్య మింకేమున్నది? తమరు క్రొత్తగా పాటలీపుత్రమునకు వచ్చియున్నారు. ఏకార్యమువిూఁద వచ్చిరో అదినాకుఁ దెలియదు. కాని యవసరమున్నయెడల మీకుఁ గావలసినంతసాహాయ్యము నేను చేయఁగలను. అడుగుటలో మీ రెంతమాత్రమును సందేహింపవలదు. భగవాన్ శ్రీబుద్ధాచార్యులవారికి శిష్యుఁడనై పరోపకార మొనర్పకున్న నాబ్రతు కెందుకు? మీ కంతయభ్యంతర మున్నయెడల నీపూఁటకుమాత్ర మిక్కడ ఫలాహారమును బుచ్చుకొనుఁడు. చాల ప్రొద్దెక్కినది. రేపటినుండి మీయిష్టమువచ్చినట్లు చేయవచ్చును." అని నిర్బంధింప పాపము మనచాణక్యుఁ డంగీకరింపక తీఱినది కాదు. బౌద్ధునిప్రార్థనపై నాపూఁట కచ్చటనే ఫలాహారము పుచ్చుకొని పుష్కరిణియొద్ద కేఁగి యచ్చట నొకయిసుకదిబ్బపైఁ గూర్చుండి యొంటరిగఁ గార్యాలోచనము సేయుచుండెను.

ఇంతలో సాయంకాలమైనది. చాణక్యుని నేత్రద్వయమువలెనే సాంధ్యరాగము అరుణకిరణగణముల నలువంకల వ్యాపింపఁజేసి ప్రకాశించుచుండెను. కైలాసనాథమందరసుందరోద్యానస్థిత దేవాలయములయం దప్పుడప్పుడే దీపములు పెట్టుచుండిరి. అప్పుడు చాణక్యుఁడు నిర్వర్తితసాయంసంధ్యాకాలోచితకృత్యుఁడై "నేను పాటలీపుత్రమునకు బ్రహ్మకర్మ సేయుటకా వచ్చితిని? కాలమంతయు నిట్లు వృథా కడపిన నేమిలాభమున్నది? ధననందునిమర్మస్థాన మేదియో, వానివంశము విధ్వంసమొనర్చుటకు నే నెవరెవరిసాహాయ్యము లపేక్షింపవలసియున్నదో, ఏయేయుపాయములు చేసినయెడల ప్రజలందఱు నొక్కమాఱుగ రాజుపై విరక్తిఁ బూని నాకు వశులగుదురో ఇంక నెన్నియో యిట్టి సమపాయము లాలోచింపవలసియున్నది కదా? ఇందు ముఖ్యముగా ప్రజలకు రాజుపై నెట్టియుద్దేశమున్నదో అది కనుఁగొనవలయును. కాఁబట్టి యిప్పట్ల బుద్ధభిక్షుని మంచిచేసికొనుటయే యుక్తమని తోఁచుచున్నది. తనమతము నిందు వ్యాపింపఁజేయుటకై యతఁడు పాటలీపుత్రమున నివసించుచుండెను కాన వాని కనేకవిషయములు తెలిసియుండును. మెల్లమెల్లఁగ వానికిఁ జను విచ్చి నందవంశసమాచారమంతయుఁ గనుఁగొనెదను. కానిమ్ము నడుమ నెన్ని కష్టములు వచ్చినను వచ్చునుగాక. అంగీకృతకార్యమునుమాత్రము విడువను. నందవంశమంతటను వేళ్లతోఁబీఁకి పాఱవైచి మగధరాజ్య సింహాసనముపైని నాముద్దుశిష్యుఁడగు చంద్రగుప్తునిఁ గూర్చుండఁ బెట్టకున్న నాకార్యాలోచనమును నాచాకచక్యము నెందులకుబనికివచ్చును? ఇఁకమీఁద నాజపమును నాకర్మకాండయు గట్టిపెట్టి క్షత్రియధర్మ మనుసరింపవలయును. ప్రస్తుతము బ్రాహ్మణధర్మము కొంతకాలము వఱకు మానక తీఱదు. ఇఁకఁ బోయి భిక్షున కేయనుమానమును గలుగకుండ మాటలసందర్భమున నూతనవిషయముల గ్రహింపవలయును" అని వెంటనే లేచి చాణక్యుఁడు బౌద్ధునియాశ్రమములోనికి వచ్చి యాతనివద్దఁ గూర్చుండి వానినేదో పెద్దసంభాషణములోనికిఁ దింపెను. చాణక్యుని యుద్దేశము భిక్షుఁ

డెఱుంగఁడు గావున వాని కుచితరీతిని బ్రత్యుత్తరము లిచ్చుచుండెను. అందుచేఁ జాణక్యుఁడు సందర్భమును గలుగఁజేసికొని బౌద్ధునితో "అయ్యా! అన్నట్లు అడుగ మఱచితిని. ఇతరరాజుల సభలలోని విశేషములు మనకెందుకుగాని మనరాజుగారి సభావిశేషములు మీ కేమైనఁ దెలియునా?" అని యుక్తిగా నడిగెను. అందుమీఁద భిక్షుఁడు, రాజును సభలోనికిఁ బోయి రాజుగారి నాశ్రయించి యేదైన సంభావన పొందు నుద్దేశముతో చాణక్యుఁడు తన్నిట్లడుగుచున్నాఁడని భావించి వానితో "అయ్యా! నాశిష్యులను రాజమందిరములోని కంపి యచ్చటి విశేషములు కనుగొనుచుండుట నాకు వాడుకయైయున్నది. కావున వారిద్వారా మీకుఁ గావలసిన సంగతులు తెలియఁజేసెదను లెండి" అని పలికెను. వెంటనే చాణక్యుఁడు "చిత్తము చిత్తము నా కదియే కావలయును ఇంక సెలవు తీసికొనెదను" అని లేవఁబోవ బౌద్ధుఁడు "కూర్చుండుఁడు ఇప్పుడేమిపనియున్నది? ఇంతేనా? ఇం కేమైన సంగతులు కావలసిన నన్నడుగవచ్చును శంక వలదు." అని వానినిఁ గూర్చుండఁబెట్టి యడుగ చాణక్యుఁడు మరల నేమో యొకసంగతియడుగఁ బోయెను. కాని యింతలో నెవ్వతెయో యొకస్త్రీ యచ్చటకు వచ్చి బుద్ధభిక్షుఁడైనవసుభూతిం గాంచి "అయ్యా! యీదినమునఁ దమతోఁ గొన్ని సంగతులు మాటాడవలయునని వచ్చినాను. నేఁడు నాకు సంభవించిన దురవస్థకు మితిలేదు. తమయెడ నన్నియును మనవిఁజేసికొనిన నాకష్టము తగ్గు ననుధైర్యము నాకున్నది......" అని యింకను చెప్పుచుండ వసుభూతి యామెతో "వత్సా! బృందమాలా! ఇంత చిక్కిపోయినావేమి? నీ కేమి విచారము సంభవించినది చెప్పు చెప్పు మురాదేవి క్షేమముగా నున్నదా?" "భగవాన్! మురాదేవి సౌఖ్యముగానే యున్నది కాని ఆమె హృదయముమాత్ర మపార దుఃఖపూరితమై కొట్టుకొనుచున్నది. ఏరోజున యువరాజునకుఁ బట్టాభిషేకము జరిగెనో యప్పటినుండియు............" అని యేమో చెప్పఁబోవుచుండ మధ్య వసుభూతి యేదో కనుసైఁగచేసి యామెను మాటాడనీయలేదు. అవలించినఁ

ప్రేవులు లెక్కిడ సమర్థుఁడైన మనచాణక్యుఁడు వారిమాటలను కడు జాగ్రత్తతో విని విని తనముఖలక్షణము లోకతీఱుగ మార్చి బృందమాల మురాదేవియొక్క దాసి యనియు నామెను తనవశము జేసికొనిన నన్నిసంగతులు గ్రహింపవచ్చు ననియు నెంచుచుండెను.

అట్లు వసుభూతి తనకనుసైగలచే బృందమాల నేమియుఁ జెప్ప నీయక "బృందమాలా! నీ వెట్టి సంగతులు మాటాడుచుంటివో యెఱుఁగుదువా? నీ వెక్కడనున్నావు? బాగా ఆలోచించుము. మనసంభాషణ మితరులు వినవచ్చునా? అందులోను నీయట్టి విశ్వాసము గలదాసియే యిట్లంతఃపురమునఁ గలరహస్యములు వెడలఁ గ్రక్కుచుండ నింక తక్కిన వారిమాట చెప్పనేల? సహజముగానే మురాదేవి దురవస్థయం దున్నది. నాకు మాత్రము తెలియదా యేమి?"

ఆమాట విని బృందమాల శాంతము వహించి యిట్లనియె. "ఆర్యా! మీయుపదేశము విన్నాను. కాని మఱియొకమనవి. నే నీదినమున వహించినంత యాతురత నా కిదివఱ కెన్నఁడును గలుగలేదు. అందుచేతనే యోర్చుకొనలేక అన్నియుఁ జెప్పివేసినాను. మాదేవిగారియవస్థ యిట్లే మఱికొన్నిదినము లుండిన యెడల నేదో గొప్పఘాతకము జరుగునని నాకుఁ దోఁచుచున్నది. తమరు నాకు గురువులు. ఎవరికైన నాపద సంభవించినప్పుడు శక్తి వంచనలేక పాటుబడి యాయాపద బాపుట యుత్తమధర్మము కదా? నాయజమానురాలిట్టి స్థితియందుండుటచే నేమియాపద వచ్చునో యని విచారించుచున్నాను. ఆమె దురవస్థ బాపుటకు నా కేమియు నుపాయము దోప దయ్యె. నావల్లనైనంత బోధించి చెప్పినాను. కాని యామె కెంతమాత్రమును సమాధానము కాలేదు. ఈసంగతియే మీకుఁ జెప్పవలయు నని వచ్చినాను. ఇతరులతోఁ జెప్పుట నా కేమి యవసరము?"

ఈరహస్యములన్నియుఁ జాణక్యుఁడు వినుచుండెనుకదా యని వసుభూతి మొట్టమొదటనుండియు ననుమానించుచుండెను. చెప్పవల దని బృందమాలకుఁ గనుసైగచేసెను కాని యామె పోల్చుకొనలేకపోయెను. వసుభూతి కనేకగుప్తశిష్యు లుండిరికదా? చాణక్యుఁడుకూడ వారిలో నొకఁడే యని బృందమాలయభిప్రాయము. అందుచేతనే ఆమె వెనుదీయక చెప్పవలసినది ధారాళముగఁ జెప్పివేసెను. వసుభూతి చాణక్యు నావలకుఁ బొమ్మనలేఁడయ్యె. ఇట్టిస్థితిలో వసుభూతి తనలో నొచ్చుకొనుచు బృందమాలా! నీయజమానురాలికి హృదయమున స్వస్థత లే దని కదా చెప్పుచున్నావు. పోనిమ్ము ఒకమాఱు నాసద్దకు తీసికొని రాఁగలవా? నేను స్వయముగా బోధించి యామెహృదయమును శాంతిపఱచెదను. నీమాటలన్నియు విన నాకు మిక్కిలి విచారముగల్గినది. అయినప్పటికి తగినయేర్పాటులు చేయుచున్నాను లే. నీవు పోయి మరల రేపురా! నాసద్ద నీ వేమేమి చెప్పెదవో అది యితరులకుఁ దెలియఁగూడదు సుమా. జాగ్రత్త. మురాదేవి కట్టిదీర్ఘద్వేషి. రాజు ఆమెశిశువును చంపించి నేఁటికి 16 సం. కావచ్చెనుకదా? దేవికి నేఁ డింతదుఃఖము గలుగుటకుఁ గారణము యువరాజపట్టాభిషేకమే! మఱేమియు భయములేదు నీవుపో! రేపుమాత్ర మొకమాఱు మరల రా" అని యుత్తరు విచ్చి యామెను పంపివేసెను.

రెండుచెవులు నిగిడ్చి హృదయము నిశ్చలముఁ జేసికొని శరీరమును మఱచి యింతవఱకును సంగతులన్నియు వినుచున్న మనచాణక్యుఁడు బృందమాల వెళ్లిపోయినంతనే యొకమాఱు పెద్దనిట్టూర్పువిడిచెను. తాను విన్న సంగతు లన్నియు వసుభూతి నడిగి స్పష్టముగ తెలియఁగోరి అడుగుటకు సందేహించి యూరకుండెను. అప్పుడు వసుభూతి చాణక్యునిఁ జూచి "విప్రోత్తమా! నిజముగా పాపము నీ వేమియు నెఱుఁగవుగాని యీనగరమున కేదో పెద్దయరిష్టము సంభవింపనున్నది. సంగతులన్నియుఁ జూడ రాజమందిరమున గృహకలహము లుద్భవించుచిహ్నాలు కనఁబడుచున్నవి,

మఱియొకమాట. మురాదేవి వాస్తవమైనరాజకన్య. ఆమె కిరాతమహారాజుకూఁతురు. అయినప్పటికి అనవసరమైనదోషము కల్పించి హిమాలయప్రాంతమున బాప మామెకుమారుని ధననందుఁడు చంపించెను. రామ! రామ! ఎంతఅన్యాయము........'' అని విచారింప వానిమాటలు విని మనచాణక్యుఁడు మిక్కిలి సంతోషించెను.

ప్రకరణము. 5.

చాణక్యునివిచారము.

భాద్ధుఁడు చెప్పిన మాటలన్నియు వినినంతనే చాణక్యున కనేక విచారము లొక్కమారు సంభవించినవి. వసుభూతి తనతోఁ జెప్పిన సంగతులన్నియు, తనకార్యమున కనుకూలముగానే వానికిఁ దోచెను. రాజమందిరమునఁ బుట్టిన గృహకలహాగ్ని తనకుఁ జాలవఱ కుపకరించు నని యెంచి దానిని మఱింత ప్రజ్వలింపఁజేయుటకై యతఁడు సిద్ధముగ నుండెను. చాణక్యుఁడు మిక్కిలి కార్యవేదియు దూరాలోచనపరుఁడు గావున వసుభూతి చెప్పిన సంగతులలో చంద్రగుప్తుఁడు వానిహృదయమున ననేకసారులు బొడగట్టెను. వసుభూతిని మంచిమాటలాడి వానివలనఁ గ్రొత్త విషయముల నింకను కనుఁగొనఁదలఁచి చాణక్యుఁడు.

“ గౌతమశిష్యా! మననగరమునుగూర్చి నా కేమియును దెలియదు. నే నీయూరికిఁ గ్రొత్తవాఁడను. హిమాచలప్రాంతమున నరణ్యమధ్యమందుఁ గల చాణక్యాశ్రమము నావాసస్థలము. ఈ మగధరాజుయొక్క కీర్తి దేశదేశముల వ్యాపించియున్నది. అందుచే నిట్టి నగరమునకు వచ్చిన ననేకక్రొత్తసంగతులు వింతలు కనుఁగొనవచ్చు నని యెంచి నే నిల్లు బయలుదేఱినాను. కాని నిన్న తమసంభాషణలో రాజమందిరమున గృహకలహ ముద్భవించు నని విని యత్యాశ్చర్యమొందితిని. ఎచ్చట గృహకలహముండునో అచ్చట లక్ష్మి యుండ దని పెద్దలు చెప్పుదురు. సరే! ఈయక్కఱకు రానిసంగతులు నా కెందుకుఁగాని అయ్యా! మురాదేవి యెవరు? ఆమెకుమారుఁ డేకారణమున బలవంతముగఁ జంపఁబడెనో

తమరాగ్రహింపక సెలవీయవలయును! తమసెలవైనచో నీవిషయమున నేను కావలసినంత సాహాయ్యముఁ జేసెదను" అన నామాటలకు వసుభూతి నవ్వి,

"అయ్యా! ఈసంగతులన్నియుఁ దమ కెఱుకండీ? మగధరాజు యొక్క కీర్తి నిజముగా మీరు విన్నంతవఱకు లేదు. అతఁడు దూరాలోచనపరుఁడు కాఁడు. ఎవరేసంగతి జెప్పినను మంచిచెడ్డ లరయక విశ్వసించుచుండును. వానికనేక దుర్మంత్రులు కలరు. ఆమూర్ఖులచేతనే రాజు, రాజకార్యములఁ జేయించుచుండును. మొట్టమొదట మురాదేవి వానికి ముద్దుభార్యయై యుండెను. ఆమెను విడిచి రాజు ఒక్క క్షణమైన నుండలేఁడు. అందుచే సవతులందఱు నేకమై యసూయచేత నామె నెట్టులైన నాశనము చేయవలయు నని చూచుచుండిరి. సేనాపతి బాహురాయణుఁడు కిరాత మహారాజున కొకవిషయమున నుపకారముఁజేసి యాతని కుమారికను గొనివచ్చి ధననందున కిచ్చెను. ఆమె సౌందర్యాతిశయమున కచ్చెరువొంది రాజు మురను బెండ్లిచేసికొనెను. దైవానుగ్రహమున నామె కొంతకాలమునకు గర్భవతి కాఁగా, తమకు సంతానము లేకపోవుటచేత నామె కుదయించు కుమారుఁడే యువరాజగు నని యెంచి యోర్వలేక సవతులందఱును గలసి ముర నిజమైన కిరాతమహారాజు కుమారిక కాదనియు, దాసీపుత్రికయనియు రాజునకుఁజెప్పి కోపముపుట్టించి ఆమెను అన్యాయముగఁ గారాగృహమునఁ బెట్టించిరి. పాపమందులోనే మురాదేవికి తేజస్వియు సుందరాకారుఁడు నగు నొకమగశిశువు జనించెను. కాని దుష్టమతులగు సవతుల యేర్పాటువలనఁ దలారు లాబిడ్డను చంపిపారవేసిరి. మొన్ననే పట్టమహిషికుమారుఁ డగు సుమాల్యునకుఁ బట్టాభిషేకము జరిగినది. ఖైదీలందఱితో మురను కూడ విడిపింపవలయు నని రాజాజ్ఞాపించెను. ఇందు విషయమై యామెదుఃఖము మీరు విన్నదేకదా" మురాదేవికి నే నుపదేశముఁజేసి యామెను భిక్షునిఁ జేసెదను"

ఈమాటలన్నియుఁ జాణక్యుఁడు అతిశ్రద్ధతో నాలకించుచు నెప్పటి కప్పుడే తనలో కార్యక్రమ మాలోచించుకొనుచుండెను. మురాదేవిని భిక్షునిఁ జేసెద నని వసుభూతి పల్కినప్పుడు మాత్రము వానికి నవ్వువచ్చినది. చాలరాత్రియగుటచేత వసుభూతి లేచి "అయ్యా? మన మింక పండుకొందము. ప్రొద్దున్న మాటాడవచ్చు" నని చెప్పి తాను శయ్యాగృహమునఁ జేరెను. చాణక్యుఁడును వెంటనే లేచి తనలేడి చర్మమును పఱచుకొని యందుపైఁ బరుండెను. కాని నిద్రమాత్రము పట్టలేదు. ఎన్నియో విచారము లొక్కసారి వాని నాక్రమించియుండ, చాణక్యునకు సుఖనిద్ర యెట్లు సంభవించును? అందుచే నతఁడు వెంటనే లేచి కూర్చుండి తనలో నిట్లు వితర్కింపఁ జొచ్చెను.

"బృందమాలతో నెట్టులైనఁ బరిచయముఁజేసి మురాదేవినిఁగూర్చి యామెతోఁ గొంత మాటాడవలసియున్నది. ఒక్కసారి మాటాడినంత మాత్రమున దాసి నిముసములో నాకు వశముకాఁగలదు గదా? తన కుమారుఁడు బ్రతికియున్నాఁడని చెప్పిన మురాదేవి నాకార్యమున కేమైన తోడుకాఁగలదా? అవును చంద్రగుప్తుఁడు తనకుమారుఁడే యని ఆమె యెట్లు విశ్వసించును? నమ్మినచో నేధన్యుఁడనే. తొందరపడి చెప్పివేసిన నెటుండి యెటువచ్చునో? ....శబాస్! ఇది మంచియుపాయము. నే నాశ్రమమునుండి మంచిముహూర్తముననే బయలుదేఱితిని. ఇంక మురాదేవికిని నాకును భేటీ గల్గిన, నిముసమాత్రములో నన్నికార్యములు చక్కనగును. కాని ఆమె రాజుభార్య. నే నొకబీదబ్రాహ్మణుఁడను. ఇంతియేకాక యీగ్రామమునకుఁ గ్రొత్తవాఁడను. ఆమెకును నాకును ఎట్లు పరిచయముగల్గును.........సరే ఇందుకు బృందమాలయే యున్నది కదా? మొట్టమొదట స్నేహముఁజేసి యీయామెనే వశపఱచుకొనవలయును. రేపు వచ్చినప్పుడు తప్పక బృందమాలను కలసికొని రహస్యముగ మాటాడెదను. కాని వసుభూతికిమాత్ర మీసంగతులేమియుఁ దెలియనీయఁగూడదు. వానినిఁగూడ వశపఱచుకొనుట యుక్తమే! తన కెంద్రో

గుప్తశిష్యు లున్నారని యాతఁ డొకప్పుడు చెప్పినాఁడు. ఇదిగూడ నా కనుకూలముగానే యున్నది. పాటలీపుత్రమునకు నేనువచ్చి ఇంక వారమురోజులైన కాలేదే! ఇంతలోనే యీసమాచారములన్నియుఁ జెప్పిన నాతఁ డెట్టియనుమానము వహించునో? అయినను ఇప్పుడు తొందరయెందుకు? మొదట బృందమాలను వశముఁజేసికొని, అందుమూలమున నంతఃపురములోఁ బ్రవేశించి మురాదేవితో మాటాడినదాఁక వసుభూతితో నీప్రసంగ మేమియుఁ దేఁగూడదు.....................''

ఇట్లనేకవిధములఁ జాణక్యుఁడు తనలో విచారించుకొనుచుండ నింతలోఁ దెల్లవాఱినది. ఆరాత్రి చాణక్యుఁ డొక్కనిముసమైన నిద్రింపలేదు. దీర్ఘాలోచనమందు నిమగ్నుఁడై యుండుటఁ దెల్లవాఱిన దనుసంగతి కూడ వానికిఁ గొంతవఱకుఁ దెలియలేదు. తనకార్యము పూర్తియగువఱకు నట్లే గడపవలయునని యాత డూహించుకొనెను. తరువాత చాణక్యుఁడు మెల్లఁగ లేచి ప్రాతఃకాలోచితకృత్యముల నిర్వర్తించుకొని జపమారంభించెను. జపమారంభించినదిమొదలు బృందమాల, మురాదేవి, చంద్రగుప్తుఁడు మొదలైనవారు తనహృదయమునకుఁ బొడగట్టుచుండుటవలన బుద్ధి మాఱి యాజపము వాని కంత దృప్తిఁగలిగింపలేదు. బృందమాలను వశ్యముజేసికొనుట యెట్లో? అంతఃపురమున నేరీతిఁ బ్రవేశింపవలయునో? మురాదేవితో నేయేసంగతులు మాటాడవలయునో ఆమెకును చంద్రగుప్తునకును ఎట్లు సంబంధము గలుపవలసియున్నదో యని చాణక్యుఁడు తదేకధ్యానమున నుండుటచే నానాటికీశ్వరధ్యానమును గట్టిపెట్టి వంటసేయుటకారంభించెను. అదివఱకే వసుభూతిశిష్యులలో నొకఁడు పాకమునకు వలయుసామగ్రినంతయుఁ గొనివచ్చి సిద్ధముగ నుంచుటచేత చాణక్యుఁడు అవలీలలో వంట పూర్తిగావించి భోజనముఁజేసెను. భోజనానంతరమునఁ జాణక్యుఁడు తనపూర్వప్రకారముగ భిక్షునితో మాటాడవలయు నని వానిదగ్గఱకు వచ్చెను. అతఁడు వచ్చుసరికి వసుభూతి యొంటరిగఁ గూర్చుండి యేదో యొకయుత్తరమును వ్రాయుచుండెను. చాణ

క్యుఁడు వానిప్రక్కనే మెల్లఁగఁగూర్చుండెను. వెంటనే వసుభూతి తనయుత్తరమును చాలించి యిటునటుఁజూచి "సిద్ధార్థా'' అని రెండుమూడుసారులు పిలిచెను. వెంటనే తనగుప్తశిష్యుఁ డగుసిద్ధార్థుఁడు వచ్చి యెదుట నిలువంబడ, వసుభూతి ఆయుత్తరమును వాని కిచ్చి రహస్యముగ బృందమాల కందఁజేసిరమ్మని యాజ్ఞాపించెను. అప్పుడే మనచాణక్యున కొకక్రొత్తయాలోచన దోచినది. అందుచే "అయ్యా! నే నీయూరికి క్రొత్తవాఁడననుసంగతి మీ రెఱుఁగుదురు? వచ్చినప్పటినుండియు నీపట్టణ మెట్లుండునో చూడవలయు నని యత్యాతురతో నున్నాఁడను. మీసెలవైనచో మీశిష్యునివెంట వెళ్లి నగరముఁ జూచివచ్చెదను.'' అని యడుగ వసుభూతి యేమో ఆలోచించి "సరే వెళ్ళవచ్చును. ఏమీ ఆటంకములేదుకాని నాశిష్యు నొకరహస్యకార్యముమీదఁ బంపుచున్నాను. నీవుఁగూడ వానివెంటనున్న........'' అని సందేహించుచుండ, చాణక్యుఁడు "ఆయనుమానము మీకక్కఱలేదు. నాకనవసరమైనసంగతులలో నేను బ్రవేశింపను. ఒకవేళ నేదైనరహస్యమును నాకుఁ దెలిసినయెడల, అది తమసెలవులేనిదే మఱియొకరితోఁజెప్పను. కావున మీ రన్యథా భావింపవద్దు. నేనుఁగూడ మీమిత్రకోటిలోనివాఁడనే'' అని సమాధానముఁజెప్ప వసుభూతి చాణక్యునకు బట్టణము జూపి తీసికొనిరమ్మని శిష్యునకుఁజెప్పి యుత్తరము మాత్రము రహస్యముగ నుంచవలయు నని బోధించిపంపెను.

సిద్ధార్థుఁడు మిక్కిలిబాలుఁడు. ఒకప్పు డాతఁ డేదో నేరముఁజేసినందున రాజు వానిని శిక్షించెను. అప్పటినుండియు నాతఁడు వసుభూతి నాశ్రయించి వానివలన బౌద్ధమతమును గైకొని అతనిసేవ సేయుచుండెను. చాణక్యుఁడు వానినిఁ జూచినప్పటినుండియు మంచిమాటలాడి వానిచేఁ గూడఁగొన్నికార్యములు చేయింపవలసియున్నదని నిశ్చయించుకొనెను.

ఇదిగాక సిద్ధార్థుఁడు మిక్కిలిచుఱుకుగలవాఁడగుటచే వానిని వశపఱచుకొనిన ముందుముందు తనకుఁ గొంతవఱకు సాహాయ్యకారి యగునని

యెంచి చాణక్యుఁడు వానితో మిక్కిలి చనువుగాఁ బ్రసంగింప నారంభించెను. సిద్ధార్థునివెంట పట్టణముఁజూచుటకు బయలుదేఱినది మొదలు పురవీథులఁ గలమందిరములఁగూర్చియు, సౌధములఁగూర్చియు, దేవాలయములఁగూర్చియు, వానినడుగుచుండ సిద్ధార్థుఁడుగూడ వానిసందేహములఁ దీర్చుచు, క్రొత్తసంగతులను జెప్పుచుండెను. ఆప్రసంగమధ్యమున నొకసారి యతఁడు ధననందునిపేరుగూడఁ జెప్పవలసివచ్చినది. అందుచే సిద్ధార్థుఁడు రాజు నూరక దూషించుచు వానియెడఁ దనకుఁ గలయసూయ యంతయు వెల్లడించుచుండ నది గాంచి చాణక్యుఁ డిట్లు సంభాషించెను.

“సిద్ధార్థా! ధననందుని పేరెత్తి వాని నట్లేల దూషించుచుంటివి?”

“అయ్యా! ధననందునివంటి యధర్మచిత్తుఁ డింకొకఁడు లేఁడు. ఆమూర్ఖుఁడు నిరపరాధినైన నన్ను నిష్కారణముగా దండించెను. నాకే కాదు. ఈపాటలీపుత్రమున వానిపేరన్న నెవరును సహింపరు.”

“తప్పుతప్పు. రాజు నట్లనగూడదు. నీ వేదో తప్పు చేసి యుందువు. అందుచే రాజు నిన్ను శిక్షించె నని వానిని నీవు నిందించుచున్నావు. ఇది సహజముగానే యున్నది.”

“లేదు లేదు. నిజముగ నే నేమియును చేయలేదు. అతఁడు నిష్కారణముగ నన్ను దండించెను.”

“సిద్ధార్థా! అబ్బా! రాజుపై నీ కెంతకోపమున్నదిరా? వానిపై నీపగఁదీర్చుకొనవలె నని చూచుచున్నావేమో?”

“సందేహమేమి? శక్యమైనయెడల నిప్పుడే నాపగఁదీర్చుకొనెదను. ధననందుఁడు శుద్ధమూర్ఖుఁడు వట్టిగ్రుడ్డివాఁడు. నీ వీయూరికి క్రొత్త. నీ కేమియును తెలియదు. అమాత్యరాక్షసుఁ డెంతకాలము రాజ్యమున నుండునో అంతవఱకు వాని నెవ్వరు నేమియును చేయలేరు. ఛీ ఛీ! సవతులమాట విని పాపము మురాదేవి కాతఁడు పెట్టినభంగపాటు వాని నూరక విడువను. అయ్యో! ఆమె యెంతపతివ్రత? ఎంతసద్గుణవతి? ఆమెవంటియిల్లా

లింకొకతెయున్నదా? అట్టిమహాదేవి కుమారుని దుర్మార్గుఁడు నిష్కారణము చంపించెను. పాపము బ్రతికియున్నచో మొన్నటి పట్టాభిషేకము వానికే జరిగియుండును గదా?”

“మురాదేవి అంతమంచిదిరా? నేనీయూరిలో కాలుపెట్టినది మొదలు ఆమెసద్వర్తనమే వినుచున్నాను సుమా? సరేకాని సిద్ధార్థా! ఆమెదర్శనము చేయవలయు నని యున్నది. నీవేమందువు?” “అనుట కేమున్నది? ఇందు కెంతమాత్రము నభ్యంతర ముండదు. మురాదేవి శివభక్తురాలు ప్రతిసోమవారమును పురాణము వినుటకై యామె మన కైలాసనాథమందిరమునకు వచ్చుచుండును. ఖైదులో నున్నప్పుడుకూడ నామె రాజుసెలవు సంపాదించి తనవ్రతమును మానలేదు. ఎల్లుండియే సోమవారముకదా? ఆరోజున సూర్యాస్తమయము సరికి ఆమె తప్పక రాఁగలదు. అప్పుడు నిరాటంకముగ మీరు ఆమెను చూడవచ్చును”.

చాణక్యుఁడు తలయూఁచి వాని కేమియును ప్రత్యుత్తర మీయక తనలో నేదో తలపోయుచుండెను. ఇంతలో వారు క్రమక్రమముగ రాజమందిరమును సమీపించిరి. అప్పుఁడు సిద్ధార్థుఁడు “అయ్యా! మీరీసింహద్వారమువద్దఁ గూర్చుండుఁడు. నేనీయుత్తరము గురువుగారి యాజ్ఞప్రకారము బృందమాల కిచ్చి వచ్చెదను” అన చాణక్యుఁడు నవ్వి “సిద్ధార్థా నాపై నీకు సంశయమెందుకు? నన్నొంటరిగవిడిచి నీవు పోవచ్చునా? ఈయుత్తరములో సంగతులు నాకుఁ దెలియవనుకొంటివాయేమి? గురువుగారును నేనును కలసి యాలోచించియే యీయుత్తరమును వ్రాసినారము. ఇదిగాక నిన్నరాత్రి వసుభూతి బృందమాలతో మాటాడుచున్నప్పుడు నే నక్కడనే యుంటిని కనుక నాపై నీకు అనుమాన ముక్కఱలేదు. నీకేమైన నాపద వచ్చిన నేను భరించెదను. నన్నొంటరిగ విడిచిపోయిన పిచ్చివానివలె నన్నిచ్చట నేమి సేయుమనెదవు? అని చెప్ప సిద్ధార్థుఁడు వానికేమియును మాఱుపలుకలేక కొంతవఱకు విచారించి “అయ్యా! సరే అట్టు

లైన రండి. కాని కొన్నిచోట్ల మిమ్ము రహస్యముగఁ దీసికొని పోవల
యును. అది నాకు సాధ్యముకాదు. అయినను శక్యమైనంతవఱకు తీసి
కొని వెళ్లెదను అంతఃపురముగదా? ఎవరేమి సందేహముంచెదరో" అని
శంకింపఁ జొచ్చెను. అందుచే చాణక్యుఁడు "నావంటి బ్రాహ్మణుల
నెవ్వరడ్డగించెదరురా? సిద్ధార్థా! అట్లులైన రాజు మంచియేర్పాటుచేసెనే
సరే! పదపద! ఇంక నేను తప్పకవచ్చెదను. బ్రాహ్మణుఁడనుకదా?
రాజు నాకేమి దండనవిధించునో అదికూడఁ జూచెదను. బృందమాల న
న్నెఱుఁగును కాఁబట్టి నిన్నేమియు నావిషయమై నిందింపదు." అని
ధైర్యముఁజెప్ప సిద్ధార్థుఁ డంగీకరించి వానినిఁగూడ లోనికిఁ గొనిపోయెను.
ఇరువురును ద్వారములన్నియుఁ గడచి అంతఃపురమును సమీపించి యచ్చట
నొకరహస్యప్రదేశమున నిలిచిరి. రహస్యసంభాషణార్థ మాప్రదేశ మిది
వఱకు బృందమాల యేర్పరచినదే ఆపైనిఁక పురుషులు పోవుట కాజ్ఞ
లేదు. కొంతసేపునకు బృందమాల వారిని కలసికొని సిద్ధార్థుఁ డిచ్చిన
యుత్తరమునుగైకొని చాణక్యునిఁ జూచి "అయ్యా, మీరును గురువుగారి
సేవయందు కుతూహలులై యున్నారా? అట్లులైన సంతోషమే ఆయ
నకు రోజురోజునకు శిష్యు లధిక మగుచున్నారు." అని పలుకరించి తాను
లోనికిఁ బోయెను. తరువాత సిద్ధార్థ చాణక్యులుగూడ నింటికి బయలు
దేఱిరి.

ప్రకరణము. 6.

ఆరంభము.

సిద్ధార్థుఁ డిచ్చినయుత్తరము చదివినదాఁక బృందమాలకు బహు
తొందర జనించెను. అందుచేతనే ఆమె వారితో నేమియు నధికప్రసంగము
చేయక యుత్తరమును పట్టుకొని తనదారిని పోయెను. మురాదేవి దుఃఖ
మంతయుఁబోగొట్టి, యామెసంకటమును తప్పింపవలయుననియే బృంద
మాలముఖ్యోద్దేశము. మురయెడలఁగల భక్తివిశ్వాసము లామె కింకొకరి
యందు లేవు. ధననందుఁడు మురాదేవికిఁ జేసినమోసమున కామెకుఁ
గూడ నసూయజనించెనుకాని యెట్లో దైవవశమునఁ బదునాలుసంవత్సర
ములక్రిందట జరిగినసంగతినిఁగూర్చి మురాదేవి యంతపట్టుదల వహించి
యుండుట బృందమాల కెంతమాత్రము నిష్టములేదు. రాజమందిరమున
గృహకలహము పుట్టు ననుసంగతికూడ విని జరిగిన దేదో యిదివఱకే జరిగి
నదికదా? మరల నిప్పు డక్కఱకురానియల్లరి యెందులకని ఆమె మఱింత
విచారించుచుండెను. "మురాదేవికుమారుఁడు బ్రతికియుండినయెడల
నామె కేదైన సాహాయ్యము నేను చేసియుందును. కార్యమా మించిపోయి
నది. ఎటుచూచినను మురచేసినప్రతిజ్ఞ వట్టియనర్థక మనియే నాయభిప్రా
యము నందవంశమును విధ్వంసముఁజేసి యెవ్వనినో సింహాసనముపైఁ
గూర్చుండఁబెట్టునఁట. ఇందు తనకేమిలాభమున్నది? ఎవ్వరిసహాయమున
నామె నందవంశమును నశింపజేయఁగలదు? ఆమెకార్య మెట్లు కొనసా
గును?" అని బృందమాల అప్పుడప్పుడు తనలో వితర్కించుకొనుచు,
తనయజమానురాలిపంతమును మాన్పుటకై ప్రయత్నించుచుండెను. ఇది
వఱకే పదునాలుసంవత్సరములు కారాగృహమున నున్నతనయజమాను
రాలు, తెలివితక్కువచే మరల నేదైన చేయరానికార్యముఁ జేసినయెడల

రాజామె కట్టిదండన విధించునో యని బృందమాల భయపడుచునే యుండెను. మురాదేవి యందు తన కధికమైనభక్తి విశ్వాసము ప్రేమయు నుండుటచేత నామె కట్టికష్టము వచ్చినను తాను చూడలేను. తా నెంత బోధించినను ఆమె వినకపోవుటచేతనే బృందమాల వసుభూతి నాశ్రయించి తొందరపడవల దని వానిచే మురాదేవికిఁ జెప్పించుచుండెను. తన యజమానురాలికి బుద్ధివచ్చునట్లు చేయఁగలఁడని బృందమాల వసుభూతిని చాలవఱకు నమ్మియున్నది. ఆనాఁడు సిద్ధార్థునిచేఁ బంపినయుత్తరము మురాదేవిని శాంతపఱచుటకే యతఁడు వ్రాసె నని యెంచి చాటునకుఁ బోయి తనలో నిట్లు చదువుకొనఁ జొచ్చెను.

"చిరంజీవి బృందమాలకు.—

నిన్నరాత్రి నీవు వచ్చి నాతో మాటాడినది మొదలు నామనసు మిక్కిలి విచారముగ నున్నది. మురాదేవినిఁ గూర్చి నీవు చెప్పిన దంతయు నే నాలోచించుచునే యున్నాను. మురాదేవి తాను తలపెట్టిన కార్యమంతయుఁ దా నొక్కతెయే చేసికొనలేదు. అందుకుఁ బ్రయత్నించిన యెడల నామె కాపదకూడ రావచ్చును. కాఁబట్టి తగిన యుపాయము నేను వెదకుచున్నాను. నేను మురతో నొక్కసారి స్వయముగ మాటాడిన అన్ని కార్యములు చక్కనగును. నీవు మరల నన్నొకమారు కలసికొనినయెడల ఆమెకును నాకును ఎక్కడ భేటీ జరుగవలసియున్నదో చెప్పెదను. కాని యొకవిధముగ నాలోచించినయెడల మురకే యేదైన నాపద వచ్చునని నాకు భయముగానున్నది. రాజువిషయమై ప్రజల కందఱి కయిష్టమున్నది కాని ఇది మన కార్యమునకుఁ బ్రస్తుత మంతగా నుపచరింపదు. మ్లేచ్ఛులు మగధరాజ్యమునకై విశ్వప్రయత్నములు చేయుచున్నారుకదా? ఇట్టి సమయమున రాజమందిరములో గృహకలహము పుట్టించిన నదియే చాలును. ఇదియే మనకార్యమునకు ముఖ్యమైన సాహాయ్యము. మురాదేవి యంతఃపురమున కెవరెవ్వ రేయేపనులమీదఁ బోవుచు

వచ్చుచుందురో ఆసంగతిమాత్రము నీవు జాగ్రత్తగాఁ గనిపెట్టుచుండవలయును. ఏదైన విశేషము జరిగినయెడలఁ దక్షణము నా కెఱింగింపుము. ఈయుత్తరమును చదివి నీవు వెంటనే చించిపాఱవేయవలయును. భగవాన్ గౌతముని యనుగ్రహము నీకుఁ గలుగుఁగాక. నీకుఁ గల్యాణ మగుఁగాక. మనకార్యములన్నియుఁ ద్వరలోనే నెరవేఱునుగాక.

గ్రహించవలెను.

ఇట్లు,

వసుభూతి."

ఈయుత్తరమంతయు సాంతముగఁ జూచిన తరువాత బృందమాలకు మనసు కొంచెము స్థిమితమైనది. ఆమెపై వసుభూతికి మిక్కిలి విశ్వాసము గలదు. సాయంకాలము ఎట్లయినఁ దీఱుబాటు చేసికొని వసుభూతితో మాటాడవలసియున్నదని యామె యెంచి వెంటనే యుత్తరమును చించి పాఱవేసెను.

ఇక్కడ సిద్ధార్థుఁడును చాణక్యుఁడునుగూడ బృందమాలను విడిచి బయలుదేఱి యథాప్రకారముగ నగరమునఁ గలవిశేషములు జూచుచు వచ్చుచుండిరి. చాణక్యుఁడుమాత్రము ఒక్కమారు రెండుకార్యములు చేయవలసి వచ్చినది. అం దొకటి సిద్ధార్థుఁడు చెప్పుచున్ననగరవిశేషములు ఆలకించుటయు రెండవది వసుభూతి బృందమాలకు వ్రాసినయుత్తరమునఁ గలసంగతులేమైయుండునో యనివిచారించుటయు. "నిన్నరాత్రి వసుభూతికిని బృందమాలకును జరిగినసంభాషణము విన్నాఁడనుకదా. ఇంతలో వ్రాయుటకు క్రొత్తవిశేషములేమియున్నవి? ఏసంగతి వ్రాసినను, ఏసంగతి వ్రాయక పోయినను, ఒకసారి బృందమాలను రమ్మనిమాత్రము వ్రాయకతీఱఁడు గదా. బృందమాలకుఁ బగలెల్ల తీఱుబాటు ఉండదు. అందుచే ఆమె మరల నేఁటిసాయంకాలమే బయలుదేఱును. కావున నిన్నరాత్రివలె నేఁడుకూడ

వారికి జరుగఁబోవుసరభాషణ మతిజాగరూకతతో వినవలసియున్నది.” అని యప్పుడప్పుడు చాణక్యుఁడు తనలోఁ దలపోయుచుండెను. ఇంతలో వారిరువురు నొక దేవతామందిరము దగ్గఱకు వచ్చిరి. అప్పుడు చాణక్యుఁడు సిద్ధార్థునితో నిట్లు ప్రసంగించెను.

“సిద్ధార్థా! విశాల మైనయీమందిర మెవ్వరిది?”

“అబ్బా! నాకు భయము పుట్టుచున్నది. దీనిపేరు నేను చెప్పలేను”

“పేరు చెప్పుటకే భయమా? అయ్యో! వెఱ్ఱివాఁడా? నే నున్నానులే! భయములేదు చెప్పు చెప్పు.”

“అయ్యా! నానోట మాట రాకున్నది. ఇది-కా-ళి-కా-లయము. ఇందులో భయంకర మైనచండికేశ్వరీవిగ్రహ మున్నది. ప్రతిమంగళవారము నిండ నేకపశువులు బలి యీయఁబడుచుండును. ఒక్కొక్కప్పుడు మనుష్యులనుకూడ...............”

అని తలఁ ద్రిప్పుచు పెద్దనిట్టూర్పు విడిచి యూరకుండెను. అప్పుడు చాణక్యుఁడు.

“సిద్ధార్థా! నీవు చెప్పినదివాస్తవమే. కాని యెట్టులైన నీదారుణకృత్యము మాఁపివేసిన బాగుండును. భగవతియైనశ్రీచండికేశ్వరియొక్క యుద్దేశము తనకొఱకు జీవహింస చేయుటకాదు. నేనుఁగూడ కాళీభక్తుఁడనే! నా కాసంగతులన్నియు స్పష్టముగఁ దెలియును. సిద్ధార్థా! నే నొకసారి ఆమెదర్శనముచేయవలయును నీవు కూడ వచ్చెదవా?” “నీవలె నాకుఁగూడఁ బ్రాణముపై నాశ లేదనుకొంటివా యేమి? నాయనా! నేను రాను. నీవు వెళ్లు. కాని మరల తిరిగి రాఁ జాలవుసుమీ జాగ్రత్త!”

చాణక్యుఁడు వానిమాటలకు నవ్వి యిప్పుడే వచ్చెద నని చెప్పి తాను కాళికాలయములోనికిఁ బోయెను. వాని కేదో తప్పక యాపద సం

భవింపక మాన దని నిశ్చయించుకొని చాణక్యునికొఱకు ప్రతిక్షణ మెదురు జూచుచు సిద్ధార్థుఁడు వేచియుండెను. కాని యెంతసేపు కాచియున్నను చాణక్యునిదర్శనము మరల వానికిఁ గాలేను. క్రమముగఁ బన్నెండుగంటల వేళయయినది. అప్పటికి చాణక్యుఁడు లోనికిఁబోయి ఒకగంటకాల మైనది. సిద్ధార్థుఁ డూరక దిగులుపడుచు, చాణక్యుని నిందించుచుండెను. ఇంతలో ఒంటిగంటకూడ నైనది. చాణక్యుని విడిచి పోవలేక పాపము సిద్ధార్థుఁడట్లు సాయంకాలమునాలుగుగంటలవఱకు వేచియుండెను కాని చాణక్యుఁడు అప్పటికిని దేవతాలయమునుండి పైకి రాలేదు. అందుచే సిద్ధార్థుఁడు విసిగి విసిగి “అయ్యయ్యో! ఈవెఱ్ఱిముండకొడుకును నే నెందుకు వెంటఁ గొనివచ్చితిని. ఆలయములోనికిఁ బోయి యైదాఱుగంటలకాల మైనది. లోపల నేమయ్యెనో కాని వానిసంగతి యేమియుఁ దెలియదు. వామాచారులు వానిని శక్తికి బలియిచ్చియుందురా? నేఁడు మంగళవారముకాదే? ఏమో దురాత్ములకు వారము వర్జ్యము లెందులకు? ఇట్లెంతసేపని వానికొఱకు వేచియుండఁగలను? ఎంత చెప్పినను వినక యిప్పుడే వచ్చెద నని చెప్పిపోయినవాఁడు సాయంకాల మైనను తిరిగి రాఁడయ్యె. ఒకవేళ తాను పోయినద్వారమును విడిచి మఱియొకద్వారమునుండి వెళ్లిపోయెనేమో? అట్టియుద్దేశమున్నయెడ నన్నెందులకు తనకొఱకు వేచియుండు మని చెప్పును? వానిని విడిచి నే నొంటరిగా నింటికిఁ బోయితినా గురువుగారు నాపై నాగ్రహమొందకమానరు.” అని పలువిధముల విచారించుచు సిద్ధార్థుఁడు మెల్లఁగఁ దనమార్గమును బట్టి బయలుదేఱి పోవుచుండెను.

ఆతఁ డట్లు బయలుదేఱి నాలుగైదువీథుల దాఁటి కొంతదూరము వఱకు నేఁగునప్పటికి మనచాణక్యుఁడు మెల్లఁగ కాళికాలయమునుండి ముసిముసినవ్వులతోఁ బైకి వచ్చి యిటునటుఁ జూచుచుండెను. చాణక్యుఁడు ఆలయములోఁ బ్రవేశించినతరువాత తా నెంతసేపు ఆలస్యముచేసినను సిద్ధార్థుఁడు తనకొఱకు లోనికి రాఁడుగదా యని బుద్ధిపూర్వకముగా నే యందులో నుండిపోయెను. అచ్చట నే స్నానముఁజేసి గర్భాలయమునఁ బ్రవేశించి

చండికేశ్వరిముందరఁ గూర్చుండి యత్యంతభక్తితోఁ గొంతవఱకు జపముఁ జేసికొని సిద్ధార్థుఁ డింకను తనకొఱకు వేచియున్నాఁడో లేదో యని తలుపు సందులనుండి యప్పుడప్పు డతఁడు తొంగి చూచుచుండెను. తాను జూచు నప్పు డెల్ల సిద్ధార్థుఁడు తనకుఁ గానవచ్చుచుండుటచే చాణక్యుఁడు "అబ్బా! శనిగ్రహమువలె నింకను బోకున్నాఁడే" అని తనలో విసిగికొనుచు మఱికొంతసేపు కాలయాపన మొనర్చెను. తుదకు వానికోరికప్రకారము సిద్ధార్థుఁడు బయలుదేఱిపోయినంతనే చాణక్యుఁడు వెలుపలికి వచ్చి.

"సాయంకాలమైనది సిద్ధార్థుని మోసపుచ్చి వాని నింటికి పంపివేసి తినిగదా? ఇంక బృందమాలతో స్వేచ్ఛగా మాటాడవచ్చును. ఆమెకూడ బయలుదేఱు వేళయైనది. పాపము వసుభూతి నాకొఱకు విచారించుచు సిద్ధార్థు నెంతో దూషించుచునుండును. ఎక్కడనుండి వచ్చుచున్నావని బృందమాల యడిగిన నామెతో నేమని చెప్పవలయును?............... ఇదే బాగున్నది. వసుభూతితోఁగూడ నిట్లే చెప్పెదను. ఇట్లైన వసుభూతికిఁ గాని బృందమాలకుఁగాని యెట్టి యనుమానమును గలుగదు. ప్రస్తుతము బృందమాలతో రహస్యముగ మాటాడవచ్చునుగదా? తరువాత సంగతి యాలోచింపవచ్చును. కావున నిప్పుడే రాజమందిరము సమీపమునకుఁబోయి యీమె వచ్చుసరికి త్రోవ తప్పి పిచ్చివానివలెఁ దిరుగుచున్నట్లు నటించెదను. తొలుత బృందమాలయే నన్ను బలుకరింపవలయును అంతవఱకు నామె వంక నే నెంతమాత్రమును చూడను."

అని యాలోచించుకొనుచు చాణక్యుఁడు మెల్లఁగ రాజమందిరము వంకఁ బోవుచుండెను. కోటకుసమీపముననే నాలుగైదు త్రోవలుండుట చేత, చాణక్యుఁడు తనకపటనాటకమున కాప్రదేశమునే రంగస్థలముగఁ జేసికొని యచ్చటకు వచ్చి యచ్చట సంచారము సేయుచుండెను. ఇంతలో సాయంకాల మాఱున్నరగంటలైనందునఁ జిన్నచిఱుచీకటులు నలువంకల వ్యాపింపఁజొచ్చెను, చాణక్యుఁడనుకొనినట్లె కొంతసేపునకు బృందమాల

కోటలోనుండి బయలుదేఱి తనకు సాహాయ్యముగ వెంట నొకసౌఖరుని గొని మెల్లఁగ వచ్చుచుండెను. చాణక్యుఁడామెను జూచినతరువాత మఱింత నటించుచు ఆత్రోవలోనుండి యీత్రోవకు, నీత్రోవనుండి యాత్రోవకు నడచుచు బృందమాలకు వినఁబడునట్లు మార్గమునఁ బోవువారిని "అయ్యా! కైలాసనాథుని మందిరమునకు మార్గ మెట్లు" అని పలుమారు లడుగుచు వెఱ్ఱివానివలెఁ దిరుగుచుండ బృందమాల వానిని సమీపించి ఆమాటలు వినెను. కాని అతఁ డెవఁడో మొదట పోల్చుకొనలేదు. తరువాత వానిని గుర్తుపట్టి చెంతకు వచ్చి,

"బ్రాహ్మణోత్తమా! ఇచ్చటి కేమునకు వచ్చినారు? మీకేమిపని యున్నది"

"బృందమాలా! నేఁడు నన్ను రక్షించితివి. ఏమని చెప్పఁగలను. నిన్ను విడిచి సిద్ధార్థుఁడును నేనును వచ్చుచుండ దారిలో నొక కాళికాలయము మాకుఁ గనంబడినది. దేవీదర్శనము జేసి యిప్పుడే వచ్చెదనని సిద్ధార్థునితోఁజెప్పి నేను లోనికిఁ బోయితిని. కాని తిరిగివచ్చునప్పుడు నేను మొదట నేద్వారమున బ్రవేశించితినో ఆమార్గము మఱచి, యింకొకద్వారమునఁ బడి యీవలకు వచ్చుసరికి సిద్ధార్థుఁడు నాకెక్కడను గానరాలేదు. వానినిమిత్త మీకోటచుట్టును వెదకితిని. వచ్చినత్రోవనురాక సిద్ధార్థుఁడు నన్ను క్రొత్తమార్గమునఁ గొనివచ్చుటచే నింటికిఁ బోవుదమన్న దారి తెలియదు. తిరగలేక తిరగలేక నాకాళ్లు పట్టుపట్టినవి. అబ్బా! బృందమాలా! నేఁడు నామనసు విస్తారముగ కలఁతఁజెందినదిసుమా! నీవు కానరాకున్న నాగతి యేమైయుండునో? ఇప్పుడు నీవెక్కడికి బయలుదేఱినావు?"

"బాగానేయున్నది. మీ యదృష్టవశమున నేను మీకుఁ గనఁబడినాను. సరే అయినదేదో అయినది నావెంటరండి! నేను గురువుగారివద్దకే బయలుదేఱినాను. ఆయన నేఁటి యుత్తరములో నన్ను రమ్మని వ్రాసినారు. కదా! పాపము గురువుగారు మీకొఱకు విచారించుచు శిష్యులఁ బంపి వెదకించుచుందురేమో? మనము త్వరగాఁ బోవలయును"

"బృందమాలా! నన్నేమిచేయుమనెదవు? ఈపట్టణము నాకు క్రొత్తగదా? సిద్ధార్థుఁడు వచ్చినమార్గమున నన్నుఁ దీసికొనిపోయిన యెడల నే నింత కష్టపడుదునా?"

అని కొంతదూరము నడచినతరువాత చాణక్యుఁడు బృందమాలను ప్రసంగములోనికి దింపి యిట్లు సంభాషించెను.

"బృందమాలా! నిన్నరాత్రి నీవు వెళ్లిపోయినతరువాత గురువుగారును నేనును చాలసేపు మాటాడినాము. జరుగవలసినకార్యము; కష్టసాధ్యమైనదే."

"ఎందుకయ్యా! ఇట్టి పిచ్చితలంపులు? వట్టికంఠశోష."

"ఏమట్లనుచున్నావు? స్త్రీలు ఏప్రతిజ్ఞ చేసినను దానిని తప్పక నిర్వహించెదరు. కాని నీవన్నట్లు మురాదేవి చేసినప్రతిజ్ఞ అంతయుక్తముగా లేదు. కాని తన్ను చెఱలోఁ బెట్టించి తనకుమారునిఁ జంపించిన రాజుపై నామె కింతద్వేష ముండుట తప్పుకాదు".

"నే నాసంగతి యెఱుఁగకపోలేదు. మురాదేవి దేనికైన ప్రయత్నించినయెడల నామెకు రాజుచేతిలో మరణము దప్ప మఱేమిలాభమున్నది? న్యాయాన్యాయముల విచారించుదాత యెవఁడైన నున్నాఁడా?"

"నిజమే కాని న్యాయాన్యాయముల విచారించుటకు కైలాసనాథుఁడే యున్నాఁడు. అతనిమీఁద భారము వేసి ప్రయత్నించినచోఁ దప్పక కార్యము సిద్ధికాఁగలదు".

అందులకు బృందమాల యేమియుఁ బ్రత్యుత్తర మీయలేదు. కొంతవఱకు నడచినతరువాత మరలఁ జాణక్యుఁడు "బృందమాలా! నీమాటలుచూడ నీయజమానురాలియందు నీకు మిక్కిలి భక్తియున్నట్లు తోఁచుచున్నది. నీ వామె కెల్లప్పుడును సాహాయ్యము చేయుచుందువని యనేకమారులు విన్నాను"

"అవును. సమయము వచ్చినప్పు డామెకొఱకు నాప్రాణమైన ఖర్చుపెట్టి తీఱెదను."

"శబాస్! ఇదికదా స్వామినిపై భక్తి? లేనియెడల పదునాఱుసంవత్సరములు చెఱసాలలోఁ బడివచ్చినస్త్రీ యెంతయజమానురాలైన నెవ్వరాదరింతురు?"

"నే నేమి చేసినాను. ఆమెను సేవించుట నాకు విధియై యున్నది కదా?"

"వాహ్వా! వాహ్వా! నీవంటియుత్తమురాలగుదాని యెక్కడనో కాని కానరాదు. ముర యదృష్టవశమున నీవంటిదానిని సంపాదించెను. దీనికేమి కాని నీ వామెప్రాణరక్షకై యేమిచేసెదవు? అది చెప్పినయెడల నీకు నేను దగినంతసాహాయ్యము చేసెదను."

"అంతకన్న నాకింకేమి కావలయును! కాని నే నేమిసేయవలయునో తోఁపకున్నది. ఎంత బోధించినను మురాదేవి తనపిచ్చి తాను విడిచిపెట్టదు. నందవంశమును నాశనముఁజేసి యెవరినో కొనివచ్చి సింహాసనముపైఁ గూర్చుండఁబెట్టునఁట. ఇది న్యాయమేనా? అందువలనఁ దనకేమైన లాభమున్నదా? తనకుమారుఁడుగాని బ్రతికియుండిన నేమో యనుకొనవచ్చును; నిష్కారణముగ నీయల్లరి తన కేమైన భావ్యమేనా?"

"సరేకాని ఆమె కుమారుఁడు బ్రతికియుండిన నీవుగూడ నంగీకరించి సాహాయ్యము చేసియుందువేమో"

"అహా! అందుకు సందేహమెందుకు! కాని అంతభాగ్యమెక్కడ!"

"బలే బృందమాలా! బలే! నీవు నిక్కమైనస్వామిభక్తి గలదానవు."

ప్రకరణము. 7.

మొదటిపాదము.

మనకథాభాగములోఁ బ్రధానపురుషుఁడైన ధనవంతునిఁ గూర్చి యింతవఱకును వినుటయే కాని చదువరు లొకసారియైన వానినిఁ బ్రత్యక్షముగఁ జూడలేదు. కావున నాతఁడు సాధారణముగ విహరించుచుండు గాలిమేడపై నొకసారి పోవలసియున్నది. అచ్చట ధనవంతుఁ డొంటరిగఁ గూర్చుండి యేవిషయమునుగూర్చియో కాని తనలోఁదానే విచారించుచుండెను. చెంత నిరువురు రంగరక్షకులుదప్ప యితరు లెవ్వరును లేరు. కాని ధనవంతుఁ డూరక తనలో నొచ్చుకొనుచు మొగము జిట్లించుకొనుచు, పెదవులు కఱచుకొనుచు నేదియో గొప్పయపరాధముఁ జేసినవాఁడు తెలివిఁ దెచ్చుకొని తాను జేసిన దానినిఁ గూర్చి పశ్చాత్తాప మొందునట్లే చీకాకుపడుచుండుటవలనఁ గొంతసేపునకు దనయంగరక్షకులఁగూడ నావలికిఁ బంపివేసెను. ధనవంతుఁడు తన యనుచరులయెడల నెంతదయాళుఁడో యంత చండశాసనుఁడు గావున వాని యాజ్ఞలేనిదే ఇతరు లెవ్వరును తనదర్శనమునకు వచ్చుటకు వీలులేదు. అతని యాజ్ఞ యన్న నెట్టివాఁడైన శిరసావహించి తీఱవలయును. ఆభయముచేతనే కాఁబోలు శీతలమందగంధవహుఁడుగూడ ధనవంతున కతివినయముగ వింజామరము వీచుచుండెను. చెంత నెవ్వరును లేకపోయినను వానివిచారము మాత్రము వానిని విడిచి పోలేదు. అంతకంత కతనిచీకాకు మితిమీఱుచుండెను కాని యెంతసేపునకును తగ్గదయ్యె. ఎచ్చటికైనఁ బోయి యెవ్వరితోనైన వినోదముగఁ గాలక్షేపముజేసినయెడల తనహృదయము స్వస్థతచెందునేమోయని మొదట ననుకొనెనుగాని మరల నెందుచేతనో యచ్చటినుండి కదలలేదు. సారెసారె కాతఁ డొనరించుశిరఃకంపనములును ఆతఁడు విడుచుచుండిన పెద్దనిట్టూర్పులును జూచిన ధనవంతుఁ డెంతో కలఁతఁజెందుచుండెనని చూపరు లనుకొనకమానరు. మనసు ఊరక యుల్లకల్లోలమగుచు, అధికవిచారము తన్నావేశించుటచేత పరవశత్వమును వహించి, మొదటినుండియు, రెప్పవాల్పక నేప్రక్కకుఁ జూచుచుండెనో ఆప్రక్కకే చూచుచు నొకసారియైన నతఁడు తనదృష్టిని మార్చి రెండవ ప్రక్కకుఁ దిరుగలేదు. ముడిచిన కనుబొమ్మలును ఎత్తిన కనురెప్పలును ఒక వంకకే ప్రసరించుచుండిన దీర్ఘదృష్టియు నెంతసేపునకును మార్పుచెందక అచలత్వమూనియట్లే యుండుటచేత నప్పటి ధనవంతుని యాకారమును జూచి యొక నిర్జీవప్రతిమను బోలియున్నదని వ్రాయుటలో నలంకారదోషము లేదు.

ఇంతలో సాయంకాలమైనది. పశ్చిమదిక్కాంతపై నెందుచేతనో యపరిమితాగ్రహము వహించి కొంతకాల మామెను విసర్జించి, మరలఁ దనలోఁ దానె పశ్చాత్తాప మొంది తీక్ష్ణమైన తనక్రోధమును విడిచి, శాంతభావముతో నామె నోదార్చి యేలుకొనుటకుఁ గాఁబోలు సూర్యభగవానుఁడు అపరశైలాంతఃపుర సౌధోపరిభాగంబునకుఁ బోయెను. భర్తను జూచినంతనే యొక్కమా రుప్పొంగుచు వచ్చినదుఃఖము నాఁపుకొనలేక పశ్చిమదిక్కాంత యూరక వెక్కివెక్కి యేడ్చుచున్నదో యన, మదవిహంగకుల కలకలారావంబు లెల్లెడల వినవచ్చుచుండెను. అధికరోదనముచే నామె మొగ మెఱ్ఱవారినట్లే సాంధ్యరాగముగూడ జనించినది. ఇప్పటికి మన ధనవంతుఁడు తన పరవశత్వమును విచారమును విడిచి ఒక్కసారి రెండవప్రక్కను జూచెను. అచ్చటనే యొక సేవకుఁడు రెండుచేతుల జోడించుకొని యతివినయముతోడను, మిక్కిలి రాజభక్తితోడను, విస్తారము భయముతోడను, నిలిచియుండెను. అతఁ డెంతసేపునుండి యచ్చటకు వచ్చియుండెనో ధనవంతునకుఁ దెలియదు. దీర్ఘవిచారములోనున్న తన ప్రభువును పిలువలేక తన వైపునకుఁ దిరిగినప్పుడే సంగతియో చెప్పవలయునని యీసేవకుఁ డరగంటకాలము క్రింద వచ్చి వేచియుండెను. ధనవంతుఁడు తనప్రక్కకుఁ జూచినంతనే యితఁడు జోహారు చేసి కట్టెదుట

నిలుచుండబడి "మహారాజా! దేవరవారిదర్శనార్థమై పట్టపుదేవిగారివద్దనుండి యుత్తరమును గొనివచ్చి దాసి యొకతె ద్వారముదగ్గఱ వేచియున్నది" అని విన్నవించుకొన రాజు "ఏమి? పట్టపుదేవిదాసియా? అట్టులైన నభ్యంతరమేమున్నది? నీవు పోయి తీసికొనిరా"

అని యాజ్ఞాపించి పంపెను. రాజుతో, తా నేదైనఁ జెప్పుకొనవలసివచ్చినప్పుడు తాను స్వయముగ మనవిఁజేసికొనుటయే కాని పట్టపుదేవి ధననందున కుత్తరములు వ్రాయుట యెన్నఁడును వాడుకలేదు. అందుచే ధననందుఁ డాశ్చర్యపడి యాయుత్తరము పట్టమహిషి యేకారణమున వ్రాసియుండునో యని వితర్కించుకొనుచుండెను. ఇంతలో సేవకుఁడు పోయి ద్వారమువద్ద వేచియున్న దాసిఁగొనివచ్చి రాజునెదుటనిలువఁబెట్ట, నామె ధననందునకునమస్కరించి వానిచేతి కొకయుత్తరమందిచ్చెను. అతఁడాయుత్తర మందుకొనుచు ఆమెముఖమును దేరిపారఁజూచి.

"నీవు పట్టపుదేవియొక్క దాసివా?"

"చిత్తము"

"దేవి యేమిసేయుచున్నది"

"ప్రాణముఁ బాయుటకు సిద్ధముగ నుండి తమ కీయుత్తర మిమ్మని నన్నుఁ బంపినది"

"ఆఁ-ఆఁ-దేవి కంతకష్ట మేమి వచ్చినది?"

అని యాతురతతో నాయుత్తర మిట్లు చదువఁగడంగెను.

"ఉ. వందన మోవశీకృతనృపాలకబృంద! యమందశుంభదా
నంద! సమస్తసద్గుణగణా! నవమన్మథసుందరా! ధనా
నందపురందరా! యిఁక మనంబునఁ బూర్వపుటాగ్రహమ్ము నీ
వొందక దాసురాలి వినయోక్తుల సమ్మతి నాదరింపవే"

సీ. ఒకమహారాజపుత్త్రిక నయ్యు నత్తింటఁ
గడునీచజాతిఁ బేర్పడినదాన
అపనిందఁ జెంది పదాఱేండ్లు ఖైదులోఁ
బడ రానికష్టముల్ బడినదాన
కడుపారఁ గన్నట్టికన్నకుమారు నే
నక్కటా! దిగమ్రింగినట్టిదాన
కుమతులౌ సవతులకుం జేతు లొగ్గి యి
ట్లుర్వీశ దాసినై యున్నదాన

తే. దిక్కు లేనట్టిదాన హా! దీనమైన
బ్రతుకుగలదాన; నింక నాగ్రహముమాన
దేవ! దేవరవారిఁ బ్రార్థించుదాన
పుడమిపై నేఁడె ప్రాణముల్ విడచుదాన.

గీ. ప్రాణనాయక! తల్లిగర్భమునుండి
వెడలి నావలె నేయాఁడుబిడ్డయైన
లలితమంగళసూత్రమ్ముఁ గలిగి యిట్లు
పడయఁగా రానికష్టముల్ పడెనె చెప్పుమ!

చ. జరిగినదంతయున్ మరల సారెకు సారెకుఁ ద్రవ్వనేల? యే
యతిమతి లేదు నాకు; మది నన్యవిచారములేమి లేవు; సం
బరమున నాడు కంఠమున మంగళసూత్రముఁ గట్టినందు కీ
మురకు క్షమించి యొక్కవరముం దయసేయవె జీవితేశ్వరా!

సీ. నను నాదరమునఁ జేకొని యేలుమా యంచు
నిన్నుఁ బ్రార్థింప నో నిర్మలాత్మ!
నీకుఁ బట్టంపురాణినిఁ గావలె నటంచు
నిన్నుఁ బ్రార్థింప నో నిర్మలాత్మ!
నగలు చీరలు మహానగరు లిమ్మంచును
నిన్నుఁ బ్రార్థింప నో నిర్మలాత్మ!
ఒకసారి పుట్టినింటికిఁ బంపు మనినైన
నిన్నుఁ బ్రార్థింప నో నిర్మలాత్మ!

తే. అట్టికోరిక లెవ్వి నాయాత్మలోన
లేవు లేవు ముమ్మాటికి లేవుసుమ్మి
అన్నిముచ్చటల్ దీఱె నాకధిప! యింకఁ
గొఱఁత యేదియు లేదు నీకరుణవలన.

ఉ. కాని మహాపరాభవముఁ గాంచినదాననుగాన నీచ మా
ప్రాణముపైఁ దమిన్ విడిచి పాయఁగనుండి శరీర మేను; నిన్
గానక జీవమున్ విడువఁగా మనసొల్లకయున్న దార్య! యీ
చానకు దీనురాలి కొకసారి ముఖమ్మును జూపి పంపవే.

ఉ. రాజున కెవ్వ రెట్టియపరాధముఁ జేసిన నట్టివారి నా
రా జురిదీయునప్పు డపరాధులయాఖరికోర్కెఁ దీర్ప కే
రాజులునైన నట్టియపరాధుల నెన్నఁడుఁ జంప రాఁగదా?
రాజవరేణ్య; యియ్యదియు రాజులధర్మము నీ వెఱుంగవే?

గీ. ఐన నీ కెంతయపరాధ మేను జేసి
నానొ గాని, మహీనాథ! నాయసువుల
నైదిటిని నొక్కమారు దీయకయె యిట్లు
ముక్కముక్కలు చేసినా వక్కటకట!

సీ. దాసిపుత్రిక నంచుఁ దగనినిందను మోపి
యొకప్రాణముం గొంటి వోనరేంద్ర!
కారాగృహావాసకష్టమ్ముఁ బెట్టి యిం
కొకప్రాణముం గొంటి వోనరేంద్ర!
పసిపాపకంఠమ్ముఁ బిసిగి చంపియు మఱి
యొకప్రాణముం గొంటి వోనరేంద్ర!
సవతులలోఁ బరాభవ మింత జేసి వే
ఱొకప్రాణముం గొంటి వోనరేంద్ర!

తే. తరలె నాల్గుప్రాణంబు; లైదవది యింక
తనకుఁ దానె ననుం బాసి చనఁగ నుండె
ధారుణీశ్వర! నాకడసారికోర్కె
ధన్య నొనరించు తావకదర్శనంబె.

ఇట్లు,
మీపదదాసి,
‘మురా’

ఆయుత్తరముఁ గొంతవఱకుఁ జూచుసరికే మురాదేవి వ్రాసినట్లు ధననందుఁడు గ్రహించెను. అందులోని ప్రతిమాటయును వానిహృదయమున శూలమువలెఁ గ్రుచ్చుకొని బాధించుచుండెను. కాని ధననందుఁడు తనవిచారమును కొంచెమైన బైటకుఁ దోఁపనీయక దాసినిఁ జూచి.

"ఒసీ! నీవు పట్టపుదేవిదాసి నని యెందులకుఁ జెప్పితివి?"

"దేవా! తనదాసియన్నను తనయుత్తరమన్నను దేవరవారు చూతురని యెంచి యిట్లు చెప్పుమని మామురాదేవి నా కాజ్ఞాపించినది. నేనామెదాసినే కాని పట్టపుదేవిదాసిని కాను. నాపేరు బృందమాల."

"సరే! నీ వింక పోయి మహారాజుగారు నీయంతఃపురమునకు వచ్చుచున్నా రని నీయజమానురాలితోఁ జెప్పు."

అని ధననందుఁడు బృందమాలను పంపివేసి తాను మేడదిగి క్రిందకు వచ్చెను. అచ్చటఁగొందఱంతఃపురపరిచారికలు తమలో నేదియో సంభాషించుకొనుచుండిరి. ధననందుఁడు వారిలో నొకతెను జూచి "ఓసీ! వేత్రవతీ! నాకు మురాదేవియంతఃపురమునకుఁ ద్రోవ జూపుము" అని యనుఁగ వానిమాటలు విని పరిచారికలందఱు విస్మయ మొంది యట్లే నిలుచుండిరి. ఒకతెకైన నోట మాట రాలేదు. ధననందుఁడు మురాంతఃపురమునకుఁ ద్రోవఁజూపుమనుట వారందఱికి కలగాఁ దోఁచినది. వేత్రవతికిఁగూడ ఈసంగతి కలలోఁగాంచినట్లే యున్నది కాని నిజమనితోఁపలేదు. భ్రమపడి యూరక సందేహించుచు కొయ్యబొమ్మవలె నిలిచియున్న యాదాసితో మరల ధననందుఁడు "వేత్రవతీ! నీవు స్వప్నమున లేవు మేల్కొనియే యున్నావు. కిరాతమహారాజకుమారిక యైనమురాదేవియంతఃపురమునకు దారి చూపుమన్న మాటాడవేమి? ఆమెను జూచి పదునాలుసంవత్సరములు కావచ్చెను. ఇప్పు డొకసారి యామెనుజూడవలయు నని నాకు బుద్ధిపుట్టినది. పదపద! వేగిరము పద" అని గట్టిగాఁ బలుక వేత్రవతి వానికి మార్గమును జూప బయలుదేరెను.

తనయజమానురాలి కీశుభవార్త యెంతవేగిరము చెప్పుదునో యని బృందమాల పరుగుపరుగునఁ బోయి యత్యాతురతతో మురాదేవిని గాంచి "అమ్మా! మహారాజుగారు వచ్చుచున్నారు. మహారాజుగారు వచ్చుచున్నారు" అని పెద్దకేక వేసి చెప్పెను. అంతవఱకు నేదియో యాలోచించుచుఁ బరధ్యానమున నున్నముర ఆమాటలు విని ఒక్కమారు త్రుల్లిపడి లేచి తత్తరపడుచు "బృందమాలా! నిజమేనా! నిజమేనా? లేక హాస్యమాడుచున్నావా? చెప్పుచెప్పు!" అని తొందరగా నడిగెను. మహారాజుగారు నిజముగానే వచ్చుచున్నా రని బృందమాల యెన్నిమారులు చెప్పినను మురకు నమ్మకముజనింప కున్నది. నిక్కమే యని మరల బృందమాల ప్రమాణముఁజేసి చెప్ప నామె వెంటనే లేచి తలదువ్వుకొని తగుమాత్రము నగలు ధరించి యొకయెఱ్ఱనిపట్టుచీర కట్టుకొనెను. ముర అత్యంతసుందరి. అంతగా నగలు లేకపోయినను ఆమె చక్కఁదనమున కేమియు లోపము గలుగలేదు. మహారాణులందఱిలో మురయే యెక్కుడుసౌందర్యవతి యని రాజేకాక ప్రజలుగూడ మెచ్చుకొనుచుండిరి. సహజసౌందర్యము లేనివారెన్నినగలు పెట్టుకొనినమాత్ర మేమిలాభ మున్నది? తమ కున్నదానికన్న నెక్కుడు లావణ్యము కావలె నని ధననందుని భార్యలందఱు నగలుపెట్టుకొనుచుండిరి. కాని మురాదేవిమాత్ర మట్లు కాదు. ఆమె నగలు పెట్టుకొన్నచో ఆనగలకే యొకతీరైనవన్నె గలుగుచుండెను. రాజుగారు తనయంతఃపురమునకు వచ్చుచున్నా రని వినినతరువాత, తా నలంకరించుకొనుటలోనే కాలమంతయు వృథాపుచ్చక కొంతతో చాలించి రాజుతో నేమేమిమాటాడవలయునో యని యాలోచించుకొనుచుండెను. ఇదియే కదా కార్యవేదుల లక్షణము? పగలు పదిగంటలకు నిలువుటద్దము ముందరఁ గూర్చుండి పండ్రెండు గంటలవఱకును శృంగారించుకొనుటలోనే కాలమంతయు వ్యయపఱచుచున్న యిప్పటి మనహిందూసుందరీమణులలోఁ గొంద ఱెట్టిలాభముఁ బొందుచున్నారో చదువరులెఱుఁగరా.

అట్లు తనకార్యక్రమము నాలోచించుకొనుచు, తనభర్త వచ్చిన వెంటనే యాతనిని గూర్చుండబెట్టుట కొకయాసనము సిద్ధముఁజేసి మురవానికొఱ కెదురుచూచుచుండెను. ఇంతలో వేత్రవతి చూపినమార్గమున ధననందుఁడామురమందిరమునఁ బ్రవేశించెను. వెంటనే రాహుగ్రహగ్రస్తసుధాకరబింబంబు చందంబునఁ గళలు తొలంగి దీనమై యున్న నెమ్మోముతో ఎడతెరిపి లేకుండ నొక్కతీరుననే స్రవించుచుఁ దన్ను మజ్జనమాడించుచున్న కన్నీటితో, స్వయముగ చెప్పనక్కఱలేకయే పదాఱు సంవత్సరములనుండి తాను పడిన ప్రయాసమంతయు నొక్కమారుగ వెల్లడి సేయుచున్న శుష్కశరీరముతో, తానేడ్చినయేడుపంతయు నింతంతగాదని తెలుపుడుచేయుచు నగ్నికణములవలె నెఱ్ఱవారియున్న విశాలనేత్రములతో, అంబరంబంటునుప్పొంగు తరంగసంఘములతో నల్లకల్లోల మగు మహాసముద్రమువలె మితిమీఱి దుర్వారమై పొంగి పైకుబుకుచున్న దుర్భరదుఃఖభారముతో, తన్నష్టకష్టములు పెట్టి, పశ్చాత్తాపచిత్తుఁడై, పునర్దర్శనమీయవచ్చిన భర్తగారి నెదుర్కొని గద్గదస్వరముతో, "ఆర్యపుత్రా! ఆనాఁడు సేనానాయకుం డగుబాహురాయణుని సాహాయ్యమున మగధరాజ్యలక్ష్మీధురంధరు లగుమీచే గాంధర్వవివాహధర్మమున నాదరింపఁబడిన యీముర; దేవరవారి యవ్యాజకరుణాకటాక్షమును సంపాదించి తనవంటి భాగ్యశాలిని యిం కెందును లే దని కొంతకాలమువఱకు విఱ్ఱవీగుచుండినయీముర; అసూయాత్తచిత్తులై సవతులు పన్నినమాయయనియైన నూహింపక, కన్నకుమారుని కాంతారమునకు బలియిచ్చి, దేవరవారిచే నింతకాలమును చెరసాలలోఁ బెట్టఁబడిన యీముర; సవతులలోఁ గల్గినదుర్వారపరాభవానలము దేహమెల్ల దహించుచుండ సహింపలేక, కడసారి తమదర్శనభాగ్య మొంది ప్రాణత్యాగ మొనర్చుటకు సిద్ధమైయున్న యీముర; దేవరకు నమస్కరించుచున్నది."

అని ధననందుని పాదములపైఁ బడి యేడ్చుచు తనకన్నీటిధారలతో వానిపాదములఁ దడిపివేయుచుండెను. రాజామెను వెంటనే తనరెండు

చేతులతోడను లేవనెత్తి తనజేబురుమాలుతో నామెకన్నీటిని తుడుచుచుండెను. అందుచేతనే తనకన్నులనుండి యేకధారగ వచ్చుచున్న దుఃఖకణముఁ దుడుచుకొనుటకు వానికి వీలులేకపోయెను. ఆమె దీనావస్థను విపరీతమైనదుఃఖమును సహజసౌందర్యాతిశయమున కపారమైన మోహమును ధననందున కొక్కమారుగ సంభవించినవి. తలయందు ముడుచుకొనిన యొకగులాబిపువ్వును, మెడలోని కాసులపేరును ధరించుకొనిన యెఱ్ఱనిపట్టుచీరయుఁ దప్ప వేఱువస్తువు లేమియును లేకపోయినను మురాదేవి ధననందునికన్నులకు మోహినీదేవియై యాతనిమనసు సర్వమును క్షణములోఁ దనవశముఁ జేసికొనెను. మొదట నామె యుత్తరము వ్రాసినముహూర్తము శుభమైనదే! ఇట్టియుత్తరము లెన్నియో వ్రాసి యెంతయో ప్రయత్నముఁజేసి వానిని దనవశముఁజేసికొనవలయునని యనుకొనెనుగాని యింతసూక్ష్మములో ధననందుఁడు తనకుఁ జేఁజిక్కునని మురయెఱుఁగదు. అత్యాదరముతో తనపాదములపైనుండి యామెను లేవనెత్తి యతఁడు

"సుందరీ! మురా! గడచినదానినిఁగూర్చి నీ వింక దుఃఖింపకుము. కాలవశమున కెవరేమి సేయఁగలరు? నాబుద్ధియే నన్ను మోసపుచ్చినప్పుడు ఒరులనిందించు టేందులకు? దుర్మార్గుఁడనై నేను నీకుఁ బెట్టినకష్టము లింతగాదు. అదంతయు జ్ఞాపకముఁదెచ్చి నామనస్సు నొప్పించిన నీ కేమిలాభమున్నది? నాయపరాధములన్నియు క్షమింపుము నాకుఁ దగిన శిక్షయైనది"

అని యాలింగన మొనర్పఁబోవ నామె యంగీకరింపక దూరముగ తొలఁగి యేడ్చుచు

"ఆర్యపుత్రా! మీయపరాధము క్షమించుటకు నే నెంతదానను మీరు నాయెడఁ జేసినద్రోహ మేమియును లేదు. ఇదియంతయు నాపురాకృతకర్మమే! దేవరవారియాలింగనసౌఖ్య మొందుట కిది సమయము గాదు. ఈభాగ్యమంతయు నా కానాఁడే ముగించినది. నేనే యదృష్టవంతురాలనైనచో నాకుమారుఁడే బ్రతికియుండును. మొన్న జరిగిన పట్టాభిషేకము

వానికే జరిగియుండును ? ప్రాణేశ్వరా ! అయినను నాకుమారునకుఁ బట్టాభిషేకోత్సవము జరుగలేదను విచారము నాకావంతయును లేదు. అతఁడిప్పుడు పదారేండ్ల నవమన్మథుఁడై దేవలోకపట్టాభిషిక్తుఁడై యింద్రుని యర్థాసనముపైనున్నవాఁడు. అట్టి నాముద్దుకుమారునిఁ జూచుటకే యిప్పుడు నేను బయలుదేఱుచున్నాను. ఇందుకే దేవరవారి కడసారిదర్శన మభిలషించితిని. ఇంక తమసెలవునకు వేచియున్నాను "

" నీ నిష్ఠురవాక్యశూలముచే న న్నెంతసే పిట్లు బాధించెదవు ? సుందరీ! క్రూరాత్ముఁడనై నేను చేసినయపరాధమును క్షమించి నన్ను మన్నింపుము. నన్ను కరుణించి నీబలవన్మరణప్రయత్నమును విడిచి పెట్టుము. ఇదియే నాప్రార్థన."

" రాజేంద్రా! వలదు వలదు. ఇంతపరాభవ మొందిన యీపాడు బ్రతుకుపై నా కాశ లేదు. నామనోనిశ్చయమును నేను మరల్పఁజాలను. ఎంతోకాలమునుండి యున్న నాసవతులకోర్కె నేఁడే చెల్లించెదను. ఆలస్యము సేయక తమ రింక నాకు సెలవొసంగుఁడు. కాని మహారాజా! మఱియొకమనవి. అంతభాగ్యము లేదు కాని ఒకవేళ చావుఁదప్పి నాకుమారుఁడే బ్రతికివచ్చినచోఁ బట్టెడన్నమును బెట్టి వానినిఁ బోషించు భారము తమరు వహింపవలయును. దిక్కులేని యేకాకినిఁ జేయక, కడకు తమద్వారపాలకునిగానైనఁ గైకొని యాదరింపవలయును. ఒకవేళ మాయమ్మ యేదియని తమ్మునడిగినచో నీనిర్భాగ్యురాలిమరణవార్త యెఱిగింపక మీపట్టమహిషులలో నెవ్వతెనైనఁ జూపి యీమెయే మీయమ్మ యని ధైర్యముఁ గఱపవలయును. దేవా! ఇదియే నాకడసారిప్రార్థన. "

అని మఱింతరోదనము సేయుచుండెను. అప్పుడు ధననందుఁడు " దేవీ! నేనెంత చెప్పినను నీసాహసమును విడువకున్నావు. నీవు నిజమైన పతిభక్తిగలదానవేయైనచో నామాట నతిక్రమింపక యిట్టి దుస్సాహసమును విడ

చిపెట్టుము లేకున్న నీయిష్టము వచ్చినట్లు చేసికొనవచ్చును. నాయపరాధము నేనేయొప్పుకొని పశ్చాత్తాపమొందుచుండ నింకను నన్ను కీల్బొమ్మవలె నాడించుట నీకు న్యాయముగాదు. జరిగిన దాని నింక దలంపకుము ఇఁక మీఁద నిన్ను నాప్రాణముతో సమానముగఁ జూచుకొనెదను. నీకట్టిలోపమైన రానిచ్చిన క్షత్త్రియపుత్త్రుఁడను గాను. దేవీ! యింతకన్న నీ కేమి కావలయును? "

అనుచు మెల్లఁగ దగ్గఱకుఁబోయి కౌఁగిలించి " ప్రాణేశ్వరీ! మాటాడవేమి? ఇంకను నీకు సందియమున్నదా? రాజ్యకార్యములయందు నాకింక వాంఛలేదు. ఆభారమంతయు నమాత్యరాక్షసున కప్పగించి నాకుమారునిచే నేలించుచు నేను నిరంతరమును నీయంతఃపురముననే కాలము గడిపెదను. చాలునా?"

" దేవా! నాకింతటి మహదైశ్వర్యము దేవరవారొసంగినచో నెవ్వరెవ్వరి కెంతకష్టముగ నుండునో?"

" అగుఁగాక — స్త్రీలమాటలు విని మాయలలోఁబడి మోసపోవుటకితఁడు పూర్వపుధననందుఁడు కాఁడు. నీకట్టి విచార మవసరము లేదు. వలయునేని నేనీరాత్రి యిక్కడనే భోజనముచేసి యుండిపోయెదను."

అనిచెప్పి ధననందుఁ డానాఁటిరాత్రి ఆమెయంతఃపురమందే కాలము గడపెను. బలే యిదియేకదా మురాదేవి తనకార్యస్థానమున బెట్టిన మొదటిపాదము ?.

ప్రకరణము ౭.

రెండవపాదము.

ధననందునివలలో వేసికొనిన తరువాత మురాదేవికిఁ గలిగిన యానందమునకు మితిలేక పోయినది. తన యజమానురాలికి భర్త వశుఁడైన తరువాత నామెను వసుభూతికి రహస్య సంభాషణార్థము భేటీకుదుర్చుటకై బృందమాల అంతగా ప్రయత్నింపలేదు. ఇంత సూక్ష్మముగ రాజున కమితానుగ్రహము కచ్చునని బృందమాలకూడ తోలుత నెఱుఁగదు. ఒక్క బృందమాలయే కాదు. ఈవిషయమాబాలవృద్ధ మందఱికి నాశ్చర్యముగఁ దోచినది. రాజమందిరమున నెక్కడఁజూచినను పలువురొకచోఁ గూడి గుసగుసలాడుకొనుటయే! ఎందుబోయినను మురాధననందుల పునస్సంధాన సంభాషణమే! పట్టమహిషులందఱికి నొక్కసారి రాజుపై నసూయయు విచారమును సంభవించెను. ధననందునకు మురాదేవి కాక ఎనమండ్రు భార్యలుండిరి. కుమారులు కూడ యువరాజైన సుమాల్యునితోఁ గలిపి ఎనమండుగురే! రాణులందఱుఁగూడ మురాదేవి యేదో తంత్రముఁజేసి తమభర్తను వశపఱచుకొనెనని చింతించుచుండిరి. ఇంతియ కాక రాజు తనకు వశుఁడగుటచేత మురాదేవి తమకుఁ బ్రత్యపకారమేదియో చేసి తమ కొంప ముంపక మానదని సవతులకు భయముగూడ జనించెను. కొందఱు భార్యలు మురదాసిని రాజుదగ్గఱకెందుకుఁ బోనిచ్చిరని ద్వారపాలురఁ గఠినముగ నడుగ వారందఱుఁ దమదోపమేమి లేదనియు, ఉత్తరము పట్టపుదేవి వ్రాసినదేయనియు తానుగూడ పట్టపుదేవి దాసియనియు బృందమాల చెప్పుటచేత విడువవలసి వచ్చినదనియుఁ జెప్పుకొని తమశిక్షఁ దప్పించుకొనిరి. మొత్తముమీఁద నీకారణమున రాజమందిరమంతయు నల్లకల్లోలమై సముద్రమువలె నుప్పొంగుచుండెను.

మురాదేవి తనకు మితిలేని యానందము చేకూరినను రవంతయైనఁ బైటికిఁ దోఁపనీయక ప్రవర్తించుచుండెను. ఆమె మూర్తీభవించిన ధర్మదేవతవలె మిక్కిలి శాంతభావముగలదై రాజునకుఁ దోఁచుచుండెను. దేనినైనఁ గూర్చి యతఁడు పదిసారులడిగిన నొకసారి ప్రత్యుత్తరమిచ్చునుగాని యధిక సంభాషణముమాత్రము సేయలేదు. భర్తసమీపమున నెల్లప్పుడును మొగము వంచుకొనియే కాని నిర్భయముగ నెప్పుడు మాటాడియుండలేదు. సవతులు తనపై నీర్ష్యవహించి కుతంత్రములు పన్నుచున్నారని తాను వినియు రాజునకుమాత్ర మెఱింగింపక అందుకుఁ దగు ప్రయత్నము సేయుచుండెను. ఆమె ప్రార్థనపై నారాత్రియే కాక మఱినాలుగురోజులవఱకు నీయంతఃపురముననే యుండెనని ధననందుఁడొప్పుకొనెను.

మఱునాఁడు మధ్యాహ్నమున ధననందుఁడు భోజనముఁజేసి కవాచీ మంచముపైఁ బరుండియుండెను. కన్నులు మూసికొనియే యుండెనుకాని నిద్రమాత్రము పట్టలేదు. వానిప్రక్కనే కూర్చుండి మురపాదములొత్తుచుండెను. తనభర్తకింకను నిద్రపట్టలేదను సంగతి యామెకుగూడ తెలిసేయున్నది. అప్పుడెవరో పరుగుపరుగున వచ్చుచుండినట్లు పాదముల చప్పుడు దూరమునుండియే వినఁబడ మురనలువంకలఁ జూడనారంభించెను. ఇంతలో నొక పరిచారిక యామె కట్టెదుటకువచ్చి నిలిచి యేమోచెప్ప నుద్యమించుచుండ మురయాగ్రహముతో "ఏమే? మూర్ఖచిత్తా! ఇప్పుడే రాజుగారికి నిద్రపట్టినదని యెఱుఁగవా? ఊరక కాళ్లు చప్పుడుచేయుచు నింతయాతురతతో పరుగెత్తి వచ్చుటకేమి కొంపమునిఁగిపోయినది? నాతో మాటాడుటకిప్పుడు నీకేమి యవసరము గల్గినది? నాతో నీవేమియుఁ జెప్ప నక్కఱలేదు. ఛీ! మహారాజుగారి యనుగ్రహముండ నెవరేమి యనుకొన్నను నాకు భయములేదు. అన్నను వారికెట్లు సమ్మతమగును? నావిషయమై వారందఱు

కొన్ని కుతంత్రములు బన్నినను నాకిఁక భయములేదు. నాపైని ద్రోహబుద్ధి వారు వహించిరిగాని నాకుమాత్ర మదిచేతఁగాదు. పతివ్రతనయ్యు నాబోటి యాఁడుది పడినకష్టములు వారెన్నఁడు ననుభవింపలేదు. కాని నాదురవస్థకు నాసవతుల నేమందును నిందింపవలయును? వారి కెంతమాత్రము నానుండి యసంతుష్టి కలిగింపవద్దని మహారాజుగారితో నిన్నరాత్రియే మనవిఁజేసికొన్నాను. మఱినీవేమియుఁ జెప్పకపో" అని పలుక నపరిచారిక మఱింత దగ్గఱకు వచ్చి మెల్లఁగ

"అమ్మా! తమకుఁ గోపమువచ్చుమాటలు నేనేమియును చెప్పను. నేనేమిచెప్పఁ దలంచితినో మీరు గ్రహింపలేదుకాని అది గొప్ప ప్రమాదకరమైన సంగతియే యనిమాత్ర మిప్పుడు చెప్పుచున్నాను."

"అట్టిసంగతి నీకేమి తెలిసినది. చెప్పుచెప్పు"

"రహస్యముగఁ జెప్పవలయును ఈసంగతి మహారాజుగారు వినరానిది భయంకరమైనది."

"భయములేదు చెప్పుచెప్పు మహారాజుగారికి నిద్రపట్టినదిలే."

అని పలుక నాపరిచారిక కొంతసేపువఱకు మురాదేవి చెవిలో నేమో రహస్యముగఁ జెప్పెను. అందుమీఁద నామె పరిచారికను గాంచి మండిపడుచు బిగ్గరగ

"ఆఁ—ఆఁ— ఏమిచెప్పుచున్నావు? మహారాజుగారనే? నాజీవితేశ్వరునే? పట్టమహిషులైయుండి వారికి దేమైన న్యాయముగ నున్నదా? ఇంతద్రోహమును సంకల్పించుకొనిరా? ఛీ ఛీ! ఇట్టిమాటలు చెప్పుటకా యిచ్చటకు వచ్చితివి? ఎవరేమేమి మాటాడుకొనుచుందురో విని నాతో చెప్పుచుండుటయా నీపని? నాయంతఃపురమున నున్నంతవఱకు మహారాజుగారిని త్రినేత్రుఁడైనఁ గన్నెత్తి చూడలేఁడు. వారికేమి సాధ్యమగును? సరే! అట్టులైనచో నీకముందు ప్రతివస్తువును నేను మొదటఁదిని చూచియే మహా

రాజుగారి కిచ్చుచుందును. ఇంతమోసము సమకట్టెదరని నేను కలలోనైన ననుకొనలేదు."

అని క్రోధదేవత తన్నావేశించినట్లు ప్రత్యుత్తరమిచ్చి యామెను పంపివేసెను. ధననందున కింకను నిద్రబట్టలేదని చదువరు లిదివఱకే యెఱుఁగుదురు? అతఁ డీమాటలన్నియు నతిజాగరూకతతో వినుచునే యుండెను. మొదట లేచి కూర్చుండి యాసంగతిఁ బ్రత్యక్షముగ నడిగి తెలిసికొనవలయునని యెంచెను కాని రహస్యముగ వినిన బాగుండునని యెంచి కపటనిద్రనభినయించుచు వారి సంభాషణమును కనుఁగొనుచుండెను. ఈసంగతి మురమాత్రము గ్రహించెను. కాని తనకపటనిద్ర నామెపోల్చుకొనెనని రాజెఱుఁగఁడు. అన్నిమాటలును చక్కఁగ నాలకించినను వారిరువురుఁ జెవిలో రహస్యముగ నేమి సంభాషించుకొనిరో ధననందునకుఁ దెలియదు. అందుచే నతఁడు లేచి కూర్చుండి మురను దగ్గఱకుఁ దీసికొని కన్నులు నులుముకొనుచు.

"ప్రియా! సుమతితో నీ వొనర్చిన సమాచారము మాత్రము వినలేదు. అందుపై నీవు క్రోధావేశమునఁ బలికినమాటలు విని నాకువిరోధమైన సంగతియే యని మాత్రము గ్రహింపఁ గల్గితిని. అదేదియో ఇప్పుడు చెప్పు."

అని యడుగ ముర భయముతో వణఁకుచు మొగము వాల్చుకొని యేమియును బ్రత్యుత్తరమీయలేక యూరకుండెను. అందుచే మరల ధననందుఁడు.

"సుందరీ! ఊరకుండెదవేమి? అన్నిసంగతులు నేను విన్నాను. నీవుచెప్పనక్కఱలేదు కాని సుమతి నీతో రహస్యముగఁ జెప్పిన సమాచారము మాత్రము నన్నుఁగూడ విననీ."

"ఆర్యపుత్రా! మీరాసంగతి నన్నడుగఁగూడదు. నేను చెప్పఁగూడదు. నన్నుక్షమింపుఁడు."

"ఎందుకు వినఁగూడదు? అది నా విషయమైన సంగతియేకదా? నేను విన్నచో నష్టమేమున్నది? చెప్పు చెప్పు"

"దేవా! వద్దువద్దు మఱినన్నడుగవద్దు. అకస్మాత్తుగ నిట్టిసంగతులు తమతోఁ జెప్పినచో నేమి యుపద్రవము జరుగునోయని నాకుభయమగుచున్నది."

"భయము లేదు నీకేమియు నాపద రాదు ఇంకఁజెప్పుము."

"తమయాజ్ఞ నతిక్రమింప లేక చెప్పవలయును గాని నాకు మాత్ర మిష్టము లేదు"

"సరే! అట్లనుకొన్నమైన నా కెఱిఁగింపుము"

అని నిర్బంధింప మురమిక్కిలి భయముతో మెల్లఁగ ధననందుని చెవిలో నేమేమో రహస్యము చెప్పెను. అది విని ధననందుఁడుగ్రుఁడై తనకను లెఱ్ఱఁజేసి విస్తారమైన యాగ్రహము వహించెను.

ప్రకరణము. 9.

ఒక యుత్తరము.

చాణక్యునకు వసుభూతితో దినదినము స్నేహమధికమగుచుండెను. అప్పుడప్పుడు బృందమాల వసుభూతివద్దకు వచ్చుచు మురాదేవి సమాచారమంతయుఁ జెప్పుచుండెను. పూర్వమువలెనే చాణక్యుఁడాయాసమయములు కనిపెట్టి వారిసంభాషణ యేవిధముగానైన వినుచుండెను. తన్నుఁ దప్పక రాజమందిరములోని కంపెద నని వసుభూతి ఖరారు చేసి చెప్పినందునఁ జాణక్యునకు మఱింత ధైర్యముగ నుండెను. వానిపై వసుభూతికి మిక్కిలి కరుణ జనించినది. ముందువెనుక లాలోచింపక తాను తటాలునఁ గోటలోనికిఁ బోయినయెడల రాజు కంటఁ బడిన నేమిముప్పువచ్చునో యని యెంచి చాణక్యుఁడు దూరముగానుండియే నగరులోనిసంగతులన్నియుఁ గనుగొనుచు నవసరము వచ్చినప్పుడు మాత్ర మొకసారి రాజమందిరమునకుఁ బోవలయు నని నిశ్చయించుకొనెను. ఇంతకును రాజసభలోనికిఁ బోవుటకు వానికేమి యావసరమున్నది? తనవిద్యఁ గనఁబఱచి రాజువద్ద బహుమానము పుచ్చుకొనుటకు చాణక్యుఁడు పాటలీపుత్రమునకు రాలేదని వేఱుగ వ్రాయనక్కఱలేదు. ఆతఁడు పోఁదలచినప్రదేశము మురాదేవియంతఃపురమే ఎట్టులైన నామెతో రహస్యముగ సంభాషించి తనవలలో వేసికొనవలయునని యాతఁడు తగుసమయముకొఱకు నిరీక్షించుచుండెను. సంగతులన్నియుఁ జూచి తనప్రతిజ్ఞ పూర్తియగుకాల మాసన్నమగుచున్నదని వానికి మఱింత ధైర్యము కలుగుచుండెను. అందుకుఁదగినట్లు తనలోఁ దగినయేర్పాటు లూహించుకొనుచు, చాణక్యుఁ డించుకైనను కాలము వృథాయొనర్ప లేదు. నందవంశమును వ్రేళ్లతోఁ బీకి పాఱవైచి ఆసింహాసనముపై చంద్రగుప్తునిఁ

గూర్చుండఁ బెట్టుటకుఁ జేయవలసినకార్యములలో ముఖ్యమైనది రాజమందిరమున గృహకలహము బుట్టించుటయే! అందు కిప్పటినుండియు, చిహ్నములు కనఁబడుచున్నవి కదా? భగవదనుగ్రహమున నీకార్యము త్వరలోనే నెఱవేఱు నని చాణక్యుఁ డనుకొనెను. తనకార్యములకు మురయొక్క సాహాయ్యముండిన మఱింత లాభకారి యని యెంచి చాణక్యుఁ డందుకొఱకు ప్రతిదిన మెదురుచూచుచుండెను. సోమవారమునాఁడు సాయంకాలము కైలాసనాథమందిరమునకు వచ్చినప్పుడు మురాదేవి దర్శనము చేసి యామెతో మాటాడవచ్చునని యానాఁడు సిద్ధార్థుఁ డుపాయముఁ జెప్పెను. కాని యందువలన వాని కేమియు లాభము గానరాలేదు. తన కామె దర్శనము కావలసినమార్గ మింకొకటి కాని యిది కాదు. అందుచే ఆప్రయత్నమును విడిచి మురను దర్శించుటకై వేఱువిధమైనమార్గము నూహించుచుండెను.

ఒకనాఁటిరాత్రి బృందమాల వసుభూతితో మాటాడి యింటికిఁ బోవలయునని యప్పుడే లేచెను. అంతవఱకును వారికి జరిగిన సంభాషణము వినుచుండిన చాణక్యుఁ డామె లేచుటఁ జూచి తానుగూడ వెంటనే లేచెను. ఏదో యనవసరమైన సంభాషణముఁ గల్గించి తన్ను విడువక వెంట వచ్చుచుండిన చాణక్యునిఁ జూచి బృందమాల యిట్లు ప్రసంగించెను.

“అయ్యా! తమరు నన్ను దిగబెట్టనక్కఱలేదు. చాలరాత్రియైనది. ఇంక రాక యింటికిఁ బోయి పరుండుఁడు. రేపు మాటాడవచ్చును.”

“బృందమాలా! నా కింకను నిద్ర రాలేదు. ఇంక నీతోఁ గొన్ని సంగతులు మాటాడవలయు నని వచ్చుచున్నాను.”

ఇన్నాళ్లనుండియు లేనియట్టియవసర మిప్పు డేల వచ్చినది?”

“అవును బృందమాలా! నన్ను క్షమింపుము. ఇన్నాళ్లనుండియు నే నెవఁడనో నీకుఁ జెప్పలేదు. నేను మురాదేవితండ్రియైన కిరాతమహారాజు

వద్దనుండి వచ్చితి నని నీ వెఱుఁగవు. తనకుమారిత పడినకష్టములఁ దలఁచి యాతఁడు పడినసంతాప మింతింత కాదు. కడకొకమాఱు మగధరాజుతో యుద్ధముఁ జేసి తనకుమార్తెను దీసికొనిపోవలయుననికూడఁ బ్రయత్నించెను. కాని ధననందునితో కలహమాడునంతసామర్థ్యము తనకు లేకుండుటచే నూరకుండవలసి వచ్చినది. పాపము మురాదేవితల్లి నిద్రాహారములు విడిచి తనయావియోగమున నూరక శుష్కించుచున్నది. ఆమె ప్రతిదినమును దనకుమారుఁడైన ప్రద్యుమ్నునితో “నాయనా! మీచెల్లెలిబ్రతుకు కడ కింతియేనా? కుమారా! ఏదైన నుపాయ మాలోచింపవా?” అని యేడ్చి చెప్పుచుండును. తల్లిగారి దుఃఖమును భరింపలేక ప్రద్యుమ్నుఁడు తనతండ్రితో నాలోచించి మురాదేవిని గూర్చి కొంత ప్రసంగించెను. అందుమీఁద కిరాతమహారాజు నన్నుఁ బిలిపించి కుమార్తె యోగక్షేమము లెట్లున్నవో కనుఁగొని రమ్మని నన్నుఁ బంపెను. యువరాజు పట్టాభిషేకమునకు రమ్మని ధననందుఁ డుత్తరముఁ ద్రాసెనుగాని కిరాతమహారాజు తనమనసు విచారముతో నుండుటచే రాలేదు. పట్టాభిషేకదినమునఁ దనకుమార్తెను విడిపించెనని విన్నచో కిరాతమహారాజెంత సంతసించునో నేను చెప్పలేను. మురతల్లిమాట యింకఁ జెప్పనక్కఱయే లేదు. ఇంక నీయూరిలో నుండవలసినపని నాకు లేదు. మురాదేవియొక్క యోగక్షేమములు నాకుఁ దెలిసినది కాని మురనొకమాఱైనఁ జూచివచ్చితివా లేదా యని వారందఱు నడిగినప్పుడు నే నేమి చెప్పఁగలను? ఆమె నొక్కమాఱు చూచిపోవుటదప్ప నాకింకేమియుఁ బనిలేదు. నేను నీతో కాక యింకెవరితోఁ జెప్పుకొందును? ఈయూరిలో నే నెవ్వరి నెఱుఁగనుగదా? బృందమాలా! ఈకార్యము నీవలననే కావలయు. అందుచేతనే దాఁపక నీతో మాత్రము చెప్పవలసివచ్చినది. కాఁబట్టి నేనొక యుత్తరమిచ్చెదను అది గొనిపోయి మురాదేవికొసంగుము. ఆమె నన్నెప్పుడు రమ్మని చెప్పునో నా కెఱింగించిననీ సహాయమున నప్పుడు రాజమందిరమునకు వచ్చెదను. తలిదండ్రులకును అన్నగారికి ఏమేమిమాటలు చెప్పునో కనుఁగొని నేను పోయెదను.”

"అయ్యా! అట్టులైన నిన్నాళ్లనుండియు నెందుకూరకుంటిరి?"

"ఏమి చేయుమనెదవు? వసుభూతిని నిన్నుఁదప్ప నేనీయూరిలో మఱెవ్వరి నెఱుఁగను. వసుభూతితో మాత్ర మీసంగతి చెప్పుట నాకిష్టముగా లేదు. నీవుఁగూడ వానితోఁ జెప్పకు. ఇదిగాక ఇతరులతో నీసంగతి చెప్పిన నెట్టులైన రాజుదాక పోక మానదు. రాజునకుఁ దెలిసిన యేమగునో యెవరు చెప్పఁగలరు? అతఁ డెంతకైన సాహసుఁడే కదా? ఒకవేళ కిరాతరాజునుగూడ శిక్షించిన శిక్షింపఁగలఁడు. ఇన్ని విధముల నాలోచించియే నీవు మంచిస్వామి నీభక్తిగలదాన వని విని నీతోఁ జెప్పితిని. కాఁబట్టి ఆమెకును నాకును భేటీ చేయవలెను. ఇది నీవలననే కాని యింకొకరివలనఁ గానేరదు. నేను వేగిరము బయలుదేఱి పోవలసియున్నది. మురాదేవి సౌఖ్యముగానే యున్నది. కానఁ మఱేమియుఁ జెప్ప నక్కఱలేదు. కాని అయినను ఒకమారు కండ్లతోఁ జూచినఁ దన పుట్టినింటివారి కేమేమి మాటలు చెప్పనో! అందుచే నీకొక యుత్తర మిచ్చెదను. అది దేవికిఁ జూపితివేని తనవారి క్షేమసమాచారములు జూచుకొని మిక్కిలి సంతసించును."

బృందమాల కేవలము నిష్కపటి కావునఁ జాణక్యునికపటము నణుమాత్రమయిన గ్రహింపలేకపోయెను. తన పుట్టింటినుండి యొక బ్రాహ్మణుఁడు వచ్చెనని చెప్పిన తన యజమానురా లెంత సంతసించునో యని యామె మురాదేవి కీసంగతి చెప్పుటకు త్వరపడుచుండెను. ఈసంగతి వసుభూతితోఁ జెప్పకుండుట మంచిదే యని యామెకుఁగూడఁ దోఁచినది. తరువాత బృందమాల చాణక్యునిఁ గాంచి

"అయ్యా! ఇంక నాలస్య మెందుకు? మీసెలవుప్రకారము నేను మురాదేవితో మాటాడెదను. మీ రీయఁదలఁచిన యుత్తర మిటు తెండు. తన పుట్టినింటిబ్రాహ్మణుఁడన్న నామె మిమ్ము వెంటనే రమ్మని కబురంపును."

అది విని చాణక్యుఁడు పెద్ద నవ్వు నవ్వి

"బృందమాలా! నీ వుండఁగ నింకను సందేహ మెందుకు? యజమానురాలిపై నీకున్న భక్తివిశ్వాసము లింకొకరికి లేవని నేను ధారాళముగఁ జెప్పగలను. నీబుద్ధికి నేనెంతయో సంతసించితిని. నీజీవితకాలమంతయు నిట్లే ప్రవర్తింపుము. నిన్నుఁ జూచినప్పుడే నాకార్యము పూర్తియైన దని సంతసించితిని. అబ్బా! నీకెంత భక్తి కుదిరినది? నేనొక్కఁడనే కాను సుమీ! నేనీయూరికి వచ్చినప్పటినుండియు వినుచున్నాను. ప్రతివారును నీ ప్రవర్తనమును శ్లాఘించినవారే. సరే కాని బృందమాలా! ఈసంగతులు మాత్రము నీ వెవరితోఁ జెప్పఁగూడదు సుమా? నీకన్న నేను బుద్ధిమంతుఁడనా యేమి? అందువలన నెట్టి నష్టములు గలుగునో నీవుమాత్ర మెఱుఁగవా? ఎట్లో మన మురాదేవి మరలఁ బ్రజలలోఁ బడ్డది. అదియే చాలును. ఇంతకన్న మనకేమి కావలయును? బృందమాలా! ఇంక నీవు వెళ్లు. ఇదిగో ఈయుత్తరముఁ గైకొని రాజులేనిసమయమున మురాదేవికిఁ జూపుము. ఇంతకన్న నేను చెప్పవలసినది లేదు. పాపము! నిన్ను చాలసేపు నిలిపివేసితిని."

అని చెప్పి చాణక్యుఁడు తన మొలలోఁ దాఁచియుంచిన యొకయుత్తరమును గైకొని తనయింటికిఁ బోవుచుండెను. నీపుట్టింటినుండి యొక బ్రాహ్మణుఁడు వచ్చె నని చెప్పిన, తన యజమానురా లట్టి శుభవార్తఁ జెప్పినందులకుఁ దన్నెంత మెచ్చుకొనునో యని బృందమాల విస్తరముగ సంతోషించుచుండెను. కాని ఎవరికంటఁబడకుండ నాయుత్తరమును గొనిపోయి దేవికిఁ జూపినదాఁక యామె కేమియును దోఁపలేదు. ఈసంగతు లేమైన రాజునకు దెలిసిన మోసము వచ్చు నని యామె భయపడుచుండెను. రాజుబుద్ధి ఒక్క క్షణములో మాఱిపోవునంతటి చంచలమైన దని యామె యెఱుఁగును. అందుచే మురాదేవితో మొదట రహస్యముగఁ జెప్పి అందుమీఁద ఆమె యెట్లు చేయు మన్న నట్లు చేయవలె నని యూహించి తిన్నఁగ నామె యంతఃపురమునకుఁ బోయెను.

ఎంత ప్రయత్నించినను బృందమాలకు మురాదేవితో రహస్యముగ మాటాడుటకు సమయము దొరకినదికాదు. ముర ప్రయోగించిన సమ్మోహనాస్త్రముచే ధననందుఁడు కట్టుబడి యామెకుఁ బూర్ణముగ వశుఁడై యొక్కక్షణమైన విడిచి యొంటరిగ నుండకుండెను. దినదినమును మురపై ధననందున కనురాగ మెట్లధికమగుచున్నదో రాజు భార్యలకు ఆమెపై నీర్ష్య యట్లధికమగుచుండెను. అందుచే రాజునకు వారిపై నసూయ పుట్టింపవలయు నని మురా సర్వవిధములఁ బ్రయత్నించుచుండెను.

ఇన్ని కారణములచేత నొంటిపాటున మురాదేవిదర్శనము బృందమాలకు లభింపలేదు. ఎట్టకేలకు మఱునాఁడు మధ్యాహ్నము రాజుగారు నిద్రించుచున్నప్పుడు బృందమాల వచ్చి మురను దూరముగఁ దీసికొనిపోయి చాణక్యుఁడు చెప్పినమాటలన్నియుఁ జెప్పి యాతఁడిచ్చినయుత్తర మామెకొసఁగెను. ముర ఆమాటలన్నియును విని ఆయుత్తరమును జదువుకొని ఇన్నాళ్ళవఱకును తనవిషయమై యుపేక్ష జేసినందులకుఁ దన పుట్టినింటివారిపై నిష్ఠురములాడి వెంటనే చాణక్యుని దీసికొనిరావలయు నని బృందమాల కాజ్ఞాపించెను.

ప్రకరణము. 10.

ఏమిమాటలు జరిగెను ?

మురాదేవి చెప్పినమాట చాణక్యున కెప్పుడు చెప్పుదునాయని బృందమాల తొందరపడుచుండెను. ఉత్తరముఁ జదువునంతసేపు మురముఖలక్షణము లనేకవిధముల మాఱినందున నందులో వ్రాయఁబడిన సంగతులేమై యుండునో యని బృందమాల యాతురతతో నుండెను. కాని మురమాత్ర ముత్తరమంతయుఁ జదివిన తరువాత నామెతో నావిషయ మేమియుఁ జెప్పక "బృందమాలా! నీ కీబ్రాహ్మణుఁ డెక్కడఁ గనఁబడెను. వీనికి నీకును బరిచయ మెట్లు కలిగెను? నీ కీయుత్తర మెప్పుడిచ్చెను?" అని తొందర తొందరగ నొకమారనేకప్రశ్నలడుగ బృందమాల యుక్తరీతిని జవాబులొసంగి యామెను దృప్తిపఱచెను. ఇఁక బృందమాల చేయవలసిన ముఖ్యమైనపని రాజునకుఁ దెలియనీయకుండఁ జాణక్యు నంతఃపురములోనికిఁ దీసికొని వచ్చుటయే! ఇదియే తనకుఁ గష్టసాధ్యమైనకార్య మని బృందమాల యాలోచించుచుండెను. కార్యనిర్వహణమునందు తన యజమానురాలు మిక్కిలి నేర్పరి కావున నామె నుపాయమడిగి చాణక్యునిఁ గొనివచ్చి యజ్ఞశాలయం దుంచుటకు నిశ్చయించెను. అందువలన మురాదేవి సమయముఁ గని పెట్టి రాజు నిద్రించునప్పుడైనను మఱెప్పుడైనను నాతఁడెఱుఁగకుండఁ జాణక్యునితో మాటాడవచ్చును. అందుచే నాలస్యము సేయక ఆమె వెంటనే బృందమాల నంపి యాతనినిఁ దోడ్కొనిరమ్మని యాజ్ఞాపించెను. దేవియాజ్ఞ శిరసావహించి బృందమాల యప్పుడే బయలుదేఱినది కాని వసుభూతి వినకుండఁ జాణక్యునితో మాటాడుటకు సమయమగునో కాదో యనిమాత్రము సందేహించుచుండెను. ఇది గాక ఆమె బయలుదేఱినది మధ్యాహ్నసమ

యము. బృందమాల యెన్నఁడు నట్టివేళలయందుఁ దన యాశ్రమమునకు వచ్చు నలవాటు లేదు. అందుచే నేకారణమున నిప్పుడు వచ్చితి వని వసుభూతి యడుగకపోఁడు, అప్పుడు వాని కేమి సమాధానము చెప్పి తప్పించుకొన వలయునో యని యామె పరిపరివిధములఁ దలపోయుచుండెను. కాని తన యదృష్టవశమున నామె పోవుసరికి భిక్షుఁ డింట లేఁడు. అతఁడు శిష్యులతోఁ గూడ భిక్షకై బయలుదేఱి యుండెను. అందుచే మంచిసమయముననే వచ్చితి నని బృందమాల సంతసించుచుఁ జాణక్యుని సమీపించి వినయముతో "ఆర్యబ్రాహ్మణులైన తమను అంతఃపురములోనికి విచ్చేయవలయు నని మాదేవి గారియాజ్ఞయైనది. తమకు రాజమందిరమునఁ గలయజ్ఞశాలలో బస యేర్పఱుపఁబడెను. తమ దేవతార్చనఁగూడ అచ్చటనే చేయవచ్చును. స్వయంపాకమా? లేక యజ్ఞప్రసాదము పుచ్చుకొనెదరా? తమయిష్ట మెట్లో అట్లే చేయవచ్చును. సమయముఁ గనిపెట్టి దేవిగారు తమదగ్గఱకు వచ్చి మాటాడెద మని చెప్పిరి" అని యెఱింగింపఁ జాణక్యుఁ డత్యాశ్చర్యమును బొందెను. ముర తనతో మాటాడ రమ్మని కబురంపుట తనకు సంతోషకరమయినదే యయ్యును బృందమాల చెప్పినమాటలలోఁ దనకు విరుద్ధవాక్యములు కొన్ని యుండుటచే నతఁడు మొగముఁ జిట్లించుకొని తనలో "ఇప్పు డేమిచేయవలెను? నిండుకొలువులో సత్యాసత్య విచక్షణ లేక నన్నుఁ బరిభవించినందున, నేధననందుని రూపుమాప నెంచితినో? ఏ ధననందుని వంశమంతయుఁ జిన్న మొలకయైన లేకుండ నిర్మూలముఁ గావించి క్షితిపాలివ్వైవ నెంచితినో? ఏధననందుని సింహాసనముపై మత్ప్రతిజ్ఞాపూర్తికై నాముద్దుశిష్యుఁ డగుచంద్రగుప్తునిఁ గూర్చుండఁబెట్ట నెంచితినో! ఆధననందుని యింటనే ప్రవేశించి ఆధననందునియన్నమే భుజించుచు నాకార్యముఁ గొనసాగించుకొనవలసివచ్చెనుగదా? ఛీ! ఛీ! ఈవిధమున నా పనులు గాకున్న నింకొకమార్గమునఁ బ్రయత్నించెదఁగాక. అంతియ కాని రాజమందిరమున యజ్ఞశాలలో మాత్రము ప్రవేశించి ఆయన్నము నేను భుజింపఁజాలను. ఇంతియకాక నా కిందుమూలమున నింకొకయాపదగూడ రావచ్చును. నేను యజ్ఞశాలలో బసచేసినచో నచ్చటిబ్రాహ్మణు లెవరైన

నన్నుఁ గుర్తింపకపోదురా? రాజుచే నవమానింపఁబడి దారుణమయిన ప్రతిజ్ఞఁజేసి నే నీపాటలీపుత్రమును విడిచిపోవుట యెన్నోదినములు కాలేదు. నేనానాఁడు చేసినప్రతిజ్ఞ నంతగా నెవ్వరును లక్ష్యింపకపోయినను నేనే యీ యజ్ఞశాలలో నున్నానని తెలిసిన మోసము రాకమానదు. కావున నే నెంతమాత్ర మచ్చట బసచేసి యుండరాదు." అని తనలో నిశ్చయించుకొని మెల్లఁగ బృందమాలతో "బృందమాలా! నే నిప్పుడు నీతో రాఁజాలను. సాయంకాలము మాత్రము బయలుదేఱి యజ్ఞశాలలోనికి వచ్చి నేటిరాత్రి యంతయు నందే యుండి మరలఁ దెల్లవారు జామున లేచి బయలుదేఱెదను. కాని అక్కడ బసచేయుట నా కెంతమాత్రము నిష్టము లేదు. భగవాన్ కైలాసనాథుని మందిరముకన్న నా కాయజ్ఞశాల యెక్కుడది కాదు. సాయంకాల సంధ్యావందనాది కృత్యములు నిర్వర్తించుకొని నేను బయలుదేఱి వచ్చెదను. అప్పుడు నీవు నన్నుఁ గలసికొని లోనికిఁ దీసికొని వెళ్లుము."

అని పలుక బృందమాల వానివ్యతిరేకపుమాటలకుఁ గొంచెము వ్యసనపడి యెట్టకేల కట్లే యని యంగీకరించి వానివద్ద సెలవుఁగైకొని తాను బయలుదేఱి అంతఃపురమునకుఁ బోయెను కాని వెంటనే మురాదేవి కీసంగతి చెప్పుటకు సమయము చిక్కలేదు. అందుచే నామె సాయంకాలమువఱకు నామెదర్శనమునకై వేచియుండి యప్పటికిని లభింపనందున చాణక్యుఁడు వచ్చి తనకై యెదురుచూచుచుండునేమోయని రాజమందిరద్వారముకడకు వచ్చి యచ్చట నెదురుచూచుచుండెను.

సంధ్యాకాలోచితకృత్యంబులు నిర్వర్తించుకొని కొంతసేపునకుఁ జాణక్యుఁడు వచ్చి బృందమాలను కలుసుకొని ఆమెతో నేమో కొన్ని సంగతులు మాట్లాడెను. బృందమాల వానికిఁ దగినప్రత్యుత్తరము లిచ్చి యజ్ఞశాలకు తిన్నగ తీసుకొనిపోయి అందు విడిచెను. బృందమాల తన్ను విడిచి

పోయినతరువాత చాణక్యుఁడు మురాదేవిరాకకై యెదురుచూచుచు నచ్చటనే కొంతవఱకు కాలముగడపెను.

అచ్చట నంతఃపురములో మురాదేవి బృందమాలవలనఁ జాణక్యుని రాక యెఱింగినదయ్యు రాజు తన్నొక్కనిమిషమైన విడచియుండని కారణముచేత వెంటనే పోయి అతనితో మాటాడ వీలులేకపోయినది. ఆమె ప్రయోగించిన సమ్మోహనాస్త్రముచేత రాజు బద్ధుఁడై ఆమెకుఁ బూర్తిగ వశుఁడయ్యెను. లోకమంతయు నాతనికి మురాదేవితోడనే యుండెను. అందుచే వాని విడిచి పోవ వలనుపడక ఆనాఁటిరాత్రి ధననందుఁడు భోజనముచేసి పరుండువఱకును వేచియుండి అతఁడు నిద్రించిన తర్వాత మురాదేవి బయలుదేఱి బృందమాలను సహాయముగఁ దోడుకొని యజ్ఞశాలకుఁ బోయెను. ఆనాఁటిరాత్రి చాణక్యుఁడును మురాదేవియును నాయజ్ఞశాలయందు దూరమున నొకరహస్యప్రదేశమునకుఁ బోయి చాలసేపువఱకు అతిరహస్యముగ తమలో కొన్నిసంగతులనుగూర్చి సంభాషించుకొనిరి. ఏమేమిసంగతులు మాట్లాడుకొనిరో యిప్పటికి మనకుఁ దెలియదు కాని సంభాషణానంతరము మురాదేవి తనయంతఃపురమునకుఁ బోవుచు ఒక్కమారు వెనుకకుతిరిగి చాణక్యునితో "నేను చెప్పినసంగతులనుమాత్రము మఱువవద్దు. నాకు నీవంటివానిసాహాయ్యము దొరకుటకన్న నింకేమి కావలయును? నీవు తోడుపడినచో నాప్రతిజ్ఞ తప్పక పూర్తియగును. అందు కిదివఱకే కొన్నియేర్పాటులుచేసియున్నాను. కాని మరల మిమ్ము కలుసుకొని మీతో మాటాడుటకు సమయము దొరకునో దొరకదో అని సందేహముగ నున్నది. అయినను రేపు ఒకసారి రండు. ఆలోచింతము" అని చెప్పి మురాదేవి రాజు మేల్కొనునేమో యనుభయముచేత తటాలున అంతఃపురములోనికిఁ బాఱిపోయెను. ఇంతవఱకును బృందమాల తాను దూరముగనుండుటచేత వారేమేమి మాటాడుకొనిరో యెఱుగదు గాని మురాదేవి పలికినకడసారిపలుకులు వినినంతనే ఆమెహృదయము అల్లకల్లోలము కాఁదొడఁగెను. మాటిమాటికి దేవిమాటలే యుచ్చరించుచు

తనలో "ఇది యేదోయొకయుపద్రవమువలె కనఁబడుచున్నది. ఇంటికిఁ బోవునుఁ జాణక్యునితో మురాదేవి చెప్పినమాటలకు నాకేమియర్థమే కాలేదు.................అర్థము కాకేమి? ఆమె చేసినప్రతిజ్ఞ నేనెఱుఁగనా? ఆమె ప్రయత్నములు నాకు క్రొత్తవియా? ....ఛీ! యెంతచెప్పిన నేమిలాభమున్నది? రాజు మరల తన్ను చేరదీసి అత్యాదరమున నేలుకొనుచున్నను తాను పట్టినపంతము మఱవకున్నదిగదా! ఇది యెఱుక తాను కొన్నియేర్పాటులు చేసినదఁట. అవి యేమియేర్పాటులో? ఎందుకొఱకో?......సరే! తెలిసినది" అని బృందమాల సందేహనిమగ్నయై పరిపరివిధములఁ దలపోయఁజొచ్చెను. సత్యవర్తనమునందేమి రాజభక్తియందేమి తదితరసుగుణసంపదలందేమి రాజమందిరమునఁ గలపరిచారికలెవ్వరును బృందమాలకు సాటికారు. కపటవర్తన మన ఆమె కలలోనయిన నెఱుంగదు. అబద్ధము లాడుటయందు ఆమెకుఁ గలభయము విపరీతము. ఈమెస్వభావ మిట్టిదని మురాదేవి మొదటినుండియు చక్కఁగ నెఱిఁగియే యుండెను. అందుచేతనే యేవైనకపటకృత్యములు చేయవలసివచ్చినప్పుడు ఆయాకార్యములయందు ఆమెను నియోగింపకపోవుటయే గాక బృందమాలతో చెప్పనైన చెప్పక యింకొకదానిచేత చేయించుకొనుచుండెను. ఒకవేళ చేయుమన్నను అట్టికార్యములకు బృందమాల అంగీకరించునదికాదు. బలవంతపెట్టి చేయించినచో ఆకార్యమును బయటపెట్టి కపటవర్తనమందు నేర్పు లేకపోవుటచేత ధ్వంసమొనర్చుచుండును. తనపై భక్తివిశ్వాసములు గలిగినబృందమాలవంటిదాని యింకొకతె లేకపోయినను మురాదేవి ఆమెనైజము కనిపెట్టినదగుటచేత తాను చేయఁదలంచినకార్యములలో ఆమెసహాయము లేశమైనను కోరలేదు. ఎవరితోడనైన రహస్యముగ మాటలాడవలసివచ్చినప్పుడు ఆమెను దూరముగానే యుంచుచుండును.

ఆనాఁడు మురాదేవినోటనుండి వెలువడినకడసారిమాటలు బృందమాలయొక్కహృదయముభేదించుచు ఆమెను పలువిధముగ కలఁతపెట్టు

చుండెను. "ఆహా! ఆనాఁడు యువరాజు పట్టాభిషేకమున దుఃఖాతిశయమున తానుచేసినప్రతిజ్ఞ యింకను మురాదేవి విడువకున్నదిగదా' ఆమె నాతో చెప్పినట్లే రాజును పూర్ణముగఁ దనవశముఁజేసికొని తనవలలోఁ వేసుకొనెను. ఆమె పలికినప్రతిజ్ఞావచనములును ఇప్పుడు బ్రాహ్మణునితో నన్నకడసారిమాటలును బట్టి జూడ వారేమేమి మాటలాడుకొనిరో అసంగతులన్నియు బోధపడినది. అక్కటా రాజవంశమున నెట్టియుపద్రవము జరుగనున్నదో కదా! పాటలీపుత్రమున కేదో యొకగొప్పయరిష్టము రానున్నదని యిదివఱకే వసుభూతి నాతో అప్పుడప్పుడు చెప్పుచుండెను. ఇదియే నిజ మగునుకాఁబోలు." అని దుఃఖించుచు స్తంభమువలె నట్లే నిలిచిపోయెను.

ప్రకరణము. 11.

చాణక్యుని కార్యస్థాపనము.

తోలుబొమ్మవలెఁ దన్నాడించుచుండుటచేత ధననందుఁడు మురకుఁ బూర్ణముగ వశుఁడయ్యె నని మాచదువరల కిదివఱకే తెలిసియున్నది. ఆమె పవిత్రమయినరాజకులంబున జనించినకన్యకయే యనియు, పాపము కారణముగ నామెకుమారుని జంపించి యంతకాలము చెరలో నుంచి నానాకష్టములు బెట్టినాననియు, నప్పుడప్పుడు తలఁచుకొని ధననందుఁడు తనలోఁదానె మిక్కిలి పశ్చాత్తాప మొందుచుండెను. ఆమెస్వభావము కల్మషమైనది గాక మిక్కిలి నిర్మలమైనదే యని యాతనికి నమ్మకము దోచినందున ధననందుఁడు మురాదేవిని శాశ్వతముగ నేలుకొనవలె నని నిశ్చయించుకొనెను. ఆనాడు తాను కపటనిద్రయం దున్నప్పుడు సుమతితో మురాదేవి సంభాషించినవిధముఁ గనిపెట్టినందున మురయందు మరింతయధికానురాగమును మహారాణులపై నపరిమితమైనయీర్ష్యాభావమును రాజున కొక్కమారు జనించినవి. తనభార్య లందరుఁ దనప్రాణముపైఁ గుట్రలు పన్నుచున్నా రని తెలిసినప్పుడే వారందఱిని విడిచిపెట్టి కలలోనైన వారిమొగములు జూడకూడ దని ధననందుఁడు పట్టుపట్టెను. కాని మురమాత్ర మంతులకంగీకరింపక "మహారాజా! పరిచారికలు చెప్పినమాటలు మనము విశ్వసింపరాదు. వారిమాటలు నిజములో అబద్ధములో ఎవరెఱుఁగుదురు? ఆసుమతిమాత్ర మెన్నఁడు నసత్యము లాడుస్వభావము కలది కాదు కాని, దాని కావలో యీ లేనిపోనిసంగతులు కల్పించి చెప్పియుందురు. ఇంతమాత్రము ముందువెనుక లాలోచింపక తొందరపడి మీ రేకార్యమును జేయవద్దు. ఇదివఱకు నా కైనశిక్షయే చాలును. నిర్భాగ్యురాల నగునేను పడినకష్టములు ఎట్టి

వారికైనను గోరను. ఒకవేళ నిజముగానే మీ కేదైననాపద రానున్నయెడల, మీకుమాత్ర ముపాయము దెలియదా? ఇప్పుడీవిచారమెందులకు?" అని చెప్పుచుండెను. అట్టిమాటలు వినినప్పుడెల్ల ధననందుఁడు అత్యాశ్చర్యమొందుచు మురనిక్కమైనసాధువర్తనఁ గలదనియు, కేవలము నిష్పక్షపాతి యనియు, విస్తారదయాశీల యనియు, ధర్మదేవత యనియు, భావించి యామెను లోలోనె మెచ్చుకొనుచుండెను. పాపము మురవట్టి బేల యనియే వానియభిప్రాయము అందుచే "ప్రాణేశ్వరీ! నీవు చెప్పినదాఁక నూరకుండెదనుగాని నేను నీయెడ నత్యంతప్రేమతో నున్నాఁడ నని సహింపలేక నాయెడ నెట్టిద్రోహము సంకల్పించుకొనెదరో! సరే! అయిననేమిలే? సుమతి చెప్పినదంతయు నిజమేకాని అందు కేదైననిదర్శనము వచ్చుదాఁక నీవు చెప్పినట్లూరకుండెదను." అని ధననందుఁ డామెకుఁ బ్రత్యుత్తర మిచ్చుచుండెను. అందుమీఁద మురాదేవి తనతలఁచినకార్యము లన్నియు నిరాటంకముగఁ గొనసాగు నని యమందానంద మొందుచుండెను. తాను గావింప నున్న సాహసకృత్యములు తనహృదయమునకుఁ దప్ప నితరుల కెవ్వరికిని తెలియనీయకూడ దని యామెయుద్దేశము. ఇంతియకాక మనోనిశ్చితకార్యమున కెట్టిభంగములు వచ్చినను విడువక సవతులవిషయమై చేయవలసినయేర్పాటు లన్నియు జాగరూకతతోఁ జేయుచుండెను. ఆమెకుఁ జాణక్యుఁ డొకఁడు కుడిభుజమై యున్నవాఁడు కదా?

ఆనాఁ డతిరహస్యముగ మురాదేవితో ప్రసంగించిన తరువాత చాణక్యునకుఁ గల్గిన యానందమునకు మితిలేకపోయినది. పాటలీపుత్రమునకు వచ్చినతరువాత తనకార్య మింత త్వరలోఁ జక్కనగు నని యాతఁడు తొలుత ననుకొనలేదు. "వాహ్వా! భగవాన్కైలాసనాథుని యనుగ్రహము నాపై పూర్తిగ నున్నది. నిశ్చితకార్యనిర్వహణమునందు మురాదేవియొక్క సహాయముకన్న నాకింకఁ గావలసిన దేమున్నది? చెప్పవలసిన మాటలన్నియు నామెతోఁ జెప్పితినిగాని యొక్కసంగతిమాత్రము దాచియుంచవలసి వచ్చినది. అయ్యో! అదికూడఁ దెలియఁజేసినచోఁ బాపమాయిల్లా లెంత

యానందించునోకదా? ఇదికాక పదునారుసంవత్సరముల క్రిందట జరిగిన శుభవార్త చెప్పిన నామె విశ్వసించునా? నగతాళి యనుకొనునేమో? ఒక్క ఆమెయే కాదు. ఇంతకాలమునుండియు రాజుచే బలవంతముగఁ జంపఁబడె నని తలంపఁబడుచున్న రాకుమారుఁడు చావుఁ దప్పి సజీవుఁడై యున్నాఁడన నెవరుమాత్రము విశ్వసింతురు? ఆశ్చర్యమే కదా? అయినను ప్రస్తుత మాసమాచారము మురయెడలఁ దలపెట్టుకుండుట మంచిపనియే చేసితిని. ఎప్పటి కెంతయవసరమో అంతకన్న నధికము ప్రసంగింపఁగూడదు కదా? అట్టితరుణము ముందుముందు రాఁగలదు.................. ఆమె మరల రేపు నన్ను రమ్మని చెప్పెను కాని నేనిఁక వచ్చుటకు వీలులేదు. ఇంతవఱకు నన్నెవ్వరు నీయూరిలో పోల్చుకొనలేదు. చీటికిమాటికి రాజమందిరమునకు వచ్చుచుఁ బోవుచున్న నెవ రేమి యనుమానించెదరో? రాజుగాని తదాస్థానపండితులుగాని నన్ను గుర్తెఱింగిన నెట్టియపాయమైన రావచ్చును..........ఆఁ...ఏమిది? సర్వజనసమ్మధ్య మగు ప్రతిజ్ఞఁ గావించి నే నిట్లు భయపడవచ్చునా? అందఱు చూచుచుండగ నెల్లవారి కన్నులయందు నిసుగఁజల్లియే యీప్రచండచాణక్యుఁడు తనశపథము నిర్వర్తించుకొనును. అట్లు చేయలేనియెడ నేను బ్రాహ్మణుఁడనే కాను. ఇది నారెండవప్రతిజ్ఞ! ....వసుభూతితోఁగూడ నింకముం దేమియు నధికప్రసంగముఁ జేయఁగూడదు. కిరాతమహారాజుగారు పంపినబ్రాహ్మణుఁడ ననియు, మురాదేవినిఁ జూచుటకై వచ్చితిననియు మాత్రముచెప్పి యిదివఱకును దాఁచియుంచినసంగతులు దాఁచియే యుంచెదను. వసుభూతినుండిగాని యాతని శిష్యులనుండిగాని ముందుముందు నేను గొప్పసాహాయ్యమును గోరవలసియున్నది. అందుల కిప్పటినుండియుఁ బాచికలు వేయవలెను."

అని చాణక్యుఁడు తనలోఁ గార్యాలోచన మొనర్చుకొని, వసుభూతిని కలసికొనెను. ఇన్నాళ్ళవలెఁగాక చాణక్యుని ముఖలక్షణములు కొంచెము మాఱి యొకవిధమైనయుత్సాహమును సూచించుచుండుట వసు

భూతి వెంటనే కనిపెట్టెను. అప్పుడు చాణక్యుఁడు వసుభూతిని దగ్గఱకుఁ బిల్చి యిట్లు ప్రసంగింప నారంభించెను.

"అయ్యా! మీతో రహస్యములైన కొన్ని సంగతులు మాటాడవలసి యున్నది. ఇది సమయమగునా!

"సమయము కాకేమి?

"మీరు ధర్మస్వరూపులు సత్యప్రియులు ఇంతకాలము వఱకుఁ దమకు నాసంగతి చెప్పకుండుటవలన నన్నుఁ దమరు క్షమింపవలయును."

"బ్రాహ్మణోత్తమా! క్షమింపుటకేమున్నది? మీరు సందేహింపవలదు. పరస్థానమునకు వచ్చినప్పుడు సాధ్యమైనంతవఱకు గుప్తముగఁ బ్రవర్తింపవలయుననియే నాయభిప్రాయము. ఇంక మీరు చెప్పఁదలచినది చెప్పవచ్చును."

అని వసుభూతి సమాధానముఁ జెప్పెనుకాని అధర్మమును అసత్యము నెన్నఁడును నెఱుంగని వసుభూతి యెడల ననృతము లాడవలసివచ్చినందుకుఁ జాణక్యుఁ డెంతయో విచారించి యేదో చెప్పఁబోవుట కుపక్రమించుచుండ నింతలో బృందమాలకూడ నచ్చటికే వచ్చెను. అప్పుడు చాణక్యుఁడు వసుభూతితో

"అయ్యా! నే నెవఁడనో తమకుఁ దెలియదు. మురాదేవి తండ్రియైన కిరాతమహారాజు తనకుమార్తెయొక్క యోగక్షేమము లరసిరమ్మని నన్నిచ్చటకుఁ బంపినాడు. తమరు నన్నుగుఱించి యెట్లుచెప్పితిరో అట్లే యీబృందమాల తన యజమానురాలి దర్శనము నాకుఁ జేయించెను. మీ యిరువురి ఋణమును నేను తీర్చుకొనఁ జాలను. మీవద్ద సెలవుఁ దీసికొనుచున్నాడను. ఇచ్చటకు వచ్చి చాలదినములైనవి. కిరాతమహారాజు

నాకై యెదురుచూచు చుండును. మురాదేవి యన్నగారైన ప్రద్యుమ్నుఁడు తన కుమారుని ఈపాటలీపుత్రమునకే పంపి యిచ్చటనే విద్యనేర్పింపవలయునని యనుకొనుచున్నాఁడు. ఇంతియకాక వాని సంరక్షణమునకు నన్నే పంపునట్లు అప్పుడప్పు డతఁడు నాతోఁ జెప్పుచుండెను. అదియే నిక్కమైన యెడల మరల కొన్నిదినములలోనే తమ పునర్దర్శనము నాకు ప్రాప్తమగును."

అని తన చరిత్రమును చెప్ప వసుభూతివిని యెంతయో సంతసించెను. కాని బృందమాలమాత్రము తొలినాఁటిరాత్రి మురాదేవి పలికిన కడపటి పలుకులఁ దలఁచుచు నాసంగతినిఁ గూర్చి యడిగినచోఁ జాణక్యుఁడు తన సందేహమును తీర్చునో తీర్పఁడోయని యాలోచించు చుండెను. తనకెట్టి సమాధానముఁ జెప్పునోయని యెట్టకేలకు బృందమాల వానింజూచి.

"అయ్యా! నిన్నరాత్రిమీరు వచ్చుచున్నప్పుడు మాదేవి మీతో చిట్టచివర కొన్ని మాటలుచెప్పినది. వానిని నేను సగము మాత్రమే విన్నాను. అప్పటినుండియు నీవిషయమునుగూర్చి మిమ్మడుగవలెనని యనుకొనుచున్నాను. దయచేసి యామె యేమిచెప్పినదో సెలవిచ్చెదరా?"

"అహ్హా-హ్హా-హ్హా-బృందమాలా! నీవు మిక్కిలి గట్టిదానవుసుమా? నీకిట్టి యనుమానమెట్లు కలిగినదో తెలియకున్నది. జననీజనకులకును, అన్నగారికిని, తన క్షేమములఁ జెప్పుమనియు, తానుసుఖముగనున్నాననియు, అప్పుడప్పుడు ఉత్తరములు వ్రాయుచుండవలయుననియు, నింక ననేక సంగతులు చెప్పవలయునని ఆమె నాకాజ్ఞాపించెను. పుట్టినింటివారి కింతకన్న నేమి సమాచారము లంపెదరు?"

"ఛీ! ఛీ! యిది యెంతమాత్రమును కానేరదు. ఆమె తానేదో ప్రతిజ్ఞ చేసినదఁట, ఎందుకో మీసహాయము కావలెనఁట, ఈమాటల కేమి యర్థము చెప్పెదరు?"

"బృందమాలా! నీకు ద్వంద్వార్థములఁ దీయుటకుఁగూడ నేర్పున్నదని నే నెఱుఁగనుసుమా! ఆమాటలయందేమి తప్పున్నది? చాల కాలమైనందునఁ దన తలిదండ్రుల నొకసారి చూడవలయునని యామె కోరి యాసంగతి వారితోఁ జెప్పి యొకసారి తీసికొనిరమ్మని యామె నన్నుఁ బ్రార్థించినది. ఎన్నియో కష్టములుపడి సుఖించినఁ దన్నుఁజూచుటకుఁ దన తలిదండ్రులు రానిచోఁ ఇఁక వారి మొగ మేజన్మమునందును జూడనని యామె ప్రతిజ్ఞ చేసినది. వారితో నెట్టులైనఁ జెప్పి బోధించి తనవద్దకొకసారి బంపుటయే యామె నాకలనఁ గోరిన సాహాయ్యము. ఇప్పుడర్థమైనదా?"

అని చెప్పెనుకాని బృందమాలమాత్రము సమాధానపడలేదు. అందుచే పెదవివిఱిచి, నందవంశమును నాశనముఁజేసి మగధ సింహాసనముపైఁ దన పుట్టినింటివారిలో నెవనినైనఁ గూర్చుండఁ బెట్టెదనని నాఁడు మురాదేవి చేసిన ప్రతిజ్ఞ జ్ఞాపకము దెచ్చుకొని బృందమాల మఱింత సంతాపమొందెను. ఇంక తానెట్టి సంగతులడిగినను, చాణక్యుఁడు తన కిట్టి ప్రత్యుత్తరములే యిచ్చునని యెంచి మఱి వాని నేమియు నడుగ కూరకుండెను. వారిరువురివద్ద సెలవుఁగైకొని చాణక్యుఁడు వెంటనేబయలుదేఱెను. అట్లు బయలుదేఱిపోవుచుఁ దన హృదయమున నెన్నియో సందేహములు గలిగినందునఁ జాణక్యుఁడు.

"ఇదివఱకు జరిగిన సంగతులన్నియు బాగానేయున్నవి. ఇకముందు సమాచారము మాత్రము చూచుకొనవలయును. ఇప్పటికి మురాదేవి నాకుఁ గావలసినంత సాహాయ్యమొనర్చునట్లే తోఁచుచున్నది. ముందుముం దెట్లుండునో? సరే దీనికేమి వెనుకనుండి యాలోచింపవచ్చును. కాని నింక చంద్రగుప్తుని గుఱించి కొంత యోచింపవలసియున్నది. వానిని బాటలీపుత్రమున కెట్లు తీసికొనిరాఁగలయును? ముఖ్యముగాను చక్రవర్తి చిహ్నములుండినసరియా? శరీరమున నందుకుఁ దగిన వస్త్రాభరణములు కూడ నుండవలయుఁగదా? వాని నెక్కడనుండి తెచ్చెదను? నేనా గర్భదరిద్రుఁడను

నాచేత నొక చిల్లిగవ్వయైన లేదే? రాజచిహ్నములగు శస్త్రాస్త్రములుగాని, కిరీటముగాని, యుచితాంబరాలంకారములుగాని లేకున్నచో, ప్రజలు వాని నెట్లు గౌరవింతురు? వానిపై వారందఱికెట్లు మోహముపుట్టును? తగిన వేషము లేకున్న యెడల వానికెంత చతురతయున్నను, ఎంత ధనుర్విద్యా నైపుణ్యమున్నను, ఎంతవిద్యయున్నను నది రాణించునా? ఆర్యులు వేషభాషలనికదా చెప్పిరి? మొదట వేషమును తరువాత భాషయునుండవలెను. ఇందులో మాచంద్రగుప్తునకు ఈడు నతిక్రమించిన భాషయున్నది కాని భాషకుఁ దగినవేషము శతాంశమును లేదు. ప్రస్తుత కార్యమున కిదియే పెద్దయాటంకము? దీని నెట్లు సరిపుచ్చవలయునో తెలియకున్నది. నవరత్న స్థాపితమైన కిరీటమును, జలతారు మయములై ధగధగలాడెడు దివ్యాంబరములును, తోరంపు ముత్యాలహారములును ధరింపవలసిన చంద్రగుప్తునకు నారబట్టలు గట్టి నలువురిలోని కెట్లు గొంపోయెదను? ఆహా! ఇఁక మీఁద ద్రవ్యముండినఁగాని కొనసాగదుకదా? ఏమిచేయవలయు? ధనము లేకున్నచో ముందొనర్పవలసిన కార్యములన్నియును భంగమగును. ద్రవ్యమార్జించునుపాయ మెటుచూచినను దోఁచకున్నది..............ఛీ. ఛీ. ఇంతసాహసమునకు నేనెట్టు లొడంబడఁగలను? చిరకాలమునుండియుఁ గన్న పుత్రులవలెఁ బెంచి పెద్దఁజేసి విద్యగఱపి కన్నకుమారులవలెఁ జూచుకొనుచున్న నాశిష్యులను ధనముఁ దెమ్మని పీడించుటకన్న నీచమున్నదా? పాపము! వారెక్కడనుండి తెచ్చెదరు.?............వారి నడుగకున్న ప్రస్తుతము ద్రవ్యసంపాదన కింక మార్గము గానరాకున్నదే? ఎట్టులైన మంచి మాటలాడి ఒక్కొక్క రొక్కొక్క మాడ చొప్పునఁ జెల్లించవలయునని యాజ్ఞాపించినవారికంత భారముండదని తలంచెదను. వేంకొలందియున్నవారు కావున వలసినంతధనము శిష్యులవద్ద గ్రహింపవచ్చును.......... అబ్బా! నేనంత సాహసమునకై యొడఁబడి వారినిఁ బీడింపలేను. వారిలో దిక్కులేనివారును, తలిదండ్రులులేనివారును, దరిద్రులును అనేకులున్నారు. వారందఱికేది దిక్కు? వారు నాకెట్లు మాడలుచెల్లించగలరు? ఈవిధమునఁ

గాకున్న నింకొకయుపాయ మాలోచించెదఁగాని యూరపనిమాత్రము సేయఁ గూడన్ను.”

అని పరిపరివిధములఁ దనలోఁదలపోయుచుఁ జాణక్యుఁడు మెల్లఁగ దనయాశ్రమమును సమీపించెను. అప్పుడు వానివిచారము మఱింత యధిక మైనందునఁ జాణక్యుఁడు తనలో “ఆహా చంద్రగుప్తుఁడు నన్ను విడిచి యొంటరిగ నెట్లున్నవాఁడో కదా? ఆశ్రమమంతయు నాతఁ డిన్నాళ్లవఱకు నెట్లు పాలించుచుండెనో తెలియదు. శిష్యులందఱు నాయాజ్ఞప్రకారము వానికి లోఁబడియుండిరో లేదో? నేను చెంతలేనందున వారందఱు చదువుఁగట్టిపెట్టి నిర్భయముగ గంతులిడుచుండిరి కాఁబోలు?”

అని చాణక్యుఁడు తనయాశ్రమమును మఱింత సమీపించి నలువంకలఁ జూచుసరికి, వానికొక శిష్యుఁడైన నెందును గానరాలేదు. తన్నుఁజూచినంతనే తనముద్దు శిష్యుఁడగు చంద్రగుప్తుఁ డెదురుగ పరుగుపరుగునవచ్చి కౌఁగిలించుకొని యెంతసంతసించునోయని యనుకొని చాణక్యుఁడు మిక్కిలి ముచ్చట పడుచుండెనుకాని యాతఁడుగూడ నాశ్రమమందెచ్చటఁ జూచినను తనకుఁ గానరాలేను. అందుచే నాతఁడత్యంతమైన విచారమును మిక్కిలి తత్తరపాటును పడవలసివచ్చినది. ఎచ్చటఁ జూచినను ఆశ్రమమంతయు నొక్కమారుగ నిర్మానుష్యమై యుండుటకు వానికిఁ గారణమేమియుఁదోపలేదు. ఇట్టిస్థితియందు చాణక్యుఁడున్నప్పుడు, ఎచ్చటనుండియో పెద్ద కలకలము వానికి వినవచ్చెను. తోడనే యతఁడు ఆశ్చర్యమునుబొంది యాకేకలు ఏమైయుండునా? యని యాలోచించుచు నచ్చటనుండి బయలుదేఱి ఆయల్లరి వినవచ్చుచున్నప్రక్కకుఁ బోవసాగెను. అట్లు కొంతదవ్వేగుసరికి సమీపమునఁగల యొకపటువృక్షముక్రింద నాతనిశిష్యులందఱునుగూడి పెద్దకేకలువేయుచుఁ జప్పట్లుచఱచుచు గంతులిడుచు ‘జయజయచంద్రగుప్తా! జయజయ చంద్రగుప్తా’ అని పాటలుపాడుచు, చంద్రగుప్తుని కీర్తించుచుండిరి. అప్పుడు చంద్రగుప్తుఁడు ఆకులతోడను కొమ్మలతోడను నిర్మింపఁ

బడిన యొకసింహాసనముపైఁ గూర్చుండియుండెను. వానిముందర మూఁకలెత్తున రత్నరాసులును, ధనరాసులును, వివిధాలంకారములును గుప్పకుప్పలుగఁబడియుండెను. వానిప్రక్కనే నలువురు పురుషులు చేతులకు సంకెలలు వేయఁబడి కన్నీరుఁగార్చుచు దీనత్వముతో నేడ్చుచు నిలిచియుండిరి. వారిచుట్టును శిష్యులందఱుఁ జేరి పరిపరివిధముల నాటలాడుచు తమ యానందమంతయు వెలిబుచ్చుచుండిరి. అదంతయుఁ జాణక్యుఁడు కన్నులారఁ జూచి మొదట నత్యద్భుతమొంది పిదప మహానందపరవశుఁడై ఆసమాచారమేమియో కనుఁగొనవలయునని రహస్యముగ నొకచెట్టుచాటున నక్కి వారిమాటలన్నియు నతిజాగరూకతతో నాలకించుచుండెను. అప్పుడాశిష్యబృందములో నొకఁడు చంద్రగుప్తునితో

“చంద్రగుప్తా! నేఁడు మనగురువుగారే యుండినచో నిన్నుజూచి యెంతసంతసింతురో కదా!”

“పీరవ్రతా? ఏమట్లనెదవు? గురువుగారు నన్నొక్కనినే మెచ్చుటను, ఇందు నాపరాక్రమమేమియును లేను. అంతయు మీసాహాయ్యమువలననే కదా? ఈధనమంతయు మనగురువుగారికి గురుదక్షిణగా మనమందరము కలసి సమర్పింపవలయును. నీకిష్టమేనా?”

“కాకమఱేమిచేయుదము? ఇదంతయు గురుదక్షిణకొఱకే యేర్పడియున్నది.”

ఈమాటలలోఁ బరాక్రమము గురుదక్షిణ అను రెండుమాటలును విని చాణక్యుఁడు “అరే! ఏమి ఆశ్చర్యము? వీరేదైన సాహసముఁజూపి యీధనము సంపాదించిరి కాఁబోలు? వాహ్వారే! వాహ్వా! నాకుమంచిసమయమునకే ద్రవ్యలాభము కలిగినది.” అని యానందమును బట్టలేక చాణక్యుఁడు వారిదగ్గఱకుఁబోయెను. వానినిఁజూచి శిష్యులందఱు నొక్కసారి “జయజయ చాణక్యమహారాజా” అనికేకలిడుచు వానిపాదములపై వ్రాలిరి.

చాణక్యుఁడు వారందఱను లేవనెత్తి "మీకుఁజిరాయువుగల్గుఁగాక" యని దీవించెను. ఇంతలో నామూఁకలోనుండి మెల్లఁగఁజంద్రగుప్తుఁడు ముందుకువచ్చి వానియెదుట చిఱునవ్వులు నవ్వుచు నిలిచియుండెను. వెంటనే వీరవ్రతుఁడను రాకుమారుఁడు గురువును జూచి

"గురూజీ! ఇంక నీచంద్రగుప్తుఁడు పూర్వపుచంద్రగుప్తుఁడు కాఁడు.

నేఁటిదినమున నీతఁడు 700 గ్రీకులతోఁ బోరాడి యనేకులఁ దెగటార్చి సంపూర్ణమైన జయము సంపాదించి వారియొద్దనుండి యీధనమంతయుఁ గొనివచ్చెను. ఎంతవింత? ఆహా! వీనిపరాక్రమము చూచి తీఱవలయును గాని చెప్పినఁదీరదు."

అనిపలుక చంద్రగుప్తుఁడు వెంటనే

"గురువుగారూ! ఈకార్యము నేనొక్కఁడనే చేయలేదు. అందఱము గలసియే చేసితిమి. ఈధనమంతయుఁ దమరు గురుదక్షిణగాను, ఈ నలువుర గ్రీకులను తమసేవకులుగాను మావద్దనుండి బహుమానము గైకొని మమ్మాశీర్వదింపుఁడు."

అన నందఱ నొక్కసారి కరతాళధ్వనులాచరించుచు పరల "జయ జయ చాణక్యమహారాజ్, జయజయచాణక్య మహారాజ్" అని జయజయధ్వనులొనర్చిరి. అప్పుడు చాణక్యుఁడు పొందినయానంద మింతయని నిరూపింప నెవ్వరితరము? అంతధనము సంపాదించి తనకు మహోపకారమొనర్చిన శిష్యులనందఱను వేర్వేఱఁ గొనియాడుచు వారినందఱను దీవించెను. తరువాత చాణక్యుఁడు తనయాశ్రమములో రెండుదినములు మాత్రమే యుండెను. ఆరెండుదినములలో నాతఁడు చంద్రగుప్తునకును వీరవ్రతునకును ఏవియోకొన్ని అనేకబోధనలు చేసెను. తరువాత నచ్చటనుండి తనయాశ్రమము నూడఁబెఱికి పాటలీపుత్రమున గంగానదియొద్దనఁ గ్రొత్తయాశ్రమము

నిర్మింపవలసినదని తనశిష్యులకందఱ కాజ్ఞాపించి, తాను చంద్రగుప్తునిఁ జక్కఁగ నలంకరించి, వానిని వెంటఁబెట్టుకొని ముందుగ పాటలీపుత్రమునకు బయలుదేఱెను. వానివెంట సాధనముఁగూడ గొంపోయెనని వేఱుగ వ్రాయనక్కఱలేదు.

ప్రకరణము. 12.

చాణక్యుని మనోవిచారము.

చాణక్యుఁడు చంద్రగుప్తుని వెంటనిడికొని కొన్నిదినములకుఁ బాటలీపుత్రమునఁ బ్రవేశించెను. కాని యీసారి యెక్కడ బస చేయవలసియుండునో వానికిఁ దోఁపలేదు. పూర్వమువలె కైలాసనాథమందిరమున నుండుట కేకారణముచేతనో అతఁడు సమ్మతింపలేదు. అందుచే నాతఁడు తిన్నగ రాజమందిరములోనికిఁ బోయి మురాదేవియంతఃపురమునకు సమీపముననున్నయజ్ఞశాలయందు దేవికొఱకు కొంతసేపు వేచియుండి, యానాఁడు సాయంకాలమామెను కలసికొని యిట్లు ప్రసంగించెను.

"దేవీ! నీతలిదండ్రులు మొదలైనవారందఱు నీక్షేమము విని యమితానందమొందిరి. వారందఱికి నిన్నుఁ జూడవలెనని మిక్కిలి యపేక్ష కలదుకాని, కారణాంతరములచే రాఁజాలకపోయిరి. అందుచే మీయన్నగారైన ప్రద్యుమ్నుఁడు తనకుమారుని నీయొద్దకుఁ బంపించెను. నాలుగైదుదినములు నీయొద్ద నుంచుకొని మరల వీనిని మీపుట్టినింటికిఁ బంపివేయవచ్చును. నీ వీతని నిదివఱ కెన్నఁడును జూచియుండలేవు. ఈబాలుఁ డిదివఱ కెన్నఁడును పరులయింట నుండి యెఱుఁగఁడు. నిన్నుఁ జూచుట కెవరును రాకున్న నీకుఁ గోపమువచ్చునని మీయన్న వీనినిఁ బంపెనుగాని లేకున్న దనకుమారుని విడిచి యాతఁడు క్షణమైన నుండలేఁడు. నీమేనల్లుని నీయిష్టము వచ్చినంతకాలము దగ్గఱనుంచుకొని పెంచుకొనుము. ఇక్కడిసమాచారము లేమియు వీనితోఁ జెప్పవద్దు. ఇదిగో మీయన్న నీకొకయుత్తర మిమ్మని నాకొసఁగెను దీనిని జదువుకొనుము."

అని చాణక్యుఁ డొకయుత్తరమును దీసి మురకందిచ్చెను. చంద్రగుప్తునిఁ జూచినంతనే మురాదేవియవస్థ సర్వమును మాఱిపోయి యామె స్తంభమువలెఁ గొంతసేపువఱకు నిలిచిపోయినది. చాణక్యుఁ డిచ్చిన యుత్తరము సావకాశముగఁ జూచి "ఆర్యచాణక్యా! మీయనుగ్రహమున నామేనల్లునిఁ జూచుభాగ్యము నాకుఁ గలిగినది. వీని నిదివఱ కెన్నఁడును నేను జూచియుండలేను. వీనిపుట్టుకయే నేనెఱుఁగను. వీనినిప్పుడే కొనిపోయి మహారాజుగారికిఁ జూపెదను. మీరుకూడ వచ్చెదరా?" అనియడుగ, చాణక్యుఁడు కొంత సందేహించి "దేవీ మురా! నేను బ్రాహ్మణుఁడను. రాజును జూచినందువలన నాకేమిలాభమున్నది? కాఁబట్టి నే నక్కడికిరాను. ఎన్నాళ్లు బాలుఁడు నీయొద్దనుండునో అంతకాలము నేనీయూరిలోనే యుండెదను. నాలుగైదు దినములు నీయొద్దనుంచుకొని తరువాత నాకప్పచెప్పుమని మీ తల్లిదండ్రులు నీతోఁ జెప్పుమన్నారు."

"ఆర్యా! బాగానేయున్నదికాని ఈయూరు మీయూరుకాదు. ఇందు మిమ్ముల నెవ్వరు నెఱుఁగరు. ఎక్కడికిపోయి యుండఁగలరు? ఇక్కడనే యజ్ఞశాలలో సుఖముగనుండరాదా? ఇచ్చట మీ తపస్సునకేమియు భంగము గల్గదు. అన్నిసదుపాయములు నేను చేయించెదను. నామేనల్లునకు నేనుక్రొత్త. నాయొద్ద చనువైనదాఁక మీరిందుండిన బాగుండును. మీయట్టిబ్రాహ్మణోత్తములకు సేవఁజేసిన నేనుఁగూడఁ దరించెదను. పాపమిప్పు డెక్కడికిఁ బోయెదరు?"

"దేవీ! మురా! నీభక్తికి నేనెంతయో సంతసించితిని. కాని యిక్కడమాత్రము నేనుండుటకు వీలులేదు. నాలుగు దినములక్రిందనే గంగానదీతీరమున, నాశిష్యు లొకపర్ణశాలనిర్మించి నాకొఱ కేర్పాటుచేసియున్నారు. అమ్మాయీ! నేను శుద్ధదరిద్రుఁడను. రాజగృహవాసము నాకెందులకు? ప్రద్యుమ్నునకు నాయందెవిశేషమైన నమ్మకముండుటచేతను, చిన్ననాఁటనుండియు నీబాలుఁడు నావద్ద మిక్కిలి చనువుగలిగియుండుట

చేతను, బాలునివెంట నేనే రావలసివచ్చినది. దేవీ! మఱియొకమాట. ఈ బాలుని విద్యాసుగుణసంపదలఁ గనిపెట్టినచో నీవాశ్చర్యపడెదవుసుమా! వీనిమొగమునఁ జక్రవర్తి లక్షణములున్నవి. ఇదిమాత్రము రహస్యముగ నుంచుము. భగవాన్ కైలాసనాథుఁడు వానికిఁ జిరాయువొసంగనీ'' అని ప్రక్కకుఁ జేరిగి "చంద్రగుప్తా! నేనింకఁ బోవచ్చునా? మురాదేవి మీయత్త సుమా? ఈమెను మంచిచేసికొనినయెడల నీకన్నియు శుభములే యగును. నేనప్పుడప్పుడు వచ్చి నిన్నుఁ జూచుచుందునులే. నీవుమాత్రము విచారింపకుము. మీతల్లిగారు దగ్గఱలేరనుకొఱఁతరానీయకుండ, ఈమె నిన్ను సకలవిధములసంరక్షించును, వేయేల? ఈమె నీతల్లివంటిదే యనుకొనుము."

అనిబోధించి మురాదేవి కప్పచెప్పి చాణక్యుఁడు బయలుదేఱెను. అతఁడు యజ్ఞశాలలోనుండుట కంగీకరింపనందున మురాదేవి కొంచెము మొగము చిన్నవుచ్చుకొనెను. శిష్యులందఱును కలసి గురుని యాజ్ఞానుసారముగ గంగాతీరమున నాశ్రమము నిర్మించిరి. కుటీరము నిర్మించుటయందు వసుభూతి వలయు నుపకరణములు చాలవఱకు సాహాయ్యముఁజేసి తనశిష్యులనుగూడఁ గొంతమందిని ఆకార్యమునందు నియోగించెను. వాని యుపకారమునకుఁ జాణక్యుఁడెంతయో సంతసించి వానిననేకవిధములఁ గొనియాడెను. అతఁడు తనయాశ్రమములోఁ బ్రవేశించుటకెట్టి యిబ్బందులును లేకుండ నన్నియేర్పాటులును చక్కఁగఁ జరిగినవి. నూతనప్రదేశమును, నూతనాశ్రమవాసమును, జూచి తనకార్యము తప్పక ఫలించుచునని చాణక్యుఁడు సంతసించుచుండెను. చాణక్యుఁడొకనాడు తనయాశ్రమములో నొంటరిగఁ గూర్చుండి సంగతులన్నియు జ్ఞప్తికిఁ దెచ్చుకొని, తనప్రతిజ్ఞాపరిపూర్తి కింక నెట్టియభ్యంతరముండదని తలఁచి తనలో నిట్లు వితర్కింపఁ జొచ్చెను.

"బళే! నందకులకాంతారమును ఛేదించుటకై వలయు నుపకరణము లన్నియు సిద్ధముగనున్నవి. ఈయుపకరణములలో నాకు ముఖ్యమైన యా

యుధము చంద్రగుప్తుఁడే కదా? ఏనాఁడు మగధేశ్వరునిచేఁ బూర్ణముగ నవమానింపఁబడి, తత్సభామంటపమును విడిచివచ్చితినో ఆనాఁడే నాకీరాజఖడ్గము లభించినది. అప్పుడే నాప్రతిజ్ఞాపరిపూర్తి కిది శుభసూచకమను కొంటిని. అనుకొనినట్లే నాప్రయత్నమంతయు నేటివఱకు సానుకూలముగనే యున్నది. వాహ్వా! దివాకరనిశాకరతారాగణము లున్నంతవఱకును చాణక్యుని కార్య ప్రయత్నమునకు భంగమనుట కలలోని వార్తయే కదా? నొసటిపై విధాత వ్రాసిన యక్కరములైనఁ దుడిచి పాఱవేయునంత సామర్థ్యముగల బుద్ధిచాతుర్య మనువస్తువునకు నింకలోకమున నసాధ్యమేమున్నది? రాజవిద్యలన్నియు నేర్పి చంద్రగుప్తునిఁ దయారుగ నుంచితిని గదా! నాయెడ వానికిఁగల గురుభక్తి యింకొకనికిలేదు. అందుచే నేనెట్లు చెప్పిన వాఁడట్లే నడచుకొనును. అవసరము వచ్చినప్పుడు వానికిఁ జేదోడు వాదోడుగ నుండుటకై భిల్లమాతంగాదులఁగూడ ధనుర్విద్యాపారంగతులఁ జేసినాఁడను. సుమాల్యుని పట్టాభిషేకదినంబున నందవంశ విధ్వంసమునకై మురాదేవి నావలెనే ఘోరమైన ప్రతిజ్ఞ సేయుటయు, క్రమక్రమముగ నామె ప్రయోగించిన సమ్మోహనాస్త్రమున బద్ధుఁడై ధననందుఁ డామెకుఁ జేఁజిక్కుటయు, అట్టి మగధేశ్వరుని వలలో వేసికొని తోలుబొమ్మవలె నాడించుచున్న మురనాకుఁ బూర్ణముగవశమగుటయు, అన్నకుమారుఁడని నమ్మించి చంద్రగుప్తు నామెయొద్ద నుంచుటయుఁ జూడ, ఆహా! ప్రచండ చాణక్య ప్రతిజ్ఞా పరిపూర్తికై యుత్తమమార్గము లేకదా? చంద్రగుప్తుని విషయమై నాకింక నెట్టి విచారమును లేదు. మేనత్త యనుభావంబున నాతఁడు తన కన్నతల్లియొద్ద క్షేమముగానే యున్నవాఁడు. కావున నింక ముందు సంగతు లాలోచింపవలయును............మ్లేచ్ఛరాజు నాశ్రయించి చాలకాలమునుండి మగధరాజ్యలక్ష్మిపైఁ గన్నువేసియున్న పర్వతరాజిప్పు డెక్కడనున్నవాఁడో! వానినెట్టులైన నమ్మించి వశపఱచుకొని నాకు సహాయముగఁ జేసికొనవలయును. ఏదైన నరాశఁ గల్పించినయెడ నాతఁడంగీకరింపకపోఁడు. మగధరాజ్యమునకుఁ జిరకాలమునుండియు గర్భశత్రువై

యున్న పర్వతరాజునకు నందవంశ నాశనమన్న ప్రసాదసోపేత భోజనమే కదా! కావున వానివిషయమై కొన్నియేర్పాటులు చేయవలసియున్నది. ఔను! వాఁడు పరమదుర్మార్గుఁడే! మొదట సాహాయ్యముచేసి కార్యానంతరమునఁ జంద్రగుప్తుని మోసపుచ్చి తాను సింహాసనము నాక్రమించునేమో? కొఱవిచేఁగొని తల గోఁకినట్లు అప్పుడు మిక్కిలి కష్టసాధ్యమగునే? ఏమి చేయవలయును? ....ఆ!—భయములేదు. ఇందు కిదియే మంచియుపాయము. నందవంశము నాశన మగుసరికి, చంద్రగుప్తునిపై ప్రజలకు మిక్కిలి యనురాగము కుదరవలసియున్నది. అట్లైనచోఁ బౌరులందఱు చంద్రగుప్త పక్షహితులై పర్వతేశ్వరుని రాజత్వమున కంగీకరింపక వానిని క్రిందకీడ్చి చంద్రగుప్తునే సింహాసన మెక్కించెదరు. అందుచే పర్వతరాజుపై నపరిమితమైన యసూయయు, చంద్రగుప్తునిపై నధికమైన యనురాగమును ప్రజలకొక్కమారుగఁ బుట్టింపవలయును. ఇంతియేమి? పర్వతరాజు నమ్మించి యేదైన ద్రోహము సంకల్పించుకొనినయెడల వానినిఁ గడతేర్చు కార్యము స్వయముగ నేనేపూనెదను. అంతవఱకుఁ గార్యము రాకమునుపే చంద్రగుప్తునిపై ప్రజలకు భక్తిగలుగవలయును గదా? అదెట్లు? యువరాజైన సుమాల్యునిఁ దెగటార్చి చంద్రగుప్తుఁడు ధననందుని జ్యేష్ఠకుమారుఁడనియు సింహాసనమునకు వారసుఁడనియుఁ బట్టణమున నెల్లెడఁ జాటింపవలసియున్నది. ఇందు కిదియే యుక్తమార్గము. అబ్బా! ఈకార్యములన్నియు మిక్కిలి కష్టసాధ్యములు కదా! ఇన్నియు నొక్కమారెట్లు చేయవచ్చును? కాదుకాదు. అవసరమునుబట్టి యొక్కొక్కటి నెఱవేర్పవలయును. మొట్టమొదట మగధ సేనాపతియైన బాహురాయణునితో స్నేహముఁ జేయుట మంచిది. తరువాత పర్వతేశ్వర సాహాయ్యము, యువరాజవధ, ప్రజావశీకరణము, పర్వతరాజ పరాభవము, చంద్రగుప్త సింహాసనారోహణము, తుట్టతుదకుఁ జాణక్య ప్రతిజ్ఞా పరిపూర్తి, క్రమక్రమముగఁ జరుగును. ఇన్నికార్యములును బాహురాయణుని స్నేహమువలననే కావలయును. అతని మైత్రి లభించుట

యంతకష్టమైన పనికాదు. సులభసాధ్యమే. ధననందుని యెడల సేనాపతి కెంతమాత్రమును విశ్వాసములేదు. కిరాతమహారాజు వద్దనుండి తాను దెచ్చి యిచ్చిన కన్యకను అన్యాయముగఁ జెఱలోఁ బెట్టి ఆమెకుమారునిఁ జంపించెనని బాహురాయణుఁడు ఈర్ష్యతోనున్నవాఁడట. అందుచే వానిని మెల్లఁగ బురికొల్పి రాజుపై మఱింత యసూయయు రోషముఁ బుట్టింపవలెను. ఇంతమాత్రమున నాతఁడు నాకులోఁబడిన సరియే! లేనియెడలఁ దుట్టతుదకు చంద్రగుప్తుఁడే మురకుమారుఁడని చెప్పివేసెదను. అంతవఱకు నీసంగతి రహస్యముగానే యుంచెదను. సైన్యములన్నియు వానియొద్దనేయున్నవి. ప్రజలకుఁగూడ వానిపై మంచియభిప్రాయము కలదు. అతఁడేపనియైనఁ జేయుటకు సమర్థుఁడు. అట్టివానిని వశపఱచుకొనిన నాకింకేమి కావలయును?... ఆహా సర్వశాస్త్రములు నెఱింగిన బ్రాహ్మణోత్తముఁడనై బ్రహ్మర్షినై కర్మకాండ సర్వమును విడిచి, రాజకార్యములయందు మెలఁగవలసివచ్చెనుగదా? ఓ మూర్ఖా! ధననందా! నీకు మేలొనర్పవచ్చిన నన్ను నిండుకొలువులోఁ బరిభవించి నాశాపమునకుఁ బాత్రుఁడవై నాచే నెన్నెన్ని కార్యములు చేయించుచుంటివిరా? నిష్కల్మషచిత్తుఁడనైన నాకట్టిద్రోహముఁ జేసిన నీకీశిక్ష యర్హమైనదే. నీయెడ నెంతమాత్రమును నాకు జాలిలేదు సుమా."

ప్రకరణము. 13.

హేమకరండము : స్వామిప్రసాదము.

తనయుత్తమ ప్రవర్తనమున మన చంద్రగుప్తుఁడు దినదినమును మురాదేవి యనుగ్రహము సంపాదించుచుండెను. వానినిఁ జూచినప్పుడే యామె యంతఃకరణమునాఁటి చంద్రగుప్తునిపై నపరిమితమైన ప్రేమయొక్కమారు మురాదేవికి జనించెను. తనయన్నకుమారుఁడింత సుందరాకారుఁడును నింత శూరశిఖామణి యని యామె విపరీతమైన యానందమును బొందినదై యయ్యు, విచారముమాత్రము కించిత్తైనను లేకపోలేదు. "ఆహా! నా కుమారుఁడు కూడ బ్రతికి యుండిన యెడల నిట్లేయుండి యుండును గదా?" యని మాటిమాటికిఁ దనలో ననుకొనుచు నూరక సంతాపమొందుచుండెను. అనురాగబంధ మూరక విడుచునా! మురాదేవి ఆనాఁడే చంద్రగుప్తుని ధననందుని యొద్దకుఁ గొనిపోయి కడువినయముతో "మహారాజా వీఁడు మా యన్నయగు ప్రద్యుమ్నునికుమారుఁడు. మా పుట్టినింటి వారినిఁ జూడవలయునని నేనాపేక్షపడుచుండ మాయన్నగారే తన కుమారుని నాలుగైదు దినము లుంచుకొమ్మని నాయొద్దకుఁ బంపెను. తమసెలవైనచో వీని నాయొద్ద నుంచుకొని మరలఁ బంపివేసెదను" అని యడుగ ధననందుఁడు మిక్కిలి జాలిపడి చంద్రగుప్తుని ముఖముఁ గొంతవఱకుఁ జూచి మాఱుమాటాడక మొగము వాల్చుకొని కన్నీరుఁ గార్చుచు నూరకుండెను. సహజధైర్యవంతుఁడగు ధననందుఁడే చంద్రగుప్తునిఁ జూచి మనసు కరఁగి విచారించుచుండ సామాన్యస్త్రీయును పుత్త్రశోకాకులచిత్తయును నగు మురాదేవి విచారమున కింక మేరయుండునా? కన్నులనుండి యేకధారగఁ బ్రవహించుచున్న దుఃఖజలమును పైటకొంగుతో నొత్తుకొనుచు మురయూరక వెక్కివెక్కి తనలోఁ దానే యేడ్వనారంభించెను. అందుచే నామె నోదార్చుటకై రాజు తన విచారమంతలోఁ జాలింపవలసి వచ్చినది. ఇంచుకైనను మనోదుఃఖమును బైటకుఁ దోఁపనీయక ఆమెయెడల నటింపనెంచెను కాని పాపము వాని మాటలు మాత్రము గద్గదస్వరముతోఁ బైకివెడలుచు నాతఁడు లేని ధైర్యమును బలవంతముగ దెచ్చుకొనె నని వెల్లడిచేసినవి. దీర్ఘములైన తన బాహువులఁ జాచి యామెనందుకొని, దగ్గఱఁ జేర్చి, కన్నీరు తుడుచుచు, ముంగురుల సవరించి నవ్వుచు, అనురాగాతిశయమున "సుందరీ! ఆనాఁడు నీవన్నమాటల నిప్పుడేమఱచిపోతివా? నేఁటినుండియుఁ దమయాజ్ఞ ప్రకారము నాదుఃఖమంతయు మఱచెద నని మొన్న నేకదా యంటివి? ఇంతలోనే మఱపుగల్గెనా?" అని యోదార్చుచు నడుగ నామె "ఆర్యపుత్త్రా! తమసెలవు ప్రకారమన్నియును మఱచితిని కాని నాకుమారునిమాత్రము నేను మఱవఁజాలకున్నాను. మహారాజా చంద్రగుప్తునిఁ జూచి నప్పటినుండియును నాకుమారుఁడుగూడ............" అని పొంగిపొంగి వచ్చుచుండిన దుఃఖాతిశయమున మఱిమాటలాడలేక, కన్నులు నులుముకొనుచు మరమఱింత రోదన మొనర్పసాగెను అప్పుడామె నోదార్చుట పాపము ధననందునకు శక్యము కాలేదు.

"దేవీ! మురా! చంద్రగుప్తుని నాయొద్దకుఁ గొనివచ్చి యింకనొక గంటకాలమైనను గాలేదు. వీనినిఁ జూచి యేదోసంగతిఁ దలఁచుకొని యింతలోనే యింతగా రోదనము సేయుచున్నావు గదా? వీఁడు నాలుగు రోజులవఱకు నీయొద్దనుండినచో దుఃఖము నేనెట్లు భరింపఁగలను? కాఁబట్టి వీనినిఁ జూచుకొని వెనుకటి సంగతులన్నియు మఱచి నీవు సంతోషముతో నుండిన యెడలఁ జంద్రగుప్తుని నీదగ్గఱనుంచుకొనుటకు సెలవిచ్చెదను. అట్లు కాక ఊరక మాటిమాటికి నిట్లు ఏడ్చుచుండిన యెడల వీనిని రేపే మరల మీ పుట్టినింటికిఁ బంపివేయుము. ఇఁక ముందు చిన్నమెత్తైనను నీకు విచారముండఁగూడదని నావ్రతము."

"ఆర్యపుత్రా! లేదులేదు."

అని చట్టునలేచి కన్నీరుఁదుడుచుకొని దుఃఖమంతయు దిగమ్రింగి వినయముతో,

"నాదుఃఖమింతతో ముగించినది. తమసెలవు ప్రకారము ముచ్చట దీఱ నామేనల్లుని నాయొద్ద నాలుగుదినము లుంచుకొని మరల మాపుట్టినింటికిఁ బంపివేసెదను"

"నాలుగుదినములా? నాలుగుదినములు కాదు నాలుగుసంవత్సరము లుంచుకొనిన నాయభ్యంతరము లేదు. నీవు మాత్రము దుఃఖింపక సంతోషముతో నుండినఁజాలును. వలయుకాని వీని కధికారముఁగూడ నిచ్చెదను. నా కుమారునితో వీఁడును అమాత్యరాక్షసునికడ రాజ్యపాలనము నేర్చుకొనుచుండును" అని చంద్రగుప్తునిఁ జూచి,

"ఏమిరా? చంద్రగుప్తా! నేర్చుకొనెదవా?"

అని యడుగ లజ్జావినయములతోఁ జంద్రగుప్తుఁడు చేతులమోడ్చి "మహారాజుగారి యాజ్ఞయైన తరువాత ధన్యులుకాని వారెవ్వరు?"

అని పలికెను. వాని వినయోక్తులకు ధననందుఁడానందమొంది "వాహ్వా! నీవు మంచి చతురతగలవాఁడవు. నాకుమారునితో నిన్నుఁగూడ బాగుజేసెదనులే! ఇప్పుడే నిన్ను యువరాజువద్దకుఁ బంపివేసెదను."

అన ముర మధ్య నడ్డముగవచ్చి,

"వద్దువద్దు. నేఁడేవచ్చినవాఁడు కదా? ఇంతతొందరయేమిటికి? రేపుదయమున సుమాల్యుఁడు తమపాదసేవకై వచ్చినప్పుడు మీరేస్వయముగఁ జెప్పి వీని నప్ప చెప్పవచ్చును."

అని ప్రత్యుత్తర మిచ్చెను.

ధననందుని దృష్టి పూర్తిగ చంద్రగుప్తునిపైనే మొదటి నుండియు నుండెను. వానిముఖలక్షణములును శరీరసౌందర్యమును చక్కఁగఁజూచి తనహృదయమున నేమియో తోఁప మురతో,

"ప్రియా వీనిముఖమే చూచుచున్నాను. ఏకారణముచేతనో కాని వీనిపై నా కధికమైన వాత్సల్యము జనించుచున్నది. వీనినిఁజూచి కొన్ని నిముసములైనను కాలేదే? ఏమి చెపుమా?"

"ఏమది? అట్లేలతోఁచినది?"

"నేనబద్ధమాడలేను. కావలసినయెడ నీవేస్వయముగఁ జూచి ఆలోచింపుము. వీనిముఖమునఁ గల ప్రతిలక్షణమును బరీక్షించినచో స్వచ్ఛముగ నీమొగమునలె నేయున్నది.........ఏమి? ఔనా లేదా?"

అని చంద్రగుప్తునిఁ జూచి,

"ఔరా చంద్రగుప్తా! నీవు గట్టిదొంగవు సుమా? వచ్చినస్వల్పకాలములోనే ఎందఱమనస్సులను కలఁతపెట్టితివిరా? అబ్బా! నిన్ను మఱియుంచుకొనఁగూడదు."

రాజు పరిహాసమాడుచున్నాఁడని యెఱింగి ముర

"చంద్రగుప్తా. నీవేమిచేసితివి? ఏమి దొంగలించితివో మహారాజుగారితోఁ జెప్పు."

అనియడుగ చంద్రగుప్తుఁడు మాటాడక మొగము వాల్చుకొని యూరకుండెను. అప్పుడు ధననందుఁడు

"ఏమిరా! ఇంతవాఁడవని నేనెఱుఁగనే! ఇంక నిన్ను క్షమింపఁగూడదు. నీకు దగినశిక్ష విధించెదను."

అని మురకొంచె మనుమానమొంది

"మహారాజా! నిజమేనా యేమి?"

"కాక నవ్వులాట యనుకొంటివా? వీఁడు నిజముగానే దొంగతనము చేసినాఁడు. అదియు నితరులవస్తువుగాదు నావస్తువే హరించినాఁడు. వీని నేనింక క్షమింపను."

అని గంభీరముగ నన నమురాదేవి

"మహారాజా! వీనిప్రవర్తనము నేనెఱుఁగుదును. చంద్రగుప్తుఁ డట్టివాఁడుకాఁడే! ఒకవేళ బాల్యచాపల్యమున దేవరవారి వస్తువేదైనఁ దీసిన యెడల యెఱింగింపుఁడు. నేను చెప్పి యిప్పించెదను."

అని వేడుకొన ధననందుఁ డంగీకరింపక

"లేదు లేదు. వీనితప్పు మన్నింపఁదగినదికాదు. నేనింక శాంతము వహింపలేను. చంద్రగుప్తా! జెప్పెదవా లేదా?"

అని భయంకరముగఁ బల్కి తటాలున లేచెను. అంతవఱకును రాజు పరిహాసమాడుచున్నాఁడేమో యని యనుకొనుచున్న చంద్రగుప్తుఁడు తన యనుమానమును విడిచి వాని గంభీరోక్తులవలన నించుక భీతహృదయుఁడయ్యు క్షత్త్రియపుత్త్రుండగుట సహజధైర్యాలంకృతుండే కావునఁ జేత నున్న కరవాల మించుక సవరించునట్లు నటించి పూర్వభయమును విడిచి, రణశూరునివలె నిర్భయముగ రాజునెదుట నిలిచెను. అప్పుడు ముర తటాలున వాని చేయిఁబట్టుకొని వెనుకకులాగి రాజుతో నేమో చెప్పుటకు సిద్ధముగనుండ నప్పుడు ధననందుఁడు,

"ఓసి పిచ్చిదానా! చంద్రగుప్తునిపై నేను నిష్కారణముగ నింద వేసితిననుకొంటివా యేమి? నీవు పోయి యొకయద్దమును గొనిరమ్ము. వీని

దొంగతనమిప్పుడే బైటపెట్టెదను. ఏమిరా? చంద్రగుప్తా! నీవుచేసినదోషమెఱింగినచో నా శిక్షకు బాత్రుఁడవయ్యెదవా? చెప్పు."

అని యడుగ తానేమియును నేరముఁజేసిన వాఁడుకాఁడు కావున నిర్భయముగ చంద్రగుప్తుఁడు

"ఓ! నేనుచేసిన దుష్కార్యమెఱింగినచో దేవరవారి శిక్షకు నేను తప్పక పాత్రుఁడనయ్యెదను."

అనిప్రత్యుత్తరమీయ ధననందుఁడు తనలోఁదానె చిఱునవ్వునవ్వుచు నప్పుడే యొకయద్దమును దెప్పించి చంద్రగుప్తుని మురకు దగ్గఱనే కూర్చుండఁబెట్టి వారిరువురి మొగములు నద్దములోఁ జూపించుచు

"మురా! చూడుచూడు, నీముఖలక్షణములు వీనిముఖలక్షణములు బాగుగ గనిపెట్టు.........ఏమి? ఏమైన భేదమున్నదా?......మాటాడవేమి? నీముఖసౌందర్యమును వీఁడు అపహరించినాఁడా లేదా? ఇప్పుడు నమ్మకము దోఁచినదా? ఇకఁజాలులే"

అని చంద్రగుప్తునితో

"ఏమిరా! దొంగా! ఇప్పుడు ఒప్పుకొనెదవా? నీవుచేసిన నేరమెఱింగించిన నాశిక్షకంగీకరింతువేమో! ఇప్పుడు నిన్ను దండింపవచ్చునా"

అని నవ్వుచుఁ బలుక చంద్రగుప్తుఁడు మందస్మితాస్యుఁడై మొగము వాల్చుకొని యూరకుండెను. అప్పుడు ముర తానుగూడ నవ్వుచు

"మహారాజా! మీరు సెలవిచ్చినది నిజమే? వీనికిఁ దమరు నిశ్చయించిన శిక్ష విధింపవచ్చును."

"ఇదిగో ఇప్పుడే వీనిని నా బాహుబంధనముచే బంధించెదను."

అని దూరముగనున్న చంద్రగుప్తుని దగ్గఱకుఁ దీసికొని తనరెండు చేతులతోడను బిగ్గరఁ గౌఁగిలించి ప్రేమాతిశయమున వానిరెండు బుగ్గలను

ఆదేవిపిన ననేకమార్లు ముద్దులాడెను. అనంతరమునఁ జంద్రగుప్తుఁడు తనచేతులతో బుగ్గలు దుడుచుకొనుచు నచ్చటనుండిలేచి మురయొద్దకు వచ్చి కూర్చుండెను. అప్పుడు ధననందుఁడు

"ప్రియా! వీఁడు మంచి భాగ్యశాలిసుమా! సుఖలక్షణములు చూడ నీతఁడు గొప్పచక్రవర్తియగు నని మాయుని కూడ తోఁచుచున్నది. ఇంతకన్న విశేషము మీయిరువురి మొగములకు భేదమేలేదు."

"దేవా ఔను. నాయన్నగారి రూపమును నారూపము నొక్కటేయని చిన్నప్పుడు మాతలిదండ్రు లనుకొనుచుండ నేననేకమారులు వింటిని. ఆతనికిఁ బుట్టినవాఁడగుట నీతఁడును తద్రూపమునే వహించెను. ఇందేమి యాశ్చర్యమున్నది? ఎట్లో భగవదనుగ్రహమున నాయువుండిన నంతియే చాలును. భాగ్యములక్కఱలేదు."

అని ప్రత్యుత్తరమిచ్చి మురధననందనకుఁ జంద్రగుప్తునిపై నధికాను రాగము జనించెనని గ్రహించి మిక్కిలి సంతసించెను ఆమె చంద్రగుప్తునకుఁ దనమందిరమునఁ దాను స్వయముగానే భోజనము పెట్టుచుండెను. కడప దాహమునకు మంచినీరైనను, తినుటకుఁ జిరుతిండియైనను, ఆమెచంద్రగుప్తున కొకరిచే నిప్పించక తాను స్వయముగానే యిచ్చి పోషించుచుండెను. ఎవరైనఁ బిల్చి తినుటకే వైనవస్తువుల నిచ్చినప్పుడు వాని నెంతమాత్రమును బుచ్చుకొనవద్దని యామె వానికిఁ గఠినముగ నాజ్ఞాపించెను. తన్నెవ్వరైన నెచ్చటికైన రమ్మని పిల్చినప్పుడు తనయనుమతిలేనిదే పోకుండఁజేసెను. చంద్రగుప్తుఁడు తనయత్తగారి యాజ్ఞల నుల్లంఘింపక ఆమె యెట్లుచెప్పునో అట్లే ప్రవర్తించుచు నామెయనుగ్రహమును బూర్ణముగ సంపాదించెను.

ఇట్లుయిదు దినములు గడచినతరువాత నొకనాడు మధ్యాహ్నము మగధేశ్వరుఁడు భోజనముఁజేసి తాంబూలము నములుచు మురాదేవితో

ముచ్చటించుచుఁ గూర్చుండెను. అప్పుడొకదాసి మెల్లగ వారి దగ్గఱకువచ్చి దేవితో

"అమ్మా! పట్టపుదేవియైన సునందాభాయి గారియొద్ద నుండి యొకదాసి యొకయుత్తరమును అందులో నొక హేమకరండమును తీసికొని వచ్చెను. దానిని లోనికిఁ దీసికొనిరమ్మని సెలవా?"

"అభ్యంతరమేమున్నది? పోయితీసుకొనిరా?"

"లేదమ్మా? ఆయుత్తరము రహస్యమఁట. మహారాజుగారు తప్ప ఇతరులు చూడఁగూడదఁట. ఆహేమకరండముగూడ నట్టిదేనఁట."

"ఛీ! పో! తీసికొనిరమ్మని చెప్పిన నిన్నిమాటలెందుకే? రహస్యమైనయుత్తరమైనచో మహారాజుగారొక్కరే చూచుకొనెదరు. అంతియె కాని పట్టపుదేవి దానికభ్యంతరము చెప్పెదననుకొంటివా? మహారాజుగారికి నేనెట్టిదాననో వారును అట్టివారే? అట్లననేల ఆమె పట్టపుదేవియగుటచే సామాన్యస్త్రీనైన నాకన్న నామెకే యీయనయెడల నెక్కుడు అధికారమున్నది. పో! నిన్నెవరు నాటంకపెట్టరు. తీసికొనిరా."

ఈమాటలు విని ధననందుఁడు

"ప్రియా బాగానేయున్నది కాని ఆదాసి నెందుకు లోనికి రమ్మనెదవు? దీనినేపోయి యీయుత్తరమును హేమకరండమును దీసికొనిరమ్మని చెప్పు."

"అట్లుకాదు అట్లుకాదు. పట్టపుదేవికోర్కె యెందులకు జరిపింపఁ గూడదు?"

అని దాసిని జూచి

"ఇంకను నిల్చియేయున్నావా! మహారాజుగారి సెలవైనదలే పోయి తీసికొనిరా!"

అనిపంప నామెపోయి పట్టపుదేవి దాసిని లోనికిఁ గొనివచ్చెను. తోడనే ఆదాసిచేతులుమోడ్చి నమస్కరించి "మహారాజా! దేవి సునంద భాయి వందనపూర్వకముగ నీయుత్తరమునిచ్చి హేమకరండములోని పదార్థమును పుచ్చుకొమ్మని మనవిఁజేసికొనినది. దయయున్నచో జవాబుగూడఁ గోరుచున్నది. ఇంక దేవరసెలవునకై వేచియున్నాను"

అని వినయపూర్వకముగ బలుక ధనసందుఁడసూయతో,

"దాసీ ఈయుత్తరమును ఈ హేమకరండమును పట్టుకొని వచ్చినదానివిపో! నాలుగైదు దినములు పోయినతరువాత మీదేవి యంతఃపురమునకు నేనే వచ్చుచున్నాను. అప్పుడీయుత్తరమును జూచెదనని చెప్పు".

ఆమాటలు విని మురా

"మహారాజా ఇది ధర్మముకాదు. పట్టపుదేవిపంపించిన యుత్తరముకాని మఱియొకటికాదు. దానిని జదువకుండఁ బంపించుటకన్న నామెకవమాన మింకేమున్నది? సకలవిషయము లెఱింగిన దేవరవారిట్టి యకృత్యములాచరింపవచ్చునా! పట్టపుదేవియెడ ననాదరణఁజూపుట యెంతమాత్రమును భావ్యముకాదు. కావున మీరా యుత్తరమునందుకొనక తప్పదు."

"సుందరీ మురా! ఆహా నీవు కొంచెమైనను మత్సరములేనిదానవుకదా? నిన్నుఁజూచి నీసవతులందఱు నోర్వలేక యూరక యేడ్చుచున్నారు. మఱియు నేనిచ్చటకు వచ్చినప్పటినుండియు నీమీఁద వారికి మరింత కడుపుమంటగ నున్నది. ఇంక నీవా? మాటిమాటికి వారిపక్షముననే నాతో మాటాడుచుందువు. ద్వేషమునకు మాఱుగ నీయనురాగ మెక్కడనుండివచ్చెను?"

ఆమాటలకు మురనవ్వి.

"మహారాజా! లేశమైనను అపరాధముసేయకయే పతిపలన ఘోరశిక్ష ననుభవించినదానను నేను. నాసవతులునాకు శత్రుపక్షములలోని

వారైనను వారికి నాకష్టములో లేశమైనను రావలెనని నేఁగోరను. ఇంతియెకాక దేవిసునంద మిక్కిలి సాధ్వి. ఆమెపై నాకెట్లు ద్వేషముండును? ఇంతకన్న మనవిఁ జేసికొనవలసినది లేదు."

మురాదేవి మాటలన్నియు విని దాసి మాఱుమాటలేక స్తంభమువలె నిలిచిపోయెను. మురయొక్క అంతఃకరణము శుద్ధమైనదనియు, నిష్కపటమైనదనియు నిర్మలమైనదనియు నెంచి ధనసందుఁడు సంతసించి ఆదాసితో

"ఓసీ! దాసీ! నీవిచ్చిన హేమకరండమును జాబును మొదటఁ దృణీకరించినను, మీరందఱును కలసియే మురను ద్రోహముఁజేసి నానాకష్టములుపెట్టి దుఃఖపెట్టిరో ఆమురచెప్పినందున మాఱుపలుకలేక గైకొంటినని మీదేవితోఁ జెప్పుము. ఇంతకన్న ప్రత్యుత్తర మేమియును లేదు. పో."

అని తిరస్కారముగఁ బలుక నాదాసి వెంటనే బయలుదేఱిపోయెను. కాని యామెయుత్తరమును హేమకరండమును మురాదేవియే పుచ్చుకొనెను. అందుచే నామె

"మహారాజా! దేవరవారికేయుత్తరము వచ్చినను నేను చదువుట యిదివరకు మామూలుకదా? కావునఁ దయసెలవైనచో నేనే చదివి వినిపించెదను."

అనియుత్తరము విప్పుచుండ ధనసందుఁడు తటాలున లాగికొని

"ఛీ! ఛీ! చదువకు, చదువకు, ఆయుత్తరములో నీకును నాకును విరోధమైనసంగతులేకాని మఱియేమియు నుండవు. అది నేనే స్వయముగఁ జూచెదను. ఈభరిణలో నేమున్నదో నీవు చూడుము."

అని తాను జాబును లోలోనఁజదువుకొనుచుండెను. కడవఱకుఁ జూచినతరువాత, రాజు

దేవీ ఇందేమియును విశేషములు లేవు. సునంద నిన్న నేమో ఉపవాసముండి కైలాసనాథునిఁ బూజచేసికొనెనఁట. ఆస్వామిప్రసాదమే యీ భరిణలోనుంచి నాకొఱకుఁ బంపించినది. దైవప్రసాదమును దిరస్కరింపఁ గూడదు. గావున మన మిరువురమును పుచ్చుకొందము రా."

అని ఆమె చేతిలోని హేమకరండము లాగికొని అందులోని స్వామిప్రసాదము రెండుభాగములుచేసి యొకటి ఆమెకిచ్చి, రెండవది తాను దినుటకు నోటివద్ద నుంచుకొనెను. అప్పుడు తటాలున ముర వానిచేయిఁ బట్టుకొని ఆతురతతో

"మహారాజా! వద్దువద్దు. తినకద్దు ఇందులో మోసమున్నది."

"ఏమిఏమి? ఇందేమి మోసమున్నదో చెప్పుచెప్పు."

"అయ్యయ్యో! ఇందులో విషము గలుపఁబడినది. మనయిరువురి ప్రాణములు నపహరించుటకుఁ బన్నినయుపాయమువలెఁ గనఁబడుచున్నది. అయినను సందేహమెందులకు? ఇప్పుడే దేవరవారికి దాఖలా చూపించెదను."

అని ప్రక్కకుఁ జూచి

"బృందమాలా నేను పెంచిన తెల్లపిల్లి నిట్లు వేగిరము తీసికొనిరా."

అని బృందమాలకాజ్ఞాపించి పంపెను.

ప్రకరణము 14.

శ్వేతమార్జాలమరణము.

బృందమాల తెల్లపిల్లినిఁ దీసికొని వచ్చులోపల మురాదేవి చర్యలు ఎట్లుండెనో చూడవలసినవే! ధనానందుఁడా ప్రసాదమును దినునేమో యను శంకచేత వానిచేతిలోనుండి లాగికొని దానినిఁ దనయొద్దనే యుంచుకొని యతిజాగ్రత్తతో నుండెను. అత్యాశ్చర్యనిమగ్నమానసరై అందుకుఁ దోడు భయకంపితరై యున్న ఆమె శరీరాకారమును రాజు చూచి "దేవీ! యేమి యిట్లున్నావు? పిల్లినెందుకు తెమ్మంటివి? దాని నేమిచేసెదవు?" అని యనేకమారు లడుగుచు వచ్చెను గాని ముర వాని కేమియును ప్రత్యుత్తరమీయలేదు. ఇంతలో బృందమాల పిల్లినిఁదీసికొని వచ్చెను. ముర దానిని వెంటనే యందుకొని మెల్లఁగ నువ్వుచు రెండుమూడుసారులు ముద్దుపెట్టుకొని "ఓశ్వేతమార్జాలమా! నేటివఱకు నిన్నుఁ గడుముద్దుగఁ బెంచి పోషించుచున్నాను. కాని దైవవశమున నిన్నే చేతులతోఁ బెంచితినో ఆచేతులతోడనే, నేఁడు నీప్రాణము లపహరింపవలసివచ్చెను." అని దానిని తనయొడిలో వెల్లకిలఁబరుండఁబెట్టి గట్టిగఁబట్టుకొని ప్రసాదమునఁ గొంతభాగము చిన్నయుండఁజేసి దానినోటిదగ్గఱఁ బెట్టెను. ఏమిచిత్రమో కాని తననాసికారంధ్రముల కావాసన సోకినంతనే యమ్మార్జాలము మొగ మూరక యిటునటుఁ ద్రిప్పుచుఁ జేతులతో నడ్డగించుచుఁ బాదములతోఁ దన్నుచు, తననోటిలో నాపదార్థమును బెట్టవలదని సూచించుచుండెను. అదిచూచి ముర "ఓహో! దీనిలో విషమున్నదని నీకుఁగూడఁ దెలిసినదా యేమి? అయినను నేనింతమాత్రమున నమ్మను. ఇదిగో ఈయుండ నీనోటిలో వేసెదను. నీవులినక వైకుమ్మివేసినను బలవంతముగ నోటిలోఁ గ్రుక్కెదనుగాని విడువను. తరువాత నేమగునో నీవే చూచెదవు." అనిచెప్పి మురల బలవంత

ముగ నోటిలోఁ గ్రుక్కుచుండెను. ఈసారికూడఁ బాపమామార్జాలము పూర్వమువలెఁ బ్రయాసపడి రెండుమూఁడుసారులు దగ్గి నోటిలోని ప్రసాదమును దుప్పునఁ బైకుమ్మివేసెను. తనగోళ్లచే బరికినందున మురాదేవి చేతులపై నక్కడక్కడ రక్తముగూడఁ జిమ్మెను. అయినను దాని లక్షింపక తనపైట కొంగుతో నారక్తమును జిమ్మకుండ నొత్తికొనెను. అదంతయుఁ జూచుచు ధననందుఁడు చీకాకుతో "మురా! అబ్బా! ఏమిది? దానిని విడిచిపెట్టు ఎందుకల్లరిపెట్టెదవు?" అని రెండుమూఁడుసారులు వారించెనుగాని ఆమె తనపనిమానలేదు. ఈసారి మురాదేవి కోపమువచ్చినందున దానికాళ్లుచేతులను గట్టిగనొక్కిపట్టి, దానినోటిలో మరల నాయుండను బలవంతముగఁ గ్రుక్కి పూర్వమువలె నుమ్మివేయకుండ దౌడలు దగ్గఱగఁ బట్టుకొనెను. అందుచేఁ బాపమాపిల్లి ఆప్రసాదమును బైకి వెడలఁగ్రక్కుటకు వీలులేకపోయినది. ఇంతలో దానికంఠములోనుండి ప్రసాదమును మ్రింగినట్లు రెండుమూఁడుగుటకలు వినఁబడినంతనే మురదానిని గుండెలపై నొకసారి చేతితో రాసి క్రిందకువిడిచెను. తోడనే యమ్మార్జాలము మ్రింగగా మిగిలినదానిని నొక్కమారుపైకిఁ గ్రక్కి పరుగెత్తుచుండెను. కాని పదిపదునైదడుగుల దూరము పోయినంతనే దానికడుపులో నేదియో యొకవిధమైనవేదన బుట్టినందున నాపిల్లి వికారముగఁ గేకలువేయుచు మఱి నడువలేక నేలపైఁబడి యూరక గింజుకొననారంభించెను. అప్పుడు మురా

"మహారాజా! చూడుఁడు. చూడుఁడు. దీని కెట్టిగతి సంభవించెనో విషమంతయు దీనియొడలికెక్కెను. అక్కటా యెంతఘోరమెంత ఘోరము? దైవవశమునఁ దప్పినదికాని లేకున్నచో నొక్కగడియక్రింద దేవరవారికి మహాపద సంభవించియుండును కదా? ఇట్టి మాయాప్రసాదమును భరిణలోనుంచి తమసాన్నిధ్యమునకుఁ బంపిన స్వామిద్రోహులెవ్వరో? ఎవరింతదారుణ మొనర్చుటకు సాహసించిరో? ఎంతమూర్ఖత? ఎంత మూర్ఖత? ఆపంపినవారికి మురతమవద్దనే యుండునని తెలియదేమో?

నేనే యజాగ్రత్తగనుండినచో వారిమనోభీష్టమిదివఱకే నెఱవేఱియుండును. ఇంత ఆలస్యమెందుకు? అయ్యయ్యో పాపమాప్రసాదమును? దినిన నాపిల్లి కెట్టిగతిసంభవించినదో చూచుచున్నారుకదా? తెల్లగనున్నదాని శరీరమంతయు విషదోషముచే నల్లగనెట్లు మాఱిపోయినదో? రామ! రామ! దాని యాకారమెంత భయంకరముగనున్నది? అదిగో! అదిగో! నాలుకఁ బైకిఁ జాపివేయుచున్నది.

ఛీ ఛీ నేఁడు నాపాడుచేతులెంత ద్రోహమునకుఁ బాల్పడినవి? ఎవరేమిచేయఁగలరు? భగవంతుఁడు దీనికిట్టి మరణము వ్రాసెను కాఁబోలు? నిజము నిజము. అక్కటా రాజ్యకాంక్ష, మదోన్మత్తత, మాత్సర్యము, అసూయ అనునాలుగింటిలో నేదియున్నను నిట్టిసాహసము లనేకముల చేయవచ్చును. అట్టితఱి నీనాల్గుగుణములుఁ గల్గియుండ నాశ్చర్యమేమున్నది? దీనికేమి? జరిగినదేదియో జరిగినది. ఇంకముందెట్టి యాపదవచ్చునో యని నాకు మిక్కిలి భయముగనున్నది" అని విచారముతో ననుచుండెను. ఇంతలో నాపిల్లి కాళ్లును చేతులును దేలవైచి గుడ్లుబైకిఁబెట్టి నాలుకసాచి విషవ్యాప్తిచే నాశ్వేతమార్జాలము కృష్ణమార్జాలమై మురవంకఁ దిలకించుచుఁ దనప్రాణములు విడిచెను. తోడనే ధననందుఁడు విపరీతక్రోధారుణలోచనుఁడై పండ్లు పటపటఁగొఱుకుచు

"ఓసీ చండాలురాలా! మూర్ఖచిత్తా! సునందా! నాప్రాణములకే యుపద్రవముఁ గల్గింపనెంచితివే? దైవప్రసాదమని నమ్మి నేను భుజించి గతించినచో నీవును నీకుమారుఁడును రాజ్యమేలుకొనుచు సుఖముగ నుండఁ దలచితిరా? పాపీ? ఈయుత్తరమున స్వహస్తముతోడనే వ్రాయఁబడినది! ఇంక సందేహమెందులకు? సరే నీవిషయమై యాలోచించెదనులే! తొందరపడకు. అంతఃపురముననుండఁబట్టికదా నీకింత మదమెక్కువైనది? యువరాజునకుఁ దల్లివేయైనను నిన్నెంతమాత్రమును క్షమింపఁగూడదు. భర్తనైన నాప్రాణములే యపహరింపఁదలఁచిన నీవు మఱియొకనాఁడే పురుషునైన

మఱిగి నీతనయుని ప్రాణములుమాత్రమెందుకు తీయవు? కావున నేఁడే నీకుఁ దగినదండన విధించెదను..............."

"మహారాజా ఇంతయాగ్రహముండుట భావ్యముకాదు. ఈమహాకార్యము పట్టపుదేవియే చేసినదా? ఆమెయే విషముఁ గల్పిపంపినదా? ఏయాధారమున నీదోషము మీ రామెపై మోపిరో సెలవిండు?"

"ఇంతకన్న నింకేమియాధారము కావలెను? ఇప్పుడీమార్జాలము పడిన దురవస్థ నీవు జూచియేయున్నావు. నేనుఁగూడ నీకన్నులతోడనే చూచినాను."

"మహారాజా! అయినను అంతకోపము తమకుఁదగదు. కొంచెము శాంతము వహింపవలయును. దురాగ్రహమున నన్యాయముగ నన్నుఁ జెఱలోబడవైచి నాకుమారునిఁజంపించి మీరెంత పశ్చాత్తాపమొందిరో తెలియదా? తొందరపడి సత్యాసత్యములరయక ఆమెను శిక్షించినచో నిట్లే యగును. అన్నికష్టము లనుభవించిన నేను చెంతనుండి మీరట్టిసాహసకృత్యములుచేసినఁ జూచి యోర్వఁజాలను. తొందరపడక న్యాయాన్యాయముల విచారింపుఁడు. నిజము నిలుకడమీఁదఁ దేటపడఁగలదుకదా."

"ఓసివెఱ్ఱిదానా!" అని ధననందుఁడు డొకసారి నవ్వెను.

"దేవా! నవ్వులే నిజములగును. న్యాయముమాత్రము విచారింపక మీరెట్టికార్యముఁజేసినను నేనంగీకరింపను. ఆలోచింపుఁడు"

"అబ్బా! ఇంకను ఏమియాలోచింపుమనెదవు? ఉత్తరము తెచ్చినది పట్టపుదేవి స్వంతదాసియే. ఉత్తరములోని వ్రాఁతయుఁ బట్టపుదేవిస్వహస్తలిఖితమే! ఇఁక ప్రసాదము విషమిళితమనుటకు ఈమృతమార్జాలకళేబరమే సాక్షి. ఇంతకన్న నింకేమి విచారింపవలయును?"

"దేవా! నాసవతులందఱు నాపై మితిమీఱిన యసూయతోనున్నారుకాని ఏకారణముచేతనో వారిని శిక్షించుట కెంతమాత్రమును సాక్ష్యము లేదు. ఇంతద్రోహమును దలపెట్టినవారందఱు నిజముగ దండనార్హులే! అయినను తొందరపడక చేయవలసినదానినిఁ గొంచెము విచారించిచేయుఁడు. ఇదియే నాప్రార్థన."

"మురా! ఇంతజరిగిన తరువాత ఇంకను శంకయేమియున్నది?"

మహారాజా! శంకయేలేదా? విచారించుటయే యనవసరమా! తమకిది ధర్మముకాదు. దేవి సునందాభాయి నేఁడేదైన నోము నోఁచుకొనెనా లేదా? అందుకు ముత్తైదువలకు వాయనములిచ్చుటకు ప్రసాదముచేసినదా? లేదా? చేసినచో ఏమిప్రసాదముచేసినది? భరిణలో నాప్రసాదముంచి యీయుత్తరమామెయేపంపెనో లేక మఱియెవ్వరైనఁ బంపించిరా? ఆయుత్తరమామె స్వయముగానే వ్రాసినదా? ఆప్రసాదమామెయే పంపించినదా లేక దారిలో నెవరయినా భరిణలోనిది తీసి పాఱవైచి యందు విషమిళిత పదార్థము నుంచిరా? దేవా, ఒకటికాదు రెండుకాదు. దేవరవారు విచారించుట కనేక సంగతులున్నవి. అయినను మఱియొకమాట. దేవిపంపించిన మంచి ప్రసాదమును దీసి పాఱవైచి యామెపై ననూయచే నేనే విషమును గొనివచ్చి పిల్లికిఁబెట్టి చంపితినేమో? సునందాభాయి పట్టపురాణి. యువరాజునకుఁ దల్లి. సామాన్యస్త్రీకాదు. కావున మంచిచెడ్డ లాలోచింపుఁడు. తమరు నాలుగైదుదినములనుండి నావద్దనే యున్నారని కిట్టనివారెవరైన నీతంత్రముఁ జేసి యుండవచ్చును. దైవవశమున నెప్పుడయినఁ గొంచెము కోపమువచ్చినయెడలఁ దొందరపడి తమరు నన్నుఁగూడ నిట్లే చేసెద రని నాకు భయము గలుగుచున్నది."

"దేవి! అట్టిభయము నీ కెన్నఁడును వలదు. నానుండియేకాదు. నీసవతులనుండికూడ నెన్నఁడును నీకుఁ గించిత్తయినను నాపదరాదు. ఆ

దుష్టస్త్రీకిఁ దగినశిక్ష వ్రాసిపంపెదను. ఆలస్యము చేయఁగూడదు. భార్య యైనను పుత్రుఁడైనను అపరాధుల నూరక విడిచిపెట్టుట రాజధర్మము కాదు."

ఆమాటలకు మురచేతులుజోడించి వినయముతో

"మహారాజా వలదు వలదు. నామాట వినుఁడు. ఇదివఱ కెన్నఁడును తమరు నామాటఁ ద్రోసివేయలేదు. ఇప్పుడు నట్టులే మన్నింపుఁడు. వాస్తవ మెప్పుడును దాఁగదు. దేవి యింతద్రోహము సేయునది కాదు. ఇతరు లెవరో యీతంత్రముఁ జేసియుందురు?"

"దేవికాక మఱి యింకెవ్వరు?"

"ఎవరో నాకేమి తెలియును? రెండురోజులు శాంతించినచో నారహస్యము కొంటనే బయలుపడును. తమరు నాయింటనుండుట కిష్టములేక నాశత్రువులే యీకార్యముఁ జేసిరి. ఆహా! మహారాజా! ఇదియే తమరు భుజించి నామందిరమునఁ బ్రాణము విడిచినచో యువరాజుచే నాకురిశిక్ష నియమింపఁబడునుకదా? అప్పుడు నే నెంత మొఱపెట్టినను నన్నెవ్వరైన నమ్ముదురా? నాకు బలవన్మరణదండన విధింపఁబడినతరువాత నీకుతంత్రము పన్నినవా రెంత సంతసింతురో! అబ్బా యీప్రసాదమునుజూచిన నాయొడలంతయు మండుచున్నది. నా ముద్దుపిల్లి గతి యేమైనదో మీరే చూచితిరికదా? అబ్బా! మార్జాలమా నేఁ డెంత పని జరిగినదే?"

ప్రకరణము 15.

చాణక్యుని రాజ్యతంత్రము.

చంద్రగుప్తుని మురాదేవి కప్పగించిన తరువాత, చాణక్యునకుఁ గొంత భారముతగ్గినది. అతఁ డప్పుడప్పుడు ప్రచ్ఛన్నవేషమున రాజమందిరములోనికిఁబోయి యందలి విశేషములు కనుఁగొనుచుండెను. ధననందుఁడు మురాదేవికిఁ బూర్ణముగ వశ్యుఁడై యామె నింకెన్నఁడును విడువఁడను సంగతి మాత్రము అతఁడు పూర్తిగ గ్రహించెను. అందుచే సవతులపై మురకింకను అసూయపుట్టించి ఆమెచేఁగొన్నికార్యములు చేయింపవలయునని యాతఁ డనుకొనుచుండెను. ఇట్లుచేసినచో నది రామబాణమువలె నెంతమాత్రమును వ్యర్థముకాక తనకెంతయో సహాయకారియగునని చాణక్యుని యుద్దేశము. ఎంతకాలము రాక్షసుఁడమాత్యుఁడై యుండునో అంతవఱకును రాజు నిద్రింపవలసినదే కాని రాజ్యవిషయమైన చింత వానికేమియు నవసరములేదు కదా? ధననందున కాతనిపై నున్న విశ్వాస మింకొకనిపై లేదని యిదివఱకొకప్పుడు వ్రాసియే యున్నాము. రాజ్యముయొక్క క్షేమముఁ గోరుటయందు అమాత్యరాక్షసునకు మించినవాఁ డింకొకఁడు లేఁడు. రాక్షసునకేకాక మురమందిరమునఁ బ్రవేశించినప్పటినుండియు రాజు ఎవ్వరికిని దర్శనమీయలేదు. ఇదికూడ దనకార్యమునకుఁ గొంతలాభకరమని చాణక్యుఁడనుకొనెను. ఎల్లప్పుడును మురమందిరముననే కాలముఁ గడుపుచు వారమునకొకమారైనను బైకిరాకుండుటచే రాజుపైఁ గొందఱకసూయ జనించెనని చెప్పవచ్చును. కాని రాక్షసునకుమాత్ర మింకేను ఏవిధమైన యభిప్రాయము రాజుపైలేదు. అతఁడే వాస్తవమైన రాజభక్తుఁడు. అందుచేఁ గ్రమక్రమముగా వానిపైఁగూడఁ బలువురకీర్ష్య జనించెను. అనుదినమును నగరము

నంగల విశేషముల నతిజాగ్రతతో నరయుచుండుటచేఁ జాణక్యునకీసంగతు లన్నియుఁ గరతలామలకములై యుండెను. రాజుగారికి తీరుబాటులేనందునను, యువరాజు బాలుఁడగుటచేతను రాజ్యపాలన మంతయు నమాత్యరాక్షసునిపైనే పడెను. ఇదియు నదియుననక సర్వాధికారమును నమాత్యుఁడే వహించుట సేనాపతి బాహురాయణున కెంతమాత్రము నిష్టములేదు. కాని తా నందేమియు జోక్యముఁ గలిగించుకొనక పరస్పరముగ నూరకుండెను. సేనాపతి యన్యథా ప్రవర్తించినచో రాజ్యమున కపాయకరమే కదా? అమాత్యరాక్షసుని పాలనమునకు లోఁబడి యాతనియాజ్ఞప్రకారము వర్తించుట తమ కెంతయు నిష్టములేనందునఁ బ్రజలు తమయిష్టమువచ్చినట్లు చరించుచుండిరి అందుచే సేనాపతి కసూయ మఱింత యధికమయ్యెను. ఈసంగతులుగూడఁ జాణక్యుఁడు బాగుగఁ గనిపెట్టెను.

చాణక్యుఁడొకనాఁడు సారంగుఁడను నొకవిద్యార్థిని వెంటఁదోడుకొని సేనాపతి యింటికి వెళ్లెను. బాహురాయణుఁడు దైవబ్రాహ్మణభక్తుఁడు కాన చాణక్యు నెంతయో గౌరవించి యాదరించెను. వానియెడఁ దనకు మిక్కిలిభక్తి జనించినందునఁ జాణక్యునకేమైన దక్షిణఁగూడ సమర్పింపఁదలచెను కాని వానిమాటలవలన నాతఁడొక గవ్వయైనఁ బుచ్చుకొనెడు స్వభావముకలవాఁడు కాఁడని వెంటనే గ్రహించి బాహురాయణుఁడు మఱింతగౌరవమును జూపించెను. అంతకంతకు వారిరువురకును మైత్రియధికమగుటచేఁ దనదక్షిణ నాతఁడంగీకరింపక పోయినను సమయమువచ్చినప్పుడేదైన నుపకారము వానికిఁ జేయవలెనని సేనాపతి తనలో నిశ్చయించుకొనెను. చాణక్యుఁడు సామాన్యుఁడుకాఁడనియు వసిష్ఠవిశ్వామిత్రప్రముఖులవలె నీతఁడును గొప్పతపశ్శాలియనియుఁ దనకు నమ్మకము దోఁచినతరువాత వానికిఁ బూర్ణముగ వశుఁడై దాసానుదాసుఁడై సేనాపతి తిరుగుచుండెను. చాణక్యుఁడు దనతో మాటాడి బయలుదేఱినప్పుడు తానుఁగూడ వెంటవెంట నింటివఱకును దిగబెట్టుచుండెను. ఒకనాఁడైన వానిఁ జూడ

కుండ సేనాపతి యుండలేదు. ప్రతిదినము వారిరువురును కలసికొని మాటాడుచునే యుండిరి. మగధరాజ్య సేనానాయకుండగు బాహురాయణు నంతవాఁడు తనకుఁ జేజిక్కినందున మనచాణక్యుఁడొందిన యానందమింతింత కాదు. కొన్నిసమయములయందు అమాత్యునికన్న సేనానాయకుఁడే ముఖ్యుఁడుకదా? రాజ్యమునకు ముఖ్యప్రాణమైన సేనాబలము వాని యరచేతిలోనేకదా యుండును? కిరాతమహారాజువద్దనుండి మురాదేవినిఁ దాసిగ గొనివచ్చి ధననందునకు సమర్పించుటచేత బాహురాయణునకు మురపై మిక్కిలి ప్రేమకలదు. ఆమెకొన్నాళ్లకు గర్భవతి కాఁగా అప్పటికి మహారాణులయందెవ్వరికైన సంతానములేనందునఁ దానుస్వయముగఁ దెచ్చిన కన్యకకు జనించు కుమారుఁడే ముందుముందు యువరాజు కాఁగలఁడని మొట్టమొదట సేనాపతి యత్యంత సంతోషమును బొందుచు వచ్చెను. ఆమె కపనింద జనించినతరువాత బాహురాయణుఁడు మిక్కిలి విచారించి కిరాతమహారాజ కన్యకయైన మురాదేవి నిక్కమైన క్షత్రియకన్యకయేకాని యెంతమాత్రమును దాసీపుత్రికకాదని, అమాత్యరాక్షసుని తోడను ధననందునితోడను, చెవినిల్లుఁ గట్టుకొనిపోరెను. వారిరువురును తనమాట వినక, యతిక్రమించినందున సేనాపతి సిగ్గును, అవమానమును, అసూయయు, నాగ్రహము, నొక్కమాఱుగ వహించి అప్పటినుండియు వారిపైఁ దనకసు లెట్టుఁజేసియేయుంచెను. మురాదేవిని చెఱలోఁ బెట్టించుటయేకాక ముందుముందు యువరాజు కాఁగలఁడని తా నమందానంద మొందుచున్న రాకుమారునిఁగూడ రాజు చంపించుటచే సేనాపతి నావేశించిన క్రోధదేవత ప్రత్యక్షమై యాతని మొగమున నెప్పుడును దాండవమాడుచుండెను. మురాదేవి కారాగృహవాసమును, రాకుమారుని మరణమును వినినతరువాత దుఃఖాతిశయమున సేనాపతి మూఁడుదినములవఱకు నిద్రాహారముల విసర్జించి కేవలము మౌనియైయుండెను. ఈపదునాఱుసంవత్సరములలోఁ గ్రమక్రమముగఁ దనదుఃఖము కొంతవఱకు శమించినను రాజును అమాత్యరాక్షసుఁడును కలసి తనమాటవినక యతిక్రమించి తనకవమానముఁ గల్గించిరికదా యను

నీర్ష్యమాత్రము వానిగుండెలో నాటియేయున్నది. రాజామాత్యులు ఇరువురును ఒకరిమాట వినక తమమాటయే జరుపుకొనునట్టి స్వభావముగలవారని యెఱిఁగినందున మొదట మురాదేవినిఁగూర్చి తానేమియును వారితోఁ జెప్పఁదలఁచుకొనలేదుగాని ఆమెను కారాగృహమున కంపిననాఁటిదినమునఁ బౌరులు మిక్కిలి దుఃఖించుచు నేయుపాయమును గనక బాహురాయణుని యింటిపైఁబడి "నాయనా! నీవైననుజెప్పి యీమహారాజపుత్రిక కష్టమును తొలఁగింపుము ఆమెకెవ్వరును దిక్కులేరు" అని పరిపరివిధముల దన్నుఁ బ్రార్థించినందునఁ దనమాట యెట్లులైనను పొల్లుకాకమానదని యెఱిఁగియే వారితో మురాదేవినిగుఱించి ప్రసంగించెను. కడకాతఁ డనుకొనినట్లే జరిగినది.

మీఁదవ్రాసిన బాహురాయణు చరిత్రమంతయు మనచాణక్యుఁడు చక్కఁగనెఱిఁగియున్నవాఁడగుట వానినెట్లులైనఁ బురికొల్పి రాజామాత్యులపైఁగల అనూయనధికముఁగావించి వాని సాహాయ్యమునఁ దనకార్యము కొనసాగించుకొనవలయునని నిశ్చయించెను. అందుచే నొకనాఁడు సమయముఁ గనిపెట్టి గంగానదియొడ్డున సైకతస్థలముపైఁ జల్లగాలిలోఁ గూర్చుండినప్పుడు చాణక్యుఁడు సందర్భానుసారముగ సేనాపతితో నిట్లు ప్రసంగించెను.

"బాహురాయణా! ఈచరిత్రమంతయు నేనిదివఱకే విన్నానుసుమీ. అదిగాక ఆపిల్లవానినిఁగూడ జూచినాను వానిముఖమునఁ జక్రవర్తి లక్షణములున్నవి. వాఁడేకాని బ్రతికియుండినచో సుమాల్యునికన్నఁ బెద్దవాఁడై యువరాజు కావలసినది. పాప మట్టివానిని రాజునిష్కారణముగ జంపిపారవేసెను. నీవేకాని మొదటఁగొంత శ్రద్ధవహించినచో నింతవఱకు రాకపోను."

"బ్రాహ్మణోత్తమా నన్నేమిచేయుమనెదవు! నాశక్తి వంచనలేక రాజామాత్యులతోఁ జెప్పినాను. కాని కార్యములేకపోయినది. ఇంతకును ఆమె కుమారుఁడు బ్రతికియుండినఁగదా మనము దేనికైనఁ బ్రయత్నించుటకు? చేతులుకాలిన తరువాత నాకులుపట్టిన నేమిలాభమున్నది? నీవే చెప్పుము."

"బాహురాయణా! సత్యనిష్ఠయం దింతటిపట్టుదలఁగలవానిని నిన్నే చూచితిని సుమా! నీమాటవినక యతిక్రమించి రాజామాత్యులు నిన్నుఁ బరాభవించినను ఈషణ్మాత్రమైన నీవా క్రోధమును వహింపవైతివి. నీకన్నసాధు వింకెవ్వఁడు గలఁడు? పాపమా కుమారుఁడే బ్రతికియుండినచో నీముచ్చటలన్నియుఁ దీరునుకదా? ఇంతకును నీవెంత సేనానాయకుండవైనను ఏమిచేయఁగలవు? పాపము! నీచేయి క్రిందైపోయినది. నీపౌరుషమంతయు మూలఁబడిపోయినది. రాజామాత్యులవలనఁ బరాభవమా సంభవించినది? ఇన్ని సైన్యము లున్నను కాలవశముచేత నేమియును చేయఁజాలకపోతివి. బాహురాయణా? నీవేమనుకొన్నను సరియేకాని మగధరాజ్యరమాప్రాణరక్షణ దక్షుండవగు నిన్నింత చులకన సేయుటవారి కెంతమాత్రమును ధర్మముకానుసుమా."

"ఆర్యా నిక్కమే వచించితివి మించినదానికిప్పుడు వగచిన నేమిలాభమున్నది! ఇదియునుగాక బాహురాయణుని పరాక్రమము వారేమెఱుఁగుదురు? చెరసాలలో జనించిన రాకుమారుని సన్నసన్నగఁ దెగటార్పించిరికాని యంతకొకక్షణము క్రిందట నాకుఁ దెలిసియుండిన నీరాజును, ఈయమాత్యుఁడును ఇంతకాలము రాజ్యమేలియుందురా? అబ్బాలుఁడే బ్రతికియుండినచో నీసుమాల్యుని కిట్లు పట్టాభిషేకము జరిగియుండునా? మగధరాజ్య సింహాసనమును ద్రినేత్రుఁడైనఁ గన్నెత్తిచూడఁగలఁడా! మించిపోయినది; కార్యము మించిపోయినది. ఇప్పుడెన్నకొన్న నేమిలాభము?"

"హహ్హా! హహ్హా! హ్హా! బాహురాయణా? శాబాస్! శాబాస్. పౌరుషమన్న నిట్టిదియేకదా? అబ్బా! మురాదేవికొడుకుపై నీకింతయభి

తానమున్నది! అవును. నీభుజపరాక్రమమును జూపి స్వయముగ నీవు దెచ్చిన రాజపుత్రికి జనించినకుమారునిపై నీకింతప్రేమముండుట సహజమే! ఈ విషయమై నీప్రాణమైనను లక్ష్యింపక నీవు వ్యయముచేయవలసి యున్నది. సరేకాని బాహురాయణా! మఱియొకమాట. ఒకవేళ నామెకుమారుఁడే బ్రతికియున్నాడను కొనుము. అట్లైనచో నిప్పుడు నీవేమిచేసెదవు, చెప్పుము."

"ఏమిచేసెదనా? మీరెఱుఁగరా? దేవా! దైవానుగ్రహమున నట్టులే జరిగియుండినచో నీయమాత్య రాక్షసుఁడును ఈధననందుఁడును నా కొకలక్ష్యమా! ఈక్షణమందె యువరాజను గద్దెపైనుండి క్రిందకీడ్చి యందుపై నాబాలసుందరునిఁ గూర్చుండఁబెట్టనా? దేవాసురు లెదిర్చినను రాజ్యమొదలకు దక్కనిత్తునా! అయ్యో! పాపమాబాలునకుఁ జక్రవర్తి లక్షణములుండెనని చూచినవారందఱును జెప్పుచుండిరి. కాని దైవమునకుమాత్ర మనుగ్రహము కల్గలేదు."

"ఆ! రాజ్యమేయిచ్చెదవా? అబ్బా! ఎంతధైర్యము అవును సైన్యములు నీచేతిలోనుండ రాజామాత్యులు మాత్రము నిన్నేమి చేయఁగలరు? అయితే! నీసైనికులు నీకు లోఁబడియే యుండెదరా లేక......"

"లేదు. లేదు. ఆసందియ మక్కఱలేదు. సైనికులందఱు నాకు దాసానుదాసులై నాయానతి నతిక్రమింపకయే వర్తించెదరు."

"సరే! నీయాజ్ఞ నీసైనికు లతిక్రమింపరు కాని రాజామాత్యుల యాజ్ఞ నీవెట్లతిక్రమించెదవు."

"ఆర్యచాణక్యా! అక్కఱకురాని యీశుష్కవాదమెందులకు? న్యాయాన్యాయవిచక్షణులే లేనప్పుడు వారియాజ్ఞ నన్నేమిచేయఁగలదు!"

"బాగున్నది దీనికే దండనీతియందురు. నీతిశాస్త్రమంతయు నీవు చక్కఁగఁ జదివికొనినట్లే కనబడుచున్నావు. నీసత్యనిష్ఠకు నేనెంతయు సంతసించితిని. ఎప్పుడైన నిట్టిన్యాయముతోడనే యుండుము. లేకున్న నీయధికారమెందుకు?

"ఆర్యా! నిశ్చయముగ సమయమువచ్చినప్పు డట్లుసేయుటకు నేను సిద్ధముగానే యున్నాను. కాని వృథావాదమెందుకు? ఆరాజకుమారుఁడు బ్రతికియున్నాఁడా!"

"అబ్బా! నీకెందుకయ్యా! బ్రతికియేయున్నాఁడనుకొని నాకు జవాబు చెప్పుము. ఇట్టిసంభాషణము రాజ్యకార్యధురంధరుఁడవగు నీతోఁగాక మరెవ్వరితో నొనర్చెదను? ఇది యిట్లుండనిచ్చి మఱియొకమాట విను. ఈపట్టణమునకు సమీపముననే పర్వతరాజున్నవాఁడుకదా? వాని కెట్టులయిన నాశఁగల్పించి యీనగరమును ముట్టడించునట్లు చేయవలెను. ఈపని రాక్షసునిపేరుపెట్టి మనమే వర్తమాన మంపుదము. అమాత్యరాక్షసుఁడే తన కనుకూలుఁడయ్యెనని యెఱింగి యపరిమితమైన సంతోషమునుబొంది పర్వతేశ్వరుఁడు తప్పక బయలుదేఱివచ్చును. వాఁడే రాజ్యముపై పెద్దకాలమునుండి కన్నువేసియున్నవాఁడుకదా! రాక్షసుని సంతకముతో మనము వానికొకయుత్తరము వ్రాసిన వానికిఁ బెద్దయాశ జనించును. తరువాత నమాత్యరాక్షసుఁడే శత్రువునికోటపైకి బలిమిని రప్పించి యింతయల్లకల్లోలముఁ జేసెనని ప్రజలకందఱికిని తెలియఁగలదు. అప్పుడుమాత్రము నీవును నీసైన్యములు మౌనవ్రతమూని యూరకుండవలయును. నందవంశము నాశనమొనర్చినతరువాత సింహాసనార్హుఁడగు రాకొమరుఁ డొకఁడున్నాఁడని చెప్పి నీవు పోరాడవచ్చును. ప్రజలుగూడ నీకనుకూలురై యుండెదరు. ఆ రాకొమరుఁడు ధననందుని కుమారుఁడేయని విని యెంతయో సంతసించెదరు. ఇదియంతయు నాకల్పనవల్ల జెప్పినానుసుమా! అనఁగా ఇట్టిసమయ మెప్పుడైనవచ్చినచో నిట్టి చతురతయే చూపవలెను మఱేమియును గాదు."

ఆమాటలన్నియు విని సేనాపతి తనలో నావిషయమునుగూర్చియో యాలోచించుచు వానికేమియుఁ బ్రత్యుత్తరమీయలేదు. అందుచే మరలఁ జాణక్యుఁడు,

"బాహురాయణా! ఇట్లు చేసిన బాగుగానే యుండును కదా? ఎప్పటికైనను మగధరాజ్యమునకుఁ జేటుతప్పదు. నీకింక సందేహమేమియున్నది? పర్వతరాజున కుత్తరము వ్రాయుటకా సందేహించుచున్నావు. అందుకేమియును భయములేదు. రాజెప్పుడు నంతఃపురములోనే యుండును. పైకి రాఁడు. పాటలీపుత్రముపైఁగల ఆశచే నంధుఁడైన పర్వతరాజు తప్పక వచ్చి పట్టణము ముట్టడింపక మానఁడు. ఇది రాక్షసుఁడు చేసిన కుట్రయే యని అందఱికిఁ దెలిసిసిన మఱింత లాభకారియగును. కాని, సేనలుమాత్రము నీవు నడపకుండనుంచవలెను. ఏమి యూరకుండెదవు?"

"ఆర్యచాణక్యా! బాగుగానే యున్నది; కాని ఆరాకొమారుఁడెక్కడనున్నవాఁడు. జీవించియే యున్నాఁడా? అది మొదట చెప్పుము."
"చూచితివా బుద్ధిమంతు లెప్పుడు నిట్లే కార్యాలోచనము చేయవలెను. నిష్కారణముగ రాజామాత్యులు మురాదేవికొడుకును చంపినారని నీవు విచారించుచుండ నీయుద్దేశముఁ గనుగొనవలెనని బ్రతికియే యుండిన నేమి చేసెదవో? యని అడిగితిని కాని, మఱియొకటి కాదు."

ఇట్లు సంభాషించుచుండ నింతలోఁ జాల ప్రొద్దెక్కినందున వారిరువురును లేచిపోయిరి. సేనాపతి చాణక్యునియొద్ద సెలవుఁ గైకొని తనయింటికి బయలుదేఱెను. కాని మార్గమధ్యమున వానికెన్నియో సందేహములు తోఁచినవి. అమాత్యరాక్షసుఁడు తనప్రవర్తనమును దినమును గూఢచారులఁ బంపి కనుఁగొనుచునే యుండును గావున నానాఁడుకూడ తాను చాణక్యునితో మాటాడినమాటలు ఎవరైన వినిరేమో యని సందేహించుచుఁ ద్వరగా నింటికిఁ బోవుచుండెను. రాక్షసుఁడు తన్ను నిర్భయముగఁ దిరుగనీయనివాఁడు కదా

యని వానికాగ్రహముగూడ జనించినది. ఆనాటిసాయంకాల మాతఁడిల్లు సేర నొకసేవకుఁడు వచ్చి వానికేదో యొకయుత్తరమిచ్చి చేతులు మోడ్చి "అయ్యా! తమరెట్లున్నను దయచేయవలయునని యమాత్యరాక్షసుని యాజ్ఞయైనది" అని పలుక బాహురాయణుఁడు విపరీతమైన యాగ్రహమును వహించి ఆయుత్తరమునుజూచి తిరస్కారముతోఁ జించి పారవైచి తనయాగ్రహము దిగమ్రింగి అమాత్యరాక్షసునియింటికిఁ బోయెను. వానిఁజూచి నంతనే రాక్షసుఁడు "అయ్యా! నీవు ప్రతిదినమును ఆబ్రాహ్మణునితో నేమి మాటాడుచుందువు? అతఁడెవ్వఁడు? రహస్యముగ మాటాడుకొనుటకు నీకును వానికిని నేమి సంగతులున్నవి?" అని యడిగెను.

ప్రకరణము. 16.

సేనాతిపతి బాహురాయణుఁడు.

అమాత్యరాక్షసుఁడడిగిన ప్రశ్నమును విని బాహురాయణుఁ డాందోళనము బొంది వానిపైనిదివఱకుఁ దనకున్న యసూయ మఱింతయధికముఁ జేసికొనెను. ఒక్కమారుగఁ దన్నావేశించిన క్రోధము నణఁచుకొని పైకెంత మాత్రమును దోఁపనీయక

"అయ్యా! నన్నుఁ బిలిపించి యిట్లడుగుటకుఁ గారణమేమి?"

అనియడుగ వానికిఁ గోపమువచ్చినదని మంత్రిగ్రహించి

"కారణమా? ఆబ్రాహ్మణుని విషయమై నాకుఁ గొంచెముసంశయముగనున్నది. వానివిషయమై నేనిదివఱకే విచారించుచున్నాను. నీవును వానిజతఁగూడినందున నీపైఁగూడ నాకనుమానముగనున్నది. ఆసంగతులేమో కనుఁగొనవలయుననియే నిన్నురప్పించితిని. నీవును వానికి నిదివఱకు నాలుగైనుసార్లు భేటీయైనదని విన్నాను. అప్పుడే నిన్నడుగఁ దలచితిని గాని జ్ఞాపకము లేకపోయినది."

అనిచెప్పి మంత్రి వానిముఖలక్షణములన్నియుఁ గనిపెట్టుచుండెను. వానికేమి ప్రత్యుత్తర మీయవలయునాయని సేనాపతి కొంతవఱకుఁ దనలోఁ జింతించి

"అయ్యా! ఆబ్రాహ్మణునిఁగూర్చి నాకంతగాఁ దెలియదు. అతఁడు పరదేశియఁట. ఈగంగాతీరమున నాలుగుదినములు వసింపవలయుననియు

మీబోటివారిస్నేహమే నేనెప్పుడుఁ గోరుచుందుననియు నాతఁ డప్పుడప్పుడు నాతోఁజెప్పుచుండెను. అందుమీఁద నతఁడు గొప్పవిద్వాంసుఁడని యెఱిఁగి వానితో నేను స్నేహముఁజేసితిని. అతఁడు పండితోత్తముఁడు. దరిద్రుఁడేకాని ఎవరేమి యిచ్చినను బుచ్చుకొనఁడు. వానిహృదయమున నెట్టికోరికలును లేవు."

అనిచెప్పెను. కాని మంత్రిమాత్రము సమాధానమొందక కొంతకాలము నిశ్శబ్దముగ నూరకుండి

"ఆబ్రాహ్మణుఁడు మురపుట్టినింటినుండి యామెయన్నకుమారునిఁ దీసికొనివచ్చిన వాఁడని నీవెఱుఁగవా యేమి?"

"నాకాసంగతి బాగుగఁ దెలియదు. కాని యిట్లే నేనుఁగూడ విన్నాను."

"మఱి తెలియదనెదవేమి?"

"నేనెవరికుట్రలలోను జేరి గుప్తసేవకులఁ బంపి రహస్యములు కనుఁగొనువాఁడను గాను. మీప్రశ్నము లేమియును నాకుఁ దెలియవు."

"బాగా నేయున్నది........సరే! ఇంక ముందుమాత్రము వానిని నమ్మి మోసపోకుము. ముందే చెప్పినాను. అతఁడు మురాదేవిపుట్టినింటినుండి వచ్చినాఁడట కాని యది నాకు సందేహముగనున్నది. అతఁడు గొనివచ్చిన బాలుఁడు మురమేనల్లుఁడగునా కాదా యని నేనుఁగూడ నాలోచించుచున్నాను. నీవును ఈవిషయమై కొంతపరీక్షించి నిజముఁ గనుఁగొనుము. రెండుమూఁడు దినములలో వాని నిచ్చటనుండి గెంటింపవలసియున్నది. అతఁడు మ్లేచ్ఛరాజువద్దనుండి వచ్చినట్లు నాకనుమానముగనున్నది. అట్టి యనుమానపురుషునితో నీవు స్నేహము చేయఁగూడదు. నీవే యాలోచింపుము."

ఆమాటలు వినినంతనే సేనాపతి నిండాగ్రహముగ

“అయ్యా! తమరేమి చేయుటకైనను సమర్థులే! కాని పాపమా బ్రాహ్మణుని మాత్ర మన్యాయముగ నేమియును జేయకుఁడు. మీరు పెద్దలు. ఆలోచింపఁగలయును. ఆర్యచాణక్యుఁడు మ్లేచ్ఛులవద్దనుండి వచ్చిన వాఁయ బ్రాహ్మణుఁడని మనకుఁ దార్కాణమగఁ బడినచోఁ దప్పక శిక్షింతము. నాలుగైదుదినములనుండి నేనును వానిని బాగుగ నెఱుఁగుదును. అట్టియును మానవు లేకమైనను వానియెడ నాకుఁ దోఁపలేదు. మురాదేవి యజ్ఞశాలలో నుండుమని యెంతచెప్పినను వినక యీతఁ డెచ్చటికో గంగాతీరమునకుఁ బోయి యున్నవాఁడు. తమరు బాగుగ శోధించి ఏమిచేయవలయునో అది చేయుఁడు. మీరు శాంతమూర్తులు. దరిద్రుఁడును గొప్పవిద్వాంసుఁడును మిక్కిలి కర్మిష్ఠియునగు విప్రోత్తముని నిష్కారణముగ బాధించుట ధర్మముకాదు.”

అని కొంతవఱకుఁ జెప్పి బాహురాయణుఁడు వానియొద్ద సెలవుఁ గైకొని తనయింటికి బయలుదేఱెను. ఒండొరులపైఁగల అసూయ యప్పుడే వారిరువురకు మఱింత యధికమైనది. బాహురాయణుఁడు తన యింటికిఁ బోవుచు మార్గముగుండఁ దనలో “అబ్బా ఎంతవిషహృదయుఁడు? ఇంకను వీనిక్రింద నేను సేవసేయుచుండినయెడల నెప్పుడో యొకప్పుడు నాకవమానము గలుగక మానదు. ఛీ! సేనానాయకుఁడనైన నాయెడల నే సందేహము పుట్టినప్పుడు నే నీయుద్యోగములో నింకను నుండవచ్చునా? అమాత్యుఁడీ రాజ్యమున నెంతకాలముండునో అంతవఱకు నీయుద్యోగము నాకక్కఱలేదు. ఇంతకాలమునుండి యింతవిశ్వాసముతో రాజసేవ సేయుచుండ నిష్కారణముగ నాపై ననుమానము వహించుట కేమికారణము? ఏవాఁడు మురాదేవినిఁ గొనివచ్చి రాజున కప్పగించితినో అప్పటినుండియు నీరాక్షసుఁడు నాపైకనులెఱ్ఱఁ జేసియేయున్నాఁడు. ఇంతకాలమునుండియు సాహసించి పైకేమియు ననలేదు కాని యిప్పుడిప్పుడు తనయసూయ వెడలఁ

గ్రక్కుచున్నవాఁడు. విధివశమున నేదైనఁ దప్పు జేసినచో నీతఁడు నన్ను రాజ్యమునుండి గెంటించును కాఁబోలు? ఛీ! ఇట్టిస్థితిలో నీనీచసేవ యింక నే నెంతవఱకుండవలయును? ధనవంతుఁడు మేల్కాంచియుండియు నిద్రించుచున్నవారిలోనే లెక్క. కావున రాజ్యమంతయు నీక రాక్షసునిదే. ఇంక నేమియును సందేహము లేదు. ఇంక నీతఁడు తనయిష్టమువచ్చినట్లు చేయును. నన్నొకదొంగగా భావించుచున్నవాఁడు గావున వీనిక్రింద నేనుండఁగూడదు. ఆహా! ఆర్యచాణక్యుఁ డెంతమంచివాఁడు? ఎంతవిద్వాంసుఁడు? నిష్కారణముగ నట్టివానిని గెంటించినఁ దనకేమి లాభమున్నది? పాపమాతఁడు నట్టిదరిద్రుఁడు కదా! అతఁడు మురపుట్టినింటినుండియే వచ్చినవాఁడా లేదా యని యింకొకసందేహమఁట. ఆహా ఓయమాత్యరాక్షసా! నీకన్ని సందేహములు కలిగినవయ్యా! ఇంత విషహృదయుఁడవగు నిన్ను సేవించుచుకన్నఁ బాపమేమి యున్నది?........అయ్యో! చాణక్యుఁడు చెప్పినట్లు బాలుఁడే బ్రతికియుండినచో నిట్టిసమయమున నెంతచక్కఁగ నుండును? అంతయదృష్టమా? హిమగిరిచెంత బలవంతముగఁ జంపఁబడిన బాలుఁడు మరల నెట్లు బ్రతుకును. వాహ్వా! ఆతఁడే బ్రతికియుండినచో నీయమాత్యుని నేనింతలక్ష్యపెట్టుదునా? వీనికెంత పరాభవమును గల్గింతును? నేనే లేఁగినచో నీరాక్షసుఁడును ఈయువరాజును ఈధననందుఁడును అడ్డగించు పాటివారా!” అని యనేకవిధములఁ దనలోఁ దలపోయుచు నతఁడింటఁ బ్రవేశించెను.

ఆనాటిరాత్రి భోజనముఁజేసి యాతఁడు తనగదిలోఁ బరుండెను కాని నిద్రమాత్రము పట్టలేదు. అమాత్యరాక్షసునకు అనుమానమంకురమైనందున నీపైని దాను జాగ్రత్తగనుండవలయుననియు నాకస్మికముగ నేక్షణమునఁ దనకేమి శిక్షవిధించునో యూరినుండియే గెంటించునో యని యనియు ననుకొనుచు నాతఁడారాత్రి యట్లేగడిపెను. ఏదియెట్లైనను రాక్షసుని వల్లనఁ జాణక్యునకుమాత్ర మేమియు నాపద రాకుండఁ గాపాడవలయు నని

యాతఁడు నిశ్చయించుకొనెను. ఎప్పుడు తెల్లవారునో చాణక్యునితో నీసంగతులన్నియు నెప్పుడు చెప్పవలెనో యని నిముసమొక యుగముగ కాలము గడపెను.

ఇంతలో నుదయమైనది. వెంటనే లేచి కాల్యకృత్యముల నిర్వర్తించుకొని గంగాతీరమున కతఁడు బయలుదేఱెను. మార్గమునఁ బోవుచు నతఁడు మాటిమాటికిని వెనుకకుఁ దిరిగి చూచుచు నతిజాగ్రత్తతో నడచుచుండెను. సేనానాయకుండయ్యుఁ దానొకరికి వెఱవవలసివచ్చెనుగదా యని బాహురాయణుఁడు తనలోఁ దానే విచారింపఁదొడఁగెను. అట్లుపోయి యతఁడాశ్రమమునఁ బ్రవేశించిన కొంతసేపునకుఁ జాణక్యుఁడు నదియొడ్డునఁ దన జపతపాదుల నిర్వర్తించుకొనివచ్చి వానిఁ గలసికొని యిట్లు ప్రసంగించెను.

"ఓహో! బాహురాయణుఁడా? నీవువచ్చి యెంతసేపయినది.? నేఁడు నీవు వచ్చెదవని నేననుకొనలేదుసుమా? అదేమి? నీముఖలక్షణములు చూడ నీవేదియో విచారముతో నున్నట్లున్నది?"

"అవును. తమదర్శనమునకు నేనిప్పుడే వచ్చితిని. తమరు నాకు స్నేహితులగుటయేకాక గురుసమానులుగాన కొన్నిసంగతులు మాటాడవలయు నని వచ్చినాఁడను. తమరుమాత్రము నాపయి నాగ్రహము వహింపఁగూడదు."

"ఆగ్రహమా? నాకా? బాహురాయణా! దురాశ, దురాగ్రహము ఈరెండును నేను చాలకాలము క్రిందటనే విడిచిపెట్టితిని. మరల నిప్పుడెట్లు వచ్చును? నీవేమి చెప్పఁదలచితివో చెప్పుము నేను సావధానముగ నున్నాను."

"ఆర్యా! చెప్పెదనుకాని నిన్నటిసంభాషణలో మీరేవైనఁ గొన్ని

సంగతులు నాతోఁ జెప్పక దాఁచియుంచితిరా? అదిమొదలు సెలవిండు తరువాత మనవిఁజేసికొనెదను."

"(నవ్వి) బాహురాయణా! నావద్ద సెలవుపుచ్చుకొని నీవు వెళ్లిన తరువాత నన్నుఁగూర్చి నీతో నెవరో మాటాడియుండవచ్చును. లేకున్న నీవు నన్నిట్లెందుకడిగెదవు? ఎవరు నీతో నా విషయమై చెప్పిరో వారినే కొంచెము శ్రద్ధగా నడిగినచో నన్నీ ప్రశ్న నీవడుగ నవసరముండకపోవును. మఱి నేను పేదబ్రాహ్మణుఁడనను సంగతి యిదివఱకే చెప్పినానుగదా? నీతిశాస్త్రానుసారముగఁ గ్రొత్తమనుష్యులెవరైన వచ్చినయెడల వారినిజాగ్రత్తగ విచారింపవలసియేయున్నది. ఇంకదాఁప నేల? నావిషయములో నమాత్యరాక్షసుఁడట్టులేయున్నవాఁడు. అతఁడేకదా ప్రస్తుతము మగధరాజు. ఇందుకు సందేహములేదు. ఇంతకును నాచరిత్రము దగ్గించినీతో చెప్పుటకు నాకేమిభయమున్నది? నన్నుఁగూర్చి నిన్నడిగినవాఁడా యమాత్యరాక్షసుఁడే కావలయును. మనయిరువురమీఁదను కన్నువేసి మనస్నేహమునకు భంగము గల్గింపనున్నవాఁడాతఁడే! ఏమి నిజమేనా?"

అని పలుక యొడలెల్లఝల్లు మన సేనాపతి "అరే యీతని కీసంగతి యెట్లు తెలిసినది? అసాధ్యునివలెనున్నాఁడే? ఎంతచతురుఁడు? ఎంతనీతివిదుఁడు. బలేబలే" అని కొంతవఱకాలోచించుచు నూరకుండెను.

" అప్పుడు చాణక్యుఁడు,

" బాహురాయణా! నేను చెప్పవలసినదేదియో చెప్పితిని. ఇంక నీచెప్పఁబోవుసంగతులు వినుటకాతురతతో నున్నాను."

అని యడుగ సేనాపతి గడచిన రాత్రితనకును రాక్షసునకును జరిగినసంభాషణమంతయుఁ బూసగ్రుచ్చినట్లేకరువుపెట్టెను. అదంతయువిని చాణక్యుఁడుగ్రుఁడైతనలో "అరేరాక్షసా! అవలించినఁ బ్రేవులు లెక్కిడఁగలవాఁడ

తని నిన్నిదివఱకే యెఱుఁగుదువురా? తొందరపడకు! తొందఱపడకు. ఎట్లై నైనను నీకును నాకును యుద్ధముజరుగకమానదు. అందెవరు గెల్చెదరో నీవే చూచెదవు." అని యనుకొని తటాలున లేచి "బాహురాయణా ఇప్పుడు నేను నీకుఁ గొన్ని రహస్యము లెఱింగింపవలసియున్నది. అవి అతిరహస్యములు. ఎవరికిని తెలియఁగూడదు. కావున కొంచెముదూరముగ బోయిమాటాడుదమురా. ఈసంగతులుమాత్రము నీవెవరితోడను చెప్పకు."

ప్రకరణము. 17.

అమాత్యరాక్షసుఁడు.

ఆనాఁడు మధ్యాహ్నమే రాక్షసుఁడు తన మందిరమున నొక గదియం దొంటరిగఁ గూర్చుండి ఏదో కార్యాలోచనము సేయుచుండెను. అమాత్యుఁడంత సొగసరి కాఁడుగాని మిక్కిలి యాజానుబాహుఁడు అతని ఫాలము చాల వైశాల్యముగల్గి గొప్ప యదృష్టవంతుఁడని చెప్పక చెప్పుచుండెను. అన్ని విద్యలయందును నతనికిఁ బ్రవేశమున్నది కాని రాజనీతియందు మాత్ర మంతవాఁడు లేఁడు. ఏవిషయమును గూర్చియైనను అతిసూక్ష్మముగా గ్రహింపఁగల శక్తి యాతనికిఁ గలదు. వాని యాకారమే కాక పాలనముగూడ నెల్లవారికిని భయంకరముగ నుండుచుండెను. ఎదురుగనిల్చి మాటాడుట కెంతవానికైన దేహము గజగజవణఁకకమానదు. ఆనాఁడతఁడేదో కార్యాలోచనమునందుండుటవలన సేవకు లెవ్వరును దగ్గఱలేరు. తనయాజ్ఞ లేనిదే యెట్టి సేవకుఁడైనను చెంతకువచ్చుటకు వీలులేదు. కాని వారందఱిలోఁ దనకు ముఖ్యుఁడగు హిరణ్యగుప్తుఁడు మాత్ర మెప్పుడైనను వచ్చి యతనితో మాటాడవచ్చును. ఇతఁడు రాక్షసున కొక ముఖ్యమంత్రివంటివాఁడు. అవసరమైన పనులేవైనఁ జేయవలసివచ్చినప్పుడు రాక్షసుఁడు వీనికే నియమించుచుండెను. రాక్షసునిపైఁ బ్రజలలోఁ గొందరి కసూయ కలదుగాన అతనిఁ గూర్చి ఎవరెవ రెప్పుడెట్టు లేమని యనుకొనుచుందురో రహస్యముగఁ గనిపెట్టి యుంచుచు మంత్రితోఁ జెప్పుచుండెను. అందుచే వానిపై నమాత్యునకు మంచివిశ్వాస ముండెను.

రాక్షసుని దీర్ఘాలోచనము రాజ్యమును గూర్చియు మురాదేవినిఁ గూర్చియు చాణక్య చంద్రగుప్తులను గూర్చియుఁ గాక నింకేమున్నది.

మురాదేవి పూర్వమువలెనే ధననందుని వశముఁజేసికొనునుగదా యని యాతఁడూరక విచారించుచుండెను. ధననందుఁడు ఆమెవలలోఁ బడుటవానికాశ్చర్యము బుట్టించెను. రాజు నెట్టులైన నచ్చటినుండి పైకిఁ దెప్పింపవలయునని తనయావచ్ఛక్తిని వినియోగించెనుకాని కార్యము లేకపోయినది. ఎల్లప్పుడును ధననందుఁడు మురయంతఃపురముననే యుండుటవలన నేక్షణమున నెట్టి యుపద్రవము పుట్టునోయని యతఁ డనుమానించుచుండెను. రాజునకు మరల మురాదేవిపై ద్వేషముపుట్టించుటకు తనకుపాయమేమియుఁ దోఁపలేదు. మురాదేవి, యొక్కక్షణమైనను వానిని విడువక యెల్లప్పుడు సమీపముననే యుండుటచేతను, అచ్చటికిఁ బోవుట కెవ్వరికిని అజ్ఞ లేకపోవుటచేతను, రాజువిషయమై యాతఁడెట్టి యేర్పాటులు చేసినను అవి యన్నియు భగ్నమైనవి. అయినను రాక్షసుఁడు తలఁచిన కార్యమునందు మిక్కిలి పట్టుదలకలవాఁడు. అతఁ డెట్టికార్యముఁ జూచినను కొసనఱకుఁ జూచినదాఁక దిగవిడువఁడు. అందుచే నతఁ డాలోచించి యాలోచించి, మురాదేవియొక్క పరిచారకులలో నెవ్వతెనైనఁ దనకువశముఁ జేసికొనినచోఁ దనకీకార్యము సాధ్యమగునని యాతఁడు నిశ్చయించుకొనెను. అదివరకే యతఁడు బృందమాలయొక్క స్వభావాదులను బాగుగ నెఱిఁగియున్నవాఁడుకానఁ బరిచారికలందఱిలో నామెయే యుత్తమురాలని యెంచి మెల్లఁగ నామెను చేరఁదీసి మంచి చేసికొనవలయునని ప్రయత్నించుచుండెను. అందు నిమిత్తము తనకు ముఖ్యసేవకుఁడగు హిరణ్యగుప్తుఁ డొకఁడున్నవాఁడుకదా? వాని సాహాయ్యముచేతనే తానీకార్యము సాధింపవలెనని యతఁడు చూచుచుండెను. బృందమాలను వశముఁజేసికొనినచోఁ దనకన్ని కార్యములగును గావున నొకటిరెండు దినములలో నెట్టులైనఁ బ్రయత్నించి యామెను తనయొద్ద కంపవలయునని రాక్షసుఁడు హిరణ్యగుప్తునకుఁ గఠినముగ నాజ్ఞాపించెను. ఆమెను దీసికొనివచ్చుటకుఁ దగినయుపాయముఁగూడ నాతఁడే వానికి బోధించెను.

ఇంకఁ జంద్రగుప్తుని విషయమై రాక్షసునకుఁ గల యనుమానములు

గొంత తెలుపవలసియున్నది. చంద్రగుప్తుని సుందరాకారమును, వాని ముఖలక్షణములును, వాని చాతుర్యమును, కళాకౌశల్యమును రాక్షసుఁ డెప్పుడు కనిపెట్టెనో యప్పుడే వాని గుండె జాఱిపోయినది. ఆకారణమున నతఁడు తనలో "ఆహా చంద్రగుప్తుఁ డెంతచుఱుకుగలవాఁడు? ఎంత సౌందర్యవంతుఁడు? అట్టివానిని మురాదేవి తన దగ్గఱనుంచుకొనుటవలన నెట్టి మోసమైనఁ గలుగవచ్చును. వాని నడతనుగూడ నేను బాగుగఁ గనిపెట్టినాను. అతఁడు సకలకలావిశారదుఁడు. ఇట్టివాఁడు రాజ్యముననుండినచో యువరాజునకట్టి యాపదయైనరాఁగలదు. సందేహములేదు. కావున నిట్టితఱినే దైన మోసముఁజేసి వానినిఁ జంపించుటయే యుత్తమమైన మార్గము. అందులకు జాలిపడినచో రాజ్యమునకట్టి యిక్కట్టులైన రాకమానవు. ధననందునంత వానినిఁ దనకు దాసానుదాసునిగఁ జేసికొనిన మురాదేవి, యట్టిబాలునిఁ జెంతనుంచుకొని తన సవతికొడుకు యువరాజై గద్దెపై నుండఁ జూచుచు నూరకుండునా? మురయొక్క స్వభావము నాకుఁ గ్రొత్తదియా? కాఁబట్టి మురాదేవి రాజ్యము విషయమై యేదైనను తంత్రముఁ జేయక మానదని రాజునకు భయముఁ బుట్టింపవలయును. అందువలన ధననందునకు మురాదేవిపై ననురాగము తగ్గుట, చంద్రగుప్తునకుద్వాసముఁ జెప్పుట, యొక్కమాఱుగ జఱుగును. అయినను ఒక్క బాలుఁడగు చంద్రగుప్తుని విషయమై నేనింత యాలోచింపనేల? అతఁడు మురాదేవికి మేనల్లుఁడు కదా? మేనత్తను జూచుటకే వచ్చినాఁడు. నాలుగు రోజులుండి మరలఁ దనయింటికి తానే పోవును! చుట్టఱికపుఁ జూపునకు వచ్చినవాఁ డెంతకాలముండును? ఇదిగాక నా కింకొక యనుమానమ్ముగూడఁ గలుగుచున్నది. ప్రద్యుమ్నునకుఁ గుమారుఁడుండినట్లు నేనిదివఱకెన్నఁడును వినలేదు. చంద్రగుప్తుఁడు వాని కుమారుఁడా! కాఁడా? ఈసంగతియే మొదట నాలోచింపవలయును. నిజముగాఁ జంద్రగుప్తుఁడు ప్రద్యుమ్నుని కుమారుఁడే యైనచోఁ గొన్ని దినములుమాత్ర మిక్కడనుండి తరువాతబయలుదేఱిపోవును కాన వాని విషయమై నేనేమిజాగ్రత్తపడ నవసరములేదు. అట్లు కానిచోఁ జంద్రగుప్తునియూర్పి యెంతమాత్రము [illegible]

డను. కావున నీసందేహమును నివృత్తించుకొనుటకిప్పుడే యొకయుత్తరమును ప్రద్యుమ్నునకు వ్రాసిపంపెదను."

అనియెంచి ప్రక్కకుఁజూచి "హిరణ్యగుప్తా! హిరణ్యగుప్తా!" అని రెండుసారులు హిరణ్యగుప్తునిఁ బిలిచెను. తోడనే యతఁడు వానిచెంతకు వచ్చి చేతులజోడించుకొని నిలిచియుండెను. వానింగాంచి రాక్షసుఁడు,

"హిరణ్యగుప్తా! ఏమిచేయుచున్నావు?"

"దేవా. ఏమియునులేదు. ఎవఁడో యొకభిల్లుఁడు దేవరవారికొకయుత్తరమును దెచ్చినాఁడు. వానితో మాటాడుచున్నాను?"

"ఎక్కడనుండి వచ్చినాఁడు? ఆయుత్తరమును వ్రాసినవారెవరు?"

"అదే వానినడుగఁబోవుచుండ దేవరవారింతలో నాజ్ఞాపించినందున నిట్లువచ్చినాను."

"సరే నీవు పోయి యాయుత్తరమును వానిని వెంబట దీసికొనిరా. తరువాత నేను పిలిచిన కారణముఁ దెలిపెదను."

"చిత్తము."

అని పోయి హిరణ్యగుప్తుఁడు భిల్లుని వానిసమీపమునకుఁ గొనివచ్చి రాక్షసునెదుటఁబెట్టెను. ఆభిల్లుఁడు నల్లనిదీర్ఘకాయము గలవాఁడు. ఎంతోదూరమునుండి నడిచివచ్చినట్లు వానిశరీరమంతయుఁ జెమటచేఁ దడసి పాదములు ధూళిధూసరములై యుండెను. అతఁడు రాక్షసునిఁజూచి నమస్కరించి తనయొద్దనున్న యుత్తరమును వానికొసఁగ నాతఁడా పత్రికను పుచ్చుకొని యిట్లు చదువనారంభించెను.

శ్రీమన్మహారాజరాజ సన్నుత సచ్చరిత్రులును, రాజ్యకార్యనిర్వాహ ధురంధరులును, సకలకళా విశారదులును, మగధరాజామాత్య శేఖరు

లును అగు శ్రీరాక్షస మంత్రిగారి దివ్యసముఖమునకు తమసేవకుఁడు ప్రద్యుమ్నుఁడు వందనశతంబు లాచరించి వ్రాసికొనిన విజ్ఞాపన మేమన,

అమాత్యశేఖరా

చిరంజీవి నాచెల్లెలగు మురాదేవియొద్దకు నాకుమారుఁడగు చంద్రగుప్తు నిదివఱలోఁ బంపించినాను. అప్పుడే తమ కొకయుత్తరమును వ్రాసి మాసేవకులలో నొకనికిచ్చి పంపించితినిగాని యామందభాగ్యుఁడా యుత్తరమును దారిలో నెచ్చటనో పారవేసినందున నిప్పుడు మరల వ్రాసి జాగ్రత్తగఁ బంపుచున్నాను. అందుచేఁ దమకుత్తరము జేరుట ఆలస్యమైనందుకు క్షమింపవలయును. నాచెల్లెలిని మహారాజుగారు మరలఁ జేరఁదీసి యాదరించుచున్నారనివిని యెంతయో సంతసించినాను. తమకుఁగూడ నామీఁద నెట్టియనుమానము లేదని వినినందునఁ దమకనేకవందనములు సమర్పించుకొనుచున్నాఁడను. మాయువరాజువెంట నొకపండితునిఁగూడ బంపించినాను. ఆయన కనేక దేశములు చూడవలయునని కోరికయుంటచే ముఖ్యముగఁ దమరాజ్యముఁ జూడవలసియున్నదని యెంచి మాచంద్రగుప్తునివెంట వానిఁ బంపించితిని. తమదర్శనముఁగూడఁ జేయవలయునని యాయన కెంతో యుత్సాహముకలదు. కాఁబట్టి మంత్రిశేఖరులందఱు రాజులకు లభించుట కష్టము. తమకీర్తి దేశదేశములయందు వ్యాపించియున్నది. కావునఁ దమ యువరాజుతోపాటు మాయువరాజునకుఁగూడ స్వయముగ రాజనీతుల నేర్పుచు వానిని బాగుచేయవలయునని ప్రార్థించుచున్నాఁడను. ఇతనినిఁగూడ మీరాజకుమారునివలె భావించి యాదరింపవలెను. వేరేల? వాని భారమంతయుఁ దమదే. అప్పుడప్పుడు తమయోగక్షేమములు తెలుపుచుండెదరుగాక

చిత్తగించవలెను.

విధేయుఁడు,

ప్రద్యుమ్నుఁడు.

ఈయుత్తరమంతయుఁ జదివిన తరువాత పాపము రాక్షసుని యుద్దేశము లన్నియు నొక్కమారు భగ్నములైనవి. కొంచెముసేపు తనలో నాలోచించి ప్రద్యుమ్నునివద్దికిఁక నెవ్వరినిఁ బంపనక్కఱలేదని నిశ్చయించుకొని తనలో "బాగున్నది. ప్రద్యుమ్నుఁడు వ్రాసినయుత్తరమును నేను తప్పక యాదరింపవలెను. ఆతఁడును ఒకరాజే కదా? వానిని గౌరవించుట నాకు విధియైయున్నది. వానియుత్తరముప్రకారము చంద్రగుప్తునిఁ జాగ్రత్తగాఁ జూడవలయును. వానివిషయమై నాకింక నెట్టియనుమానమును లేదు." అనియెంచి ఆభిల్లునకు భోజనముఁ బెట్టించెను. తరువాత హిరణ్యగుప్తుఁ డెదుటను వచ్చి నిలిచి,

"దేవా! నా కేమి సెలవు?"

"నిన్నెందుకుపిల్చితినో ఆకార్యమైనది. మఱియుకసరములేదు కాని బృందమాల మాటయేమిచేసితివి?"

"స్వామీ! నేనామెతోఁ జెప్పవలసినంత దూరము చెప్పి బోధించినాను. కాని యామె తమదర్శనమునకు వచ్చుటకు భయపడుచున్నది. తను గొంటరిగఁ గూర్చుండి రహస్యముగ మాటాడెదరన్న నామె భయము మఱింత యధికమయ్యెను. కడకెట్టులైననేమి యామెనొప్పించుటకు నాతాతలుదిగివచ్చిరి. నేఁడు తమదర్శనమునకు వచ్చెదనని చెప్పినది."

"ఓరి తెలివితక్కువవాఁడా ఇన్ని సంవత్సరములనుండి నాదగ్గఱఁ బనిసేయుచు నీవేమి నేర్చుకొంటివిరా? నీభార్యద్వారా కబురంపవలయునని నేను చెప్పిన నీవెందుకు స్వయముగ మాటాడితివి? నీకింక నెప్పుడు బుద్ధివచ్చునురా? నీభార్యయే పోయి యామెతో నీసంగతి చెప్పిన బాగుండునా? ఆమె నామందిరమునకు వచ్చినచో నెవ్వరడ్డగింతురు? ఛీ! బాగులేదు. మరలఁ గబురంపు."

"చిత్రము చిత్రము. ఈసంగతి నేనెఱుఁగుదును. ఆమె నేఁడు వచ్చెద నని చెప్పినదికదా? రాకపోయినచో నట్లేచేసెదను."

అని ప్రసంగించుచుండ నింతలో నొకసేవకుఁడువచ్చి రాక్షసునితో "దేవా! దేవరవారితో నేమోమాటాడవలయు నని యెవతెయో యొకదాసివచ్చి ద్వారముకడ వేచియున్నది" అని పలుక, రాక్షసుఁడు "హిరణ్యగుప్తా! అదిగో! ఆమెయే వచ్చినది. నీవుపోయి తీసికొనిరా" అని చెప్పిపంపనాతఁడు తక్షణముపోయి యామెనులోనికిఁ గొనివచ్చెను. తోడనే రాక్షసుఁడు,

"బృందమాలా! నీకు క్షేమమా?"

"ఆర్యపుత్రా దాసినైననన్నుఁ దమరింత గౌరవింపవచ్చునా? తమసెలవునకు సిద్ధముగ నున్నాను."

"బృందమాలా! ఏమియునులేదు రాజుగారు మురయంతఃపురములోనే యుండుటచే నచ్చటి సమాచారము మాకేమియును దెలియకున్నవి. విశేషములేమైనఁ జెప్పెదవేమోయని పిలిపించితిని. నీవు మిక్కిలి స్వామిభక్తిగలదానవు. నిన్నుజూచిన నాకు మిక్కిలి యానందము గలుగుచున్నది. రాజదంపతు లిరువురు క్షేమముగ నున్నారా?"

అని యడిగి నవ్వుచు రెండుబంగారుకంకణముల నామెకు బహుమానమిచ్చి,

"బృందమాలా! సంశయింపకుము. నీనుండి నే నొక యుపకారమును గోరుచున్నాను. అదేమన? అంతఃపురములోని విశేషములు నీవెప్పటికప్పుడు వచ్చి నాకుఁజెప్పుచుండవలయును. అయినను నీవింత దూరమువఱకు రానవసరములేదు. హిరణ్యగుప్తుఁ డక్కడికి వచ్చుచుండును. వానితోఁ జెప్పినఁజాలు. నాకుఁదెలియఁగలవు. స్వయముగ నీవేవచ్చిచెప్పవలసిన యవసరమున్నచో ముందుగ నాకుఁగబురంపిన నేను సిద్ధముగ నుండెదను.

ఏరోజున కేమిజరుగునో అదిమాత్రము నీవు మఱవక నాకెఱింగించుచుండ వలయును."

"ఇంతమాత్రమేనా? అట్లులే చేసెదను. ఒకరితోఁ జెప్పనేల? నాకేమి రాణివాసమాయేమి? నేనేవచ్చి మనవిఁజేసికొనెదను."

"సరేకాని మనసంగతులు ఇతరులు వినగూడదు సుమా. బృందమాలా నీకు నేను నీతులు చెప్పవలయునా?"

"దేవా నేనుబృందమాలను కాను. ఆమెకుఁదోడిదాసిని. నాపేరు సుమతి. ఆమెకుఁ దీరుపాటులేనందున నన్నుఁబంపించినది. అయినను మేమిరువుర మొకటియే. తమసెలవు ప్రకారము నేను ప్రతిదినమువచ్చి యంతఃపుర విశేషములు చెప్పుచుండెదను.

ఆమాటలు మంత్రికిఁ జమత్కారముగఁదోఁప కొంతసేపాలోచించి

"సరే నీవైననేమి? ఆమెయైననేమి? మీయిరువురు నొకటియే కదా? నేను చెప్పినట్లుమాత్రము చేయుము."

"అభ్యంతరమేమి? తప్పక చేసెదను. ఇంక నాకు సెలవా"

అని యడిగి వానియొద్ద సెలవు పుచ్చుకొని సుమతియే కారణమునవో కాని రాజమందిరమునకుఁబోక, తిన్నగ గంగాతీరము నంకనడచసాగెను.

ప్రకరణము. 18.

రాక్షసుని యుద్దేశమునకు భంగము.

రాక్షసుఁడు తనకార్యము లొక్కమాఱుగ రెండును నెఱవేఱినందుల కమందానంద మొందుచుండెను. అందొకటి చంద్రగుప్తుని నిజస్థితి తెలియుటయు రెండవది మురమందిరమునఁగల రహస్యములు కనుఁగొనుట కేర్పాటు చేయుటయుఁగదా? ప్రద్యుమ్నుఁడు తన కింత మర్యాదగ నుత్తరము వ్రాసినందుకు వాని నెంతయో మెచ్చుకొనుచు వెంటనే జాబువ్రాసి పంపెను. ఆనాఁటిసాయంకాలమే చంద్రగుప్తుఁడు అమాత్యరాక్షసుని దర్శనమునకు వచ్చి,

"ఆర్యా! నేఁడు మాతండ్రిగారు నాకొక యుత్తరమువ్రాసిరి. అందులో నేను ప్రతిదినమును తమదర్శనమునకు వచ్చుచుఁ దమసేవ సేయుచుండవలె నని ఆయన నాకాజ్ఞాపించినారు."

"కుమారా! ఔను. నాకుఁగూడ నాజ్ఞాపత్రికవచ్చినది. బాబయ్యగారి సెలవుప్రకారము నీకు నేను రాజనీతులన్నియు నేర్పుచుండెదను. ఇక్కడ నున్నంతకాలము ప్రతిదినము నాయొద్దకు వచ్చుచుండుము. ఇంతమాత్రమునకై బాబయ్యగారి యాజ్ఞకావలెనా?"

అనిపలుకఁ జంద్రగుప్తుఁడు ఎంతోసేపు వానియొద్దనుండక సెలవుఁ బుచ్చుకొని వెంటనే బయలుదేఱిపోయెను. చంద్రగుప్తుని ముఖలక్షణములు స్పష్టముగ మురాదేవి ముఖలక్షణములఁ బోలియున్నవని యాతఁడు గ్రహించినందున రాక్షసున కొకవిధమయిన వికారము పుట్టెను. కాని యావి

కారమెంతో సేపువఱకు వాని హృదయమున నుండలేదు. ప్రద్యుమ్నుఁడు మురకన్నయేయగుటచే వానికుమారుఁడును వానినిఁబోలియే పుట్టియుండ వచ్చునని యతఁడు వెంటనే తనయనుమానమును సమర్థించుకొని పోఁగొట్టుం కొనెను. మురవిషయమయితప్ప ఇంకెట్టిశంకలును వానికిలేవు. ధననందు నక్కడనుండి తప్పించి మరల వానిపై రాజ్యభారము మోపుటకతఁడు విశ్వ ప్రయత్నము సేయుచుండెను. తాను స్వయముగ బయలుదేఱి యంతఃపుర ములోనికిఁ బోవుటకు వీలులేని కారణమునను యతఁ డంతఃపురదాసిని వశ ముఁజేసి యామెసాహాయ్యమును గోరవలసి వచ్చినది. అందువలనఁ గొంత వైనఁ దనకులాభముండకపోదని యతఁడు నిశ్చయించుకొనెను. ఆనిబ్బర ముచేతఁ దనరాజ్యకార్యము లన్నియుఁ జక్కఁగ నిర్వర్తించుకొనుచు నతఁడు సంతోషముతో నుండెను. ప్రతిదినమును హిరణ్యగుప్తుఁడు దాని యొద్దకుఁ బోయి క్రొత్తవిషయములఁ గనుఁగొని వానితోఁ జెప్పుచుండెను. ఒకనాఁడు సుమతి తాను స్వయముగానే వచ్చి యమాత్యునితో నిట్లు ప్రసంగించెను.

"అమాత్యవర్యా! మురాదేవి యేదియో యొకపెద్ద తంత్రమును జేయనెంచినది. అది స్పష్టముగఁ గనుఁగొనవలెనని యెంతో ప్రయత్నించితిని. గాని నాకేమియును దెలియలేదు. తెలిసిన వెంటనే వచ్చి యామెచేయనున్న కుతంత్రమును తమకు మనవిఁజేసికొనెదను. అది భయంకరకృత్యమఁట. గొప్పసాహసమఁట."

ఆమాటలు విని రాక్షసుఁడు మిక్కిలి యాతురపడి యామె నెన్నియో ప్రశ్న లడిగెను. సుమతి యంతకన్న నధిక మేమియుఁ జెప్పలేదు. అందుచే నామె తనకుఁ దెలిసియుండియుఁ జెప్పక దాఁచెనేమో యని సంశయపడి,

"సుమతీ! నిజముగ నింతకన్న నీ కేమియును దెలియదా?"

"దేవా! తెలిసియుండిన నెందుకు దాఁచెదను? అట్టిస్వభావమే కల దాననైనచోఁ బ్రత్యేకముగవచ్చి యీసంగతిమాత్రము తమతో మనవిఁ జేసికొనెదనా? తమ కెందులకీసంశయము?"

"అట్టే! నాకేమిసంశయమునులేదు కాని నీవుమాత్రము జాగ్ర త్తగఁ బ్రవర్తించి యారహస్యమేదియో కనుఁగొని తత్క్షణము నాకెఱింగింపవలయునుసుమా మఱచిపోవద్దు."

"తమరు ప్రత్యేకముగ నాజ్ఞాపింపవలయునా? నేనందుకు సిద్ధముగానేయున్నాను. నాకింక సెలవిప్పించెదరా?"

"మంచిది. పో! మఱచిపోకుమీ."

"ఎంతమాట? లేదు. లేదు."

అని ప్రత్యుత్తరమిచ్చి సుమతి యచ్చటనుండి బయలుదేఱెను. సుమతిచెప్పినమాటలు వినినంతనే రాక్షసున కాందోళన మంతకంత కెక్కుడగుచుండెను. అతఁడు వెంటనే హిరణ్యగుప్తునిరావించి ప్రతిదినమునుబోయి పూర్వముకన్న నెక్కుడుశ్రద్ధతో సుమతి చెప్పిన విశేషములఁ గనుఁగొని తనకెఱింగించుచుండవలయునని మరలఁ గఠినముగ నాజ్ఞాపించెను. పాపమాతఁడెంత యాలోచించినను మురాదేవి చేయనున్న సాహసకృత్యమేదియో వానికి బోధపడలేదు.

"ఔరా! ఎంతచిత్రము? ఆమె రాజును విషముపెట్టి చంపునాయేమి? అదిరాజునకా లేక యువరాజునకా?..............ఏవిధమునైన నింక మురను సాధింపకతీఱదు. లేకున్నచో గొప్పయాపద తటస్థించును. కావున నొకసారి రాజుతో నాకు భేటీకల్గిన బాగుండును. అన్నిసంగతులును మాటాడుటకు వీలగును. అవును కాని భేటీకలిగినచో వానితో నేమి మాటాడెదను? నేనేమిచెప్పినను నతఁడు వినునో వినఁడో? నామాటలు

వానికి రుచించునో రుచింపవో? సరే! యీసంగతులు తరువాత నాలోచింపవచ్చును. మొదట నాతని దర్శనము లభించుటకై ప్రయత్నింపవలెను. ఇందు కేమి యుపాయము!.........బలే! బాగున్నది. ప్రస్తుతమింతకన్న వేఱుమార్గము లేదు. శత్రువులు కోటముట్టడించుటకు సిద్ధముగ నున్నారు. కావునఁ గొన్నిసంగతులఁగూర్చి రహస్యముగ మాటాడవలయునని కబురంపిన నాతఁడు భయపడి తప్పక నాకు దర్శనమిచ్చును. కబురంపుట కొను ఉత్తరమే వ్రాయవలయును. ఔనుగాని పరులకంటఁ బడకుండ నాయుత్తరమును వాని కొసంగువారెవరు? సరే! యిందుకు సుమతియే యున్నది.''

అని తనలో నాలోచించి హిరణ్యగుప్తునిఁజూచి "హిరణ్యగుప్తా! నీవు పరుగుపరుగునఁబోయి యింటికిఁబోవుచున్న సుమతిని మఱియొకసారి తీసికొనిరా! అమెయింకను మార్గముననే యుండును. పో! పో! పరుగెత్తిపోయి తీసికొనిరా'' అని యాజ్ఞాపింప నతఁడు పోయి కొంతసేపునకు సుమతినిఁదీసికొని యచ్చటికివచ్చెను. ఈలోపున రాక్షసుఁడొక యుత్తరమును వ్రాసి సిద్ధముగనుంచి సుమతితో

"సుమతీ! ఒకసంగతి నీతోఁజెప్పనెంచి మఱపుగల్గినందున మరల రప్పించితిని. నీవొకపెద్దసాహాయ్యమును నాకుఁ జేయవలసియున్నది. అది చేసితివో నీకు గొప్ప బహుమాన మిచ్చెదను.''

"తమయాజ్ఞయైనచోఁ దప్పక చేసెదను. బహుమానాపేక్ష నాకెంతమాత్రమును లేదు. స్వామి యాజ్ఞ శిరసావహించుటయే నాముఖ్యవ్రతము.''

"పనియేమియును లేదు. ఈయుత్తరమును గొనిపోయి రహస్యముగ అనఁగా, మురాదేవి చూడకుండ మహారాజుగారి కీయవలయును. ఆయన

నీనినిఁజూచి నన్నురమ్మని యాజ్ఞాపింపగానే నీకీయవలసిన బహుమానమిచ్చెదను. నీపై నాకునమ్మకమున్నది.''

"ఇదికఱకు తమసెలవెన్నఁడును మీఱలేదు. ఈసంగతి తమరెఱుఁగుదురు. తమపని ప్రాణముపోయినను చేసి తీఱెదను. కాని తొందరమాత్రము పడవలదు. ఎందుచేతనన దేవి యొక్కక్షణమైనను రాజును విడిచి యుండదు. ఆమె చెంతలేనిసమయమును గనిపెట్టి నేనీయుత్తరమీయవలెను. కాని యట్టితరుణము దొరకుట దుర్భరము. దేవి చెంతనున్నప్పు డిచ్చినచో మహారాజుగారామెకుఁ జూపకమానరు. అయినను నేను ప్రయత్నము చేసెదను.''

"విడువకు విడువకు ప్రయత్నముచెయ్యి. పో!''

అని యుత్తరమునిచ్చి యామెను బంపివేసెను. కానియాయుత్తరమందుకొని సుమతి మురాదేవిమందిరమునకుఁ బోలేదు. మార్గమునక్కడక్కడఁగూర్చుండి కొంతకాలయాపనముఁజేసి పిదప మెల్లఁగలేచి యటునిటుఁజూచి యామెతిన్నఁగ గంగాతీరమువంకఁ బోవుచుండెను. ఆమె దురదృష్టవశమున హిరణ్యగుప్తుఁడేపనిమీదనో బయలుదేరిపోయి యాదారినే వచ్చుట సంభవించెను. అందుచే నతఁడు మార్గమధ్యమున నామెనుజూచి యిట్లు ప్రసంగించెను.

"సుమతీ! మురమందిరమునకుఁబోక నీవిక్కడికివచ్చుచున్నావు?''

"నీవమాత్యునకు ముఖ్యసేవకుఁడవై యుండియు నిట్టులడిగెద వేమి? వానిపనిని నేను జేయలేనని నీకనుమాన మున్నదా యేమి? నే నిప్పుడు కైలాసనాథుని దర్శనమునకై పోవుచుండ నీకీ యనుమాన మెందుకు గల్గినది? ఎక్కడికిపోవుచున్నావు? ఏమిచేయుచున్నావు? అని మాటిమాటికి నన్నుఁ బరీక్షించిన నావల్లకాదు. నన్నేమియు నడుగవద్దు. అమాత్యురా

క్షసునిపై నాకు మిక్కిలి భక్తిగలదు. అతఁ డేమిచేసినను రాజుగారి మేలుకొఱకేగదా ? ఆసంగతి నే నెఱుఁగననుకొంటివాయేమి? నేను మిక్కిలి విశ్వాసముతోఁ బనిసేయుచున్నాను. నీకుఁగాని నీయజమానునకుఁ గాని యేదైన ననుమానమున్నయెడల నీయుత్తరము నీవేగొనిపొమ్ము. నాచేతఁ గాదు.”

అని యుత్తరమును వానిమొగముపైఁ బారవైచెను. అప్పుడు హిరణ్యగుప్తుఁడు నవ్వి ఆయుత్తరమును మరల నామెకొసంగి

“అబ్బా! సుమతీ! నీకెంతకోప మున్నదే? నీచక్కఁదనమునకును నీమరాగ్రహమునకును సరిపోయినది సుమా! నేనూరకహాస్యమునకన్న నిజమే యనుకొంటివా? పోనీ యిప్పుడైన నాపైనిఁ గోపముపోయినదా.”

అని యడుగ సుమతిమాటాడకూరకుండెను. మరల హిరణ్యగుప్తుఁడు “ఏమి యూరకుండెదవు? నీకుఁ గోపమున్నచో నేను భరింపలేను. నన్ను క్షమించి ధన్యునిఁజేయవలయును. ఏదీ? ఏదీ? ఒక్కనవ్వు నవ్వి నాకు సంతోషముఁ గలిగింపుము. నిన్నుఁబ్రార్థించెదను. సుమతీ అబ్బా! ఎంత చక్కఁదనమే నీది?”

“హిరణ్యగుప్తా! నడివీధిలోనా పరిహాసములాడెదవు? నీకు మతి పోయినదా యేమి? నాచక్కఁదనముఁగూర్చి నీకెందుకు?”

“నాకెందుకా? నీకును నాకును గలసంబంధ మెఱింగినచో నీచక్కఁదనమునుగూర్చి నాకే కావలయునో యింకెవరికిఁ గావలయునో నీకుఁ దెలియఁగలదు.”

“ఆసంబంధమెట్టిదియో చెప్పు.”

“సంబంధమా? నీవు నాకు మఱఁదలవగుదువు.”

అని పక్కున పెద్దనవ్వు నవ్వి నోరుమూసికొనెను. అందుపై సుమతి చిఱునవ్వునవ్వుచు

“ఏమిరా? నీసంగతి యేమియును బాగులేదు. నేనిఁక నీతో మాటాడఁదలఁచుకొనలేను పో.”

“సుమతీ! కోపమువద్దు. నేనబద్ధమాడితి ననుకొంటివా యేమి? చిన్నప్పుడు మీతండ్రిగారు నిన్ను నాకేయిచ్చి పెండ్లిచేయవలయునని యనుకొనుచుండిరి. ఆసంబంధము తప్పిపోయినది. లేకున్న మనమిరువురము ఆహాహాహా.”

“హిరణ్యగుప్తా! నీకు...........”

“అదిగో హిరణ్యగుప్తా! యేమిటి? బావా అని పిలువుము.”

“చి ఛీ! నీతో మరిమాటాడను.”

అని సుమతి యాయుత్తరమును గైకొని వెనుకకుఁదిరిగి పురమందిరమునకు బయలుదేరి పోయెను. ఆమె ధననందున కాయుత్తరముఁ జూపినంతనే యాతఁడు చదువుకొని వెంటనే రాక్షసుని రమ్మని కబురంపెను. అత్యానందమున నమాత్యుఁడును వెంటనే లేచి యుచితవస్త్రములఁ దాల్చి ధననందుని వద్దకుఁబోయెను. రాజు వానినిఁగాంచి యిట్లు సంభాషించెను.

“అయ్యా! మీ రేమివ్రాసితిరి? ప్రాణములపైనాశవిడిచి యేధీరుఁడు మనకోటను ముట్టడింపనున్నాఁడో కొంచెమెఱింగింపుఁడు.”

ఆమాటల కేమి ప్రత్యుత్తర మీయవలయునో యని మంత్రికొంత సేపాలోచించి కడకు,

“మహారాజా! ఈభరతఖండంబున మనమగధరాజ్యమును గన్నెత్తి చూడఁగల మగవాఁ డెవ్వఁడును లేఁడు. ఒక్కమ్లేచ్ఛ ప్రభువుమాత్రము

కొంచెమల్లరిచేయుచున్నవాఁడు. ఆసంగతియే తమకువ్రాసితిని. పర్వతరాజు ఎప్పుడో యొకప్పుడు మనరాజ్యముపైకి రాకమానఁడు. యుద్ధమునకువలయు నేర్పాటు లాతఁ డిదివరకే సిద్ధముఁజేసికొని యున్నవాఁడు. అయినను నేను ముఖ్యముగ నిందుకొఱకే రాలేను. తమకు గృహశత్రుభయముగూడ నున్నందున నాసంగతినిఁగూర్చి కొంచెము మాటాడ నెంచితిని."

"గృహశత్రువా? ఎక్కడనుండి వచ్చెను?"

"దేవా! చెప్పుట కిదిసమయముగాదు. తమరుమాత్ర మిఁకమీఁద జాగ్రత్తగ నుండవలెను."

"ఔనౌను. నే నిప్పుడు గ్రహించితిని. నాకును సందేహముగానే యున్నది. జాగ్రత్తగానే యుండవలయును?"

"అదే నేను దేవరవారినిఁ బ్రార్థించునది."

"ఎందుకు నాకిదివరకే, యనుభవమైనది ఇంకశంకలేదు."

"దేవా! ఏమియనుభవమైనది? ఆదొంగను మనము వెంటనే పట్టుకొనవలయును. తెలిసినవెంటనే కండ్లుమూసికొని యూరకుండరాదు. తమ యభిమానముచు విడిచి దూరముగ నుంచవలెను."

"నేను నాల్గుకన్నులతోఁ జూచుచున్నాను."

"మహారాజా! ఆశత్రువు తమప్రక్కనే యున్నది. ఇంకసంశయ మెందుకు? దేవరవారి కెప్పు డనుమానముకల్గెనో వెంటనే దూరముగనుంచి యుండిన బాగుండియుండును, అట్టి ప్రమాద మిఁకముందెన్నఁడును రాఁగూడదు. అపరాధిని వెంటనే శిక్షింపవలయును. తమసెలవైనచో నేనే యాపనిఁజేసెదను."

"అపరాధిని నేనుబాగుగ నెఱుఁగుదును. శిక్షింపవలయునని అప్పుడే యనుకొంటిని కాని, మామురవద్దువద్దని నన్నడ్డగించుకొనినందున నూరకుండవలసివచ్చెను. లేనినిందలు గల్పించి నాకసూయఁ బుట్టించి పాపమొకయాఁడుదాని నష్టకష్టములు పెట్టిరికదా? ఇంకమీఁద నాప్రాణముకొఱకే వారు వేచియున్నారు. మామురయడ్డగింపకున్నఁ జేయవలసిన దిదివరకే చేసియుందును."

ఆమాటలు విన్నంతనే మంత్రి వెఱ్ఱివానివలె రాజువంకఁ జూడసాగెను.

ప్రకరణము. 19.

చాణక్యుని యేర్పాటులు.

బాహురాయణునకును చాణక్యునకును ఆనాఁ డేమి సంభాషణము జరిగెనో యిదివరకు మనకుఁ దెలియదు. ఏనాడు వారిరువురును చాలసేపువఱకు రహస్యముగ మాటాడుకొనిరో అప్పటినుండియు వారి మైత్త్రిపూర్వముకన్న ద్విగుణమైయుండెను. అంతకుఁ బూర్వము దినమున కొకసారిమాత్రమే యొండొరులఁ గలసికొని మాటాడుకొనుచుండిరి కాని ఆనాటినుండియు వారు దినమునకు రెండుమూఁడుసారు లొకరినొకరు గలసికొని తమకార్యములఁ గూర్చి ముచ్చటించుకొనుచు వచ్చిరి. చాణక్యునిపై బాహురాయణునకుఁ బూర్వముకన్న నెక్కుడు భక్తివిశ్వాసములు జనించెను. ఇట్లు కాలముఁ గడపుచు నొకనాఁడు సాయంకాలము వారుగంగాతీరమునఁ జల్లగాలిలో నొకయిసుక దిబ్బపై నధిష్ఠించి యిట్లు సంభాషించుచుండిరి.

"బాహురాయణా! నీవుచెప్పిన సంగతులు బాగానేయున్నవికాని రాక్షసుఁడు సత్యనిష్ఠాపరుఁడని విన్నాడను. అది నిజమగునా కాదా యను సంగతి మొదటఁ గనుఁగొనవలెను."

"లేదులేదు. అతఁడు సత్యనిష్ఠాపరుఁడుకాడు; నేనెఱుఁగుదును. ఇందుకు సందియమక్కఱలేదు. వానికపటమున కేమిచేసినను చేయవచ్చును."

ఆమాటలకు జాణక్యుఁ డత్యంతానందమొంది

"సరే! అట్లైనచో నాలస్యమెందుకు? కాలవిళంబనమున నేమిలాభమున్నది? రాజ్యకార్యముల విషయమై యెంతమాత్రమును జాగుసేయఁ

గూడదని రాజనీతి చెప్పుచున్నది. ఇంతవఱకును మనరహస్యములు బైటఁబడలేదు. బయలుపడినతరువాత శత్రువులు మేలుకొన్న నేమి లాభమున్నది? కావున మన మనుకొనినట్లు త్వరలోనే పర్వతరాజున కుత్తరము వ్రాయవలెను."

శత్రువులరమ్మని వ్రాయుట సేనాపతి కెంతమాత్రము నిష్టములేదు. అట్టి సాహసకృత్య మొనర్చినయెడల నెట్టియాపద వచ్చునోయని పాపమతఁడు భయపడుచుండెను. కాని మొట్టమొదట చాణక్యునితోఁ జంద్రగుప్తునిఁ జక్రవర్తినిఁ జేయుటకును నందవంశమును నాశనముఁ జేయుటకును అంగీకరించెదనని మాటయిచ్చినందున మరల నిప్పుడు వ్యతిరేకముగఁ జెప్పినాతఁ డేమనుకొనునోయని సందేహించి ముందువెనుకఁ జూచుచుండెను. ఒకవేళ బలవంతము మీద నందవంశనాశన మంగీకరింపవలసి వచ్చిన నందుకుఁ జేయవలసిన కార్యములన్నియుఁ జాణక్యునిచేతనే చేయింపవలయునని వానియభిప్రాయము. ఇదియునుగాక రాజంతవఱకుఁ దనయెడ నెట్టి ద్రోహమును జేయనందున నట్టివానిని నిష్కారణముగ నాశనముఁజేసి ఆసింహాసనముపైఁ జంద్రగుప్తునిఁ గూర్చుండఁబెట్టు నంతటియకార్యము నేల సేయవలెనోయని యతఁడూరక తలపోయఁ జొచ్చెను. అందుచే నతఁడు చాణక్యునిఁ జూచి,

"అయ్యా! ఇప్పుడు నాకొక క్రొత్తయుపాయము దోఁచినది. అది తమకిష్టమైనచో క్షణములో మనకార్యమగును. కాని దానికి మీరుఁగూడ సమ్మతింపవలయును."

"బాహురాయణా! నీవుమాత్రము కార్యవేదివికావా యేమి? చెప్పు చెప్పు! నీయుపాయ మనుకూలముగ నున్న నట్లే చేయవచ్చును. ఇందుకు శంకయెందుకు?"

"శంకయేమియును లేదు. నాకుఁ జక్కనియుపాయమే పొడకట్టినది. మీరు నాకెఱింగించిన రహస్యము మెల్లఁగ రాజుచెవిలో వేసిన బాగుండునని

నాయభిప్రాయము. అతఁడు మురాదేవిపై నెంతయనురాగముతో నున్నాఁడో తమకుఁ దెలిసియే యున్నదికదా? మనమీ రహస్యమెఱింగించినచోఁ దప్పక నేఁడే చంద్రగుప్తునకుఁ బట్టాభిషేకముఁ గావించును. ఇందుకభ్యంతరములేదు. ఇట్లు చేసినచో మనము నిష్కారణముగ శత్రువులఁ గోరి కొంపపైకిఁ దెచ్చుకొన నవసరముండదు."

ఆమాటలువిని పెదవి విరచి చాణక్యుఁడు నిర్లక్ష్యముతో నవ్వి

"వాహ్వా! బాహురాయణా! మంచినీతివిశారదుఁడవే! నీయుపాయము చాలచక్కఁగనున్నది. ఇట్లుచేసినచో నేనును నీవును మరియీరాజ్యమున నుండనక్కఱలేదు. ఓయివెఱ్ఱివాఁడా! సుమాల్యుని పక్షమున నమాత్యరాక్షసుఁ డున్నాఁడని యెఱుఁగవేమో? చంద్రగుప్తుఁడు రాజైనచో రాక్షసుఁడు మంత్రియైయుండి వానిని రాజ్యమేల నిచ్చునా? బ్రతుకనిచ్చునా? మంత్రి యెంతటిచతురుఁడైనను చంద్రగుప్తుఁడు తనయిష్టమువచ్చినట్లు రాజ్యమేలువాఁడుకాని యొకరికిలోఁబడువాఁడుకాఁడు. వాస్తవముగ రాక్షసుఁడు రాజభక్తుఁడే. ఎంతటిరాజభక్తియున్నను తనకిష్టములేనివాఁడు చక్రవర్తియైయుండ నాతఁడే సాహసకృత్యమును జేయకుండును? ఇంత యెందుకు చంద్రగుప్తుఁడే చక్రవర్తికావలెనని నీయుద్దేశమున్న రాక్షసుని యధికారము తగ్గించి యాతనిపైఁ బ్రజలకసూయ పుట్టింపక తీఱదు. వెంటనే నీపై విశ్వాసముగూడ నుండవలయును."

అదివిని సేనాపతి యేమియును దోఁపక తానొకవేళ రాజద్రోహముఁ జేయవలసివచ్చునేమోయని శంకింపఁజొచ్చెను. అందుచేఁ జాణక్యునిమాటలు వానిమనసున కెంతమాత్రము నెక్కలేదు. కాని రాక్షసునిపైఁ దనకుఁగల యసూయచే వానినెట్లైన నొకసారి క్రిందఁబడఁద్రోసి పరాభవము చేయవలయునని మాత్రము నిశ్చయించుకొనెను. వానియుద్దేశముఁ గనిపెట్టి చాణక్యుఁడు,

"బాహురాయణా! ఏవిషయముఁగూర్చి సందేహించుచున్నావు? చెప్పు. నేనుసమాధానముఁ జెప్పెదను. ఆలోచనములక్రిందనే మనము కాలమంతయుఁ గడపుచున్నాముకాని క్రియమాత్ర మీగడియకు సున్న. దినములన్నియు నిట్టులేగడచుచున్నవి. ఇది బుద్ధిమంతుల లక్షణముగాదు. నామాట విను. కార్యవేత్త లెప్పుడును తాము బూనినకార్యము విడువఁగూడదు. నీవంగీకరించినచోఁ గార్యారంభమునకు సుముహూర్తమేర్పరచెదను. అదుగో! రాక్షసుని ముఖ్యసేవకుఁడగు హిరణ్యగుప్తుఁడుగూడ వచ్చుచున్నాఁడు."

అదివిని సేనాపతి యొక్కమారు త్రుళ్లిపడిలేచి

"ఆఁ ఆఁ హిరణ్యగుప్తుఁడే వచ్చుచున్నాఁడా! మనమిరువురమును మాటాడుకొనుచున్నారమని రాక్షసునితోఁ జెప్పును కాఁబోలు? వాఁడుమంత్రికి బహిఃప్రాణము."

అందుకుఁ జాణక్యుఁడునవ్వి

"బాహురాయణా! భయపడకుము. నీవన్నట్లు వాఁడు రాక్షసుని బహిఃప్రాణమేకాని యిప్పుడు చాణక్యునకుఁ దాసానుదాసుఁడయ్యెను. ఈసంగతి నీవింక నెఱుఁగవేమో? రాక్షసునిగుట్లన్నియుఁ గనుగొనకున్న మనకార్య మెట్లు కొనసాగును? అందుకొఱకే హిరణ్యగుప్తుని వానినుండి వేఱుపరచినావశముఁ జేసికొంటిని."

"ఎంత ఆశ్చర్యము? అబ్బా! వాఁడట్లు లొంగువాఁడుకాఁడే? రాక్షసుఁడన్నవానికి దేవుఁడే. ఈకార్యము మీకెట్లు సాధ్యమైనదయ్యా?"

"ఎట్లుసాధ్యమైనదా? ఇందుకు వగలాడియైన సుమతి యుండనే యున్నది. దానికి మెల్లఁగ బోధించి హిరణ్యగుప్తునివలలో వేసికొమ్మని చెప్పిపంపితిని. ఇదివరకే వాఁడు సుమతిని మోహించియున్నవాఁడు. కావున నామదాంధుఁడు నిముసములో నామెకు వశుఁడై తోలుబొమ్మవలె నాడు

చున్నాఁడు. వేయేల? అతఁడు సుమతి పెంచిన కుక్కయే! రాక్షసుని గుట్లన్నియు వానికిఁ దెలిసియున్నవి. ఇదిగాక యాతని ముద్రకూడ వానియొద్ద నేయున్నది. నీవిప్పుడు తలయూఁపినచో పర్వతరాజునకు వ్రాయవలసిన యుత్తరమిప్పుడే వ్రాసి దానిక్రింద రాక్షసుని ముద్రవేయించి పంపించెదను. అన్నియు నిప్పుడు కలసివచ్చినవి. ఇదియే మంచి తరుణము. కొసవరకును మనకార్యమిట్లే నిరాటంకముగ జరుగునని నేను నిబ్బరముగఁ జెప్పఁగలను. రాక్షసునిపని యిప్పుడు పుసిగినది. రాజునకు మురాదేవియెట్టి సంకటముఁ దెచ్చిపెట్టునో యనుభయమున నాతఁ డిప్పుఁడు గాబ్లాపడక యున్నాఁడు. ఇదే యుక్తమైనసమయము. నీవిప్పుఁడు—'ఊఁ' అన్నఁ జాలును. ఉత్తరమునిప్పుడే వ్రాయించి రాక్షసుని ముద్రవేయించి పర్వతరాజున కందఁజేసెదను. రాక్షసుఁడు వ్రాసిన యుత్తరమని గ్రహించి పర్వతేశ్వరుఁ డెంతో సంతసించి వెంటనే బయలుదేరును. కావున నుత్తరము వ్రాయుట కిప్పు డెంతమాత్ర మభ్యంతరము చెప్పఁగూడదు. ఇంత యేందుకు? నీవిప్పుడిష్టపడనిచో నేనిక నీతో మాటాడఁ దలఁచుకొనలేను. నీభుజపరాక్రమమును జూపి యేకన్యకనుగొనివచ్చి రాజునకర్పించితివో ఆకన్యకకు జనించిన ముద్దుకుమారుఁడగు చంద్రగుప్తుని నేనిప్పుడే కొనిపోయి నీవు చూచుచుండగనే వాని కవచకుండల కిరీటాదుల నూడఁబెరికి పారవైచి సన్యాసినిఁ జేసి యడవికిఁ గొనిపోయెదను. బాహురాయణా! ఆలోచింపుము. నీవును బుద్ధిమంతుఁడవే! రాజ్యకార్యధురంధరుఁడవే! చంద్రగుప్తునిపై నీకీషన్మాత్రమైన దయలేకున్న లేకుండునుగాక! పదారు సంవత్సరములు చెఱలోఁబడి యష్టకష్టములొందిన మీమురాదేవినిఁ దలంచియైనను నాకిప్పుడుత్తరము వ్రాయుటకు సెలవొసంగుము. పౌరుషవంతుఁడవేయైనచో రాక్షసునిపైఁ గసితీర్చుకొనుటకు సిద్ధపడుము. ఇంకఁ జెప్పఁజాలను''.

"ఆర్యచాణక్యా! నమస్కారము. తమరింత యాగ్రహమూనుటకు నేనేమియును వ్యతిరేకముఁ జెప్పలేను. మీ సెలవెట్లైన నట్లు సేయుటకు

నేను సిద్ధముగానే యున్నాను. ధననందునకిప్పుడే సంగతియును మనము చెప్పఁగూడదు. తమరిఁక వ్రాయవలసిన యుత్తరమును ప్రారంభింపుఁడు. ఇదే మంచిసమయము''

"వాహ్వా! వాహ్వా! బాహురాయణా! ఇప్పుడుకదా మురాదేవి ఋణము నీవు దీర్చికొంటివి?''

అని వానినిఁ గొంతవరకుఁ గొనియాడి చాణక్యుఁడు తన యానందమంతయు వెల్లడించుచు నప్పుడే యొక యుత్తరమును వ్రాసి హిరణ్యగుప్తునిచే రహస్యముగ రాక్షసునిముద్రఁ దెప్పించి యందు వేయించెను. పర్వతరాజునకెట్టి యనుమానమును గలుగకుండ నాతఁడు నమ్మి మోసపోవునట్లే చాణక్యుఁ డుత్తరమును వ్రాసెను. ఇంతియకాక నాజాబులో నీకు రాజ్యప్రాప్తియగుననియు, సంగతులన్నియు రహస్యముగ నుంచవలయుననియు, నీవిందుకు వ్రాయు జవాబు నీయుత్తరముఁ దెచ్చిన సేవకునకిచ్చియే పంపవలయుననియు, నీతఁడు మంచి విశ్వాసపరుఁడు కావున సందేహింపవలదనియుఁ గూడ వ్రాసెను. ఆయుత్తరమును వ్రాసి పంపినతరువాత నందవంశమును నాశనముఁ జేసి చంద్రగుప్తునిఁ జక్రవర్తినిఁ జేసినట్లే చాణక్యుఁడు సంతసించెను. సేనాపతియే తనకు వశ్యుఁడైయుండ వానికింకేమి లోపమున్నది? వానితో నన్ని సంగతులును జెప్పెను. చాణక్యుఁడు రెండు విషయములుమాత్రము జెప్పక దాచియుంచెను. అందొకటి మురాదేవి చేసిన ప్రతిజ్ఞ; రెండవది తన నిజస్థితి.

ప్రకరణము. 20.

సుమతి.

అమాత్యరాక్షసుఁడు చతురవర్తనుఁడును రాజ్యము విషయమైకడు జాగ్రత్తకలవాఁడే కాని చాణక్యుఁడు సేయుచున్న కుట్రలుమాత్రము వానికిఁ దెలియకున్నవి. అతనికి ధననందుని విషయమైగల చింతదక్క యింకెట్టి విచారమునులేదు. మురాదేవికిఁ బూర్ణముగ వశుఁడైయున్న రాజు నెట్లు బైటకు రప్పింపఁగలయునోయని యతఁడహర్నిశమదే విచారమూని కృశించుచుండెను. రాజువిషయమై మురయెట్టి ద్రోహమొనర్ప నున్నదో యని భయపడుచు నతఁడు క్షణమొకయుగమువలెఁ గడుపుచుండెను. కాని తానున్నంతకాల మెట్టిశత్రువుఁడైనఁ బాటలీపుత్రమును ముట్టడింపలేఁడను నిబ్బరముమాత్రము రాక్షసుఁడు కలిగియుండెను. వాని విచారమంతయు గృహశత్రువునుగూర్చియే! సుమతివచ్చి మురాదేవి యేదియో సాహసకృత్య మొనర్చుటకు సిద్ధముగనున్నదని చెప్పి నప్పటినుండియు వాని హృదయము మరింతయల్లకల్లోల మొందుచుండెను. ఆనాడు తాను ధననందునితో సంభాషించినప్పుడు మురాదేవి నే మనసులోనుంచుకొని కొంతదూరము వానితోఁ బ్రసంగించెనుగాని, రాజుమాత్ర మాయుద్దేశమొందక యింకెవరిగూర్చియో మాటాడెను. అందుచేఁ బాపమతఁడు పిచ్చెత్తిన వానివలె నేమియుఁ దోఁపక కొంతవరకు విచారించి కడకు ధైర్యముఁ దెచ్చుకొని, యేమాయోపాయమైనఁజేసి ధననందు నక్కడనుండి బైకిఁ దెప్పింపకమాననని యాతఁడొకపెద్దపట్టు పట్టెను. ఇతరవిచారము లింకేమియు లేనందున నాతఁడాసంగతినిఁగూర్చియే నిరంతరముఁ బ్రయత్నించుచుండెను. చంద్రగుప్తునిపైఁగూడ వాని కెట్టియనుమానమును లేదు. వాఁడు చెంతనున్నచో

యువరాజునకు మరింత హెచ్చరికగ నుండునని యెంచెను. వారిరువురిస్నేహమున కతఁడెంతయో సంతసించి ముందుముందు జరుగబోవు మ్లేచ్ఛయుద్ధమునఁ జంద్రగుప్తుఁడు యువరాజునకుఁ దోడగుట కెంతయో పనికివచ్చునని రాక్షసుఁడు మిక్కిలి సంతసించెను. ఒక్కమురాదేవి భయముదప్ప శత్రువులు తననగరమును ముట్టడింతురేమో యను శంకగూడ వానికి లేదు. మురాదేవి సమ్మోహనాస్త్రమును బ్రయోగించి రాజును బద్ధునిఁజేసినందున నందుకనుకూలమైన ప్రత్యస్త్రమేదైనఁ బ్రయోగించి యాతని విడిపింపవలయునని దీర్ఘాలోచనము సేయుచు నాతఁడు దినములు గడపుచుండెను. ఇట్లుండ నొకనాఁడు సుమతియేడ్చుచు వానిదగ్గరకువచ్చి "అమాత్యశేఖరా! రక్షింపుము రక్షింపుము." అని పాదములపైఁబడెను. అది విని రాక్షసుఁడాతురతతో

"సుమతీ! ఏమిఏమి? భయపడక చెప్పుచెప్పు. నేనున్నాను. నీకే యాపదయు రానీయను."

అని యాతురతతోనడుగ భయముచే గడగడవణఁకుచు సుమతి

"దేవా! యేమిచెప్పుదును? నేను తనరహస్యములన్నియుఁ గనుఁగొని యిచ్చటకువచ్చి చెప్పుచున్నానని మురాదేవికెట్లో తెలిసినది. అప్పటినుండియు నామె నన్ను శిక్షించుటకు వెదకించుచున్నది. నేనెవరికిని దొరకక యిట్లు పారిపోయి వచ్చినాను."

"మురాదేవికే తెలిసినదా? ఎట్లు తెలిసినది? ఎవరు చెప్పిరో! మన రహస్యము నెవరు నెఱుఁగరుకదా?"

"ఔను. ఎవరు నెఱుఁగరు. ఒక్కహిరణ్యగుప్తునకే తెలిసియున్నది కాని యాతఁడట్లుచెప్ప సాహసించునా?"

"నీవు నాతో నక్కడిసంగతులు చెప్పుచున్నావని యామె కెప్పుడు తెలిసినది?"

"నేఁడే తెలిసినది. అప్పటినుండియు నన్నుఁ జంపివేయవలెనని యామె చూచుచున్నదికాని నేను దొరకకున్నాను."

"చంపివేయవలయు ననియే?"

"ఆహా! ఆమెచేతిలో నొకఖడ్గముఁగూడ నేను జూచినాను. మహారాజుగారికిఁ జేయఁదలఁచిన దారుణకృత్యముఁగూడ నేఁడే జరిగించునట. దేవా! ఇప్పు డేమిచేయవలెను? నాకు యజమానురాలైనందున నామెయెడ ద్రోహముఁ జేసితిని గావున నాకు శిక్ష కావలసినదే. ఇందులో నెంతమాత్ర మన్యాయములేదు. నన్నుఁ బట్టి యీడ్చుకొనిరావలయు నని యామె తనపరిచారికల నందరి నన్నిదిశల కంపినది. వారు నాకొఱకు వెదకుచున్నారు. నా కింకేదిదిక్కు? తమచరణములు నాకింక శరణము."

"సుమతీ! భయపడకు భయపడకు. రాజువిషయమై యామె చేయఁదలఁచిన దారుణమేమియో నీవెఱుఁగుదువా? ముఖ్యముగ మనమిప్పు డావిషయమునుగూర్చి పనిచేయవలెను. ఇంక నీభయమునువిడిచిపెట్టినీకుఁ దెలిసి యున్నంతవరకు నాతోఁజెప్పుము. నిన్నును మహారాజుగారినిఁ గూడ నేనే రక్షించెదను. ఆలస్యముచేయక వేగిరము చెప్పు. అందుకుఁ దగినయేర్పాటు చేసెదను."

"దేవా! చెప్పకేమి? మహారాజుగారి ప్రాణముకన్న, నాప్రాణము నాకెక్కువదికాదు."

"అవునులే! ఆఘోరకృత్యము నేఁడే జరిఁగించునా?"

"నేఁడేయనివిన్నాను, ఒకవేళఁదప్పినను రెండుమూఁడు దినములలో నామె తన పూనిక నెరవేర్పక మానదు."

అని యూరకుండెను. అదివిని రాక్షసుఁడాతురతతో "రెండుమూఁడు దినములలోనే? ఆకార్యమెట్టిది? మురయేమిచేయఁదలఁచుకొనినది?"

"దేవా! అయ్యో! ఆమాట నేనెట్లు చెప్పెదను! నానోటనుండి యట్టిమాటలు రావు. నన్ను క్షమింపుఁడు."

"సుమతీ! ఇది నీకు న్యాయముగాదు. నీవిప్పు డెట్లులైనఁ జెప్పక తప్పదు. రాజుగారి కాపదవచ్చిన నీకుమాత్రముగాదా? ఆయన యోగక్షేమములు నీకుమాత్రమక్కఱలేదా?"

"అయ్యో! చెప్పకతీఱునా? ఆర్యా! మురాదేవి వైధవ్యమును గోరుచున్నది. ఎంతమోస మెంతమోసము?"

"ఆఁ-ఆఁ-వైధవ్యమా? మురాదేవియా?"

"ఔనౌను. ఇంతకన్న నేనింక స్పష్టముగఁ జెప్పలేను"

"సుమతీ చెప్పలేనన్న నెట్లగును? ఈకార్యము నీవలననే కావలయును గాని యితరులవలనఁ గానేరదు. నిజముగ నీకు రాజభక్తియే యున్నయెడల మరల మురతో స్నేహమును సంపాదించి అచ్చటిరహస్యము లింకను స్పష్టముగఁ గనుఁగొనివచ్చి నా కెఱింగింపుము."

"ఏమిచేయుమనెదరు? నేను కంటఁబడినచో నామె నన్నుఁజంపక మానదు. చంపకున్నను చెరసాలలోనైన నన్నుఁ బెట్టించును. ఇట్టిస్థితిలో నుండి మీకేమి యుపకారముఁజేయగలను? మీరే ఆలోచింపుఁడు"

"సుమతీ! నీకునే నుపాయముఁ జెప్పువాఁడనా? ఎట్లులైన ప్రయత్నించి బ్రతిమాలుకొని మరల ముర యనుగ్రహమును సంపాదింపుము. నిజముగఁ బనిఁబట్టి చేసిన నిది నీచేతిలోనిపనియే! కష్టమని యాలోచింపకు.

నీకష్టము దీఱునట్లు తగినబహుమానము నేను నీకిచ్చెదనులే! మహారాజుగారికి రానున్న యాపదఁ దప్పించినచో నాయన నిన్నెంతయో కొనియాడి తగినరీతిని గౌరవింపకమానరు. నామాట విను.''

"దేవా! ఇంతదూరము సెలవీయనేల? నాప్రాణముపై నాకాసలేదు. తమసెలవుప్రకారమిప్పుడేపోయి ఆపని చక్కఁబెట్టి వచ్చెదను.

ప్రకరణము. 21.

రాక్షసుని వృథాసంతోషము.

సుమతిచెప్పిన మాటలవలన రాక్షసుని ధైర్యమంతయు నొక్కమారు క్షీణించిపోయినది. ధననందుఁ డంతఃపురములోఁ జిక్కుపడియుండుటచే నేయుపాయముఁ జేయుటకైన వీలులేకుండెను. జరుగవలసిన ఘోరకృత్య మొకటి రెండుదినములలోనే జరుగనుండెను. అన్నివిధములఁ దనహృదయము కల్లోలమగుచుండుటచే నెదుట నిలుచఁబడియున్న సుమతితోఁ గొంత సేపు నేమియును మాటాడక తనలో దీర్ఘాలోచనముఁ జేసి

" సుమతీ! ఇంకనెందుకు నిలిచియున్నావు? మనమహారాజుగారినిఁ గూర్చి నీవు చింతించనక్కఱలేక కష్టపడుము. నీప్రాణమును నేను రక్షించెదను. భయపడకుము. పోయి సంగతులన్నియుఁ గనుఁగొని వేగిరము రా!''

"సెలవైనచోఁ బోవుచున్నాను. కాని మరల వచ్చెదనను నిబ్బరము మాత్రము నాకు లేదు. దేవి నాపై నపరిమితమైన కక్షవహించియున్నది. కంటఁబడితినా చంపకమానదు. ఆమెకడ్డముఁజెప్పఁగల ధైర్యవంతులెవ్వరు? దేవా మఱియొకసంగతి వినుండు. ఏదైనఁదగు నుపాయమాలోచించి నేఁడుగాని రేపుగాని మహారాజుగారిని మీరక్కడనుండి తీసికొనిరావలయును. లేకున్న నాయనప్రాణములు దక్కవు. కార్యము మించిపోయినతరువాత వగచిన నేమిలాభమున్నది? అక్కడనుండి యెట్లులైన నీవలఁబడిరా మరిభయముండదు. దేవరవారి కింతకన్న నేమి మనవిఁ జేసికొనెదను? నేనిప్పుడే బయలుదేరిపోవుచున్నాను. కాని తిరిగి యిచ్చటికి వచ్చెదనని మీరునమ్మికొనియుండక మీరుచేయవలసినకార్యము సత్వరముగఁ గావింపుఁడు.''

అని పలికెను. సుమతిచెప్పిన సంగతులయందు రాక్షసుఁడంతగా లక్ష్యముంచలేదు. ఆమె చెప్పవలసిన నాలుగుమాటలుఁజెప్పి వానియొద్ద సెలవుఁగూడఁ గైకొనకుండ నచ్చటినుండి బయలుదేరిపోయెను. కాని తనయాలోచనలో నుండుటచేఁ గొంతవరకు నాసంగతి రాక్షసుఁడెఱుఁగనే యెఱుఁగఁడు. తరువాతఁ దనకు సుమతి గానరానందున వెళ్లిపోయినదాయని సేవకు నడిగి తనతోఁ జెప్పకయే పోయినందుల కాశ్చర్యమొందెను. అందుమీఁద నాతని విచారము మరింత యధికమయ్యెను.

"ఆహా! దైవఘటన? నేఁటివరకును సౌఖ్యముగనున్న పాటలీపుత్రమున కెట్టియాపద రానున్నదో కదా? ఓ గయ్యాళీ! రక్కసీ! మురా! ఎందరిహృదయముల కల్లకల్లోలముఁ గల్పించుచుంటివే? నీనుండి పాపము యువరాజుతల్లి నిద్రాహారములు లేక తననాథునికొఱకు శుష్కించుచున్నది కదా? అయ్యో! పాప మామెమాత్ర మేమిచేయఁగలదు! నాకే రాజదర్శనము దుర్ఘటమైయున్నది శత్రువులు కోట ముట్టడించెదరను నెపముఁ బెట్టి మొన్నటిదినమున వానిసముఖమునకుఁ బోయితిని. మరల నిప్పుడేవంకఁ బెట్టుకొని యాతనిదగ్గర కేఁగఁగలను? పోకున్నచో నామాయలాడి ధననందుని మహామాయ మొనర్చునుగదా? ఎట్టులైనను పోక తప్పదు. మగధరాజ్యమున కిన్నాళ్లకుఁ గష్టకాలము వచ్చినది. అయినను నాశక్తి వంచనలేక పాటుబడి రాజభక్తి వెల్లడించెదను. పిదప దైవాజ్ఞ యెట్లున్న నట్లుకాక మానదు."

అనియెంచి అప్పుడే యొకయుత్తరమును వ్రాసి రాజునకుఁ బంపించెను. అతఁడు మురాదేవితో ముచ్చటలాడుచుండ నాయుత్తరము వానికందినది. తోడనే దానినిఁ దనలో రాజు చదువుకొనుచుండ ముర

"మహారాజా! ఆయుత్తరమెవరు వ్రాసిరి?"

"అమాత్యరాక్షసుఁడు."

"వానియొద్దనుండి తరచుగ నుత్తరములు వచ్చుచున్నవే? తాను స్వయముగ వచ్చి మాటాడుట పరువుతక్కువ కాఁబోలు! ప్రాణేశ్వరా! వానికింకను నాపై నసూయ తగ్గలేదుకదా?"

"కాదుకాదు ఆసంగతికాదు. తనకొకసారి దర్శనమునిచ్చిన జరుగుతుగా మాటాడవలసిన పనియున్నదఁట."

"తమరిదివర కెప్పుడును దర్శనమీయలేదా యేమి?........... సరే యేమిసంగతులు మాటాడెను?"

"రాజ్యకార్యములలో నేదియో ప్రమాదము సంభవించినదఁట. దానినిఁ గూర్చియే మాటాడునఁట."

"ఏమిప్రమాదమో? ఔను అతఁడు రాజభక్తుఁడు గావుననే మీ సేమముఁగోరుచున్నాఁడు. కాని నాపైమాత్రము వానికసూయలేక పోలేదు. మొదటినుండియు నామీఁద వానికి సందేహముగానే యున్నది. ఎవరేమి యనుకొన్న నాకేమి! మనోవాక్కాయకర్మముల మీపాదసేవఁ దప్ప నాకింకెట్టి కోరికలును లేవు. నామీఁద వానికేల దురూహపుట్టినదో తెలియదు. ఇంతకును దమ యనుగ్రహము నాకున్నంతకాలము నన్నెవరేమి చేయఁగలరు? నాకింకెట్టివిచారమును లేదు. తమపాదసేవ సేయుచు నిట్లే యుండెదను.........మహారాజా! ఇంకేమి వ్రాసెను?"

"ఏమియును లేదు. ఎంతత్వరగా రమ్మని సెలవైన నంతత్వరగ వచ్చి మాటాడునఁట. లేక వీలైనచో నన్నే యొకమారు రాజసభకు రమ్మని వ్రాసినాఁడు. కాని నిన్ను విడిచి నేను పోఁజాలను."

"అదేమి? నాకొఱకు తమరు రాజ్యాంగ విషయములను విడిచిపెట్టెదరా? అది నా కిష్టములేదు. అట్లు జరిగినచో జనులు నన్ను దూషింతురు."

అమాత్యునివలె నామీద నింకనెందరో ద్వేషము వహింతురు. కావునఁ దమరింక ముందు, కోరినవారికెల్ల దర్శన మిచ్చుచుండవలయును."

"రాక్షసున కంతకంతకుఁ బిచ్చి యధికమగుచున్నది. ఎందుకీ యక్కఱరాని భేటీలు."

"న్యాయముకాను న్యాయముకాదు. వానికి దర్శనమిచ్చి తీరవలయును. అతఁడేమి సంగతులు చెప్పునో మీరువినవలసి యున్నవి. లేకున్నచో రాజ్యమునకు సంకటములు సంభవించును. అప్పుడప్పుడు తమరే మంత్రిని స్వయముగఁ బిలిపించి రాజ్యమును గూర్చి ప్రసంగించుచు యోగక్షేమము లరయుచుండవలెను. కాని నన్నుమాత్రము విడిచి మీ రితరస్థలమున నుండరాదు. కోటలోఁ దమకనేకశత్రువులున్నారు. ఇందుకు మొన్నటి స్వామిప్రసాదమే తమకుసాక్ష్యము. నేను తమప్రాణసంరక్షణమునకుఁ బూనియుండు టెఱింగి, యేమాయోపాయమైనఁజేసి, యిక్కడనుండి మిమ్ముఁదీసికొని పోవలయునని చూచుచున్నారు. తమకేదియైన నాపదసంభవించిన నాగతియేమగునో తెలియకున్నది.

"దేవీ! నేడు నీ నోటనుండి యిట్టిమాటలు వెడలుచున్నవేల? నేనెక్కడికినిబోను. ఎవరినిఁ గూర్చి నాకుసందేహముగ నున్నదో వారిని శిక్షింపఁ దలంచుచుండ నీవే వలదనివారించితివి కదా? అందుచేత నేయూరకుంటిని. లేకున్నఁ దగినశిక్ష యిదివరకే విధించియుందును. సరే, యిప్పుడు మంత్రినిఁబిలిచి కనుఁగొందము."

అని యప్పుడే రాక్షసునిఁ దీసికొని రావలయునని సేవకునిఁబంపెను. వాని దర్శనమున కదివరకే యెదురు జూచుచున్నవాఁడు గావున రాక్షసుఁడు రాజాజ్ఞయైనందున కమందానంద మొంది తత్క్షణమ యచ్చటికివచ్చెను. వెంటనేలేచి ముర యొకచాటునకుఁబోయి కూర్చుండియుండెను. రాజు వానిని గౌరవించి, యుచితాసనమునఁ గూర్చుండఁబెట్టి యిట్లు ప్రసంగించెను.

"అమాత్యశేఖరా! ఏమి మాటాడవలసియున్నది?"

"మహారాజా! చిన్నమనవి. తమరనుగ్రహించి వినవలెను."

"తప్పక వినియెదను. అనుమానమెందుకు? రాజ్యవిషయమైన సంగతు లేవైన నైనచో నేను విని, అందుకుఁ దగిన యేర్పాటులు చేసెదను."

"రాజేంద్రా! తమరు నేటికిఁ జాలదినములనుండి రాజసభకు వచ్చుట మానివేసిరి. రాజ్యకార్యముల యందావంతయును శ్రద్ధవహింపకున్నారు. ఈకారణమున దేవరవారిపైఁ బ్రజలందరు దురభిప్రాయమూనియున్నారు. వారి దూషణములకు మనము పాత్రులము గావలసివచ్చినది. ఒకమాఱైనను దమరువచ్చి స్వయముగఁ బ్రజలమొఱలు లాలకింపకున్న నెట్లు వ్యవహారము జరుగును? కావున నేఁడుగాని రేపుగాని సుముహూర్తమునఁ దమరొకసారి రాజసభకు రాకతీరదు. వచ్చి తమరు, రెండు నిముసములుమాత్రమే సింహాసనముపైఁ గూర్చుండినఁ జాలును. ఈవిషయమున నన్నుఁ దమ రెంతనిందించినను నేనుభరించెదనుగాని నామనవిమాత్ర మంగీకరింపక తప్పదు. ఇంక మీచిత్తము."

రాక్షసుఁడు రెండుదినములనుండి రాజు నెట్లు వెలుపలికిఁ దీసికొని రావలయునో యని విచారించి విచారించి కడకీయుక్తిఁ బన్నెను. అంతఃపురముఁదాటి యెట్లులయిన నీవలికివచ్చిన నన్నిసంగతులు మాటాడవచ్చునని యెంచి యాతఁ డధికప్రసంగముఁజేయక యంతమాత్రమున నూరకుండెను. రాజు వానిమాటలు విని,

"అయ్యా! రాజ్యము సుమాల్యునకును, తత్కార్యభారము మీకు నప్పగించి విశ్రాంతికై నేనిందు కాలముఁగడుపుచుండ గడియగడియకు

నన్నెందుకు బాధించెదరు ? నేను ప్రతిదినమును రాజసభకు రాజాలను. నాకిప్పుడు విశ్రాంతికావలసియున్నది."

"ఔనౌను. ఆసంగతి నేనెఱుంగుదును. తమ కింక విశ్రాంతియే కావలసియున్నది. అయినను ప్రతిదినమును మిమ్ము నేను బాధింపలేను. అధమపక్షము వారమున కొకసారియైనఁ దమరు రాజసభకురాకున్నచో నందువలనఁ బెక్కు నష్టములు గలుగును. తమ కిష్టములేనిచో నేడు రా నక్కఱలేదు. రేపటిదినమునమాత్ర మొకసారి వచ్చి శ్రమపడవలయును. ఇది దేవరవారికిఁ దప్పదు."

"సరే ! ఆలోచించెదను. మీరు తఱుచుగ, నిచ్చటికి రా నవసరము లేదు. నా ప్రియసఖియైన మురయొక్క యభిప్రాయముఁ గనుఁగొని రేపు రాజసభకువచ్చెదనో, లేదో సాయంకాలములోగానే కబురంపెదను."

ఆమాటలు విని చాటుననున్న ముర

"మహారాజా ! రాజ్యకార్యములనుగూర్చి నన్నెందు కడుగవలయును? తప్పక తమ రమాత్యశేఖరుని కోర్కె చెల్లింపవలసియున్నది. ఇందులకు నాయభ్యంతరములేదు. రాజసభకుఁబోయి రాజ్యకార్యములు నిర్వహింపకుండ మిమ్ము నడ్డబెట్టుటకు నేనంతమూర్ఖురాలనుగాను. ఇప్పుడేకాదు ఈ సంగతి నిదివర కనేకసారులు తమతో మనవిఁజేసికొనియున్నాను."

అనిపలుక ధననందుఁడు చిఱునవ్వు నవ్వి రాక్షసునితో

"అమాత్యశేఖరా ! మాదేవిసెలవైనది. నేను రేపు తప్పక రాజసభకు వచ్చెదను. మీరింక..............."

"చిత్తము చిత్తము ! నేనింక సెలవుఁదీసికొనెదను."

అనిచెప్పి యతఁ డక్కడనుండి యింటికి బయలుదేరెను. రాజసభకు వచ్చుటకు ధననందుఁ డంగీకరించె నని యమాత్యుఁ డొందిన యానంద మింతింతగాదు. కాని వానిరాక తనకు సంతోషదాయకమో దుఃఖదాయకమో యాతఁ డేమెఱుఁగును ?

ప్రకరణము. 22.

మురకార్యస్థానము.

ధననందుఁడు రాజసభకు బయలుదేరినతరువాత వానితో మాటాడుటకు రహస్యముగ భేటీదొరకునని యెంచి యెన్నియోసంగతుల మాటాడవచ్చునని రాక్షసుఁ డనుకొనుచుండెను. తనశక్తినంతయుఁ బ్రయోగించి రాజునకుబోధించి మురముఖమైనఁజూడకుండఁజేసి యామెపై రాజునకసూయఁ బుట్టింపవలెనని యతఁడు దురాశతోనుండెను. రాజసభకు వచ్చెదనని ధననందుఁడు సెలవిచ్చినప్పుడే తనకష్టము ఫలించినదనియు, రాజు గండముదప్పినదనియు నతఁడూహించుకొనెను.

అమాత్యరాక్షసుఁడు వెళ్లినతరువాత మురాదేవి చాటునుండి యొయ్యారముఁజూపుచుఁ బైటకువచ్చి రాజుప్రక్కఁగూర్చుండి ఆశ్చర్యముతో

"ఏమి చమత్కారము? రాజసభకుఁ బోవలదని మీకు నేను జెప్పితినా? నిజముగాఁ బ్రజలు మిమ్ము దూషించుచునేయున్నారా? వారందరంత జ్ఞానహీనులా? ఇది రాక్షసుని స్వకల్పనమనుటకు సందేహమేమున్నది? రాజ్యకార్యములనుగూర్చి మిమ్ము నేనెప్పుడు నాటంకపరచలేదే? కాని యొకసంగతిమాత్రము నిజము. స్వేతనూర్జాలము మరణమొందినప్పటినుండియు, మిమ్ము నేనతిజాగరూకతతోఁ జూచుచున్నాను. ఎవరికున్నను లేకపోయినను, మంత్రికిమాత్రము మీపైనిదురూహకలదు. ఇది నిజము"

అని పలుకుచుండ నాచెంతనే నిలిచియున్న సుమతి ముందునకువచ్చి మురాదేవితో

"ఏమమ్మా? ఇప్పుడే మఱచితిరాయేమి? ఏదోవిచిత్రమైన సంగతి మహారాజుగారితోఁ జెప్పఁదలఁచియుంటిరికదా?"

ఆమాటలువిని మురకోపముతో

"ఛీ! మూర్ఖా! మధ్యమధ్య నడ్డముగరాకుము. చెప్పఁదలఁచినది నేనే చెప్పెదను. నీకెందుకు?"

"సరే! నాకెందుకు? నేనూరకుండెదను. మీరేచెప్పుఁడు"

"అక్కడనేయుండుము. అడ్డముగవచ్చి మాటాడిన నీనాలుకఁ గోసెదను"

అది విని ధననందుఁడు సుమతితో

"సుమతీ! మీయిరువురకు నీకలహమెందుకు? దేవి నాతోఁజెప్పకుండ నేమిదాఁచినది? నీవుచెప్పు భయములేదు"

"దేవా! ఇదిగో వినుఁడు దేవి, వీర-పు-రు-ష........"

అని చెప్పుచుండ మురఅత్యంతాగ్రహము వహించి

"ఛీ పాపాత్మురాలా అవలికిపో! నోరెత్తినచూడుము ఏమిచేసెదనో"

అనికోపింప ధననందుఁడు మెల్లఁగ

"దేవీ! ఓహో! నీవు వీరపురుషుఁడవయ్యెదవాయేమి? మంచిసంగతియే కాని కన్నులనుండి నీరుఁగార్చుచు నెందుకేడ్చుచున్నావు? ఇది వీరపురుషలక్షణముగాదే!"

ఇందుకు మురమాత్ర మేమియును బ్రత్యుత్తరమీయలేదు ధననందుఁడామె కన్నీరునొత్తుచు మఱింత దగ్గరగఁజేర్చికొని యోదార్చుచు

"మురా! నీవు వీరపురుషుఁడవయ్యెదవని యెంతోసంతసించితిని. కారణముచెప్పు. ఇట్లూరక యెందుకేడ్చెదవు? ఆనందబాష్పములకుమారుగ

నీదుఃఖబాష్పములేటికి? నీయేడ్పు చూచుచున్నందున నాకును దుఃఖము వచ్చుచున్నది. చెప్పు కారణమేమి?" అని ప్రక్కనుఁ జూచి"

"పోనీ! సుమతీ నీవైనను చెప్పెదవా లేదా?"

అందుకు సుమతి

"ఏమి కారణమా? ఇదిగో వినుఁడు. దేవి............"

అనిచెప్పుచుండ ముర

"ఛాప్! నోరత్తను గుప్ చేప్"

అనియాగ్రహింప రాజు నవ్వుచు

"దేవీ! నీవుచెప్పవు దానినిఁ జెప్పనీయవు. అదిచెప్పుచుండ నీవెందుకడ్డపడెదవు?"

అని సుమతినిఁ జూచి

"సుమతీ నాయాజ్ఞయైనది. ఏదీ చెప్పుచెప్పు"

అని యడిగెను.

చెప్పవలయునని రాజాజ్ఞయుఁ జెప్పవలదని దేవియాజ్ఞయు సుమతి యొక్కమారు నిర్వహింపవలసివచ్చెను. అందుచేఁ గొంతవర కామె యూరకుండి రాజు మరలమరలఁ దన్నడుగుచుండుటచే

"మహారాజా! దేవి వీరపురుషుఁడైనందున నేమిప్రయోజనమో తమకుఁ దెలియదా? ఆనాడు బాలునిఁ గాంతారమున నెట్లు బలవంతముగఁ జంపించిరో అట్లే"

అని సగముఁ జెప్పి మురాదేవి మొగముఁజూచి ఆమెయేమి సంజ్ఞ చేసినదోకాని పైమాటచెప్ప కూరకుండెను. అప్పుడు రాజు

"సగముఁజెప్పి యూరకుండెదవేమి? చాలకాలము క్రింద జరిగినసంగతి మరల నిప్పుడెందు కెత్తుచున్నావు? అట్టి దారుణమేదైన మరల జరుగనున్నదా యేమి."

అనియడుగ మురయేడ్చుచు

"అట్టిదారుణమే కాదు. అంతకన్న నెక్కువదే."

"దేవీ! ఇంక నీదుఃఖముఁజాలించి అదేదియో చెప్పుచెప్పు."

"దేవా! తమరు రేపు రాజసభకు బయలుదేరుచున్నారుగదా? కపటహృదయుఁడగు మంత్రియుద్దేశ మెట్లున్నదో తెలియదు. కాని వాని మనస్సు కల్మషపూరితమై యున్నదనిమాత్రము నేను గ్రహించితిని. నన్ను విడిచి తమరొంటరిగ బయలుదేరినచో నాపై నెన్నియో కొండెములు కల్పించిచెప్పి విరక్తిపుట్టించుట కతఁడు సిద్ధముగానున్నాడు. నన్నొంటరిగ విడిచి మీరువెళ్లినచో మంత్రి నన్నేమిచేయుటకు నిశ్చయించెనో తెలియదు. ఛీ! పాపిష్టిదైనను నన్నెందుకు బ్రతికించి యుంచవలెను? ఆనాడు నాకుమారునితో నేనుఁగూడ ప్రాణములు విడిచియుండిన నెంతబాగుండును?"

అని మరింత రోదనమారంభించెను. ధననందుఁడామెనోదార్చుచు

"ప్రియా? అట్లైన నీవిప్పుడేమనెదవు? చెప్పు?"

"అనుటకేమున్నది? మంత్రి మిక్కిలిగట్టివాఁడు. మీపైని విస్తారముగ నసూయతోనున్నాడు. ఇక్కడనుండి మిమ్ముఁగొనిపోయి యేమిసేయునో? అతఁడెంతటి సాహసుఁడుగాడు? అకస్మికముగ మిమ్ముఁ జెరసాలలోఁ బెట్టించునో? తమప్రాణములపైనే కదా వానిపూనిక? మహారాజా!"

"సరే! బాగున్నది. పోనీ అక్కడికివెళ్లనులే"

"ఎట్లుపోకుందురు? వచ్చెదనని చెప్పి వెళ్లకున్న మంత్రికి నాపై ననుమానము మరింతయెక్కుడగును? మీపైఁగల అసూయయు నధికమగును. కావున నేనొక వీరపురుషునివలె వేషమువేసికొని మీవెంటనే వచ్చె,

దను. లేక కలదన్న మానివేసెదను. మీరులేనితఱి నాకెట్టియాపదవచ్చినను రానిందు. ఏమిచేయఁగలను?”

అనిపలుక రాజామెను గాఢాలింగనముఁ జేసికొని మందస్మితుఁడై

“ప్రియా! ఇంతభయపడుచుంటివేల? రేపురాజసభకుఁబోయి రెండు నిముసములుమాత్ర మక్కడనుండి తిరిగివచ్చెదను. ఇంతలో నీకుఁగాని నాకుఁగాని యెట్టియాపదయు రాదు.”

అని యింక నేమేమో చెప్పుచు శయ్యపైఁగూర్చుండిన ధననందుఁ డాకస్మికముగఁ బెద్ద నిద్దురవచ్చినట్లు పడిపోయెను. తరువాత వానినోటనుండి యొకమాటయైన రాలేదు. అంత నిద్దుర వానికి సహజముగానే వచ్చెనో లేక యాతఁడేదైన నిషాగల్గించు వస్తువుఁ దిని యుండెనో మనకుఁ దెలియదు. కాని మురాదేవియు సుమతియుమాత్ర మాతఁడట్లు శయ్యపై వ్రాలినంతనే యొండొరుల మొగములుఁ జూచుకొని నవ్వుకొనసాగిరి. మురయచ్చటనుండి వెంటనే లేచి కొంచెము దూరముగఁబోయి

“సుమతీ! ఇంతసాహసముఁ జేయుచున్న నాకార్యము భంగమగును గదా? బృందమాల వట్టి పిచ్చిమనిషి. ఇట్టికార్యములన్న దానికెంత మాత్రము నిష్టములేదు. కాని నామీఁదభక్తిమాత్రము లేకపోలేదుసుమీ! సరే! దీనికేమి! చాణక్యుఁడెప్పుడు వచ్చునో యెఱుఁగుదువా?”

“ఆతఁడును వచ్చువేళయైనది”

చాణక్యుని సుమతి గురువుగా భావించుకొనుచుండెను. అక్కడి సమాచారము లిక్కడ, ఇక్కడసమాచారము లక్కడఁ జెప్పుచు, చాణక్యున కామెయెంతయో సాహాయ్యముఁ జేసినది. ఆతఁడెట్లు చెప్పిన సుమతి యట్లే ప్రవర్తించుచుండెను. ఆనాఁడు సుమతియు మురయు సంభాషించుకొనుచుండ నింతలోఁ జాణక్యుఁడు కూడవచ్చెను.

మురాదేవి వానినిఁ జూచుచు

“ఆర్యా! తమరేవచ్చిరా? రాజుగారు రేపేసభకు బయలుదేరుచున్నారు. కాని నన్నొంటరిగ విడిచి యేగుట భావ్యముకాదని కొంత వరకుఁ జెప్పినాను. మీరు మీకార్యములయందు సిద్ధముగ నున్నారా?”

“ఆహా! సిద్ధముగానే యున్నాను. ఇదివరకే తగిన యేర్పాటులన్నియుఁ జేసితిని. ఇంకఁజేయవలసినదేదియు మిగిలియుండలేదు. అన్యవిచారములతో నీకింకఁబనిలేదు. నీప్రతిన నెఱవేఱును”

“ఆర్యా! తమపనులకా కొఱఁత గల్గుట! ఆసందేహము నాకెన్నఁడును లేదు. మనకార్యములన్నియు నిర్విఘ్నముగ జరుగునని నాకు మొదటి నుండియు నమ్మకమున్నది. కాని యీరహస్య మెంతమాత్రమును బైటఁ బడరాదు”

“మురా చాణక్యునికార్యమునకా భంగము? కలలోనివార్త! హిరణ్యగుప్తుఁడను రాక్షసముఖ్యసేవకుఁడొకఁడు నాకుఁ బూర్ణముగ వశ్యుఁడై యున్నవాఁడు వానిచే నేనిదివఱకుఁ గొన్నికార్యములు చేయించితిని. ఇంకను జేయింపనున్నాను. వాని యాధారముచేతనే రాక్షసునకు ముఖ్యమంత్రియగు చందనదాసుని వశపరచుకొనవలయునని ప్రయత్నించుచున్నాను. ఈ కార్యముఁగూడ నెఱవేఱెనా నందవంశము నాశనమైనట్లే రేపేకొన్ని ముఖ్యకార్యములు జరుగవలసియున్నవి”

“బాగుగానే యున్నది. కాని, అయ్యా! మఱొక్కవిషయము. రాజుగారి మరణమొక్కటి దప్పించి, మనము తక్కినకార్యములను జేసినచో బాగుండును. యువరాజును జంపినఁజాలదా? రాజుగారి నెందుకు జంపవలయును?”

“మురా! రాజనీతియన్న నేమో నీవెఱుఁగుదువా? ఛీ! ఛీ! ఇన్నాళ్ల నుండియు నేమో యనుకొంటినిగాని నీకుఁ గష్టసుఖము లేమియును తెలియవు. ఈకార్యములన్నియు రాక్షసుఁడు చేయించినట్లే ప్రజలనుకొనురీతి

యేర్పాటుచేసితిని. రాక్షసుఁడే యింతఘోరకృత్య మొనర్చెనని ప్రజలు వానిని నిందించెదరు. లేకున్నచో నతఁడు నీమేనల్లునకు రాజ్యముఁ దక్క నిచ్చునా?"

ఈమాటలు విని మురాదేవి సంతసించి ఒక్కదినములోనే యింత మహాకార్యము నెఱవేఱునుగదాయని యంతకంత కానంద మొందుచుండెను.

ప్రకరణము. 23.

హృదయ చాంచల్యము.

"వాహ్వా! నేఁడుగదా దైవమునకు నాపై ననుగ్రహము గల్గినది? రేపటిదిన మెంతసుదినము? నాశత్రువుల నెల్లఁ గసిదీఱ శిక్షింపఁదగిన దినము రేపే కదా? ఇంతకాలము నుండియు హృదయమున నాటిన కోరికలన్నియు నొక్కసారిగ ఫలించుదినము రేపే కదా? అన్యాయముగఁ బదారు సంవత్సరములు నన్నుఁ గారాగారంబున బంధించి నాకన్నకుమారునిఁ దెగటార్చి నన్నష్టకష్టములఁబెట్టిన రాజునకుఁ బ్రాయశ్చిత్తము జరుగుదినము రేపేగదా? మదోన్మత్తలై మహారాజ కుమారికనైన నేను దాసీపుత్రికనని యపనిందఁ గల్పించి నన్నింతయేడ్పించిన నాసవతుల గర్వము భంగమగు దినము రేపేకదా? నవమన్మథాకారుఁడగు నాముద్దుల మేనల్లుఁడు గద్దెపై నెక్కి చక్రవర్తియగు దినము రేపేగదా? అహా! చాణక్యుఁడు నాపాలి దైవమువలె వచ్చినాఁడు కదా? వాని ఋణము నే నెటు తీర్చుకొనఁగలను"

అని మురాదేవి తనలోఁ జరుగఁబోవు మహాకార్యమునుగూర్చి సంతసింపఁ జొచ్చెను. చాణక్యుఁడు పాటలీపుత్రమునకు వచ్చిన తరువాత నందరిస్నేహములోఁబాటు మురాదేవియొక్క స్నేహమునుగూడ సంపాదించెను. కాని వారందరి మైత్రికన్న నీమె మైత్రి వాని కెక్కుడు సాహాయ్య మొనర్చెనని వేరుగ వ్రాయ నవసరములేదు. మొదటఁ జాణక్యునకు వశమైనవాఁడు మరెన్నటికిని తిరిగిపోఁడు. మురయు నట్లులే వానికిఁ బూర్ణముగ వశమై వానిచేతనే తనకార్యము లన్నియుఁ గొన

సాగఁ జేసికొనవలెనని మొదటినుండియు నమ్మకముతో నుండెను. ఆమెతోఁ బరిచయము గల్గినందుకుఁ దనప్రతిజ్ఞగూడ నిరాటకంబుగఁ బరిపూర్తి యగునని చాణక్యుఁడును సంతసించుచుండెను. ఆనాఁటిరాత్రి మురచాణక్యునితోఁ గార్యక్రమమునుఁగూర్చి సంభాషించిన తరువాత రాజు మేల్కొనునేమో యని వానిఁబంపి తాను తనమందిరములోనికిఁ బోయెను. కాని రాజు మాత్రము మేల్కొని యుండలేదు. అతఁడప్పుడు గాఢనిద్రయందు దొడ లెఱుఁగకుండఁబరుండియుండెను. మురాదేవి మెల్లఁగఁ జప్పుడు సేయకుండ వాని ప్రక్కనే పరుండెను. అప్పటి యామె హృదయాందోళనము మాచదువరులు చక్కఁగ నెఱుఁగుదురు గావున నామెకు నాఁటిరాత్రి యెంతమాత్రమునిద్ర పట్టలేదని వేరుగ వ్రాయనక్కఱలేదు. అన్నివిధములఁ గలఁతఁజెందుచు నామె హృదయమున కేమియుఁ దోఁపదయ్యె. మాటిమాటికి నామెను రాజును జూచుచు విచారించుచుఁ గన్నీరుఁగార్చుచు, నిట్టూర్పులు విడుచుచు "హా మహారాజా" అకారణముగ నన్నుఁ గారాగారమునఁ బెట్టింపక, నాకుమారునిఁ జంపక, న్యాయముగ నేలుకొనుచు నుండిన యెడల, రేపటి దినమున నీకు బలవన్మరణము సంభవింపకుండును గదా? నీవు చిరకాలము సౌఖ్యముగానే యుందువు కదా? నీయెడ నెంతద్రోహమూనవలసి వచ్చినది?" అని మాటిమాటికి ననుకొనుచు నేడ్చుచుండెను. కన్నీరు చీరకొంగుతో నొత్తుకొనుచు, నామె వానివైపునకుఁ దిరిగి చూచుచుండ రాజు మెల్లఁగఁ బ్రక్కకొత్తిగిలి పెద్దనిట్టూర్పు విడిచి దీనత్వముతోడను గద్గదస్వరముతోడను,

"హా! ప్రియా! సుందరీ! మురా! రక్షింపుము! రక్షింపుము ఎన్నిమారులు బ్రతిమాలినను ఈదీనునిపై నీకేల కరుణ జనింపకున్నది? నీకెంతయో యపరాధ మొనర్చితిని. అదిమరచి యీదీనునిఁ గటాక్షించి బ్రతికింపుము. నీపాదములు బట్టుకొనెదను. నీకుమారుఁ డెక్కడనున్నవాఁడో తెలియఁ జేసిన వానిని వెదకించి తెప్పించి యువరాజును జేసెదను. మురా! మురా

నాకింక దిక్కెవ్వరు? వలదు. సాహసమువలదు. అపత్సమయము. అయ్యో! అయ్యో!!" అని పలవరింపసాగెను. ఈమాటలు వినినంతనే మురయొడల్లొక్కమారు ఝల్లుమని వెంటనే త్రుళ్ళిపడిలేచెను. కాని రాజు గాఢనిద్రయందే యుండుటచే వాని లేపనొల్లక తానుమాత్ర మట్టులే కూర్చుండి

"ఆహా ఈతఁడు కలలోఁగూడఁ దానుజేసిన దానికిఁ బశ్చాత్తాపమొందుచుండెనుగదా? చెరలోనుండివచ్చిన తరువాత నేటివరకు నీమహానుభావుఁడు నాపైఁ జూపిన యాదరణ మెన్నిజన్మములకును మరువఁజాలను. ఇట్టితరి నేనిట్టి సాహసకృత్యమున కంగీకరించుట న్యాయమా? కొంచెమైనను నాకు విశ్వాసముండవలదా? కన్నులారఁ జూచుచు నీతని మరణమున కెట్టు లంగీకరింపఁగలను? అయ్యో! రేపు ఎంతటిఘోరము జరుగుచున్నది? జరుగఁబోవు దుష్కార్యమంతయు నాకన్నులకుఁ గట్టినట్టులే యున్నది. నాయొడలంతయు గడగడ వణక నారంభించెను. ఇప్పుడేమి సేయుదును?"

అని తనలో విచారించుచు వానికి నిద్రాభంగము గల్గకుండఁ గొంత దూరముగఁ గూర్చుండెను. అప్పు డన్నివిధముల నామె హృదయము మిక్కిలి చాంచల్యము వహించియుండెను. నాఁటినుండియు హృదయతలమునఁ బెరుగుచుండిన మోహలత నొక్కసారిగఁ దెగఁగోసి తనప్రాణేశ్వరు నీలోకమునఁ గానరాకుండఁ జేసి యాతనియెడ నంతటిద్రోహ మొనర్చుట కామెమనసు అంగీకరింపదయ్యె. అందుచే మరల నామె తనలో

"ఎంతదారుణ మెంతదారుణము? నే నీఘోరకృత్యమున కెట్టులంగీకరింపఁగలను? అన్యాయముగ నతని కింతశిక్ష సేయుటకు నాయెడ నేమి ద్రోహముఁజేసెను? ఇతరుల ప్రోత్సాహమువలన నన్నుఁ జెరలోఁ బెట్టించెను గాని వీని స్వబుద్ధివలనఁ గాదే? కావున వానికే తగినప్రాయశ్చిత్త

ముఁ జేయవలసియున్నది. పాప మీతఁడేమిచేసెను? పరులుచెప్పిన కొండెముల నాలకించినాఁడని యింతమాత్రమున కింతఘోరశిక్షయా? ధర్మము కాదు. ధర్మముకాదు. ఇందునుగూర్చి న్యాయాన్యాయముల విచారింపవలసి యున్నది. రేపేకదా చాణక్యుఁడు వీనినిఁ జంపించుట కేర్పాటుచేసెను? దీనినిఁ దప్పించుటకేమి యుపాయమున్నది? స్వయముగఁ బెండ్లాడిన భర్తను చేతులారఁ జంపుకొని కోరి వైధవ్యమెట్లు దెచ్చుకొనెదను? ఇంతటి దుష్కార్యము నొనర్చుటకు నాహృదయ మెట్టులంగీకరించినది? నందవంశమును నాశనముఁజేసిన నాకుఁ గలుగులాభమేమియున్నది? నా మేనల్లునకు రాజ్యాధిపత్యమా? ఛీ! అక్కరలేదు. వాఁడట్టులే యుండును. భర్తను జంపుకొనె ననునపకీర్తి తప్ప నాకిందేమియును లేదు. రేపు జరుగఁబోవు కృత్యము నెట్టులైన నాఁపివేయవలెను? నాప్రతిజ్ఞభంగమైన నగుఁగాక. నా మేనల్లునకు రాజ్యము లేకున్న లేకుండునుగాక. నాకుమారు నీతఁడు చంపించి నను జంపించెనుగాక. ఏదియైనను వైధవ్యముమాత్రము నేను భరింపలేను. నాబుద్ధియంతయు నిప్పుడు పూర్ణముగ మారిపోయినది. నేను చేయఁదలఁచినది పతిహత్య. అందులోనే రాజహత్య, అబ్బా! నాతరముగాదు. నా తరముగాదు. నాభర్తను నేను జంపుకొనఁజాలను. ఇప్పుడే రాజును లేపి సంగతులన్నియుఁ జెప్పివేసెదను. ఒకవేళఁ జెప్పినచో రాజు నన్నే యురిఁ దీయుంచునేమో? ఆసంగతిఁ జెప్పుటకు నాకు మిక్కిలి భయమగుచున్నది. చెప్పక మరేమి చేయవలెను?............నామందిరమునుండి బయలు దేరినఁగదా వీని కాపద సంభవించును? కావున నట్లు బయలుదేరకుండ వీనిప్రయాణ మాఁపివేసెదను. నేను బోధించి చెప్పినచో నామాట నతిక్రమింపఁడు. ఇదియే మంచియుపాయము. రేపుమాత్రము గుమ్మముదాటి యెచ్చటికినిఁ బోనీయఁగూడదు. ఆయేర్పాటులన్నియుఁ దీసి పారవేయవలయునని చాణక్యునకుఁ గబురంపెదను."

అని తనలో ననేకవిధముల వితర్కించుచు నాటిరాత్రియంతయు నిద్రలేక యామె యట్టులేగడిపెను. ఇంతలోఁ దెల్లవారుజామైనది. అప్పు

డు నందుఁ డాకస్మికముగ మేల్కొని కన్నులువిప్పి, తనప్రక్కనే కూర్చుండియున్న మురనుగాంచి "దేవీ! యింకను నిద్రరాలేదా? మేల్కొనియున్నావేమి? ఎంతరాత్రియైనది?" అని యడిగెను. అదియే మంచిసమయమనియెంచి వానితోఁ జరుగఁబోవు కుట్రలన్నియుఁ జెప్పి యాతనిప్రాణములఁ గాపాడ నెంచెనుకాని, చెప్పివేసినతరువాతఁ దనప్రాణము లాతఁడు గాపాడఁడో యనుశంకచే నాసంగతులుఁ జెప్ప నిష్టపడక

"మహారాజా! తెల్లవారు జాముకావచ్చినది. కాని యేకారణముననో యింకను నిద్రరాకున్నది. నామనసుగూడ స్థిమితముగలేదు."

"ఎందుచేత? ఓహో తెలిసినది. రేపు నేను రాజసభకుఁబోయి మరల నీదగ్గరకు వచ్చెదనో లేదో యనియా?"

"ఔను అదియేకారణము. మీరు రేపుపోకతప్పదుకదా?"

"వచ్చెదనని మాటయిచ్చిన తరువాత నెట్లు తప్పును? నేఁ డేదో భయంకరకృత్యము జరుగునని తోఁచుచున్నది."

"ప్రాణేశ్వరా? ఏమిఆశ్చర్యము? నాకును నట్లే తోఁచుచున్నది. తమకేమైనఁ జెడుకలవచ్చినదాయేమి? ఏమోపలవరించిరి. కాని అది నాకు బాగుగఁ దెలియలేదు"

"ఏదో అపశకునమైనకల"

"ఏమి! చెప్పఁగూడనిదా?"

"అదే ఆలోచించుచుంటిని. అపశకునమైనకల చెప్పవచ్చునా?"

"చెప్పినంతమాత్రమున నష్టమేమున్నది? దయచేసి నాకెఱింగింపుఁడు"

"చెప్పెదనుగాని వినుటకు నీకుఁ గష్టముగనుండును. నీవుమాత్ర మాగ్రహమొందఁగూడదు"

"నాకెందుకుఁ గోపము? ఇది మీచమత్కారము కాఁబోలు"

"చమత్కారముగాను నిజమే చెప్పుచున్నాను. వినినచో నీకాగ్రహము రాకమానదు."

"లేదులేదు నాకాగ్రహమురాదు ఇంకసరియేనా?"

"సరే అట్లైన విను. నాకొక కలవచ్చినది."

"ఇదివరకే చెప్పిరికదా?"

"అది దుశ్శకునమైనకల"

"అదియు నాకుఁ గ్రొత్తకాదు తరువాత?"

"నీవును నేనును కలసి వేటాడుటకై యొకమహారణ్యమునకుఁబోయినామఁట. ఆయ్యరణ్యము గాఢాంధకారమై యున్నది."

"అబ్బా అంతభయంకరమైన యరణ్యమా? మనమిద్దఱమేనా?"

"అవును మనమిరువురమే మూఁడవ వారెవ్వరును లేరు."

"చమత్కారమైన కలయే తరువాత నేమైనది?"

"తరువాత?.........అబ్బా! నీకుఁ గోపమువచ్చునేమో సుమా"

"త్వరగాఁజెప్పుఁడు నేనాతురముతోనున్నాను."

"ఆయ్యరణ్యములో మనమిరువురమును నిల్చియుండ నేమిజరిగినదనఁగా, గొంతసేపునకు నాచేతిలోని బాణమును ఖడ్గమును నీవు జూచెదనని తీసికొంటివి. ఇంతలో భయంకరముగ నట్టహాసముఁజేయుచు, గర్జించుచు, ఒకపులి నామీఁదఁబడినది."

అదివిని యామెభయపడి రాజునకు దగ్గరగఁబోయి

"మహారాజా! రక్షింపుఁడు రక్షింపుఁడు. ఆపేరుచెప్పినంతనే నాయొడలు కంపమెత్తుచున్నది. అది నాయెదుటనే యున్నట్లున్నది."

"తరువాత విను."

"అబ్బా! మరిచెప్పవద్దు నాగుండెలు కొట్టుకొనుచున్నవి."

"మరెందులకడిగితివి? ఇదివఱకే చెప్పినాను."

"భయంకరమైనదే యయ్యును, వినవలెనని మాత్ర మాశతోనున్నాను."

"ముందుఁ జెప్పఁబోవుదానికిమాత్ర మాగ్రహింపకున్నఁ జెప్పెదను."

"నాకుభయముమాత్రమేకాని, యాగ్రహమెందుకు? తరువాత?"

"తరువాత నది నాపై తటాలునఁ బడి నన్ను:—"

"అయ్యో! అయ్యో! నాకు మూర్ఛవచ్చుచున్నదేమి దారి?"

"భయపడకు భయపడకు. ఇది కలగాని నిజముగాదు"

"నాకు? నిజముగానే జరిగినంత భయముపుట్టుచున్నది. ప్రాణేశ్వరా; తరువాత నేమైనది"

"ఆదేచెప్పుటకు కష్టముగనున్నది"

"ఆలోచించుటెందుకు? వేగము సెలవిండు"

"అదినామీఁదఁబడి నన్నుజంపుట కుద్యమించుచుండ నప్పుడు ఖడ్గమొకసారిఇమ్మని నిన్నడుగ నీవీయక దూరముగఁ బారిపోయితివి"

"అయ్యయ్యో! ఏమిగ్రహచారమిది? తమప్రాణములు విడిచి నేనట్లుపాఱిపోవుదునా? పోనిండు. స్వప్నమేకదా?"

"వెఱ్ఱిదానా! ముందుసంగతి జెప్పిన నింకెంత యాశ్చర్య మొందెదవో"

"దేవా! ఇంక నెట్టిసంగతులు వినవలసి యున్నవో విననిండు"

"నీవు నాకుఖడ్గమొసంగక నన్నుఁజూచినవ్వుచు, దూరముగ పోవుచుంటివి! అప్పుడు నిన్ను నాయపరాధములు క్షమించి నన్నుబ్రతికింపవలయునని యనేక విధములఁబ్రార్థింప, నీవించుకైనను లక్షింపక, జాలిగొనక "లేదులేదు. నిన్ను పులి చంపనేరదు. నాపిల్లవానినే వ్యాఘ్రముజంపినది? ఇప్పుడుజ్ఞాపకము వచ్చినదా? ఆఫలమిప్పుడనుభవింపు" మనినీవు పలికితివి. వెంటనేనాకు దెలివివచ్చినది"

అనిచెప్పగా కల విని ముర మిక్కిలి భయపడెను.

ప్రకరణము 24.

కృతనిశ్చయభంగము.

కల తెఱంగంతయు విన్నతరువాత, తానుజేసిన యేర్పాటులన్నియు రాజు విని స్వప్నమనుమిషచే నిట్లు చెప్పుచున్నాడేమో యని మురాదేవికి మొదట సందేహము గలిగెను. అందుచే నామెగుండె దడదడఁ గొట్టుకొనుటయే కాక, ముఖలక్షణములుగూడ మారి పైకి భయమును సూచించుచుండెను. నిక్కముగ నేరముజేసినవారు తమగుట్టు బైటఁబడిన తరువాత నెట్టిస్థితియందుందురో మురకూడ నప్పు డట్టిస్థితియందే యుండెను. కొంతసేపున కామెరోదనముఁగూడఁ బ్రారంభించినది. తమ కేయుపాయమును దోఁచనప్పుడు భర్తసన్నిధి నల్లిబిల్లియేడ్పులేడ్చుటయే కదా? కొందఱు స్త్రీలు సంపాదించిన గొప్పవిద్య? పేరునకుమాత్రము భర్తలై కాంతలకు బూర్ణముగలొంగి మెలంగు నామకభర్తలుతప్ప తక్కినవా రెన్నఁడు నట్టి కట్టియేడ్పుల నంతగా లక్షింపరు. కాని మన ధననందుఁడుమాత్రము మీద వ్రాసిన తరగతియందే చేరినవాఁడు గావున మురమొఖమును జూచి తాను సహింపలేక

"ప్రియా స్వప్నవృత్తాంతమున కింతభయ మొందనేల? ఒకవేళ నిజముగా నే పులివచ్చి నన్నుఁజంపినచో నీవెట్లోర్వఁగలవు!"

"దేవరవారి కట్టిగతియే సంభవించినచో నిలఁబడువాటున నే నా ప్రాణములు నన్నువిడిచి పోకుండునా? ప్రాణేశ్వరా! స్వప్నములోఁ దమకు ఖడ్గ మందీయలేదని నన్ను మరలఁ జెరసాలలోఁ బెట్టించెదరా యేమి?"

అని కెవ్వనార్చి వానిమొగముపైఁ దనమొగముఁ జేర్చిపరుండెను. రాజామె కన్నీరు దుడిచి యోదార్చుచు

"వెఱ్ఱిదానా! కలసంగతినిఁబట్టి నిన్ను శిక్షించుట కంతమూర్ఖుఁడ ననుకొంటివా? నిజముగానే నీవట్టులు చేసినను నీపై నాకావంతయు ద్వేషము జనింపదు."

"ప్రాణేశ్వరా! నిజమేకదా? లేక నన్ను వృథా శిక్షించెదరా? దిక్కులేనిదానను. ఎటుజూచినను మీరుదక్క నాకింకెవ్వరు రక్షకులు లేరు. హా! యీశ్వరా! ఇట్టికల యెందుకు వచ్చినది!"

"ఇంకను నెందుకేడ్చెదవు! పంచభూతములును సాక్షిగ నీపై నత్యంత ప్రేమతప్ప కించిత్తైనను నాకనుమానములేదు. నీవింక విచారింపకుము"

"సరే! అట్టులైనఁ దమరు రేపు రాజసభకు బయలుదేరెదరా?"

"మొదట నీవే యొప్పుకొంటివి. ఇప్పుడు నీవే వద్దనుచున్నావు. నీ సెలవుమీదనే, నేను మంత్రికి వచ్చెదని మాటనిచ్చితిని"

"నిజమేకాని, మానివేసిన నేమగును"

"ఎందుకు మానివేయవలెను?"

"కారణ మేదైననేమి? రేపుమాత్రము మీరు బయలుదేరవద్దు. ఎందుచేతననఁగా?........."

"వెళ్లినచో మరల వచ్చెదనో రానోయనియా? అబ్బా! నీకెంతసందేహమున్నది? మురా! నీపై నాకింతవిశ్వాసముండ నెవరేమి చెప్పినను నమ్మెదననుకొంటివా? ఔను నీమందిరమును విడిచినంతనే యనేకు లనేకవిధ

ముల నీపైని గొండెములు జెప్పెదరు. ఈనాసంగతి యెఱుఁగుదును కాని యెందుకు నమ్మెదను?"

అనిపలుక మురజరుగఁబోవునదంతయుఁ జెప్పి, క్షమాపణఁ గోరవలయునని యెంచి, యతఁడు క్షమించునో క్షమింపఁడోయని సందేహపడుచుండ, ధననందుఁడు

"ప్రియా! మాటాడవేమి? ఎందువలన నేను బోఁగూడదు?"

"ఎందుచేతనా? రేపు—రేపు—మీరు బయలుదేరఁగూడదు"

"ఔను కారణముఁ జెప్పవేమి? నీవు చెప్పకున్నను నాకుఁ దెలియక పోలేదు. వెళ్లినచో మరల వచ్చెదనో రానోయని నీకుఁ గట్టియనుమానము గల్గినది. కావున నీయనుమానము, నివర్తించుటకై నీవంతవలదని నిర్బంధించినను నేను బయలుదేరకమానను. నేను తిరిగి నీదగ్గరకు వచ్చినప్పుడే నీయనుమానమంతయుఁ బోవును. నేఁడేకాదు. నీకీశంక చాలదినములనుండియున్నది. అదంతయు నేఁడే నిన్ను విడిచిపోఁగలదు. ఇంక నీవేమి చెప్పినను నేను వినను. ఇది నిశ్చయము నీవింక నోరెత్తక పరుండుము. తెల్లవారజామైనది. మరికొంచెముసేపు నిద్రించి లేచిపోయెదను"

అని రెండవప్రక్కకుఁదిరిగి కనులు మూసికొనెను. ముర రాజును బయలుదేరకుండఁజేయుట కెంతప్రయత్నించినను కార్యము గానరాలేదు. తన మొఱలాలకించి యుపాయముఁ జెప్పుటకు నామెకెవ్వరును తోడులేరైరి. తనపై నెక్కుడు భక్తివిశ్వాసములఁగల బృందమాలయొకతెయుండెను కాని యామె యీకపటనాటకమున కెంతమాత్రమును బనికిరాదు. ఆమెను నియోగించినచోఁ గార్యము ధ్వంసమగుటయేకాక, యాపదగూడవచ్చును. అందుచేతనే మురాదేవి యామెను మొదటినుండియు దూరముగ నుంచెను.

దానివిషయమై యామె కెట్టియాపదయు లేదు. ఎట్టికార్యమును జేయుట కైనను ఒక్క సుమతిమాత్రము తగియుండెను. తనకపటనాటకమునకుఁ జేదోడువాదోడుగ నుండునని మురయామెపైనే నమ్మకముఁ గలిగియుండెను. తనమాటలు చాణక్యునకును, చాణక్యునిమాటలు తనకును జెప్పి యిదివరకు సుమతి యామె కెంతయో సాహాయ్యముఁ జేసినది. కాఁబట్టి ప్రస్తుతము నామె సాహాయ్యమును గోరుటయే యుక్తమనియెంచి, రాజు గాఢనిద్రయందుండుట యెఱిఁగి మురసుమతిదగ్గరకువచ్చెను. మెల్లమెల్లఁగ నామె యొద్దకుఁ బోయి యిటునటుఁ జూచుచు నెవరును వినకుండ

"సుమతీ! సుమతీ లే! లే. ఎంతసేపు పరుండెదవు" అని కొట్టి లేపెను. సుమతి, తోడనే భయపడుచులేచి "అమ్మా ఇప్పుడెందుకు వచ్చిరి? నేనేదియో ఆనందకరమైన స్వప్నములో మునిఁగియుండ నన్ను లేపి దానికి భంగము గల్గించిరి" అని పలుక మురయనుమానమునువహించి మొదటి నుండియుఁ దనకార్యమునఁ బ్రవేశించి మిక్కిలి విశ్వాసముతోఁ బనిసేయుచున్న సుమతి, యిప్పుడు క్రొత్తమార్పునుజెప్పిన, నంగీకరించునో యంగీకరింపదోయని, విచారించుచుండెను. రాజునెట్లయినను గాపాడుటయే తనకుఁ గర్తవ్యమైయుండుటచేత బృందమాలను పిలిచిన బాగుండునని మరల నాలోచించెను. కాని ఆబుద్ధికూడ నామెయెడ స్థిరముగ నుండలేదు. క్షణక్షణ మామెహృదయము మారుచునేయుండెను. ఇంతలో సుమతి."

"అమ్మా! మేల్కొల్పి మాటాడరేమి?"

"సుమతీ! రాత్రి నాకునిద్రపట్టలేదే. మనకార్యముసానుకూలమగునా? లేకున్నచో నీకును నాకును ఆపదసంభవించునుసుమీ!".

"అమ్మా! సంశయమెందుకు? చాణక్యుఁడు సామాన్యపురుషుఁడు కాఁడు. వానియేర్పాటు భంగమగుట కలలోనివార్త. మీకీసందియ

మెంతమాత్ర మవసరములేదు. తమ మేనల్లునకుఁ దప్పక రాజ్యము లభించును"

"ఛీ ఛీ! సుమతీ! (అని దానినోరు మూసి) గట్టిగ మాటాడకుము- గోడకుఁ జెవులుండు ననుసంగతి యెఱుఁగుదువా?"

అనిపలికి యేకార్యముఁ జేయుటకైనను చతురతగలసుమతియే తగునని యెంచి, బృందమాలతో నేమియును జెప్పుట కిష్టపడక.

"సుమతీ! నామేనల్లునకు రాజ్యాధిపత్యము గలిగినచో నాకేమి లాభమున్నది? అంతకన్న మహారాజు చిరాయువుఁ గల్గియుండిన నాకదియే యెక్కుడు సౌఖ్యముకదా? నన్నుఁ జెరలోఁ బెట్టి నాకుమారునిఁ జంపించెనను నీర్ష్యచేత నింతకాలమునుండియు నీప్రతిజ్ఞ నేను బూనియున్నాను. కాని అట్లుచేయుట యెట్టియవివేకమని నాకిప్పుడు తోఁచుచున్నది. కావున నన్నియేర్పాటులును విడిచిపెట్టి యిప్పుడే చంద్రగుప్తునిఁ దీసికొని, పొమ్మని చాణక్యునితోఁ జెప్పుము. రాజు నేడు బయలుదేరకుండ నేను జేసెదను. ఒకవేళ వినకున్నచో రహస్యములన్నియుఁ జెప్పివేసెదను. నన్ను శిక్షించిన శిక్షింపనీ రహస్యముగఁ గావించినయేర్పాటు లన్నియు నలువురిలోఁ బడకుండ రహస్యముగనే విడిచి, రాజును గాపాడుటయే యుత్తమమని చాణక్యునితోఁ జెప్పుము. నేనీసంగతులన్నియు రాజుతోఁ జెప్పకమానను.........ఏమి మాటాడవు?"

అదంతయువిని సుమతి భయపడి, ఇదికలయా లేక నిజమేనా యని సంశయించుచు నత్యాశ్చర్యముతో!

"దేవీ! తమ మనసిట్లు మారిపోవుటకుఁ గారణమేమి?"

"మారుమాటాడవద్దు. నేను చెప్పినట్లు చేయకతీరదు. పో. వేగముపో."

"చిత్తము. నేనిప్పుడేపోయి చాణక్యునిఁ దీసికొని వచ్చెదను కాని..."

"మఱేమియు నోరెత్తకు. వేగిరముపోయి యీసంగతి చాణక్యునితోఁ జెప్పుము. రాజుగారికిఁ దెలిసినచోఁ బాప మాబ్రాహ్మణుని నిష్కారణముగ శిక్షింతురు. వాని నెక్కడికైనఁ బాఱిపొమ్మని చెప్పుము."

అని పలుక దీర్ఘవిచారముతో సుమతి బయలుదేఱిపోయి వెంటనే చాణక్యునిఁ గొనివచ్చెను. మురవను వానికిని జరుగు సంభాషణము చదువరు లిప్పుడే తెలిసికొనఁగలరు.

ప్రకరణము 25.

కొడుకా? మేనల్లుఁడా?

సుమతివలన మురాదేవి యుద్దేశమంతయుఁ జాణక్యుఁడు విన్నతరువాతఁ దనకార్యమునకు భంగముగలుగునని యాతని కెంతమాత్రము నధైర్యము దోపలేదు. తనకుఁ గావలసిన పనిముట్లన్నియు సిద్ధముఁజేసియే యుంచుకొని, యేదైన నొకవస్తువుఁ దయారుచేయునప్పుడు, శిల్పికారుఁ డెప్పటి కేది యవసరమో, దాని నుపయోగించుచుఁ దనకార్య మెట్లు పూర్తిఁజేసికొనునో, అట్లే మన చాణక్యుఁడు గూడ, నిజకార్యసాధనమునకు వలయు నాలోచనములను, నుపకరణములను, తనహృదయపేటికయం దిదివరకే సిద్ధముగ నుంచుకొనియున్నవాఁడు. మురాదేవి తనకార్యమునకు భంగముఁ దలపెట్టినందున నాతఁ డిప్పుడు క్రొత్తగ నాలోచింపవలసినదేమియు లేదు. సహజముగ స్త్రీలు చంచలచిత్త లనుసంగతి చాణక్యుఁ డెఱిఁగియేయున్నవాఁడు గావున, నొకప్పుడు గాక, మఱి యొకప్పుడైనను, మురాదేవివలనఁ దనకార్యమునకు భంగము గలుగవచ్చునని యాతఁడు మొదటనే యనుకొనెను. అట్టిసమయ మెప్పుడైనఁ దటస్థించినయెడల నేమియుపాయము సేయవలయునో ఆవిషయమును గూడ నాలోచించి యాతఁడు సిద్ధముగానే యుంచుకొనెను. ఆనాఁడు సుమతివలన సంగతు లన్నియుఁ గనుఁగొని చాణక్యుఁ డింటినుండి బయలుదేఱివచ్చి, మురాదేవినిఁ గలసికొని, యేమియు నెఱుఁగనట్లు ప్రసంగింపఁ జొచ్చెను.

"దేవీ! ఇంతతొందరగ నెందుకు గబురంపితివి? మనకార్యమున కేదైన భంగమువచ్చినదా యేమి చెప్పు! అందుకుఁ దగినయుపాయమాలోచించెదను."

"అయ్యా! కార్యమంతయు బాగుగానే యున్నది. ఎట్టివిఘ్నములును రాలేదు. కాని మహారాజునకుఁ బ్రాణభంగము మాత్రము కాఁగూడదు. అందుకే మీకువర్తనమానమంపి పిలిపించితిని మీరిదివరకుఁ జేసిన యేర్పాటులన్నియును విడిచిపెట్టవలయును. రేపు రాజు రాజసభకుఁ బోకుండ నేనాపివేసెదను. అతఁడు నామాటవినక బయలుదేరుట కుద్యమించినచో మన కార్యక్రమమంతయు నాతనికిఁ జెప్పివేసెదను. కావున మీరింకఁ జంద్రగుప్తుని వెంటఁబెట్టుకొని యెచ్చటికైనఁ బారిపోవలయును. లేకున్న నాపద రాఁగలదు."

"(నవ్వి) మురా! నీకిష్టములేనిచో నన్నింతవరకు నెందుకు బాధపెట్టితివి? నీకొరకేగదా నేనింతకాలమునుండియు నానాకష్టములు బడి కార్యమంతయు ఫలోన్ముఖమునకుఁ దెచ్చితిని. నీవిప్పు డాకస్మికముగ నీమనసు మార్చుకొని..............."

అని గట్టిగ మాటాడుచుండ ముర

"గట్టిగ మాటాడవద్దు. రాజుగాని, తదితరులుగాని విన్నచో, నెప్పుడో రావలసినయాపద, యిప్పుడే వచ్చును. మీరింక వేవేగఁ బారిపొండు. మహారాజు మేల్కాంచు సమయమైనది. ఆతనిని నేడు నామందిరమునుండి కదలనీయను. నామనస్సు యిప్పటికి స్థిరమైనది. ఇంక మీరెన్ని చెప్పినను నేను వినఁదలచుకొనలేదు. నేను జేసిన యపరాధమంతయుఁ జెప్పి క్షమాపణవేడికొని, వానిప్రాణముల నేను గాపాడెదను."

"సరే! కాని నీకుమారుని ప్రాణము లూడఁదీసి, రాజుప్రాణములా కాపాడ దలంచుచుంటివి!"

"నాకుమారుఁ డెవఁడు! ఏమిట్లు మాటాడుచున్నారు. నాకేమియు నర్థము కాలేదు?".

"ఎట్టులర్థమగును? మొదట నీవుచేసిన ప్రతిజ్ఞ జ్ఞాపకముఁ దెచ్చుకొనుము. నీకుమారుని నిష్కారణముగఁ జంపుకొని వానికి రాజ్యము రాకుండఁజేయుట నీకు న్యాయముగాదు. నీకుమారునిఁ జంపించుటకై యానాఁడు రాజు ప్రయత్నించెనుకాని, ఆప్రయత్నము వ్యర్థమైనది. అందుచేతనే కాఁబోలు నీవిప్పుడు ప్రయత్నించుచున్నావు?"

ఆమాటలువిని ముర ఆశ్చర్య నిమగ్నమానసయై యుండఁ జాణక్యుఁడు

"దేవీ! భ్రమపడకు. ఇదివరకే నీకుమారుని చరిత్రము నీకుఁ జెప్పవలసి యుండెను. కాని సమయము వచ్చినప్పుడు చెప్పవచ్చునని దాఁచిపెట్టితిని. ఇప్పుడు నీమనసు పూర్తిగ మారియుండుటచే నీకుమారుఁడు జీవనముతోడనే యున్నాడని యిప్పుడు నీ కెఱింగించుచున్నాను."

"నాకుమారుఁడా. నాకుమారుఁడేనా! జీవనముతోనే యున్నాఁడా?"

"ఔను నీకుమారుఁడే! జీవనముతోనే యున్నాఁడు."

"హాస్య మాడుచున్నారా యేమి?"

"వినోదమున కిది సమయముగాదు."

"బలవంతముగఁ జంపఁబడిన నాతనయుఁ డెట్లు బ్రతికియున్నవాఁడు?"

"అతఁడు చంపఁబడలేదు. అతఁడు బ్రతికియే యున్నాఁడు. ఇంతకాలమునుండి వానిని నేనే పెంచితిని."

"వాఁడెక్కడిప్పుడున్నాఁడు?"

"పాటలీపుత్రములోనే యున్నాఁడు."

"పాటలీపుత్రములోనే యున్నాఁడా?"

"పాటలీపుత్రములో నీయొద్దనే యున్నాఁడు."

"ఏమేమీ! చావక పాటలీపుత్రములో నాయొద్దనే నాకుమారుఁ డున్నవాఁడా! అయ్యా! దయచేసి స్పష్టముగఁ జెప్పుఁడు."

"ఇంతకన్నను స్పష్టమేమున్నది!"

"ఇది నిజమని నేనెట్లు నమ్మఁగలను? చంద్రగుప్తుఁడు నాకుమారుఁడా? నాఁడరణ్యమున నాతఁడు చంపఁబడలేదా? ఇందేమియు మోసము లేదుకదా? లేక మీకార్యమున కడ్డముఁ జెప్పితినని యిట్లు కల్పించితిరా?"

"మురా! రాజే బాలునిఁ జంపింపఁ బ్రయత్నించెనో అతఁడే చంద్రగుప్తుఁడు! ఇందుకు వానిస్వరూపమే సాక్ష్యము. ఇంతయేల! మొదట వానినిఁ జూచినప్పుడు నీకుఁ బుత్రవాత్సల్యము బుట్టినదా లేదా? మొదటి నుండియు వానిపై నీకు శంక గలిగియుండెనా లేదా? అవసరము వచ్చి నప్పుడు చెప్పఁదలఁచియే తొందరపడక నీకీసంగతి నిదివరకుఁ జెప్పలేదు."

అని చెప్పెను కాని మురకుమాత్రము సందేహము పోలేదు. అందుచే నామె

"అయ్యా! మీకార్యసిద్ధికై యీపన్నుగడ పన్నలేదుకదా?"

"అట్టి యనుమానమున్నచో వాని స్వరూపమును బరీక్షించి చూడరాదా."

"అయ్యా! ఇంతకన్న నేదైన మఱియొక యుదాహరణమున్నదా?"

"కావలసినన్ని నిదర్శనము లున్నవి, కాని చెప్పుటకుమాత్రము వేళలేదు"

"ఆనిదర్శనములు వినకున్న నేనెట్లు విశ్వసింపఁగల్గుదును?"

"వాఁడు హిమగిరిప్రాంతమున నొక యరణ్యమధ్యమున మఱ్ఱిచెట్టు క్రిందఁ బడియుండ నొకనాఁటి వెన్నెల రాత్రియందొకగొల్లవానికి దొర

కెను. చంద్రకాంతియందు గుప్తముగ దొరకఁబడిన వాఁడగుటచేతనే వానికిఁ జంద్రగుప్తుఁడను పేరువచ్చినది. మొన్నమొన్నటిదాఁక నాతఁడు బాలకృష్ణునివలె గొల్లవారిండ్లయందే మెలఁగుచుండెను. వానిని నేను చేర దీసి అన్నిశాస్త్రములు నేర్పి యింతవానినిఁ జేసితిని."

అది వినినంతనే యామెసందేహము కొంతవరకుఁ దగ్గినది. కాని చాణక్యునితో కొంతవర కేమియు మాటాడక నిశ్చలముగ నట్లే నిలిచి తరువాత

"ఆర్యా చంద్రగుప్తుఁడు నాకుమారుఁడనుట యింకనిశ్చయమేనా?"

"ఆహా త్రికరణశుద్ధిగ నిశ్చయమే! ఇందు మర్మమేమియు లేదు."

"అట్లైన నన్నేమి చేయుమనెదరు? నాకేమియును దోఁపలేదు."

"నీవేమియును జేయనక్కఱలేదు. ఊరకుండిన నంతియచాలును రాజు ప్రయాణమును నీవాటంక పఱుపకుము. నీకుమారునకు రాజ్యమును దక్కనిమ్ము. నీరహస్యములన్నియు రాజున కెఱింగించి వానిప్రాణముల నిష్కారణము దీసివేయకుము. రాజశాసనానుసారముగ, దుర్మార్గుల నురిదీయుపనియందే మెలఁగుచు నదివఱ కెందఱిప్రాణములో తీసి చంపిన కఠినచిత్తులగు తలారులు సైతము ఆసుందరాకారునిఁ దమచేతులారఁ జంపలేక విడిచిపెట్టిపోయిరి. అట్టితఱి నవమాసములు మోసి కన్నతల్లివైయున్న నీవు వానిమరణమును గోరుట భావ్యముకాదు. నీవు రాజుదగ్గఱ నేమైన నోరెత్తిన వానిచావు నిజము. ఒక్కక్షణమున ఓపిక పట్టిన నాతఁడు మగధరాజ్యమునకుఁ జక్రవర్తియగును. ఇంతకన్న నేనింకఁ జెప్పవలసినది లేదు. తరువాత నీయిష్టము వచ్చినట్లు చేయుము."

అని బోధించి చాణక్యుఁ డచ్చట నిలువక వెంటనే బయలుదేఱి పోయెను. చాణక్యుని మాటలు విన్నంతసేపును కుమారుని క్షేమమే కోర

వలయునని యనుకొనుచున్న మురయాతఁడు బయలుదేరిపోయిన తరువాత, యథాప్రకారముగ నామె హృదయము భర్తప్రాణములు రక్షించుటయందే ప్రవర్తింపఁ జొచ్చెను. కుమారునకుఁ బట్టాభిషేకము భర్తకు పరలోకవాసము. లేదా, కుమారునకుఁ బరలోకవాసము భర్తకు భూలోకవాసము. ఈవిషయములయందే యామె హృదయ మల్లకల్లోల మొందుచుండెను కాని కడకేదియు నిశ్చయించుకొనలేదు. పిచ్చెత్తిన దానివలెనే, యామె తనమందిరమునఁ బ్రవేశించెను. ఇంతలో రాజుగూడ మేల్కొనెను. అతఁడు మేల్కొను సరికి ఆమె వానిప్రక్కనే యుండెను. రాజామెను గాంచి

"మురా రాత్రియంతయు నీకు నిద్రయేలేదా యేమి? నేను రాజసభకు బయలుదేఱుదునను భయముచేత నేనా? మఱేమైనఁ గారణమున్నదా?"

"అదియే కారణము మహారాజా. ఏమి సెలవు?"

"సెలవున కేమున్నది? నేఁడు తప్పకపోయి వచ్చిన నీయనుమానము తయుఁ బోవును."

"వద్దువద్దు. నాకుడికన్న దరుచున్నది. నాకు భయముగలుగుచున్నది."

"నీభయమంతయు నేఁటిసాయంకాలము నేను తిరిగివచ్చినప్పుడే పోవును. అంతవఱకు నిట్లేయుండును."

ప్రకరణము. 26.

పతియా? లేక కుమారుఁడా?

ఎట్టులైనను రాజును సభకుఁబోకుండఁ జేయవలెనని మురాదేవి యెంతో ప్రయత్నించెనుగాని యామె ప్రయత్నము ఇప్పటికి సఫలముగాలేదు. ఎంతచెప్పినను రాజు తనపట్టినపట్టు విడువకున్నవాఁడు. "మహారాజా! పోవలదు పోవలదు" అని యామె యనేకవిధములఁ బ్రార్థించెను కాని రాజామాటలను లక్షింపక "మురా! నీమనమున ననేకసందేహము లుండవచ్చును. కాని నీపై నెవరేమి మాటలు నాతోఁజెప్పినను నేను వినను. వినను. ముమ్మాటికిని వినను. గట్టిగ నమ్ముము. నీకెంతమాత్రమును భయములేదు. ఈవిషయమునుగూర్చి నీవింక నాతో నేమియుఁ జెప్పవద్దు. నీవేమిచెప్పినను నేను నాపనిమానను. నేఁటిసాయంకాలము నేను తిరిగివచ్చుసరికి నీభయము నీసందేహము నొక్కమాఱుపోవును. మఱిమాటాడకుము. పో! నాప్రయాణమునకు సర్వమును సిద్ధమొనర్పుము. నీకింత యనుమానమున్నచో నీవుఁగూడ నావెనువెంటరా! నీవు నాదగ్గఱనున్నచో నాతో నినుఁగూర్చి యెవరు నేమియుఁ జెప్పరు. ఒకవేళఁజెప్పిన నీవు తగినప్రత్యుత్తర మీయఁగలవు. అనిచెప్పి రాజామెను మరలమరల మాటాడకుండఁ జేసెను. తానింక నెంతచెప్పినను కార్యములేదని, ముర తనలోఁదానే దుఃఖించుచుఁ బతిప్రాణములు రక్షించుటకేయుపాయమును దోఁపక

"హా! దైవమా! యెట్టి సంకటము దెచ్చిపెట్టితివి? మాటాడకూరకుండినచోఁ గుమారునకు రాజ్యము దొరకును, గాని భర్తృహత్యాదోషము నాకలతమునకుఁ జుట్టుకొనకమానదు. పతినిఁ జంపుకొనిన పాపా

త్మురాలని జను లాచంద్రతారార్కముగ నన్ను నిందించెదరు. నాకుమారునకు రాజ్యము లేకున్న లేకుండును గాక. ఇదివఱకు నేను జేసిన దోషములన్నియు నాపతికెఱింగించి నాదోషము నొప్పుకొనెదను. క్షమింపుమని ప్రార్థించినను విడువక, యతఁడు నన్నుఁ గారాగృహమునఁ బెట్టించునా, పెట్టనిమ్ము పదాఱుసంవత్సరములు నాకుఁ గారాగారవాసము అలవాటు పడినదే కాని క్రొత్తదికాదు. ఇంతకంటె నాతఁ డేమిశిక్ష విధించును? నన్నురిదీయునా? ఊఁ, అదియును గానిమ్ము. నేను సిద్ధముగా నేయున్నాను. నాకుమారునిఁ జంపించెనను ద్వేషముచేఁగదా రాజుపై నేనింత కపటవ్యూహము బన్నితిని. వాఁడు చావుఁదప్పి బ్రతికియేయున్నవాఁడు. నిష్కారణముగ నాభర్తను నేనేల చంపుకొనవలయును? ఈచాణక్యుని నేనెంతకు నమ్మవలయును? నందవంశమంతయు నాశనముఁజేసి కడకుఁ జంద్రగుప్తునిఁ గూడ నతఁడు చంపివేయునేమో? అతఁ డెంతకు సాహసపరుఁడు కాఁడు! తలారులే చూచిచూచి చంపలేరని సుందరాకారుని నీవుమాత్ర మెట్లు చంపఁగలవు? అని యతఁడు నన్ను మందలించెను గాని, నాకుమారుఁడే మైనను నాపతినిమాత్రము నేను జంపుకొనలేను............ అఁ, అఁ, ఏమేమి? లేకలేక కడుపారఁ గన్న కుమారునే చూచిచూచి చేతులారఁ జంపుకొనవలయునా? ఛీ! ఛీ! అంతద్రోహము నాచేతఁగాదు. కాకున్నచో నెట్లు? పతినా? కుమారునా? ఎవరిని నేనిప్పుడు దిగమ్రింగవలయును? ఇరువురకును బ్రాణభంగము గాకుండఁ గాపాడు నుపాయమేదియును లేదా? ఏమున్నది? నేనుజేసిన యేర్పాటులన్నియు రాజున కెఱింగించినచోఁ దప్పక చంద్రగుప్తునిఁ జంపింపకమానఁడు. ఆనాఁడు చావుదప్పినను ఈనాఁడు మాత్రముదప్పదు. ఏమో అట్టులననేల? ఒకవేళ విడిచినవిడువఁగూడదా? నాపతియే జీవించియున్నచో నాతని మెల్లఁగ మంచిమాటలాడి వశపఱచుకొని చంద్రగుప్తునకే పట్టముఁ గట్టింపవచ్చును. ఛీ! ఛీ! ఎంత తెలివితక్కువదాననైతిని? ఆమూర్ఖబ్రాహ్మణునితో నేనిందుల కేకీభవించితిని? వానిపై నాకెందుకింతనమ్మకము గలిగినది? ఇప్పుడైన నేమైనది? రాజుతో

నన్నిసంగతులును జెప్పివేసెదను. మేమందరముఁ గలసి యెంతకుట్ర జేసినను, అతనిపాదములపైఁబడి శరణము వేడుకొన్నచో నతఁడు క్షమింపక మానఁడు. ఆఁడుదాననౌట నాప్రాణములును, ఉత్తమబ్రాహ్మణుఁడగుటఁ జాణక్యుని ప్రాణములును, తీయునంతటి సాహసమున కాతఁడు సమకట్టఁడు. ఒక్క చంద్రగుప్తుని ప్రాణములను గూర్చియే నాకు సందేహముగనున్నది. ఇందుకేమి యుపాయమున్నది? చేతులార వానిని ఖడ్గమున కెరవేయ సాహసింపనా? లేక కన్నులార నాపతి మరణమును జూడవలయునా? ఏమిచేయవలెను? ఇరువురకును బ్రాణభంగము గలుగకుండ నుపాయమేమియున్నది? ఏమియుననక మాటాడక యూరకుండినఁ బతి గడతేరకమానఁడు. ఏమైన నోరెత్తినచోఁ గుమారుఁడు కడతేరకమానఁడు. ఎంతటి దురవస్థ తటస్థించినది! అయ్యయ్యో కాలము మించిపోవుచున్నదే ఏమిచేయుదును? ఎవరిని దిగమ్రింగుదును? నాకుమారుఁడు బ్రతికియే యున్నవాఁడను సంతోషము నాకొకింతయుఁ గలుగదయ్యె. దైవవశమున బ్రతికెనుగాని లేకున్న నేమి జేసెదను? కావున ప్రస్తుతము భర్తప్రాణములు గాపాడినచోఁ దరువాత నన్నిసంగతులు నాలోచించి చంద్రగుప్తునివిషయమై తగిన యేర్పాటు చేయవచ్చును. పిమ్మట దైవాజ్ఞ యెట్లున్న నట్లగు".

అని విచారించుచు మురాదేవి దుఃఖసముద్రమున మునిఁగియుండెను. ఈసంగతులేమియు ధననందుఁ డెఱుఁగఁడు గావున నామె కన్నులఁ గారు నీరును, దీనమై వాడియున్న యామె ముఖమును, జూచి తనలో నవ్వుకొనుచు, నేను బయలుదేఱి మరలఁ దనవద్దకు వచ్చెదనో రానోయను విచారముచేతనే యీమె యింతవగచుచున్నదని యనుకొనుచుండెను. అట్టి యామె సందేహమును దొలఁగించి సంతోషమొందఁ జేయవలయునని ధననందుఁడు తన ప్రయాణమున మఱింతపట్టుదల వహించియుండెను. ధననందుఁ డానాఁడు జాముప్రొద్దెక్కువరకు నిద్రించి, మేల్కొని కాలోచిత కృత్యములు నిర్వర్తించుకొని స్నానము జపమును బూర్తిఁజేసికొనుసరికి మధ్యాహ్నముగావచ్చినది, ఈలోపున వానితో మాటాడుటకు మురాదేవికి

సమయముగాలేదు. కాని మజ్జనమాడుచున్నప్పుడుమాత్ర మామె చేతులు జోడించుకొని యేమో చెప్పవలయునని చెంతకుఁ బోవుచుండ రాజు దానిని గ్రహించి "ఏమీ? నీవువచ్చుట నన్నుఁబోవిడ్డని చెప్పుటకేనా? పో! పో! సాయంకాలమువరకు నీతో నేను మాటాడఁ దలఁచుకొనలేను" అని యేమి యును జెప్పకముందే తాను నిరాకరించుచుండెను.

రాజు ఆఁకలితోనున్నందునఁ దనమాటలు విని తగిన సమాధానముఁ జెప్పఁడనియెంచి భోజనమైన తరువాత సావకాశముగ నన్ని సంగతులును జెప్పవీలగునని మురి యంతవఱకును కాలముగడిపెను. ఆయాసముదీఱునట్లు ఒకక్షణము శయ్యపై విశ్రమించియే యాతఁడు రాజసభకు బయలుదేఱునని యామె నమ్మకము. కాని ధననందుఁడట్లు కాక భోజనానంతరమున నొక్క నిముసమైనఁ గూర్చుండక వెంటనే నిలువుటద్దము వద్దకేఁగి రాజసభకేఁగుటకై తగిన వస్త్రాలంకారములతో నలంకరించుకొనుచుండెను. అలంకరించుకొను లోపుననైన నన్ని సంగతులు జెప్పివేయవలెనని యామె యనుకొని మెల్లమెల్లఁగఁ జెంతకువచ్చుచుండ, ధననందుఁడు చూచి,

"ప్రియా! నీవేమి చెప్పెదవో తరువాత వినెదనుగాని మొదట నాకుఁ దాంబూలముఁ గట్టియిమ్ము. నేఁడు నీమనసు విచారముతోనుండుట చేతఁ గాఁబోలు మఱచిపోతివి? వేగిరము తీసికొనిరా" అని పంప మురి తాంబూల మొసఁగిన తరువాతఁ జెప్పెదనని యెంచి తమలపాకులను జుట్ట నారంభించెను. సామాన్యులు వేసికొనునట్లు మహారాజులు నాలుగాకులు నింత వక్కపొడియు నములువారు కారుగదా? జాజికాయ, జాపత్రియు, లవంగాలు, యేలకులు, కుంకుమపుష్పము, మృగనాభి, పచ్చకర్పూరము, మొదలగు సుగంధద్రవ్యములన్నియు వేసి ముత్యపుంజిప్పలఁ గాల్చిచేసిన సున్నమునురాసి తాంబూలము జుట్టుట కెంతయో కాలము పట్టును. అప్పటికిని పాపము మురాదేవి యానాఁడు తొందరగానే తమలపాకులను జుట్టినది. కొంతకాలమువఱకు దాసీలుచుట్టి యిచ్చిన తాంబూలమే రాజునకు

మురయిచ్చుచుండెనుగాని, విషమిళితమైన స్వామి ప్రసాదమును జూచి నప్పటినుండియు, నింకముందు నీవు స్వయముగానే తమలముఁజుట్టి యిచ్చుచుండవలెనని యతఁడు మురకాజ్ఞాపించెను. లేకున్న మురి యానాఁడంత తొందరలో నాకార్యము దాను స్వయముగ నెందుకు బూనుకొనును? ఎట్టకేలకు తాంబూలమును సిద్ధముఁజేసి యామె తనభర్తయొద్దకుఁ బోవు సరికి యతఁడలంకరించుకొనుట పూర్తియైనది. జలతారు మొగ్గలతోఁ బలు విధములఁ జిత్రింపఁబడి మోకాళ్లవఱకు జీరాడు నొకముఖమలంగరఖా ధరించి, చూచువారికిఁ గన్నులు మిఱుమిట్లు గొలుపుచు ధగధగలాడు నొక పట్టుషెరాయి దొడిగి, కంఠమున ముత్యాలహారములు వైచికొని, శిరముపై నవరత్నఖచితమైన బంగారు కిరీటమును దాల్చి, ఇంకను దిలకముమాత్రము సగముసగము దిద్దుకొనుచు నతఁడు రాజసభకు—కాదుకాదు స్వర్గలోక ప్రయాణమునకు సిద్ధమగుచుండెను. ఆసమయమున మురాదేవి వానిని సమీపించి, తాంబులము నందిచ్చి, సంగతులన్నియుఁ జెప్పుట కింతకన్న తరుణము లేదని గ్రహించి, కాలయాపన మొనర్చినచో నాపదవచ్చునని యూహించి తనప్రాణములపై నాశను విడిచి, తనకుమారుని మరణమునకుసైతము సహించి యపరిమితమైన ధైర్యమును వహించి, తనహృదయమునఁగల విచారమంతయుఁ ద్యజించి, తన కన్నులఁగారు దుఃఖకణములను బైటకొంగుతోఁ దుడిచి, తనభారమంతయును దైవముపైవైచి, రెండుచేతులను జోడించి, భర్తగారి ప్రాణములను గాపాడఁదలంచి, యాతనిపాదములకు సాష్టాంగ నమస్కారములొనరించి, "మహారాజా! గడచిన సంగతులన్నియుఁ జెప్పివేయుచున్నాను. నన్ను క్షమింపవలయును. నాప్రాణములను మీకు ధారవోసితిని. మీరే నాకుదిక్కు నన్నేమిచేసినను మీరు జేయవచ్చును ఇదిగో వినుఁడు—" అనిచెప్పఁబోవు సంగతి కుపోద్ఘాతము మాత్రము జెప్పి తరువాత గ్రంథ మారంభించుసరికి, ఆకస్మికముగ నెచ్చటినుండియో "జయము! జయము! మహారాజా జయము జయము మహారాజా" అని పెద్దకోలాహలము వినవచ్చెను.

ఆయుపద్రవ మేమియోయని మురాదేవి రాజపాదములపైనుండిలేచి యించుక ప్రక్కకుఁ జూచుసరికి దివ్యాంబరాలంకారములచే నలంకృతులై యువరాజగుసుమాల్యుఁడును, అమాత్యశేఖరుఁ డగురాక్షసుఁడును, చంద్రగుప్తుఁడును మరికొంత పరివారమును బిరబిరలోని కరుదెంచిరి. చంద్రగుప్తుఁడు తన కుమారుఁడేయని తెలిసిన తరువాత నామెకిదియే మొదటి చూపు. వానినిఁ జూచిన తోడనే యామె కక్కడలేని మోహమును బుట్టి వాని సౌందర్యమును ముఖమును నలంకరించియున్న రాజచిహ్నములను గని కెట్టి యాతఁడే చక్రవర్తి యగునని తనలో నిశ్చయించుకొనెను!

(యువరాజును జూచినతోడనే పూర్వపు ద్వేషమంతయు నామె మనసునకు జ్ఞప్తికిఁ వచ్చినది) అందుచే తనలో "ఛీ! నాకుమారుని రాజ్యాధిపత్యమునకు నేనేల భంగముఁ గల్గింపవలయును! కైలాసనాథుఁడే యీబాలుని బ్రతికించి యిచ్చుటకుఁ దీసికొనివచ్చెను కాఁబోలు? మగధరాజ్యమును వీనికే యిప్పింపవలయునని భగవంతుఁడే నాచే నింతవరకుఁ జేయించెను కాఁబోలు? నేనేమిచేయఁగలను? దైవప్రయత్నమును నేనెట్లు తప్పింపఁగలను. అని తనలో సమాధానముఁ జేసికొనెను. కాని యొక్కక్షణము వారెవరును రాకుండిననో నామె రాజున కన్నిసంగతులును జెప్పియేయుండును. వారందరును లోనఁ బ్రవేశించినంతనే ముర రాజునువిడిచి దూరముగఁబోయి, నిలిచి "ఆర్యపుత్రా! మీకొరకుఁ బరివారమంతయు వచ్చినది. తమరు సురక్షితముగఁబోయి వచ్చెదరుగాక" అని పలికి తనకుమారునివైపు రెప్పవాల్పకుండ జూచుచుండెను. ధననందుఁడు తనకెదురుగ వచ్చి నమస్కరించి నిలిచిన యువరాజును ముద్దులాడుచు, అమాత్యునితోఁ బ్రసంగించుచుఁ దక్కిన పరివారమును బహూకరించుచు నిలువుటద్దములో మరియొక్కసారి తనరూపమును జూచుకొని మురవంక తిరిగి "దేవీ. నాకింక సెలవిచ్చెదవా! నీవు విచారింపకుము. నీవు పతిభక్తికలదానవే కావున నీకేయాపదయు సంభవింపదు." అని పలికి మందిరమును విడిచి వారందఱితోఁగలసి యావలకుఁబోయి తనకొరకలంకరింపఁబడి సిద్ధముగనున్న

పట్టపుటేనుఁగుపై నధిష్ఠించెను. వాని యెడమప్రక్క నింకొకయేనుఁగుపై అమాత్యరాక్షసుఁడును రెండవప్రక్క యువరాజును వెనుక గజారూఢులై దక్కటికుమారులును బయలుదేరిరి. మనచంద్రగుప్తుఁడుమాత్రము వారికెంతో దూరమున నొక చిన్నగుఱ్ఱముపైనెక్కి వెనుక వచ్చుచుండెను. మురమందిరమునుండి రాజసభకుఁ బోవలయునన్నఁ జాలదూరము నడువవలసియున్నది. రాజమార్గమున నచ్చటచ్చటఁ బలువిధములగు స్తంభములఁ బాతి తోరణములఁగట్టి ఆక్రిందనుండి రాజుపోవునప్పుడు వానిపై పుష్పవర్షము గురియునట్లేర్పాటుజేసిరి. ధననందునిఁజూచి చాలకాలమైనందునఁ బ్రజలందరు నానందసముద్రమునఁబడి తేలుచుండిరి. సౌధోపరిభాగములపై నధిష్ఠించి పౌరకాంతామణులెల్ల వానిపైఁ బన్నీరుఁజల్లుచు, పుష్పముల విసరుచుఁ దమరాజభక్తి వెల్లడించుచుండిరి. ఎచ్చటఁజూచినను నగరమంతయుఁ బలువిధముల శృంగారింపఁబడియే యుండెను. ఇసుకవేసిన రాలకుండునట్లు ప్రజలందరు రాజుగారివెనుక జయజయశబ్దములతో బయలుదేరుచుండిరి. ఇట్లు కొంతదూరము పోవుసరికెవఁడో యొకసేవకుఁడు పరుగుపరుగున నమాత్యరాక్షసునకెదురుగ వచ్చుచుండెను. వానిచేతిలో నేదేనిమిది గజములపొడవుఁగల యొక వెదురుగలదు. దానిచివర నొకయుత్తరమును దగిలించి యాసేవకుఁడు గజారూఢుఁడై రాజుప్రక్కనుండియే వచ్చుచున్న రాక్షసునికందిచ్చెను. అతఁ డాయుత్తరమునుజూచుకొని తత్తరపడి యాతురతతో "మహారాజా! నేనింతవరకును మీతోవచ్చితినిగాని తొందరపనిమీద నేను వేరేమార్గమునఁబోయి కొంతసేపునకు మిమ్ము రాజసభలోఁ గలసికొందును" అని పలికి తా నింకొకమార్గమున నెచ్చటికో పోవుచుండెను. కాని రాజుమాత్రము వాని మాటలయందంతగా లక్ష్యముంచలేదు. యువతులెల్లరుఁ దనపై పుష్పములు చల్లుటయు, నగరశృంగారమును, విచిత్రములును, వినోదములును, జూచుచు, రాక్షసుఁడేమో చెప్పుచున్నాఁడని యెంచి యట్లే యని తల నెగరవేసెను. ఇట్లుండఁ గొంతసేపున కాయుత్సవముతో ధననందుఁడు మార్గమధ్యమున విచిత్రముగఁ గట్టఁబడిన

యొక పెద్దతోరణము దగ్గఱకువచ్చెను. అంతరిక్షము పొడుగునను అతిమనోహరమునఁ దయారుచేయఁబడిన యాతోరణముపై నెల్లవారి దృష్టులు నుండెను.

పాప మచ్చట మురాదేవిమాత్రము, తనమందిరమునఁ బతియా లేక కుమారుఁడా యనుసందేహమందే మునిఁగి తేలుచుండెను. కుమారునిఁ జూచినప్పు డామెహృదయము గొంతమారినది కాని ధననందుఁడు తనవద్దకువచ్చి "దేవీ నాకింక సెలవిచ్చెదవా" యని యడిగినప్పుడుమాత్ర మామె హృదయము దుఃఖపూరితమై మరల యథాస్థితికివచ్చెను. అప్పటినుండియు దనసౌభాగ్యమునకు భంగముగల్గునని యామె యేడ్చుచున్నయేడు పింతింత గాదు. "అయ్యయ్యో! దైవమా! నాకింకేదిదిక్కు? మృత్యుముఖమునఁ బడుటకు నాభర్త బయలుదేరెను. అక్కటా ఎంతసాహసమున కొడిఁగట్టితిని? ఎట్టియపకీర్తి పాలైతిని?

పవిత్రమైన యార్యవంశములో జనించిన మహాపతివ్రతలలో నాయట్టి చండాలురాలు, నాయట్టి మూర్ఖచిత్త, నాయట్టి గొడ్రాలు, నాయట్టి దుష్టస్త్రీ, యొక్కతెయైననున్నదా? ఒక్కతెయైనఁజేతులారఁ బ్రాణభర్తను జంపుకొనినదా? ఒక్కతెయైనఁ గోరికోరి వైధవ్యమును దెచ్చుకొనినదా? అయ్యయ్యో! దైవమా! నాకిందేదిదిక్కు? నన్నెవ్వరిపాలుజేసెదవు? నన్నే నడిసముద్రములోఁ బడఁద్రోసెదవు? ఇట్టి క్రూరకృత్యమునకు నన్నెందుకుఁ బురికొల్పితివి? ఓరోరిదుష్టా మూర్ఖచిత్తా! అధమాధమా! చాణక్యా! నీవు నాకెక్కడ దాపరించితివిరా? నన్నెంతమోసముఁ జేసితివిరా?"

అని పండ్లు పటపటఁ గొరుకుచు.

"ఓరోరి బ్రాహ్మణాధమా! నీయెడ నేనింక జాలి వహింపఁగూడదు. శుభముఁబోవులోపల నానాథునిఁ గలసికొని నీచర్యలన్నియు వానికెఱింగించి

నీప్రయత్నములన్నియు భంగముఁజేసి నాయెదుటనే నిన్ను కండకండలుగఁ గోయించెదను చూడు"

అని ప్రక్కకుఁజూచి "ఓసిముద్దా! బృందమాలా వేవేగ సవారినిఁ బోయీలను దెప్పింపుము"

అనిపలుక నామె

"అమ్మా యిప్పుడెక్కడికిఁ బోయెదవు."

"ఓసి బానిసా! నీకన్నులు నెత్తికెక్కెనా యేమి? నేనెక్కడికి పోయెదనో నీకెందుకు! నాయొడలు గడగడవణకుచున్నది. నానోట మాట రాకున్నది. వేగఁదెప్పింపుము. అయ్యో అయ్యో రక్కసీ! నాచేతులతో నాభర్తనెట్లు చంపుకొందునే? తల్లీ! తల్లీ! నిన్ను బ్రతిమాలెదను వేగిరము సవారిఁ దెప్పింపవే"

అని యేడ్చుచుండ బృందమాల భయపడి పరుగెత్తుకొనిపోయి యప్పుడేయొక పల్లకిఁదెప్పించెను. తక్షణముననే మురదానియందుఁగూర్చుండి యతిత్వరగాఁ బరుగుపరుగున మహారాజుగారికడకుఁ దీసికొనిపొండని బోయీలకాజ్ఞాపించెను. వారును పల్లకినెత్తికొని కొంతదూరముఁ బోవు, సరి కాకస్మికముగ హాహాకారములును రోదనధ్వనులును బల్లకిలోనున్న మురకు వినఁబడెను.

ప్రకరణము. 27.

స్వయంకృతాపరాధము.

ప్రజాసందోహమునుండి వినవచ్చిన యాయల్లకల్లోలమును బ్రత్యక్షముగ వినియు, మగని ప్రాణముల రక్షించుటయందింకేమైనఁ దనకవకాశముండునేమోయను నట్టిభ్రాంతిచేత మురాదేవి యూరక కొట్టుకొనుచుండెను. ఆరోదనము తనచెవినిఁ బడినంతనే రెండుచేతులతో గుండెలును నెత్తియు మోఁదుకొనుచు నామెకూడ రోదనమారంభించెను. కాని పాపమామె నోదార్చువారెవ్వరును లేకపోయిరి. కన్నులనుండి యెక్కుడంతనీరు గారినను, ముఖమెంత విచారమును సూచించినను, అంతమాత్రముననే మగధరాజ్యలక్ష్మీ ధురంధరుఁడగు ధననందునిచే నెంతయో యోదార్పఁబడుచుండిన మురాదేవి, పాపము నెత్తియు నోరును బ్రద్దలుజేసికొనుచు, నెంతరోదన మొనరించుచున్నను మాచి జాలిపడువారైన లేనందున నారోదనమంతయు నరణ్యరోదనమువలె నిష్ఫలము గావలసివచ్చినది. ముందునకుఁబోవుటకుఁగాని, వెనుకకుఁ మరలుటకుఁగాని యామెకప్పుడు దోపలేదు. నిజముగ నామెకప్పుడు పిచ్చియెత్తినది. ఇట్టి దురవస్థయందామెయుండి ప్రయాణముసేయుచుండఁ గొంతసేపునకు ప్రజాసందోహమునుండి యొక్కమారు "జయజయరాక్షసామాత్య జయజయరాక్షసామాత్యా" అను ధ్వని యాకస్మికముగ వినవచ్చెను. ఆశబ్దము వినినంతనే మురవెలవెలఁబోయి నోటనేమియు మాటరాక కొంతసేపువరకు నట్లే చూచుచునే కారణమునకో కాని తనదుఃఖమంతయు విడిచి, యెక్కుడలేని యానందమును తానేవహించి "శబాస్ అమాత్యరాక్షసా! నీకే జయము గలిగినదా? చాణక్యుని ప్రయత్నములన్నియు వ్యర్థములైనవా? ఆహా! ఏమి నీచాతుర్యము? మహారాజు

గారి గండమెట్లు తప్పింపఁగలిగితివి? నీవే నిక్కమైన రాజభక్తుఁడవు, నిష్కారణముగ నీపై నింతకాలమును దురభిప్రాయము వహించియుంటిని. నాయనా! నీవే మహారాజుగారి నెట్టులైన రక్షింపవలయు, నీవేధన్యుఁడవు. నేనే రాజద్రోహిని. చాణక్యునియేర్పాటులకు భంగముఁ గల్గించి మహారాజును నీవు గాపాడకున్న నీజయజయధ్వనులేటికి బుట్టును? నాకోరిక ఫలించినది. రాజుచే బలవంతముగ నురిదీయఁబడకుండ నిచ్చటనే నాప్రాణములు విడిచెదను. అయ్యో! ఇంతద్రోహ మొనరించినతరువాత నాతఁడు నన్నింక విడచునా? ఆమష్ట బ్రాహ్మణుని మొగ మెట్టివేళఁ జూచితినో కాని యింతకాలమును వాని కుట్రలయందుఁబడి రాజహత్యకును పతిహత్యకును, గూడఁ బాల్పడవలసి వచ్చినది. అందుకుఁ బ్రాయశ్చిత్త మాత్మహత్యకన్న నింకేమున్నది"

అని మురాదేవి తనలో ననుకొనుచు రాజు గండముగడచినది కదా యని యెంతయో సంతసించుచుండెను. ముందుముందుఁ బోయినకొలఁది "జయజయరాక్షసామాత్య" యను శబ్దములు తఱుచుగ వినవచ్చుచుండెను. ఇసుకవేసిన రాలకుండునట్లు ప్రజలు క్రిక్కిరిసియుండుటచే నడచిపోవుటకుఁగూడ నెంతమాత్రమును వీలులేకుండనుండెను. అందుచే మురపల్లకి నింకను ముందునకుఁ గొనిపోవుటకు బోయీలకు దుర్భరమయ్యెను. జనులందరు నొకరిపై నొకరుపడి యూపిరియైన రాకుండ జిక్కుపడియుండిరి. జనసమ్మర్దమున, నడగి ముందుఁబోవుటకును వెనుకకు మరలుటకునుగూడ నవకాశము లేనందునఁ గొందఱు తమప్రాణము లఱచేతుల నిడుకొని ప్రయాసపడుచుండిరి. ఒకరిపైనొకరు తిరుగబడుచు, నొకరినొకరు త్రొక్కివేసికొనుచు, గాయములఁ దగిలించుకొని, యొండొరులఁ దిట్టుకొనువారును, గ్రుద్దుకొనువారును, మోఁచేతులతోఁ బొడుచుకొనువారును, లాటీకఱ్ఱలచే మోదుకొనువారును, ఎచ్చటఁ జూచినను విచ్చలవిడిఁ గానవచ్చుచుండిరి. ఇట్టి యల్లకల్లోలములోఁ గొంతసేపునకు బూర్వమువలెఁ బ్రజలెల్లరు హాహాకారముల ఘొల్లుననార్చి ముందువైపునుండి తిరిగి వెనుకకుఁ బరుగెత్తివచ్చ

చుండిరి. ఆసమయమున మురాదేవి పల్లకి ముక్కముక్కలై ధ్వంసమగుటయే కాక, ఆమెకుఁగూడ ప్రాణసంకటము గలుగవలసినదే కాని, దృఢకాయులగు నాబోయీలు లిటాలునఁబల్లకిఁ గ్రిందకుఁదించి యేయపాయమును రాకుండఁ గొంతవరకుఁ గాపాడఁగలిగిరి. ఆబోయీలలో నొకఁడామెదగ్గరకువచ్చి, దేవీ! ఇంకఁ బల్లకిముందున కెంతమాత్రమును బోఁజాలదు. ప్రజాసందోహమంతయు మహాసముద్రమువలెనున్నది. సముద్రతరంగములవలె జనులు గుంపుగుంపులుగఁ గూడి మీఁదఁబడి పోవుచున్నారు. ముందు జరిగిన చిత్రమేదియో మనకుఁ దెలియకున్నది కాని అమాత్యరాక్షసుని మాత్రమెందరెందరో యూరక దూషించుచున్నారు. తనప్రాణములు రక్షించుకొనుటకై యాతఁడెక్కడికో పాఱిపోయెనట. ఇఁకముందున కొక్కయడుగైన నిడుట మాతరముగాదు. సెలవైనచోఁ బల్లకినిక్కడనే యుంచెదము. లేదా యింటికిఁ గొనిపోయెదము" అనిపలుక మురయాతురతో "ఏమేమీ? రాక్షసునే దూషించుచున్నవారా? నిజమేనా? చాణక్యునకే జయము గల్గెనా? యేమి? ఓరీ! జయజయ రాక్షసామాత్యయను శబ్దములు మనమిప్పుడు విన్నారముగదా? పోపో నీవుపోయి అతివేగముగ నాసంగతి యేమియో కనుఁగొనిరమ్ము" అని వానినిఁ బంపించెను. కాని యాతఁడు బయలుదేరి రమారమి నూరడుగులైనను బోకమునుపే, మురయాందోళనమంతకంతకధికమగుచుండుటచేఁ దనబోయీలలో నింకొకనిపిలిచి "ఏమిరా! వాఁడింకను రాకున్నవాఁడు ఇంత ఆలస్యమేల? నీవుపోయి ఆసంగతిఁ గనుఁగొని పరుగుపరుగున రా! పోపో" అని మఱియొకనిఁ బంపెను. పాపమామెకప్పుడు శరీరముపై స్మృతియే లేదు. ఆమెగుండె లెడతెరిపి లేకుండఁ దడదడఁ గొట్టుకొనుచుండెను. హృదయమునుండి యుబ్బొంగుచుఁ బైకుబుకుచున్న దుఃఖమునకు మితియే లేదు. మందమారుతముచేఁ జలించుచుండు లతవలె నామెశరీరమంతయు నిలుకడలేక భయాతిశయమున నూరక వణకుచుండెను. తనయాజ్ఞప్రకారము రెండవవాఁడుకూడ బయలుదేరి వెళ్లినను మనసు నిలుకడలేనందున, నాతురతచే బోయీలనుగాంచి "ఇంకను

రాలేదా? సరే! నేను బయలుదేరెదను మీరు సాహాయ్యముగ వచ్చి నాకొఱకు మార్గమునుజూపుఁడు" అని యడుగ వారు వినయముతో "అమ్మా! వద్దువద్దు. తమరురాలేరు. ఈజనసమ్మర్దమునఁ బోవుటకు మాకే ప్రాణములు కటకటలాడుచున్నవి.

ఇంతకును అక్కడికిఁబోయి యేమిచేసెదరు?" అని వారించిరి కాని మురవారిమాటలు వినక "నాకు భయములేదు. నన్నిప్పుడు మహారాజుగారున్న ప్రదేశమునకుఁ గొనిపోయితిరేని మీకు మంచి బహుమానమిచ్చెదను. వేగిరముఱండు" అని దిగ్గునఁ బల్లకినుండిదిగి యావలకు వచ్చినిలిచెను. బోయీలామెకెదురుచెప్పనేరక బలవంతముమీఁద నామెను గొనిపోవుట కంగీకరింపక తీఱినదికాదు. తాము ముందునిలిచి గుంపుగుంపులుగఁ గూడియున్న జనులను ప్రక్కకుఁ ద్రోసివేయుచు, వారిమధ్యనుండి మార్గముఁ జేసి, యామెను గొనిపోవుచుండిరి. పాదచారిణియై యామూఁకలోనుండి నడచిపోవుట మురాదేవికి దుర్భరమైనను ఆమె తనపని మానలేదు. మురకూడ మహారాజులలో నొకతేయని యెఱింగినవారెయయ్యు నామెను జూచియును నెవరును దారియొసంగరయ్యె. లక్షలకొలదినున్న నాజనులందరిలో నెవ్వనిమొగము జూచినను విచారముచే దీనదశయందే యుండెను. కన్నులనుండి నీరుఁ గార్చనివాఁడానాఁడొక్కఁడైన నందులేడయ్యె. "హా దైవమా! యేమీ ఘోరమును మాకన్నులతోఁ జూడఁజాలము" అని కొందరు వెనుకకుఁ దిరిగి పాఱిపోవుచుండిరి. ఆఘోరకృత్యమెట్టిదియో చూడవలయునని మఱి కొందఱు ముందునకుఁ బరుఁగిడుచుండిరి. అష్టకష్టములుపడి మురయొట్టకేలకు బోయీలవెంటఁ బోయిపోయి, యొకచో దట్టముగఁగూడియున్న యొకజనసమూహమువద్దఁ జేరెను. అత్తఱి నొకబోయివాఁడు "దేవీ! ఇంతవరకు నెట్లో యీమహాసముద్రము నీఁదుకొనివచ్చితిమిగాని, యిఁకముందుఁ బోఁజాలము. ఈసమూహమును దాఁటుట మాకే యశక్యముగనున్నది. వీరందరిని తప్పించుకొని మీరింకరాలేరు. సెలవైనచో సురక్షితముగ నింటికిఁ గొనిపోయెదము" అని ప్రతిమాలుకొనెనుగాని ఆమె వినక "ఓరీ! ఇంతదూరమునువచ్చి

యింకఁ గొంచెములో మనము భయపడరాదు. మీయందరికిఁ దగిన బహుమానమిచ్చెదను. నన్నెట్టులైనఁ గొనిపొండు" అని దీనముగఁ బలుకవారు బలవంతముగ నాగుంపులోదూరి యించుక త్రోవఁజేసిరి. ఎట్టకేల కతిప్రయాసతో నామె కొంతసేపున కాజనసమూహమునుదాటి యావలఁబడు సరికి పాప మామెకన్నులు దారుణకర్మములు జూడవలసివచ్చెను. ఎచ్చటఁ జూచినను రక్తప్రవాహమును మృతకళేబరములును విశేషముగఁ గానవచ్చుచుండెను. వానిచుట్టును ఖడ్గపాణులై రాజభటులు జనులను దగ్గరకుఁ బోనీయకుండ ఘారాయిచ్చుచుండిరి. అదంతయును జూచినప్పుడే మురశరీరమంతయు నొక్కసారి కంపమెత్తెను. అందరితోఁబాటుగ నామెకూడ నాదారుణకృత్యమును జూచుచుండ నింతలో నొకపురుషుఁ డామెవద్దకువచ్చి "ఇట్టికార్యములను జూచుటకు స్త్రీలెంతమాత్రమును రాఁగూడదు. నీకిందేమిపనియున్నది? నీవుచేసిన యేర్పాటు జరిగినదో లేదోయని పరీక్షించుటకా వచ్చితివి? నీకాసందేహమక్కరలేదు నీకోరికలన్నియు నెరవేరినవి. ఈతంత్రమంతయు నీవొనర్చినదేయయ్యుఁ బాపనిందమాత్ర మమాత్యరాక్షసునిపైఁ బడినది. చాలుచాలు నీయుక్తికిఁ జాలసంతసించితిమి. నీవిక్కడ నిలువఁగూడదు నడునడు." అని నిష్ఠూరముగఁ బలికెను. ఆగుంపులో మన చాణక్యుఁడుగూడ నుండెను. అచ్చటికి మురగూడవచ్చునని యెఱింగియే తానును వచ్చెను. కొంతసేపునకుఁ దనకించుమించుగ సమీపముననేయుండిన చాణక్యునిఁజూచి మురి కనులెఱ్ఱఁజేసి క్రోధావేశమున నొడలు మఱచి "ఛీ! మూర్ఖా! ఆర్యకాంతలచే నిట్టిఘోరకృత్యమును జేయించితివిరా? నాగతియు నాకుమారునిగతియు నేమైనను సరియేకాని, నేనిప్పుడే రహస్యములన్నియు గేకలువేసి అందరితోఁజెప్పి నిన్నుఁగూడఁ జంపించెదను చూడుము జనులెల్లరు నిప్పుడే తమ దురభిప్రాయమును విడిచి వాస్తవమును గ్రహింపఁగలరు" అని కఠోరముగఁబల్కి యామె తనముసుగు దీసి పారవైచెను. అప్పు డామె భీకరాకారమునుజూచి మూర్తీభవించిన క్రోధదేవతయో యనియు సాక్షాత్కరించిన కాళికాదేవియో యనియు నందఱును

భ్రమపడఁజొచ్చిరి. ముసుఁగుఁదీసి క్రిందఁబారవైచి నిజస్వరూప మెల్లరకుఁ జూపుచుఁ జాణక్యునిగుట్లన్నియుఁ బైటఁబెట్టి యాతనికిఁ దగిన ప్రాయశ్చిత్తముఁ జేయింపవలెనని యెంచి "ఓమహాజనులారా! మీరందరును నామనవి నాలకింపుఁడు. ఈక్రూరకృత్యమంతయు నిశ్చయముగ నమాత్యరాక్షసుఁడు చేసినది—" అని బిగ్గరగఁ జెప్పునరికిఁ జాణక్యుని మంత్రమాహాత్మ్యము వలనఁ బైమాట లామెనోటనుండి వెలువడలేదు. ఆకస్మికముగ నిరువురు భిల్లులు వెనుకనుండివచ్చి తటాలున నామె దౌడలునొక్కివేసి మోసికొనిపోవసాగిరి. హా! ఎవరు చేసికొనినది వారనుభవింపక తీరదు కదా? పాపము, ముర గిజగిజగింపుకొనుచు గాళ్లఁజేతులఁ దన్నుకొనుచు నెత్తినోరు మోఁదుకొన నారంభించెను. ఆమెనుభరించుట తమకు దుర్భరముగఁ దోచినందునఁ గొంతసేపునకు నాభిల్లు లిరువురును ఆమెను విడిచిపెట్టిరి. ఇంకఁ జాణక్యుఁడు తన్ను బ్రతుకనీయఁడని నిశ్చయించుకొని తానుఁగూడ నచ్చటనే చావనెంచి ముందునకువచ్చి "ఓరోరి దుష్టా! చాణక్యా? నీవుచేసిన దుష్కార్యమువలన జన్మజన్మములకును దైత్యుఁడవై పుట్టుచుందువు. నాప్రాణేశ్వరునితో నేనిప్పుడే జోహారుచేసెదను." అని శాపమిచ్చి అచ్చటఁ ద్రవ్వఁబడియుండిన గోతిలోఁ దటాలున దుమికెను. ఆగోయి రమారమి యిరువదిగజములలోతును అంతయే వెడల్పును గలిగియుండెను.

అంతలో నెవరైన నాకస్మికముగ బడిపోయెదరేమోయని చుట్టును భిల్లులు గాచికొనియుండిరి. మురాదేవి దానిలో దుముకుచున్నప్పు డామె నడ్డగించి బ్రదికించుట యవసరమని యెవ్వరికిని దోపలేదు. తన్నుఁ బదారుసంవత్సరములు కారాగారమునఁ బెట్టించి, తనకుమారునిఁ జంపించె ననునీర్ష్యచే నింతకాలమువరకుఁ దనపతియెడ ద్రోహబుద్ధివహించి, తుదకుఁ దాను జేసినదానికిఁ బశ్చాత్తాపమొంది యింతవరకును మనకథాభాగమునకు ముఖ్యపాత్రయైన ముర ఆనాటితోఁ దనజీవనమును జాలించి అంతకుమున్నే ఆకస్మికముగ ఆగోతిలోఁబడి ప్రాణములు విడిచిన తనభర్తను గలిసికొని మురతనపతిభక్తి లోకమున వెల్లడిచేసికొనెను.

ఎవఁడో యొకసేవకుఁడు వచ్చి ఏదో యొకయుత్తరమిచ్చినంతన, దానినిఁ జూచుకొని వేఱుమార్గమున నమాత్యరాక్షసుఁడు బయలుదేరిపోయెనని యిదివరకే వ్రాసినారముగదా? పాటలీపుత్రమును పర్వతరాజు ముట్టడించెననియు, మీఁరొకసారివచ్చి సంగతులన్నియు జాగ్రత్తగఁ జూడవలసి యున్నదనియు నందు వ్రాయఁబడియుండుటచే, రాక్షసుఁడు తత్తరపడి, ఆసమాచారమేదియో కనుఁగొనవలెనని వెంటనే యచ్చటనుండి బయలుదేరెను. తరువాత ధననందుఁడు మొదలైన వారెందఱో ఆగోతిలోఁబడి ఏమిచిత్రమోకాని పడినంతనే కత్తివ్రేటునఁ దునకతునకలగుచుఁ బ్రాణములు బాసినందున నీఘోరకృత్యము రాక్షసుఁడే చేయించెననియు, అందుచేతనే యాతఁడు మెల్లఁగఁ దప్పించుకొని మొదటనే పారిపోయెననియు, ప్రజలెల్లరు ననుకొనుచుండిరి. అందుకొరకే చాణక్యుఁ డట్టియుత్తరమును రాక్షసునకు వ్రాయించెను. వానియాజ్ఞానుసారముగ గోతిలోఁబడిన వారందరిని దెగనరకుచు నందులో భిల్లులు జయజయరాక్షసామాత్యయని కేకలువేసి నందునఁ బ్రజల యనుమానము మఱింత దృఢమయ్యెను. రాక్షసునిపై నపనిందవేయుటకే చాణక్యుఁ డీసాహసమూనెనని వ్రాయనక్కఱలేదు. ఇట్లు నందవంశమును నిర్మూలముఁజేసి రాక్షసుఁడే పర్వతరాజును నగరముపైఁకి దెప్పించియుండునని జను లనుకొనుచు నుండిరి. ఒక్కచంద్రగుప్తుఁడు తప్ప తక్కిన నందకుమారులందఱుఁ గడతేరినందున వానిచే పర్వతరాజును నోడింపఁజేసి ప్రజలకు ననురాగముఁ బుట్టించి మంత్రికపకీర్తిఁ గల్గింపవలెనని చాణక్యుని ముఖ్యోద్దేశము. ఇంతకును చంద్రగుప్తునకు మంచిదినములు వచ్చినవి. చాణక్యుని మిగిలిన యేర్పాటులు చదువరులు ముందుముందు తెలిసికొనఁగలరు.

చంద్రగుప్త

రెండవ భాగము.

ప్రకరణము. 1.

పర్వతరాజు.

నందకులమును నిర్మూలమును గావించి చాణక్యుఁడు తనప్రతిజ్ఞ కొంతవఱకుఁ బూర్తిఁజేసికొనెను గదా? ఇంక వానిప్రతిజ్ఞాశేషము చంద్రగుప్తుని సింహాసనముపైఁ గూర్చుండఁ బెట్టుటయే. ఆదినుండి యంతమువఱకును మురాదేవి చాణక్యున కెంతయో సాహాయ్యముఁజేసి, తానుజేసిన దానికిఁ బశ్చాత్తాపమొంది తనభర్తతోఁగూడ నుత్తమలోకమున కేఁగెను. ఆమెతో చదువరుల కెక్కుడు పరిచయము గల్గియున్నందున, నామె ప్రవర్తనము మొత్తముపై సత్ప్రవర్తనమో దుష్ప్రవర్తనమో గ్రహించియేయుందురు కాన మేమిక్కడఁ బ్రత్యేకముగ వ్రాయ నవసరము లేదు. కావునఁ జాణక్యుఁడు చంద్రగుప్తుని సింహాసన మెక్కించుట కేయేతంత్రము లొనర్చెనో కనుఁగొనవలసి యున్నది.

ఆనాఁడు చాణక్యుఁడు వ్రాసిన యుత్తరమును పర్వతరాజు జూచుకొని అందు రాక్షసునిముద్ర యుండుటచే, నాతఁడు వ్రాసినదేయని భ్రమించి మగధరాజ్యము తనకు దక్కఁగలదని యపరిమితమైన సంతోషమొందెను. ఇదివఱ కొకసారి పర్వతరాజు అలగ్జాండరుచే నోడింపఁబడెనుకాని చాల

కాలమునుండి మగధరాజ్యముపై నాతఁడు కన్నువేసియుండుటచే గ్రీకువారిసాహాయ్యమునఁ దనకోర్కె నెరవేర్చుకొనవలయునని, యాతఁడు వారి కుట్రలలో నేకీభవించి, తనరాజ్యమును మరల సంపాదించుకొనెను. అందుచేఁ బాటలీపుత్రముపై నాతనికిఁ గలదురాశ యంతకంత కధికమగుచుండెనేకాని తగ్గలేదు. మ్లేచ్ఛసైన్యము తనకుఁ గావలసినంత యాధారముగ నుండుటచే ధననందునిపైఁ గసిఁదీర్చుకొనవలయునని యాతఁడు సమయము కొరకు నిరీక్షించుచుండెను. అమాత్యరాక్షసుఁ డున్నంతకాలమును, దనకు మగధరాజ్యము లభించుట దుర్లభమనియే యతఁడుపేక్షచేసెను గాని లేకున్న నదివరకే పాటలీపుత్ర మతఁడు ముట్టడించియుండును. అట్టిరాక్షసుఁడే తనకు వశమైనయెడల వానికంతకన్న నింకేమి కావలయును? పాపము చాణక్యుని యుత్తరము వానినిఁ బూర్తిగ మోసముఁజేసినది. తరువాత వారిరువురకును రెండుమూఁడుసారు లుత్తరప్రత్యుత్తరములు వ్రాసికొనుట జరిగెను. అందొకయుత్తరములోఁ జాణక్యుఁడు "........ఇన్నాళ్లకు నీకోరిక నెరవేరినది. నీవుమాత్రము కొంచెముసైన్యముతో బయలుదేరి రావలయును. నాసైన్యము లిక్కడఁ గావలసినన్ని యున్నవి. ధననందునిపై ప్రజలకు మిక్కిలి ద్వేషముండుటచేత మిమ్ముఁ జూచినంతనే వారు రాజుగాఁ బరిగ్రహించెదరు. కావున యుద్ధమే యవసరముండ దనుకొనెదను. అయినను ముందు జాగ్రత్త మంచిదికదా? కావున మీరు సత్వరముగ బయలుదేరి కొందరు సైనికులతోమాత్రమే వచ్చి పాటలీపుత్రదుర్గమును ముట్టడింపుఁడు. సేనాపతి బాహురాయణుఁడుకూడ మనపక్షముననే యున్నవాఁడు. నందవంశమును నొక్కక్షణములో నశింపఁజేయుట కేర్పాటు చేసియున్నాను. ఎచ్చటికి బయలుదేరెదరని యెవ్వరైన నడిగినయెడల ధననందునితో మాటాడుటకు అనిమాత్రము చెప్పవలయునుగాని, మనరహస్యము నెంతమాత్రమును వెల్లడింపవద్దు. ఇంతకన్న వ్రాయవలసిన దేమియు లేదు. తమరు రాజైనచో నేనే యమాత్యుఁడనై తమసేవసేయుట కెంతయో కుతూహలముతో నున్నాఁడను. ప్రజల కష్టములన్నియు తమయనుగ్రహ

ముననే తీరును. ఆలస్యము చేయవద్దు" అని వ్రాసి పూర్వమువలె నందులోఁ గూడ రాక్షసునిముద్ర వేసిపంపుటచే దానినిఁజూచి మగధరాజ్యము తనకుఁ జేజిక్కినట్లే పర్వతరాజపరిమితానంద మొందెను. "ఆహా! ఎంత కాలమునకు నామనోరథము నెరవేరినది? నిక్కముగ మగధరాజ్యలక్ష్మి నన్నే వరించినది. అమాత్యరాక్షసుఁడు నాపాలిదైవమువలె నున్నాఁడు. బాహురాయణుఁడు గూడ ననుకూలుఁడై యున్నాఁడఁట. పాటలీపుత్ర పౌరులందరు నన్నే కోరుచున్నవారట. వాహ్వా! ఎంత యదృష్టవంతుఁడను? నాయట్టిభాగ్యవంతుఁ డింకెవ్వఁడు గలఁడు? రాక్షసుని యాజ్ఞానుసారముగనే నింక నీరహస్య మెవరితోను జెప్పక స్వల్పసైన్యముతోడనే బయలుదేరి మగధరాజ్యమును వశపరచుకొనెదను. దైవానుగ్రహమున, నేనే మగధేశ్వరుఁడ నైనయెడల నింకేమి కావలయును? ఈమ్లేచ్ఛుల నాశ్రయించి వీరిదయ సంపాదించు నీచకృత్యము నాకుఁ దప్పునుగదా? రాజకలాధురంధరుఁడగు రాక్షసుఁడే నాకమాత్యుఁడై యుండినయెడల గ్రీకువారిని నేను నిముసములో జయించి పారఁదోలగలను. అప్పుడొక్క మగధరాజ్యమే కాక వారు జయించుకొనిన సింధు, పంజాబు, గంధారదేశము, మొదలైనవన్నియు నాకు వెంటనే చిక్కునుగదా! ఆర్యమహారాజులందరు నాకప్పుడు సామంతులయ్యెదరు. వారందర సాహాయ్యముననే నీయార్యావర్తమంతటిని క్రమక్రముగ జయించి చక్రవర్తినై స్వతంత్రరాజ్యమును స్థాపించి శాశ్వతమైన యశమును సంపాదింపఁగలను. వాహ్వా! వాహ్వా! నాకెంత యదృష్టము బట్టినది? ఇంతలోనే యింతమంచిదినములు నాకు వచ్చునని నేను కలలోనైన ననుకొనలేదుకదా? అమాత్యరాక్షసునకు ధననందునిపై ననూయపుట్టుట నాభాగ్యమే" అని యింకనెన్నియో గొంతెమ్మకోర్కెలఁ గోరుచు, దురాశాబద్ధుఁడై స్వల్పసైన్యముతోఁ బర్వతరాజు పాటలీపుత్రముపైకి వెంటనే బయలుదేరెను. మార్గమధ్యమునఁ దన్నడిగిన ప్రతివారితోఁ గూడ ధననందునితో మాటాడవలసిన పనియున్నందునఁ బోవుచున్నానని చెప్పుచువచ్చెను గాని, నిజ మెవ్వరికిని తెలియఁజేయలేదు. తనరాక నెఱింగి

యమాత్య రాక్షసుఁడును పాటలీపుత్ర పౌరులును తనకెదురుగవచ్చి యెంత గౌరవించెదరో, యెంతశ్లాఘించెదరో, యని యనుకొని యుప్పొంగుచుఁ బర్వతరాజు వెట్టివానివలె నూరక సంతోషాతిశయమున నొడలు మఱచి కేకలు వేయుచుండెను. ఏదైనఁ జెప్పవలసి వచ్చినప్పుడు, తనయనుచరులలో నెవ్వరైన "పర్వతేశ్వరా" యనిపిలిచినవారిని దూషించి "మగధేశ్వరా! యనిపిలువక పర్వతేశ్వరా! యని యనుచున్నావేమి? మూర్ఖా! బుద్ధిలేదా?" అని యాగ్రహించుచుండెను. వానిరాజ్యము హిమాలయపర్వతమునకు సమీపమునఁ గొండలనడుమ నుండుటచే వానినిఁ బర్వతరాజనియు పర్వతేశ్వరుఁడనియు జనులు బిలుచుచుండిరి. కాని వాని నిజమైన పేరేదియో మనకుఁ దెలియదు. అకారణముగ జనించిన పేరాసచే నపరిమితానంద మొందుచు, ముందురాఁబోవు మోసము నెఱుంగక, తాను మగధేశ్వరుఁడు కాఁగలఁడని యూరక విఱ్ఱవీగుచు, వచ్చివచ్చి పర్వతరాజు పాటలీపుత్రనగరమును ముట్టడించెను. కోట ముట్టడించినతరువాత వాని యుత్సాహమును దురాశయు గొంతెమ్మ కోర్కెలును ఎంతోసేపువరకు వానిహృదయమున నుండలేదు. ఏనాఁడు నందకులము నిర్మూలము గావింపఁబడెనో, ఆనాఁడే పర్వతరాజు నగరమును ముట్టడించుటచేత, నీతంత్రముగూడ రాక్షసుఁడే చేసెనని జనులెల్లరు వానిని దూషింప నారంభించిరి.

పర్వతేశ్వరుఁడు పట్టణము ముట్టడించినంతనే నగరములోనుండి కొందరు సైనికులు బురుజులపైకెక్కి యుద్ధమారంభించిరి. వెంటనే పర్వతరాజునకు గుండె జాఱిపోయినది. వాని యాసలన్నియు నిరాశలయ్యెను. శత్రువులు కోటముట్టడించినప్పుడు వారి నెదిరించుట రాజధర్మము గావున పాటలీపుత్ర పౌరులను తృప్తి పరచుటకు రాక్షసుఁడే విధాయకముగ నీయుద్ధమును మెల్లమెల్లఁగఁ జేయించుచున్నాఁడనియుఁ గొంతసేపున కాతఁడేవచ్చి పౌరుల సమ్మతముపై తన్నులోనికిఁ గొనిపోవుననియు ననుకొని, పర్వతరాజు కొంతవరకు సమర్థించుకొనెను. కాని యంతకంత కాపోరు మితిమీరి తనసైనికుల ప్రాణము లపహరింపఁజొచ్చెను. అందుచే విధాయకముకొఱకు జేయుయుద్ధమైన నింత ఘోరముగనుండునా? కావున నిందేదైన మోసముండక తీరదని వెంటనే పర్వతేశ్వరుఁడు గ్రహించి "ఔరా! ఎంతమోసమైనది? రాక్షసుఁడు నాకెంతద్రోహముఁ జేసెను? ఆతఁడు మిక్కిలి స్వామిభక్తిగలవాఁడుకదా? నారాచరికమున కెందుకంగీకరించును? ఈసంగతి మొదటనే యాలోచింపవలసియుండెనుగాని మందమతినై యూహింపఁజాలక పోయితిని రాక్షసుఁడు నన్ను మోసపుచ్చెననుట యిప్పటికి స్థిరపడినది. అదిగాక రాక్షసుఁడే నాకాయుత్తరము వ్రాసెనా? కానున్నచో నితరులెవరు వ్రాసియుందురు? ఇతరులే వ్రాసినచో, నందు రాక్షసునిముద్ర యేటికుండును? లేదులేదు రాక్షసుఁ డిట్టి యుత్తరము వ్రాయువాఁడు కాఁడు.........ఏమో కాదననేల? నేను మగధరాజ్యముపైఁ గోర్కెఁగలిగి యున్నాఁడననుసంగతి నాతఁడెఱుంగునుగదా? అందుకొఱకే నన్నిట్లు మోసముఁ జేసియుండవచ్చును! ఛీ ఎంత జ్ఞానహీనుఁడనైతిని? ఇందుకొఱకేకాఁబోలు నన్ను స్వల్పసైన్యముతో రమ్మని వ్రాసెను? రాజ్యకాంక్షచే ముందువెనుకలరయక నేను బిరబిరఁ బరుగెత్తుకొని వచ్చెదనని యాతఁ డెంతసూక్ష్మములో గ్రహించెను. బలే రాక్షసా! నీవెంతయుక్తిపరుఁడవురా? నీమోసము నేను గ్రహింపఁజాలనైతిని. నాయంత నేనే బుద్ధిపుట్టివచ్చిన, నింత స్వల్పసైన్యముతో నెందుకు బయలుదేరెదను? అయ్యో! నాయాసలన్నియు నిప్పుడడుగంటినవి. నాధైర్యమంతయుఁ గ్రమక్రమముగ క్షీణించుచున్నది. అయ్యో ఇంక నేమియుపాయమున్నది? కోటలోని వారియుద్ధ మంతకంతకధిక మగుచుండెనుగాని యెంతసేపునకుఁ దగ్గదయ్యె. ఇట్టి స్వల్పసైన్యముతో నే నింతవరకుఁ బోరాడఁగలను? ఇదివరకే పలువురుసైనికులు మడసిరి. వెనుకకుఁ దిరిగి పాఱిపోయితినా నాసాటివారందరు నన్నుఁ గుక్కకన్న హీనముగఁ జూతురు. తిని కూర్చుండలేక నేనీయాపద కోరికోరి తెచ్చుకొంటిని. అయ్యో నాకింకేదిదిక్కు?"

అని పర్వతరాజు ఏయుపాయమునుదోపక పలువిధముల విచారింపవలసివచ్చినది. అమాత్యరాక్షసుఁడు తన్నింతమోసముఁజేసెఁగదాయని కంఠమునఁ బ్రాణమున్నంతకాల మెప్పటికైన వానిపైఁ బగఁదీర్చుకొని, మగధరాజ్యమును జయింపకమాననని, యతఁడు మరింతద్వేషము వహించి పట్టుపట్టెను. పాపము సిగ్గుచేతఁ దన యనుచరుల మొగ మాతఁడు చూడలేకపోయెను. శత్రువులధాటి కోర్వలేక యిట్టితరి పలాయనమే పరమధర్మమని యాతఁడూహించుచుండ నింతలో నొక దండనాయకుఁడు వానియొద్దకువచ్చి దీనవదనుఁడై "పర్వ........" అని చెంపలు వాయించుకొని "మగధేశ్వరా!" అనిపిలిచి యేదియో చెప్ప నుద్యమించుచుండఁ బర్వతేశ్వరుఁ డత్యాగ్రహమొంది "ఛీ మూర్ఖా! మగధేశ్వరా యని నన్ను ధిక్కరించుచుంటివా" అని బిగ్గరగఁ బలికెను. పాప మా దండనాయకుఁడు భయముతో "దేవా! లేదులేదు. క్షమింపుఁడు. కోటలోనివా రంతకంతకు ఘోరముగఁ బోరాడుచున్నవారు. మనసైన్యము స్వల్పమగుటచే వారిధాటికి నిలుచుట దుర్భరముగనున్నది. ఇంక తమసెలవైనచో........" అని యేమో చెప్పఁబోవుచుండ నతఁడు "సందేహ మెందుకు? మీయట్టి పిఱికి పందలు దండనాయకులైయుండ నాకు జయమెట్లుకలుగును? సరే! ఇంక చేయవలసినదేమున్నది? యుద్ధము నాపివేయుము. పారిపోవుదము" అని హీనస్వరముతోఁ బ్రత్యుత్తరమిచ్చెను. వానియాజ్ఞానుసారముగ సైనికులందరును దమపిక్కబలిమిఁ జూపుటకు సిద్ధముగనుండిరి. ఇంతలో నాకస్మికముగ దుర్గద్వారపు తలుపులు తెరవఁబడినవి. పట్టణములోనుండి వేలకొలంది భిల్లు లాయుధపాణులై బిరబిరనుఱికి శత్రుసైన్యమును వెంబడింపఁజొచ్చిరి. ఈసైన్యమునకు మనచంద్రగుప్తుఁడే నాయకుఁడు.

పర్వతరాజు కోటముట్టడించె ననుసంగతి తెలిసినప్పుడే చాణక్యుఁడు చంద్రగుప్తునిఁ బిలిచి రహస్యముగ "చంద్రగుప్తా! శత్రువులు నగరముపై కరుదెంచిరి. నీప్రతాపమునుజూపి పాటలీపుత్రపౌరుల దయసంపాదించుట కిదియే యుక్తసమయము. ఈవల, నందవంశము నిర్మూలమగుటయు,

నావలఁ బర్వతరాజు కోటను ముట్టడించుటయుఁజూచి భయాకులచిత్తులై తమకెట్టి యాపద సంభవించునోయని పౌరులందరు విచారించుచున్నవారు. నీ విట్టిసమయమున నీసైన్యములతో బయలుదేరి పర్వతేశ్వరునోడించి చెరబట్టి తీసికొని రావలయును. అందుకు నీకు శక్యములేనిచో నీవు మరల నా మొగముఁ జూడనవసరములేదు. నీవీనగరమునఁ గాలిడుట యక్కఱలేదు. తరువాత నీయిష్టము" అని నిష్ఠురముగ నాజ్ఞాపింప గురునాజ్ఞ శిరంబున ధరించి యత్యంత పౌరుషముతో మనచంద్రగుప్తుఁడు బయలుదేరెను. రాక్షసుఁడే యీ సాహసకృత్యము లన్నియుఁ జేసెనని ప్రజలు నమ్మియున్నందున, నిట్టితరి చంద్రగుప్తునిచే నేదైనఁ బెద్దకార్యముఁ జేయించినయెడల, వానిపై ప్రజలకు భక్తియుండునని చాణక్యుఁడు ఈయుక్తిఁ బన్నెను. పర్వతరాజు సనాతనమునుండియుఁ బాటలీపుత్రమునకు దీర్ఘశత్రువనుమాట యెల్లరు నెఱుఁగుదురు. అట్టివానిఁ జంద్రగుప్తునిచే జయింపఁజేసి యెంతో కాలమునుండి ప్రజలహృదయమున నాటియున్న భయమును తొలంగఁజేసి యాప్రతిష్ఠఁ జంద్రగుప్తునకుఁ గలుగవలెనని యెంచియే మొదట చాణక్యుఁ డిట్టిమాయలేఖను పర్వతరాజునకంపెను.

ఆనాఁడట్లు శత్రువులు పారిపోవుటకు సిద్ధముగనున్నారని తెలిసినంతనే చంద్రగుప్తుఁడు దుర్గద్వారములఁ దెరపించి తనసైనికులతోఁగూడ శత్రువులవెంటఁ దరుమఁజొచ్చెను. తనకు గురువుగారు కఠినముగ నాజ్ఞాపించియున్నందున నెంతయో ధైర్యముఁగహించి అత్యంతవేగమునఁ దనసైనికులతోఁ బరుగెత్తుచుఁ గొంచెముదూరములోనే పర్వతరాజు నడ్డగించుకొనెను. ఎట్లైనను దప్పించుకొని పారిపోవలయునని యాతఁడు ప్రయత్నించెను కాని పాపము వీలైనదికాదు. చంద్రగుప్తుఁడు వానిని విడువక వెంటనే చెఱపట్టెను. పర్వతరాజు వానిని బ్రతిమాలుకొనుచు దీనస్వరముతో "అయ్యా! నన్ను విడిచిపెట్టుము. ఇఁకమీఁద నీకు సామంతుఁడనై కప్పముఁ గట్టుచుండెదను." అని వేడుకొనెనుగాని చంద్రగుప్తుఁడు బలవంతముగఁ దనహృదయము కఠినముగాఁ జేసికొని "నన్నేమి చేయుమనె

దవు. ఇది మాగురువుగారియాజ్ఞ. నేనెట్లతిక్రమించెదను? నిన్నుఁగొనిపోయి నేనిప్పుడు గురుదక్షిణ సమర్పింపవలయు" అనిపలికి వానినిఁ బట్టణములోనికిఁ గొనివచ్చుచుండెను. అతఁడు తప్పించుకొని పారిపోకుండ నాయుధపాణులై భిల్లులందరు చుట్టును గుమిగూడి వచ్చుచుండిరి. పర్వతరాజు తన యవివేకమున కూరక పశ్చాత్తాపమొందుచు "అరే దుష్టా! రాక్షసా! నీవిషయము నాకింతవరకును గౌరవమును పూజ్యభావము నుండుచుండెను గాని యింతదుర్మార్గుఁడవని యెఱుంగనైతినిరా! అయ్యో! నామూర్ఖత!" అని రాక్షసు నూరక తిట్టుచుఁ దన్నుఁ దాను నిందించుకొనుచుండెను. మార్గమధ్యమున నొకసారి చంద్రగుప్తునిఁజూచిపర్వతరాజు, ఉత్తరముసంగతి యడిగెనుగాని, యతఁడు సరియైన జవాబొసంగక "ఏమో యెవరిహృదయమెట్టిదో నేనేమెఱుంగుదును" అనిచెప్పి యూరకుండెను. ఎట్టులైన నీసంగతి పర్వతరాజడుగక మానఁడని తెలిసియే, అడిగినచో నిట్టి ప్రత్యుత్తరమే యొసంగవలెనని చాణక్యుఁడు చంద్రగుప్తునకు బోధించెను. ఇదివఱకుఁ జాణక్యుఁడుచేసిన కుట్రలన్నియుఁ జంద్రగుప్తునకుఁ దెలిసియే యున్నవి. అన్నింటిలో నొక్క పితృద్రోహమే పాపము మనచంద్రగుప్తునకు దుర్భరముగనుండెను. కాని వానియాజ్ఞనతిక్రమించి గురుద్రోహియగుట కిష్టములేనందున, నతఁడూరకుండవలసివచ్చెను. పాపము కడసారి తల్లితోఁగూడ మాటాడుభాగ్యము వానికిఁ గల్గదయ్యె. ఇంకఁ జాణక్యుఁడెట్లుచెప్పిన నాతఁడట్లు నడచుకొనవలసినదే కదా?

ప్రకరణము. 2.

అమాత్యరాక్షసుని భయము.

పర్వతేశ్వరుని చెరపట్టి చంద్రగుప్తుఁడు గొనివచ్చుచున్నాడని విని చాణక్యుఁ డత్యానందమొంది ముందుముం దేమిచేయవలయునోయని ఆలోచించుచుండెను. కాని చంద్రగుప్తుఁడు పట్టణములోఁ బ్రవేశించులోపలఁ జాణక్యుఁడు రాక్షసునిసంగతి యేమయ్యెనో కనుఁగొనవలసి వచ్చినది. పర్వతరాజు నగరమును ముట్టడించెనని చాణక్యుఁడు వ్రాసినయుత్తరమునుజూచి యూరును పేరును లేనందునవాయుత్తరమెవరువ్రాసిరో శత్రువులు కోటనెటు ముట్టడించిరో కనుఁగొనవలయునని రాక్షసుఁడు బయలుదేరి సేనావారము నద్దకు వచ్చెను. అచ్చటిసైనికులెల్లరు యుద్ధమునకు సిద్ధముగనున్నట్లే వానికిఁ గాన్పించిరి. అందుచే రాక్షసుఁడు సంతసించి ఇంక నెందరు శత్రువులు వచ్చిపడినను, నగరమునకు భయములేదని ధైర్యమువహించి, యంతలోనే సేనలను సిద్ధముగనుంచినందున బాహురాయణుని చాకచక్యమునకు మెచ్చుకొనుచుండెను. కాని సేనాపతిమాత్రము వాని కక్కడఁ గానరాలేదు. అందుచే నచ్చట కాచియున్న యుపసేనానాయకునిఁ జూచి యమాత్యుఁడు

"బాహురాయణుఁడెక్కడ? వేగము దీసికొనిరా?"

"అయ్యా! ఇక్కడనుండి కదలుటకు నాకాజ్ఞలేదు"

"ఎవరియాజ్ఞ కావలెను! శత్రువులువచ్చి కోటను ముట్టడించియుండ మీరింక నూరకుందురేల?"

"బాహురాయణునియాజ్ఞ లేనిదే యుద్ధమొనర్చుటకు మాకధికారము లేదు. తనసెలవులేనిదే యిచ్చటినుండి కదలఁదగదని యతఁడు మాకుఁ గఠినముగ నాజ్ఞాపించెను."

"కావచ్చును. అయినను నాయాజ్ఞకన్న వానియాజ్ఞ యెక్కువ కాదు"

"అది మీయభిప్రాయముకాని మాయభిప్రాయముగాదు"

"నేనెవఁడ ననుకొంటివి? తెలియక మాటాడుచుంటివా యేమి? నేనమాత్యరాక్షసుఁడను"

"ఆసంగతి మేమెఱుఁగుదుము? తెలియకుండ మాటాడలేదు."

ఆమాటలు విని రాక్షసుఁడు కనులెఱ్ఱఁజేసి యాగ్రహముతో

"ఔరా సేనాపతికన్న నేనున్నతాధికారినని యెఱుఁగుదువా?"

"ఆసంగతియు నెఱుఁగుదుము కాని వానిసెలవులేనిదే యిచ్చటనుండి కదల నిశ్చయించుకొనలేము."

అనిసంభాషించుచుండ నింతలోఁ బద్ధకోలాహలము వానికి వినంబడెను. తోడనే శత్రువులు వేలకొలంది పురమును ముట్టడించి యల్లరిచేయుచున్నారని యనుకొని మంత్రి యాతురత వహించుచుండెను. అంతవఱకును నూటికొక్కఁడైనఁ దనయాజ్ఞ మీఱువాఁడు లేఁడుకాని, ఆయుపసేనానాయకుఁడు వానినిఁ ధిక్కరించుచు నిర్లక్ష్యముగ మాటాడినందునఁ బాపమమాత్యుఁడు కొంచెము చిన్నవోయెను. ఒక్కొక్కప్పుడు ధననందుఁడు గూడ వానిమాట జవదాట వెఱచుచుండెను. అట్టిస్థితిలో నొకయుపసేనానాయకుఁడు తనకింత నిర్లక్ష్యముగ జవాబొసంగుటచే నతఁడాశ్చర్యమొంది యిల్లమకేదైనఁ గారణముండకపోదని గ్రహించి వానితో

"ఓయీ! బాహురాయణుఁడు నీతో నేమిచెప్పెను? శత్రువుల నెదిరింపకుండ నాతఁడేల యాజ్ఞాపించెను?"

"ఆసంగతి నన్నేమియు నడుగవద్దు. బాహురాయణుఁడు వద్దనిన పని మేముచేయలేము. వానిసెలవులేనిదే యాయుధములధరించుట మాకిష్టము లేదు"

"శత్రువులు కోటముట్టడించినసంగతి బాహురాయణుఁ డెఱుఁగునా?

"ఎఱుఁగును. ఆతఁడే మాకీసంగతి చెప్పెను"

"ఎఱిఁగియు యుద్ధమునకుఁబోకుండ మిమ్మెందుకు వారించెను?"

"ఇష్టములేక"

ఆమాటవిని రాక్షసుఁ డాగ్రహము బట్టలేక

"ఛీ మూర్ఖులారా! మిమ్ము నమ్మరాదు. మీరందరును రాజద్రోహులు ఓరిదుష్టా! బాహురాయణా! ఎఱిఁగియే నీవింతద్రోహమునకుఁ బాల్పడితివా? నీవు కేవలము రాజఘాతకుఁడవని నేను మొదటనుండియు నెఱుఁగుదును. రాజహత్యకును పాటలీపుత్ర నాశనమునకును నీవే కారకుఁడవయ్యెదవని నేనెఱుఁగుదును. ఎప్పుడో యొకప్పుడు నీవుండియే నందవంశమున కాపదసంభవించును. ఛీ! నిన్నింక నమ్మరాదు" అని కఠోరముగఁ బలికి రాక్షసుఁడు వెనుకకుఁ దిరిగిపోవుచుండ, నంతలో "ఓహో రాక్షసా! నీవా మంత్రిశేఖరుఁడవు? నీవేనా రాజభక్తుఁడవు? మేమా రాజద్రోహులము? నీవుచేసిన మహాకార్యమునకుఁ బ్రజలు నిన్నెట్లు పలుకుచున్నారో పాపము నీవింక నెఱుఁగవేమో? నీగుట్టు నీవు దాచికొన్నచో ప్రజలు దాచెదరనుకొంటవా? ఇంకేమి చేయఁగలవు? నీవుచేసిన దేదియో యిదివరకే చేసితివి. నేముచేయవలసినదింకను మున్నన్నది" అనుమాటలే కాక "నీకుఁ దగినశిక్ష యింకను నున్నదిలే! తొందరపడకు తొందరపడకు" అనుమాటలుకూడ రాక్షసునకు వినిపించెను. రాక్షసుఁడు వెను

కకుఁ దిరిగిచూచు సరికి, ప్రత్యక్షముగ భాగురాయణుఁడచ్చటనే నిలిచియుండెనుకాని మంత్రి వానినిఁజూడలేదు. ఇంకను అధిక ప్రసంగముఁజేసిన తనమర్యాద దక్కదనియెంచి యచ్చట నొక్కక్షణమైన నుండనొల్లక యచ్చటనుండియో, హాహాకారములును రోదనములు నెక్కుడుగ వినవచ్చుచుండుటచే నూరకత్తరపడుచు, సేనాపతివిషయమై ధననందునితోఁ జెప్పి, కఠినముగ నాజ్ఞయొసంగునట్లు చేయవలయునని యతఁడచ్చటనుండి బయలుదేరెను. ఇప్పటికి ధననందుఁడు రాజసభలోఁ జేరియుండునని వానియభిప్రాయము. శత్రువులు కోటముట్టడించిరను భయముచే పౌరులిట్లు భయపడుచుండిరని యనుకొనెనుగాని, వారియల్లకల్లోలమునకు నిజమైన కారణము వాని కింకను తెలియలేదు. ఏవంకఁజూచినను పౌరులు విచారగ్రస్తులై పరుగిడుచుండుటయుఁ దనపేరెత్తి యూరక నిందించుచుండుటయు రాక్షసుఁడు కనిపెట్టి ఏమియుపద్రవము జరిగెనోయని యాతురతపడుచుండెను. ఎవరినడిగినను తనకేసంగతియును జెప్పరైరి. అందుచే వానియాందోళనము మరింతయధికముగాఁ జొచ్చెను. ఏసంగతియును దెలియక యాతఁడు పిచ్చివానివలెఁ దిరుగుచుండ నింతలో నొకపురుషుఁడు పరుగుపరుగున వాని సమీపించి

"అమాత్యమహారాజా! ఇంకను తమ రిక్కడనే యున్నారా అయ్యయ్యో! ప్రజలెల్లరు మీపై కక్షిగట్టియుండ మీకెందుకు భయము లేదు. అయ్యా! ఎక్కడనైన రహస్యముగ దాగుండుఁడు".

"ఏమీ? నీవేమి చెప్పుచున్నావో నాకుఁ దెలియలేదు. మహారాజుగారెంతవరకు వచ్చిరి. సభలోఁ బ్రవేశించిరాలేదా?"

"అయ్యా! మహారాజుగారిని, మీరెక్కడికుఁ బంపనెంచితిరో అచ్చట నాయన తన తొమ్మండ్రు కుమారులతోఁగూడఁ బ్రవేశించిరి"

"సరే! అదియేకావలయును కాని—"

"ఆహా! మీరు తలఁచినదికాకుండునా? మీయభీష్టము నెరవేరినది. ఇంకమీరు సుఖముగ నుండవచ్చును."

"ఏమిరా నీమాటలు నాకేమియు నర్థముకాలేదు. సరిగాఁ జెప్పు ప్రజలు నన్నెందుకు నిందించుచున్నవారు? వారు నన్నేమి చేసెదరు?"

"మహారాజుగారియొక్క—అబ్బా 'అట్టిమాటలను నానోట నాడవలెను. వారందఱకుఁ దమపైనాగ్రహము వచ్చినది."

"ఆగ్రహమా? నామీదనా? ఎందుకొఱకు? కపటహృదయుమైన మురయొక్క మోహపాశమునుండి తప్పించి యాతనిని సురక్షితముగ నీవలకుఁ గొనివచ్చితిననియా?

"కాదు కాదు"

"కాకమరేమి కారణము? నీవు త్రాగిమాట్లాడుచున్నట్లున్నది లేనియెడల నిట్టి—"

"అయ్యా! క్షమింపుఁడు. నే నొడలుమరచి యుండలేదు. మీ క్షేమముఁ గోరియే మాటాడుచున్నాను. తమరు వేగముగ నెచ్చటికైనఁ బారిపొండు. తమరేమిచేసినను తమయెడ నాకుభక్తిమాత్రమున్నది. మహారాజుగారికి సంభవించిన యాపదకుఁ బ్రజలు మిమ్మేమిచేసిన చేయవచ్చును".

"మహారాజుగారికా? ఏమియాపదవచ్చినది చెప్పుచెప్పు ఎవరా రాజద్రోహులు?"

"ప్రస్తుతము తమరేయని వదంతి పుట్టినది. నిజము దేవుఁడెఱుంగును నామాటవిని తమరుముందు దాగియుండుఁడు. తరువాతఁ జెప్పెదను"

"నన్నేలఁకు దాగియుండుమనెదవు? నేను దొంగతనము జేసితినా యేమి? చెప్పవేమి?"

"ఇట్టిసమయములో నేనేమియును చెప్పఁజాలను. ఇంకొక్క నిముసమిట్లే తమరు కాలయాపనమొనర్చినచో దేవరకు గొప్పయాపద సంభవించును. ఏగోతిలోఁబడి ధననందుఁడు నాతనికుమారులును ప్రాణములు విడిచిరో, ఆగోతిలోనే మిమ్ముఁగూడఁ బడఁద్రోయవలెనని ప్రజలేర్పాటు చేసియున్నవారు. ఈసంగతి మున్ముందుగఁ దమకెఱింగించి తమప్రాణములను గాపాడవలయునని నేను వచ్చితిని. ఇంక నన్నేమియుఁ దమరడుగవద్దు. చాటునకు వచ్చినచో నన్నిసంగతులు చెప్పెదను."

అనిచెప్ప రాక్షసుఁడు భయభ్రాంతుఁడై శరీరమంతయు గడగడ వణక, నోటమాటరాక, వెలవెలఁబోయి యేదోయొక యుపద్రవము సంభవించెననియు, బ్రజలకు తనపై ననుమానముబుట్టి యుండవచ్చుననియు, గ్రహించి సేనానాయకుఁడు పల్కినమాటలు జ్ఞప్తికిఁదెచ్చుకొని మఱింత విచారింప నారంభించెను. అప్పుడాపురుషుఁడు వానిని మెల్లఁగ నొకరహస్య ప్రదేశమునకుఁ గొనిపోయి, జరిగినవృత్తాంతమంతయుఁ జక్కగ నెఱింగింప ధైర్యవంతులలో నగ్రగణ్యుఁడైనను పాపము దుఃఖాతిశయమున మూర్ఛపోయి, మరల లేచి యిట్లు విలపించెను.

"హా! మగధరాజ్యలక్ష్మీ ధురంధరా! హాధననందమహీపురందరా! ఇంతకాలమునకు నీకీరాక్షసునిపై ద్వేషముపుట్టినదా? అయ్యో! నన్ను విడిచి నీవొంటరిగఁ బోవుటకు నేనేమి తప్పుఁజేసితిని? హామహారాజా! నీయన్నముఁదిని నీవస్త్రమునుగట్టి యేదురాత్ముఁడీరాజద్రోహి, యింతటి సాహసమొనరించెను? ఎంతఘోరమెంతఘోరము? నిష్కారణముగ నీయపనింద నాపైఁబడినదా? అయ్యో! నేనే పాపమెఱుఁగనే? రాక్షసుఁడు నీతిపరుఁడు, విద్యాధికుఁడు, రాజభక్తుఁడు నని నన్నెల్లరు నిదివరకుఁ గొని

యాడుచుందురే! నేనే యీద్రోహమొనరించితి నని యెట్లువచింప సాహసించిరి? అయ్యయ్యో! నాబుద్ధియంతయు నేమైపోయినది? ఇంతఘోరకృత్యమొనర్చిన యాగర్భశత్రుఁడెవ్వఁడు? బాహురాయణుఁడు కాఁడుగదా! నాఁడే పర్వతరాజును రప్పింపలేదుకదా! కాకున్న నింతదారుణకృత్యమింకెవ్వనికి సాధ్యమగును! లేకున్నచో నిప్పుడు పర్వతరాజెందుకు రావలెను. ఛీ. వానియట్టియధమాధముఁ డింకొకఁ డీరాజ్యమున లేఁడు. ఓగోత్రీపాపీ! దుష్టా! మూర్ఖచిత్తా! బాహురాయణా! నీవు చేసినదానికి ప్రతిఫలమనుభవించెదవులే ఇంతనీచుఁడవా! ధననందుని వద్దనుండి నీకేమి కావలసియున్నదో నన్నడుగరాదా? ఇతసాహసమున కెందుకు పాల్పడవలెను! అమాత్యుఁడనైయుండి నిన్నూరకవిడిచెద ననుకొంటివా! నిన్నెంత నీచగతికిఁ దెచ్చెదనో చూడుము. ఇదే నాప్రతిము."

ప్రకరణము. ౪.

చంద్రగుప్తుని రాక.

పలువిధములఁ దోరంపు రతనాలచే నలంకరింపఁబడి, తమ్ముల చెలికాని వెలుంగుకన్నఁ బదిమడుంగు లెక్కుడుగ ధగధగలాడు పసిండికుళ్లాయితో, కడుసొగసుగ జలతారు మొగ్గలతో సింగారింపఁబడి, చూపరుల కన్నులకు మిరిమిట్లు గొలుపు మఖమలంగరకాతో, అప్పుడే శత్రువుల జోహారనిపించి యెన్నటికిని వ్యర్థముకాని మహాత్మ్యమును గలిగి, ప్రత్యేకముగ గురుదత్తమై, రామబాణమోయనఁ గేలనలరారియున్న ధనుర్బాణములతో, నాలుగుపాదము లొక్కసారి భూమిపైమోపక, కురంగమువలె

సుపోఁగి, కడు చతురతతో దాఁటుచుఁ గడువొయ్యారమున నడచివచ్చుచున్న పంచకల్యాణి హయముతో, సహజ సౌందర్యాతిశయమున ముద్దులుగుల్కు వదనేందు బింబమునకొక తీరైన క్రొత్తసోయగముఁ గల్గించు సుందర మందహాసముతో, పురుషుల నైతము మోహపాశమున బంధించి, యత్యాశ్చర్యమును గొల్పు కోమలశరీరలావణ్యముతో, చెఱకువిల్లుఁబూని, చిలుక బాబా నెక్కి, దిగ్విజయము నొనర్చి వచ్చుచున్న లక్ష్మీకుమారుఁడో యన, గురుశాసనమున నాహవరంగంబున నరాతిమూకలఁ బోకార్చి, ద్రుపదరాజును బంధించి, ద్రోణాచార్యునకు గురుదక్షిణ యొసంగ బయలుదేరిన నాటిధనంజయుఁడో యన, పర్వతేశ్వరునిఁ జెరపట్టికొని వచ్చుచుఁ జూపరుల కతిమనోహరుఁడై మనచంద్రగుప్తుఁడు యుద్ధభూమినుండి పాటలీపుత్రమునఁ బ్రవేశించెను. అట్టి తనముద్దు శిష్యునిఁ గన్నులారఁ గాంచినప్పుడు, చాణక్యునకు జనించిన యానంద మెవరు వర్ణింపఁగలరు? వాని యేర్పాటు ప్రకారముగఁ జంద్రగుప్తుని వెనుక నాతని శిష్యులెల్లరు "జయ జయ చంద్రగుప్తా! జయజయ చంద్రగుప్తా." అని చప్పట్లు చఱచుచు జయజయ ధ్వనులొనరించుచుండిరి. అదిజూచి యితరులుగూడ వారివెంటఁబడి తాముగూడ జయజయ ధ్వను లారంభించిరి. ఇట్లు క్రమక్రమముగ వారిపొడవున వారితో నేకీభవించినందున నగరమున నెక్కడఁజూచినను జయజయధ్వనులు వినవచ్చుచుండెను. ఆనాడే నందవంశము నిర్మూలమైనందున నట్టివిచారమైన దినంబున, జనులిట్టి సంతోషమును సూచించుట, అంతగా బాగుండదని యెంచి చాణక్యుఁడు వారందరినిఁ గొంతమందలింపవలసివచ్చెను. మగధరాజ్యమునకుఁ బూర్వమునుండియు గర్భశత్రువగు పర్వతరాజు రాక్షసుని ప్రేరేపణమువలన నగరము ముట్టడించెననియు, బాహురాయణుని సాహాయ్యమున నమితపరాక్రమవంతుఁడగు చంద్రగుప్తుఁడట్టివానిని నిముసములో నోడించి, చెఱపట్టి ఖైదీగఁ గొనివచ్చెననియు, లేకున్నచోఁ బర్వతరాజువలనఁ బాటలీపుత్రమున కెట్టియిక్కట్టులైన సంభవించి యుండుననియు, నందవంశమును నాశనముఁజేసి శత్రువులను గోరి

కోటపైకిఁ దెప్పించి యింతటి ఘోరకృత్య మొనరించిన రాజద్రోహి యెవఁడో కనుఁగొని శిక్షింపవలయునని చంద్రగుప్తుఁ డూరక ప్రయత్నించుచున్నవాఁడనియు, నట్టిరాజకుమారుని మనమందర మాదరింపవలసి యుండుననియుఁ జాణక్యుఁడు చేసిన యేర్పాటువలనఁ బ్రజలెల్లరు గుంపులుగుంపులుగఁ గూడి పట్టణమునం దెచ్చటజూచినను ముచ్చటింపుచుండిరి. మరికొందరు పౌరులు చంద్రగుప్తున కెదురుగఁజని గౌరవించి మెడలోఁ బూలసరులు వైచికొని వచ్చుచుండిరి. రణధీరుఁడైన సేనాపతి సాహాయ్యమునఁ జంద్రగుప్తుఁడు పాటలీపుత్రమును మ్లేచ్ఛులకు దక్కనీయకుండఁ గాపాడెనని చాణక్యుఁడు నగరమునం దంతట చాటించెను.

ఆసంతోషమునఁబడి ప్రజలు ధననందుని మరణదుఃఖమును మరచిరని చెప్పవచ్చును. వారిహృదయములు క్షణములో మార్చవచ్చునని చాణక్యుఁడు మొదటనే యెఱిఁగియుండెను. ఎట్లైనను కాలవిళంబనము సేయక చంద్రగుప్తునకుఁ బట్టాభిషేకము జరుగువరకు నన్నివిషయములలో జాగ్రత్తవహించియుండవలెనని యతఁడనుకొనెను. అందుచే వెంటనే పర్వతేశ్వరునిఁ జెరలోఁబెట్టించి, చంద్రగుప్తుని బాహురాయణునిఁ జాణక్యుఁ డొకరహస్యప్రదేశమునకుఁ గొనిపోయి "బాహురాయణా! మనకార్యము మూఁడుపంతులు ఫలించినదికదా? కావున నాలస్యమునొనర్పక తక్కినది గూడఁబూర్తిసేయవలెను. అందుకుఁ దొలుత రాక్షసుని ప్రవర్తన మెట్లుండునో మనముగనుఁగొనవలసియున్నది. అతఁడు ధననందుని విడిచి బయలుదేరినప్పటినుండియు వానిసంగతులు నేను గనుఁగొనుచునే యున్నాను. తనపై నింతయపనిందబడిన తరువాత రాక్షసుఁ డూరకుండు వాఁడుకాఁడు. వాని విషయమై మనము శ్రద్ధవహింప వలయును. ఈనగరమును దాటి వాని నెచ్చటికిఁ బోనీయఁగూడదు. విరక్తిచే నాతఁ డెట్టిసాహసమైనఁ జేయగలఁడు? దీనినిఁగూర్చి నీవుబాగుగ నాలోచింపుము వానిని లొంగించుకార్యము నీచేతనే యున్నది. మరియు రాజనీతిప్రకారము బ్రాహ్మణక్షత్రి

యు వైశ్య శూద్రులలో జాతికి నలుగురు చొప్పునఁ బెద్దలరావించి వారికధికారమొసంగి నందవంశమున కింత ఘోరమెట్లు జరిగినదో, ఎవరుగావించిరో, పర్వతేశ్వరున కిట్టిశిక్షఁగావింప వలసియున్నదో ఈమొదలైన సంగతులఁగూర్చి వారితోఁ బ్రసంగింప వలసియున్నది. తరువాత చంద్రగుప్తునిఁగూర్చి యెంతవరకు వారితోఁ జెప్పవలసియున్నదో నీవెఱుఁగుదువు కదా? కావున మొదట నీకార్యమును జేసి, తరువాత రాక్షసునిఁగూర్చి ప్రయత్నింప వలసియున్నది. నీవు త్వరపడుము'' అని చెప్పెను. చాణక్యుని యేర్పాటు ప్రకారము బాహురాయణుఁ డప్పుడే బయలుదేరి నాలుగుజాతులయందును నొక్కొక్కజాతికి 4 గురి చొప్పున న్యాయాన్యాయముల నెఱింగిన పెద్దలరావించి సంగతులన్నియు వారికెఱింగించెను. సమాచారమంతయుఁ బూర్తిగవినిన తరువాత వారందరు రాక్షసునిఁ దూలనాడ నారంభించిరిగాని చాణక్యుఁడు వారలవారించి "అయ్యా! మీరింతమాత్రము నాతనిని దూషింపవలదు. మనముప్రయత్నించినఁగాని రాజద్రోహియెవ్వఁడో బయలు పడకమానఁడు'' అనిచెప్పెను. చాణక్యుని బుద్ధిచాతుర్యమునకును వాని ధర్మనిష్ఠకును నెంతయో సంతసించిపిదపఁ జంద్రగుప్తునిఁ గొంతవరకు శ్లాఘించిరి. వానికే రాజ్యాభిషేక మొనర్ప వలయు నని వారందరు నిశ్చయించుకొనిరి. తరువాత పర్వతరాజును రప్పించి ఎవరిప్రోత్సాహమున నీవిట్లు నగరమును ముట్టడించితివని యడిగిరి కాని యాతఁడు మొదటనేమియుఁ బ్రత్యుత్తరమీయక, మొగము వాల్చుకొని యూరకుండెను. అంతతో విడువక, మరలమరల వారుగద్దించియడుగ, నతఁడు కన్నీరుఁ గార్చుచు రాక్షసుఁడు వ్రాసిన యుత్తరముఁ జూచి తాను నగరమును ముట్టడించె నని మెల్లఁగఁ బలికెను. అది విని తనలోఁదానె చాణక్యుఁడు నవ్వుకొనెను.

తరువాతఁ జాణక్యుఁడు బాహురాయణునిరాక్షసునివద్దకుఁబొమ్మనిచెప్పెను. ఈవిషయమును గూర్చియే వానికిఁ బెద్దసందేహముగలదు-

బాహురాయణునిఁ జూచిరాక్షసుఁడేమనునోయెంత సాహసమూనునోచాణక్యుఁడు మొదటినుండియు ననుమానించుచుండెను. అందుచే సేనాపతి బయలుదేరుచున్నప్పుడుమరల వానినిఁగాంచి "బాహురాయణా! రాక్షసునియెడ జాగ్రత్తసుమీ! అతఁడుతొందరపడినను నీవుమాత్రము శాంతింపవలయును అతఁడేమి సంగతులు చెప్పునో చక్కఁగవినుము మనమందరమును గలసి రాజద్రోహినిపట్టుకొనవలయునని మొట్టమొదట నీవే చెప్పుము. ఇంతకును సారాంశము వానిమనసుఁ ద్రిప్పి వానిని మనవలలోఁబడవేసికొనుటయేకదా? రాక్షసుఁ డేమేమి కుట్రలు పన్నుచుండెనో అదిమనము జాగ్రత్తగఁ గనిపెట్టవలయును. నీవధికప్రసంగముఁ జేయక వానిని మంచిఁజేసికొని రమ్ము పొమ్ము'' అనిపంపించెను. కాని రాక్షసుఁడు తనకువశుఁడగునని చాణక్యునకు మాత్రమునమ్మకములేదు. అదివరకే సేనాపతిపై ననుమానముతో నుండుటచేరాక్షసుఁడు వానినిఁజూచినంతనే ఆగ్రహమునుబట్టలేక వానిని జంపించునేమోయని, కొంచెము భయపడుచుండెను. రాక్షసుని నిజమైన కోపము సేనాపతి యెఱుంగఁడు గావున నేవానియొద్దకుఁ బోవుటకుసమ్మతించెను. గానియింకొకనికి శక్యముగాదు. నందవంశము నాశనమొందెననివిన్న వెంటనే యేక్రూరుఁడింతటి దారుణకర్మమొనర్చెనోయని యమాత్యుఁడు దీర్ఘాలోచన సేయుచుండెను. జనులెల్లరునిష్కారణము దన్నునిందించుచుండుటచేత నకీయపనిందఁగలుగఁజేసెనని తనశత్రువులలో నెవఁడోకోరియీ కార్యముఁజేసెనని యాతఁడు నిశ్చయించుకొనెను. కొంతసేపునకు బాహురాయణుఁడు వెదకివెదకిరాక్షసునిసమీపింప గల్గెను.

ప్రకరణము. 4.

రాక్షసుని ప్రతిజ్ఞ.

"ప్రతీహారి చెప్పినదంతయు వాస్తవమనియే తోచుచున్నది. అసత్యమాడుట కాతని కేమి యవసరము? ప్రజలెల్లరు నన్నా రాజద్రోహిగా భావించుచుండిరి? భావించి నన్నేమిచేసెదరు? ఇంతకాలమునుండియు నాయెడఁ జూపుచువచ్చిన గౌరవమంతయు నేడు మంటపాలొనరించిరా! ఔరా! కాలమహిమ! మగధరాజ్యమున బ్రవేశించినప్పటినుండియు నా చిత్తము కేవలము రాజభక్త్యాయత్త మొనర్చుకొని, జనులనెల్లర సన్మార్గమున నడపుచు, నందవంశభక్తుఁడని దేశదేశములఁ గీర్తిఁగాంచిన రాక్షసున కెట్టి యపకీర్తివచ్చినది? స్వరాజ్యమునందే కాక యితరరాజ్యములయందుఁ గూడ నేమేమి కుట్రలు జరుగుచుండునో మిక్కిలి సూక్ష్మముతోఁ గనుఁగొనుచుండిన నేను ప్రత్యక్షముగ నెదుట జరిగినమోసమును గనుఁగొనఁ జాలనైతినిగదా? ఈ మహాద్రోహ మొనర్చినవాఁడు నాకన్న నెక్కుడు చతురతఁ గలవానివలెఁ దోచుచున్నాడే! ఛీ! నేనింకఁ బౌరుల మొగముఁ జూడఁజాలను. ఇచ్చటనే కాలముఁ గడిపెదను" అని రాక్షసుఁడు తనలో ననుకొనుచుఁ దన్నుఁ గొనివచ్చిన ప్రతీహారి యింటిలో రహస్యముగఁ గూర్చుండియుండెను. ఇంతలో వీధితలుపులు తట్టి యెవరో పిల్చినట్లు శబ్దము వినవచ్చినందున లోనఁగల ప్రతీహారి యెవరోయని యాలోచించుచు, మారుపలుక కూరకుండెను. ఎవరువచ్చినను తలుపులు తీయవద్దని రాక్షసుఁ డాజ్ఞాపించుటచేత, ప్రతీహారి కవాటమును తెరవలేదు. అంతకంతకు శబ్ద మెక్కుడై తలుపు చెక్కలగునేమోయని యనుమానముఁ దోచినందున, నతఁడు రాక్షసుని వద్ద కేఁగి "దేవా! దేవరవారికొరకు ఎవరోవచ్చి తలుపు బ్రద్దలు

సేయుచున్నారు. కంఠస్వరముఁబట్టిచూడ బాహురాయణునివలెఁ దోచుచున్నాఁడు. ఏమిసెలవు?" అని యడుగ రాక్షసుఁడు క్రోధముతో "ఏమీ! బాహురాయణుఁడా? పోయి తీసికొనిరా! రాజద్రోహ మొనర్చి నాకింత యపకీర్తిఁ దెచ్చిన యానీచునకు నే నెంతమాత్రము భయపడను. అవసరము వచ్చినయెడల నిదిగో ఖడ్గము నాయొద్ద నేయున్నది. నీవుపో" అని యాజ్ఞాపింపఁ బ్రతీహారి వెంటనేపోయి తలుపులనుదీసి బాహురాయణుని లోనికిఁ గొనివచ్చెనుకాని రాక్షసుఁడుమాత్ర మతనికింకను గానరాలేదు. అందుచే "మంత్రియెక్కడ? మంత్రియెక్కడ?" అని రెండుమూడుసారు లడిగెను. అతఁడేమియును బ్రత్యుత్తరమీయలేదు. వానిమాటలు రాక్షసుఁడు లోననుండి విని, బిగ్గరగ "బాహురాయణా! నేనిక్కడనున్నాను రారా!" అని పిలిచెను. వెంటనే సేనాపతి యచ్చటికిఁబోయి వానికన్నులకుఁ గనఁబడినంతనే రాక్షసుఁడు మండిపడుచుఁ దనలో "ఔరా! దుష్టాత్మా! రాజకులమంతయు ధ్వంసముఁ జేసి నన్నుఁ బరామర్శించుటకా వచ్చితివి? ఇదంతయు నీపనియే కాని మఱియొకటి గాదు. ఈరాక్షసుని కన్నులలో నీ వేమన్నుఁ గొట్టినాఁడవు" అని యనుకొని తనకోపము నాచికొని ప్రకాశముగా

"బాహురాయణా! మహారాజుగారిని సురక్షితముగ రాజసభకుఁ బంపినావుకదా."

అని యుక్తిగా నడుగ వాని కపటస్వభావమును సేనాపతి గ్రహించి, యేమి ప్రత్యుత్తర మీయవలెనోయని కొంతవర కాలోచించి

"అమాత్యరాజా! మర్త్యాగ్గుఁడగు పర్వతరాజును, నేనును చంద్రగుప్తుఁడునుబోయి చెఱపట్టికొని వచ్చితిమి. ఇంక రాజ్యమువిషయమై యాలోచింపవలసిన సంగతు లనేకములున్నవి. తమరు లేకున్న నే సంగతియుఁ గానేరదని యెంచి యిట్లు దర్శనమునకు వచ్చినాను. భగవంతుఁ డేమిచేయఁ దలఁచెనో యిదివరకే చేసెను. కడచినదానినిఁ గూర్చి విచారించిన నేమి ఫల

మున్నది? కావునఁ దమరింక లెండు. సైనికులెల్లరుఁ దమపనిఁ జేసికొనిరి. ఇఁక ముందు కార్యములన్నియుఁ దమరు చేయవలసినవే కాని మావల్లఁగానేరవు. అందుకొరకే మహారాజుగారు మిమ్ముఁ దోడ్కొనిరమ్మని నన్నంపినారు."

"ఆఁ-ఆఁ-ఏమహారాజు?"

"అయ్యా! చంద్రగుప్తమహారాజు"

"ఛీ! ఛీ! చంద్రగుప్తమహారాజనుమాట నేనిదివఱకెన్నఁడును వినలేదే! సరేసరే! ఇప్పుడు తెలిసినది! చంద్రగుప్తునకు రాజ్యమిప్పించుటకా యింతపనిఁ జేసితివి? ఆనాడు మురచేసినప్రతిజ్ఞ నేనెఱుఁగననుకొంటివా? స్త్రీలెంతను సాహసులుకారు? హా చండాలా! మూర్ఖచిత్తా! మురా ఏనాఁడు నీకుమారుని రాజు జంపించెనో, ఆనాఁడు నిన్నుఁగూడ బలవంతముగఁ గడఁతేర్చిన నందవంశమున కింతఘోరము జరుగకుండునుగదా? బాహురాయణా! ఇంకెంతకు దాచెదవు? మీరందరును గానివలలోఁబడి రాజద్రోహమునకుఁ బాల్పడితిరి. నీకు మంత్రిపదవి కావలసినచో నాతోఁ జెప్పియుండరాదా! నేనత్యంతసంతోషమున నీయుద్యోగము నీకప్పగించి హాయిగఁ గూర్చుండియుందునే! ఇంతమాత్రమున కింతదారుణకృత్యమొనర్పవలెనా? ఛీ ఇఁక నీతోమాటాడుటకు నాకేమి యవసరమున్నది? స్వామిద్రోహుల మొగము నేనింకఁ జూడఁజాలను."

అనిమాఱు మొగమిడికొని యూరకుండెను. సేనాపతి వానిమాటలన్నియు విని శాంతముతో

"అమాత్యరాజా! స్వామిద్రోహమొనర్చువాఁడు తనమేలుకొఱకుఁ గావించునా! నిష్కారణము దమరు పౌరులకు భయపడి యిక్కడ దాగియున్నారు. అందుచేతనే పర్వతరాజులోనఁ బ్రవేశించుటకు వీలైనది. కాని

రాజకుమారుఁడగు చంద్రగుప్తుఁడు వానిని వేఁటనే చెఱపట్టి కారాగృహమునఁ బెట్టియున్నవాఁడు. ఇందుకు సంతసింపక, నన్నును జంద్రగుప్తుని నిట్లూరక దూషించుట తమకు ధర్మమేనా! నిష్కారణముగఁ దమరు భయపడి యెచ్చటనో దాగియున్నారని విని తమకొఱకు వెదకుకొనుచు నిట్లు వచ్చితిని. తమ రిట్లు మూలమూలదూరినచో జను లనుమానము నూహింపరా అమాత్యరాజా! తమధైర్యమంతయు నేడెందుబోయినది. రాజ్యము విషయమై ముందుఁజేయవలసిన పనులన్నియు మీయాలోచనపైఁ జేయవలెనని చంద్రగుప్తుఁడు తమకొఱకె యెదురుచూచుచున్నవాఁడు. తమరింక దయచేయుఁడు.

"ఏమి యీకపటనాటకము! ఛీ! ఛీ! అవలికిపో! వాఁడేరాజైనచో నేనీకన్నులతోఁ జూడనోర్వలేను. మీరందరును కలసి వానినిఁ బెద్దఁజేసినచో నాకంఠమునఁ బ్రాణమున్నంతవఱకు నెట్లైనఁ బ్రయత్నించి వానిని నశింపఁజేయకపోనుసుమా! జాగ్రత్త ఇచ్చట నుండి వానిని గెంటించినఁగాని నానిద్రపట్టదు. నన్నెట్లైన వశపఱుచుకొనవలయునని యూరక ప్రయత్నించుచుంటివి? చాలుచాలు. నేను నందకులమునకు ఋణస్థుఁడను. నేనే నందకులమునకు సేవకుఁడను భక్తుఁడను. చంద్రగుప్తుఁడెంతమాత్రము రాజుగా నేరఁడు. నీవింకపో! అట్టినీ కోర్కులను నాచెవులఁబడనీయకు. మీరందరును క్రొత్తరాజ్యము, క్రొత్తరాజును, ననుసరించి క్రొత్తమార్గమునఁ బ్రవర్తింపుఁడు. నేనుమాత్రము ప్రాతమార్గముననే యుండెదను. నీమాటలలోనే నాకుఁ జాణక్యుఁడు బొడకట్టుచుండెను. ఆతఁడిప్పుడే నీచేనిన్ని కార్యములను జేయించెనని నాకుఁ దెలిసినది. పాటలీపుత్రమునకాతఁడు చంద్రగుప్తుని నెప్పుడు గొనివచ్చెనో అప్పటినుండియుఁ బ్రయత్నించుచున్నవాఁడు గాని మందమతినైన నేను గనిపట్టఁజాలనైతిని. ఆయుద్దేశముతోడనే వాని నీయూరికిఁ గొనివచ్చినాఁడు, కాని యింతద్రోహము జరుగునని నేనిదివఱకెప్పుఁడు ననుకొనలేను. శత్రువులు గూడ నగరము ముట్టడించెదరనియెఱుంగను. సరే యైన

జేవో అయినది. ఇంక మీ యందరకుఁ దగిన ప్రాయశ్చిత్తము నేనే చేయవలెను. ఇంకను మీరు పన్నిన కుట్రలు నాకుఁ గొన్ని తెలియవలసియున్నది. అవి గూడఁ దెలిసికొనిన తరువాత మీకన్నఁ బదిమడుంగు లెక్కుడు కపటము నేను వహించి మీ కట్టెగతి దెచ్చెదనో చూచెదరు గాక. రాజ్యమే మైపోయినను పోవనిమ్ము. నేను బ్రతికియుండగాఁ జంద్రగుప్తుఁడు మాత్ర మెన్నటికి రాజు గాఁజాలఁడు. నేను కానీయను. ఇది ముమ్మాటికిని నిజము. ఎంత కాలము వరకు నందవంశము పేరు భూలోకమున నుండునో అంతవరకు నే నితరులకు సేవఁ జేయను. ఇదియే నా ప్రతిజ్ఞ. నీవింక పో! ఈతఁడింక మీ మంత్రిగాఁడు నా మొగముఁ జూడవలదు."

అని కడునిష్ఠూరముగ మాటాడుచున్నందున సేనాపతి వానికేమియునుఁ బ్రత్యుత్తర మీయలేక పోయెను. ఇంకెంత బ్రతిమాలినను కార్యములేదని నిశ్చయించుకొని, యప్పుడే సేనాపతి యచ్చటనుండి బయలుదేరి పోయెను. బాహురాయణుఁ డెంతటి సేనాపతియైనను, మంత్రికి క్రిందివాఁడే కావున నేమియును విరోధముగ మాటాడలేక పోయెను. అదియునుగాక, సేనాపతి వహించిన కపటమంతయుఁ గ్రొత్తగా నేర్చుకొనినది కాని సహజముగాఁ బుట్టినది కాదుకదా? అందుచేతనే మంత్రిని వలలో వేసికొనుట వానికిఁ జేతనైనది కాదు. ఈసంగతి నాతఁడు చాణక్యునితోఁ జెప్పినంతనే యతఁడు చేయవలసిన యుపాయ మేమియో యని యాలోచించుచుండెను. రాక్షసుఁడు తన్నుఁ గూర్చి యెట్టిప్రయత్నమున నున్నవాఁడో యని కనుఁగొనుటకే యతఁడు సేనాపతిని వానియొద్దకుఁ బంపెను. ఇప్పుడు మరియొక యుపాయము వానికిఁ గ్రొత్తగఁ దోచినందునఁ జంద్రగుప్తుని వద్దకేగి వానిచే రాక్షసుని క్రిందివిధమున నొక యుత్తరము వ్రాయించి పంపించెను

"అమాత్యరాజా!

నేనును బాహురాయణుఁడును గలసి మనమగధరాజ్యమునకు దీర్ఘశత్రువగు పర్వతరాజును పట్టుకొని కారాగృహమునఁ బెట్టించుట తమకుఁ దెలిసియేయున్నది. రాజ్యమునపహరింపఁ గుట్రలు పన్నుచున్న శత్రువు మనచేఁ జిక్కెను గావున వానికట్టి శిక్ష విధింపవలయునో, క్షమించి విడిచి పెట్టవలసియుండునో? వాని కుమారుని యొద్దనుండి మన మొక సంధిపత్రికను వ్రాయించి పుచ్చుకొనినఁజాలునో, లేక యింకేమి చేయవలయునో, యనువిషయములఁ గూర్చి మనమాలోచింపవలసియున్నది. ఇంతియేకాక రాజకులమునకింతటి ఘాతమొనర్చిన ద్రోహిని మనము వెదకవలసియున్నది. లేనియెడల జనులనేకవిధములఁ దలపోయుట కవకాశము గల్గును. నిజము బయలుపడినదాక, వారట్లు అనుకొనక మానరు. తమరు నందకులభక్తులు గావున, నీకార్యభారము వహింపక తీరదు. తమ, రిందనాదరణము వహించినచో స్వామికార్యమునం దనాదరణము వహించుటయే?

ఇట్లు

విధేయుఁడు,

చంద్రగుప్తుఁడు."

రాక్షసుఁ డాయుత్తరమును జూడకమునుపే చంద్రగుప్తుఁడు వ్రాసినదని విని, చించిపారవేయనెంచెనుగాని, యేమిసంగతులు వ్రాసెనో యని మరల బుద్ధిమార్చుకొని యాయుత్తరమును జదువుకొనెను. ఉత్తరమంతయుఁ జూచినతరువాత నేమిచేయవలెనో వానికిఁదోపలేదు. చంద్రగుప్తుని సేవ తనకిష్టము లేనందునఁ దనయుద్యోగ మతఁ డదివరకే విడిచిపెట్టియున్నవాఁడుకదా! చంద్రగుప్తుఁడు మొదలైనవారందరు నేదైనఁ గపటవ్యూహము పన్నితన్నుఁ బడద్రోయుటకే యిట్టి యుత్తరమును వ్రాసిరేమో యని యతనికనుమానము జనించెను. రాక్షసుఁడు మిక్కిలి కూరుఁడే యయ్యుఁ బాపము

క్కాలవశముచే నిప్పుడొరులకు భయపడవలసివచ్చినది. అందుచేఁ దాను స్వతంత్రముగా నియేకార్యముఁ జేయుట కిష్టపడలేదు. ఎటుజూచినను తనపక్షమున నొకడైనలేడయ్యె. కడకొకసేవకునితోఁ గూడ నేసంగతి చెప్పుటకును వానికి నమ్మకముగలుగలేదు. సేనాపతి మొదలగువారు తమంతటఁ దామే తనకధికార మొసంగియుండిరి కావున దాని కంగీకరించినవారందరు నెట్టులైన గోతిలోఁ బడఁద్రోయువారలెనని రాక్షసుండూహించి,

“ ప్రద్యుమ్న కుమారుఁడగు చంద్రగుప్తునకు

ఆశీర్వాదములు.

నీవు వ్రాసిన యుత్తరమందినది. పర్వతేశ్వరుని విషయమైయాలోచించుటకు నేను సిద్ధముగా నేయున్నాను. ఎవరెవరి కే యేశిక్షలు విధింపవలసి యున్నవో అట్లు చేయక తప్పను. కాని నేను మాత్రమిందే విషయమును గూర్చి యునెఱుఁగను. కడసారి శిక్షలు గూడనా చేతితోనే జరుగవలసి యున్నవి.

ఇట్లు,

రాక్షసుఁడు.

అని యొకయుత్తరము వ్రాసి చంద్రగుప్తునకంపెను. ఆయుత్తరమునుజూచి చాణక్యుఁడెంతయో సంతసించి,

“ శబాస్! అమాత్యరాక్షసా! ఇప్పుడు నాచేతిలోఁ జిక్కితివి, ఇంకెక్కడికిపోఁగలవు ” అనిచప్పట్లు చఱచుచు పెద్దకేక వేసెను.

ప్రకరణము. 5.

న్యాయ మేమయ్యెను ?

చాణక్యుఁడు రాక్షసునకధికార మిప్పించుటకుఁ గారణము వాని నెట్టులైన సభలోఁ బరాభవింపవలయుననియే. చాణక్యుఁడు మిక్కిలి నీతిపరుఁడే కాని వాని మనసుమాత్రము మిక్కిలి కుటిలమైనది. తనశత్రువుల మొదలంట నాశనముఁ జేసినదాక యాతఁడు విడుచువాఁడు కాఁడు. వానిపట్టుదలకుఁ దగిన మహాగ్రహముగూడ వానికిఁ గలదు. అతఁడు చేసిన ప్రతిజ్ఞ యిప్పటికిఁ గొంతవరకుఁ బూర్తియైనదికదా? అతఁడు దరిద్రుఁడైనను హిమాలయప్రాంతమునఁగల భిల్లులు మొదలగువారినిఁ జేరఁదీసి వారికిఁ జక్కఁగ విలువిద్య నేర్పుటచేఁ దనకార్యములో వారు కొంతసాహాయ్యముఁ జేసిరి. అనేకులాతనికి వశులగుటకుఁ గారణము వానివిద్యాప్రభావమే కాని వేరొకటి కాదు. గొప్పవారికేకాక తనవద్ద విద్యనేర్చుకొనుచుండిన బాలురకుఁ గూడ వానియెడ నెంతయో భక్తియుండెను. చాణక్యుఁడన్నచో విద్యానిధి యనియే యెల్లరి యభిప్రాయమైయుండెను. అతఁడు పాటలీపుత్రములోఁ బ్రవేశించి యెంతవరకుఁ దనచాకచక్యముఁ జూపించెనో చదువరులెఱుఁగుదురు కదా! అతఁడెంతయో యుక్తిపరుఁడు కానిచో సేనాపతియంతవాఁడాతని కెట్లు వశుఁడగును? ఇంక సామాన్యులమాట వ్రాయ నవసరమేలేదు. ఇంక రాక్షసునిఁగూడఁ దనవశపరచుకొనవలయునని యతఁడు ప్రయత్నించుచుండెను. కాని యిదివరకుఁ జేసిన కార్యములన్నింటికన్న నిదియే వాని కెక్కుడు కష్టమైనదని తోఁచినది. ఇందుకుఁ గారణము రాక్షసుఁడు మిక్కిలి సత్యపరుఁడగుటయే. అందుచే నమాత్యునకుఁ బ్రాణమిత్రుఁడైన చందనదాసుద్వారా యీకార్యమును సాధింపవలయు

వని చాణక్యుఁడు నిశ్చయించుకొనెను. ఆదినుండి యింతవరకును ఉత్తము బ్రాహ్మణుఁడని యెవరైన నేమైన నిచ్చినఁ బుచ్చుకొనక, తానెవఁడో చెప్పక, రహస్యముగఁ లోలోన నన్నికార్యములను జేయించుచుఁ జాణక్యుఁ డేమియు నెఱుఁగనివానివలెనే నటించుచుండెను. వసుభూతి వలన ననేకసమాచారములఁ దెలిసికొనినందునఁ జాణక్యుఁడు నాటినుండి నేటివరకును వానిని విడువలేదు. వాని గుప్తశిష్యుఁడగు సిద్ధార్థుఁడు సామాన్యుఁడు కాఁడు. వాఁడు చాణక్యున కెన్నియో యుపకారములు జేసెను. కాని వానినెల్ల నిచ్చట వ్రాయు నవసరములేదు. నోటవచ్చిన ప్రతిమాటయుఁ జెల్లించుటకు సమర్థులగు శిష్యులు వాని కనేకులుండఁ జాణక్యుఁడొక్క నందరాజ్యమేకాక, ఇంకెన్ని రాజ్యములైనను ధ్వంసముచేయుట కేమియాటంకము? ఇప్పటికిఁ జాణక్యుని మనసులో నెట్టికోరికలును లేవు. గాని యొక్క రాక్షసుని విచారమే వానినిఁ బీడించుచున్నది. రాక్షసుఁ డచలచిత్తుఁడు. ఏకమార్గప్రవర్తి. త్రినేత్రుఁడు వచ్చినను పట్టినపట్టు విడచువాఁడు కాఁడు. అందుచేతనే తన్నుఁగూర్చి వానికెట్టి సంశయమును బుట్టనీయకుండ నింతవరకుఁ గాలముఁ గడిపెను. చాణక్యుఁ డన్న నొక సామాన్యవిప్రుఁ డనియే యనుకొనుచుండెను గాని, పాపము రాక్షసుఁడు వానినిఁ గూర్చి యింతకన్న నిదివరకేమియు నెఱుఁగఁడు. సేనాపతి మొదలైనవా రందఱు వశ్యులైనందునఁ జాణక్యుని కార్యము లింతవరకు శ్రేయస్కరముగ జరిగినవి. ఇంకమీఁద రాక్షసు నెట్టులైన వశపరచుకొని చంద్రగుప్తుని సింహాసనముపైఁ గూర్చుండఁబెట్టి వానిచేతనే గ్రీకువారినిఁ బారఁదోలించి ఆర్యావర్తదేశమునకు శుభముఁ గలిగించుటయే చాణక్యుఁడు చేయవలసిన ప్రధానకార్యము. మొట్టమొదట మంత్రి లోఁబడకున్న నిం కేదియును గానేరదు కదా? కావున వానినెట్లు వశపఱచుకొనవలయును? ధనమిచ్చియా? మంచిమాటలాడియా? కాక మఱెట్లు? ఎంతదూరమాలోచించినను సామమార్గముననే వానిని వశపరచుకొనవలయునుగాని వేఱుమార్గమునఁ దనకెంతమాత్రమును శక్యముగాదని చాణక్యుఁ డెఱుఁగును.

పగరాజులతో నేకీభవించి రాక్షసుఁడే కాని చెలరేఁగినచోఁ జంద్రగుప్తున కెట్టియుపద్రవమైన సంభవించును. కావున వానిని సామమార్గమున సాధింపవలయు నని యెంచియే చాణక్యుఁడు చంద్రగుప్తునిచే వానికట్టి యుత్తరము వ్రాయించెను. అపరాధి యెవఁడో మంత్రి యెఱుఁగనే యెఱుఁగఁడు కదా? ఆమఱునాఁడే న్యాయసభ యేర్పాటు చేయఁబడినది. చంద్రగుప్తుఁడు రాక్షసునిఁ గలసికొని "అయ్యా! ముందు విచారణము గుప్తముగ జరిగించిన బాగుండును. లేకున్నచో నపరాధి భయపడి పారిపోవును. తరువాత వానినిఁ బట్టుకొనుట మనకుఁ గష్టసాధ్య మగును. పర్వతేశ్వరుని విచారణఁజేసి వానికుట్ర లన్నియుఁ బైకి తీసి శిక్షింపవలసియున్నది. ద్రోహియని యేర్పడినవాఁడు బ్రాహ్మణుఁడైనను చండాలుఁడైనను విడువక తప్పక శిక్షింపవలయును.'' అని చెప్ప నన్నింటికిని రాక్షసుఁడు సమ్మతించినట్లు తలయూచెను.

అమాత్యరాక్షసుఁడు మిక్కిలి యుక్తిపరుఁడు. చాణక్య చంద్రగుప్త బాహురాయణులు మువ్వురును గలసి యీ యక్రమమంతయుఁ జేసియుందు రనియు, వారే శత్రువును రప్పించి తన్ను మోసపుచ్చిరనియు, తాను స్వయముగ నన్నిసంగతులు విచారించి వారికిఁ దగిన శిక్ష విధింపవలసి యున్నదనియు, తన్ను మోసపుచ్చుటకే యీ యధికారమును దనకొసంగి రనియు, మెల్లమెల్లఁగ వారిమువ్వురిగుట్లు నూడఁబెరికి పరాభవింపవలయు ననియు, నూహించి యమాత్యుఁ డామఱునాఁడు న్యాయస్థానమునఁ బ్రవేశించెను. అతఁడు పోవుసరి కచ్చటఁ జంద్రగుప్తుఁడును సేనాపతిమాత్రమే యుండిరి. వారిరువురును లేచి తగినమర్యాదఁ జేసి, యొకయున్నతాసనముపైఁ గూర్చుండఁబెట్టిరి. కాని రాక్షసున కింకను సందేహములు విడువలేదు. చంద్రగుప్త బాహురాయణుల మొగములఁ జూచి వారే ద్రోహులని వానికిఁ దోచినది. అందుచే "వీరిమొగము లిప్పుడు దీనత్వము సూచించుచున్నవి. తప్పక వీరే యపరాధులు కావలయును.

వీరి నేరీతిఁ బరిభవింపఁ దలఁతునో? నందకులమును నాశనముఁజేసి వీరే కదా పర్వతరాజును చెప్పించిరి? అందును వీ రంగీకరించెదరా? ఏదైన యుక్తిఁజేసి యీయపనింద నాపైనే మోపెదరేమో? ఇప్పు డేమిచేయవలెను? న్యాయాధిపత్యము నేనిప్పు డంగీకరింపవలెనా? కూడదా? అంగీకరింపకున్నచో, నన్ను మొదటనే యనుమానపురుషునిగా భావింతురు. కాఁబట్టి యొప్పుకొనక తప్పదు. నేనిప్పుడు జాగ్రత్తగా నుండవలయును" అని చంద్రగుప్తునిఁ జూచి "ప్రద్యుమ్నకుమారా! చంద్రగుప్తా! నందవంశమంతయు నాశముఁజేసి యీగద్దెపైనా యెక్కఁదలంచితివి! ఎంతదారుణము? సరే నీవెంతవరకుఁ బ్రయత్నింపఁగలవో నేనిప్పుడే చూచెదను. పోయి, దుష్టుఁడైనపర్వతరాజును దోడ్కొనిరా" అని పలుక తక్షణమే యిరువురుసేవకులు పోయి చెఱలో నున్నపర్వతేశ్వరునిఁ దోడ్కొనివచ్చిరి. దీనాననుఁడై కన్నీరుఁగార్చుచుఁ బర్వతేశ్వరుఁడు న్యాయస్థానమునఁ బ్రవేశించిన తరువాతఁ గొంతవరకు రాక్షసునివైపు చూడలేదు. అతఁ డచ్చట నున్నాఁడనిగూడ యెఱుంగఁడు. అందుచేఁ జంద్రగుప్తునిఁ జూచి "చంద్రగుప్తకుమారా! నన్నెందుకు రప్పించితివి?" అనియడుగఁ జంద్రగుప్తుఁడు "అయ్యా! నిన్ను నేనురప్పింపలేదు. అదిగో నున్నతాసనముపై న్యాయాధీశుఁడున్నవాఁడు ఆతనిని గనుంగొనుము" అని చెప్పెను. తోడనే పర్వతరాజు ప్రక్కకుఁదిరిగి రాక్షసునిఁ జూచి పండ్లు పటపటఁ గొరికి

"ఓయీ రాక్షసా! నీతలిదండ్రులు నీకుఁ దగినపేరుపెట్టిరి. ఛీ! నీయట్టినీచుఁ డింకెవ్వఁడు కలఁడు? యజమానునికులము నశింపఁజేసిన నీకు నన్ను మోసపుచ్చుట ఆశ్చర్యము గాదు. నీయట్టి విశ్వాసఘాతకుఁ డెందును లేఁడు. నీస్వంతముద్రతో నుత్తరము నీవంపకున్న నేనిట్లు వచ్చెదననుకొంటివా? నన్ననఁనేల? నామందదృష్టమే నన్నిట్లీడ్చుకొని వచ్చినది. నన్నింక నీవేమిచేసెదవో చేయుము. నీవధముఁడవు నీచుఁడవు. సందేహములేదు. నన్నింతవరకు మోసముఁజేసి న్యాయస్థానమున కెందుకు రప్పించితివి..."

అని యింకనేమో చెప్పఁదలంచెను కాని ఆయాసముచే మరి మాటాడలేకపోయెను. వానిమాటలన్నియు విని యులుకును పలుకును లేక, పాపము రాక్షసుఁడు స్తంభమువలె నట్టులే యుండిపోయెను. ఏమి ప్రత్యుత్తర మిచ్చుటకును వానికప్పుడు తోపలేదు. తనపై నిట్లు కల్పించి చెప్పవలయునని వానికిఁ జంద్రగుప్తుఁడుగాని, చాణక్యుఁడుగాని బోధించియుందురనియెంచి పర్వతేశ్వరా! నిష్కారణముగ నొకరిపై నిందమోపిన లాభములేదు. మంత్రి యిప్పుడు న్యాయమూర్తియై యున్నవాఁడు. కావున నబద్ధములాడకుము. ఈద్రోహ మెట్లు జరిగినది? నీవెట్లు వచ్చితివి? నిన్నెవరు రప్పించిరి? నీవుకూడ నొకరాజమాత్రుఁడవే కాని నిన్నుశిక్షించుటకు నేనిప్పుడు సిద్ధముగ నున్నాను. నీవుచెప్పిన సంగతులువిని, ఆపైనీకు శిక్ష విధింపఁబడును దాపక నిజమెఱింగించినచో కొంచెము శిక్షతో నిన్ను విడిచెదము. ప్రస్తుతము న్యాయాధీశుఁడు రాక్షసుఁడు జాగ్రత్త" అని పలుక పర్వతరాజు నవ్వి "ఏమేమి! ప్రస్తుతము న్యాయాధీశుఁడు రాక్షసుఁడా ఔనౌను. ఎంతన్యాయమూర్తివి కానిచో నాకిట్టి దుష్టలేఖ వ్రాసెదవు "నందవంశమును నిర్మూలముఁ జేయఁబోవుచున్నాను గావున నీవు కొంచెము సైన్యములతో వచ్చిన యెడల నీకన్నియు ననుకూలమగునట్లు చేసెద" నని వ్రాసి అందుకు నేనువ్రాసిన జవాబునుగూడఁజూచి మరల మరల నెన్నియో యుత్తరములు వ్రాసి నన్నుఁ దెప్పించి మోసపరచిన విశ్వాసఘాతకుఁడవగు నీవా న్యాయాధీశుఁడవు! నీ శరీరమంతయు కండ కండలుగఁగోసి పరీక్షించినను నీకు న్యాయమున్నదా"

అని ప్రక్కకుఁదిరిగి

"కుమారా! చంద్రగుప్త! నీవేయింక మగధేశ్వరుఁడవు గావున నీకృతఘ్నునిఁగూర్చి జాగ్రత్తగ నుండుము. ఈతఁడు బట్టలో తేలువంటి వాఁడు సుమా? నాయనా!" అని నిర్భయముగ నుచ్చరించెను. వాని

మాటలు విని చంద్రగుప్తుఁడును బాహురాయణుఁడును ఆశ్చర్యమభిన యించుచుండిరి. అప్పుడు రాక్షసుఁడు కొంచెము కోపము వహించి

"ఓరీ పర్వతేశ్వరా! నీకింకను బుద్ధిరాలేదా? ఖైదులోఁ బడినం దున నీకుఁ బిచ్చియెత్తినదా యేమి? ఇంకముందు నోటికివచ్చినట్లు న్యాయ స్థానమునఁ గూసినచో నీగతియేమగునో చూచుకొనుము."

"ఛీ అధమా! ఇదిగో నీవు వ్రాసినయుత్తరము! పారవేసితి నను కొంటివా యేమి? ఓరి నీచా! విశ్వాసఘాతకా! రాజద్రోహీ! కన్ను లుండినచో నీయుత్తరమునఁగల నీముద్రఁజూచుకొనరా? ఓ చంద్రగుప్తా బాహురాయణా! మీరు ధర్మమూర్తులు చూడుఁడు చూడుఁడు. ఇదిగో ఇదియే వీనిముద్ర. ఇట్టి ద్రోహిని శిక్షశాసనమున నురిదీయింపక యింకను జాలివహింతురేల?" అని పలికి ఆయుత్తరములను వారిఁదరికిఁ జూపెను.

ప్రకరణము. 6.

న్యాయాధీశుఁడా? లేక అపరాధియా?

పర్వతేశ్వరుని కఠినోక్తులన్నియు విన్న పిదపఁ బాపము రాక్షసుని హృదయమూరక యల్లకల్లోలమగు చుండెను. అతఁడు జూపించిన యుత్త రమును గని, యాతఁడేమి సమాధానముఁ జెప్పుటకును వీలులేక పోయినది. వానికప్పుడు మితిలేని యాగ్రహముగూడ జనించెనుగాని, తాను న్యాయా ధిపతియై యుండుటచే బలవంతముగ నాకోప మణచుకొని పర్వతరాజుతో

"అసత్య మసత్యము. పర్వతేశ్వరా! నేనే యీయుత్తరమును వ్రాసితినని నీవు నమ్మఁగలిగితివా? నీబుద్ధి సర్వమును మారిపోయినది. నా పేరుపెట్టి నీకిట్టి యుత్తరమును వ్రాసి నిన్నెవరో మోసపుచ్చిరి. బాగుగ నాలోచింపుము. నీవీ కపటము నూహింపఁజాలక నాపేరు చెప్పుచున్నావు. నీకింత నీచముగ నెవరు వ్రాసిరో వానిపేరు తెలిసియున్న మాకెఱింగిం పుము నిన్ను విడిచెదము. నీకుఁ గావలసినశిక్ష వానికే విధింతుము. లేకున్న నీకింకఁ గారాగృహమే నివాస ప్రదేశమగును. కావున నూరక చెడక ఆ రహస్యమును మాకెఱింగింపుము."

అని పలుక పర్వతేశ్వరుఁడు వాని మాటలయందు కొంచెమైన లక్ష్య ముంచక ఖేదమొంది, తనకింత మోసముఁజేసి రాక్షసుఁడేమియు నెఱుఁగ నట్లు నటించుచున్నవాఁడని యూహించి వానితో నింక మాటాడుటయు నవసరమని తలంచి చంద్రగుప్తుని వంకఁదిరిగి

"అయ్యా! మాటాడరేమి? అపరాధినా న్యాయాధిపతిగాఁజేసిరి. వీఁడే నందవంశమును రూపుమాపెను. వీఁడే మమ్మందరి మోసపుచ్చవల యునని నాకిట్టి కపటలేఖవ్రాసెను. ఈయుత్తరమే యిందులకు సాక్ష్యము. మీరింక ననుమానింపవలసిన పనిలేదు. ఇదివఱకు రాక్షసుఁడన్న రాజభక్తుఁ డనియు, ధర్మమార్గ ప్రవర్తియనియు, నీతికోవిదుఁడనియు, జనులు కీర్తించు చున్నారుగదా? ఆ నిబ్బరముచేతనే తానెట్టికార్యముఁ జేసినను ప్రజలు నమ్మరనియెంచి, యీ మహానుభావుఁ డింతటి దారుణకృత్య మొనరించెను. కానియెడ నేకారణమును లేకుండ నన్నెందుకు రమ్మనును? ధననందుఁడు మూర్ఖుఁడనియు, రాజ్యమునందు వానికెంతమాత్రము నిష్టములేదనియు, నాతఁడొక స్త్రీ వలలోఁ దగుల్కొని యంధుఁడై కాలముఁ బుచ్చుచున్నా డనియు, ప్రస్తుతము రాజ్యము మంచిస్థితియందు లేదనియు, కావునఁ దమరు తత్క్షణము బయలుదేరివచ్చినచో నేనీలోపున నన్నికార్యములను జ క్కపరచి సిద్ధముగనుండి, మీకు రాజ్యము దక్కునట్లేర్పాటు చేసెదననియు,

నీతఁడు నాకు రెండుమూ డుత్తరములు వ్రాసెను. అయ్యో! యిదెక్కడి ధర్మము! మీరుండియు నీతఁడిట్టి యుత్తరములు వ్రాయుటకెట్లు సాహసించెను? నందవంశముతోఁ బాటుగ నావంశముఁగూడ నీతఁడు నాశనముఁ జేయ నూహించెనుకాఁబోలు! నాయనా చంద్రగుప్తా! నీవీరాజ్యమున కధిపతివైతివి నీవింకను బాలుఁడవుగాన, రాజ్యతంత్రము లేమియు బాగుగ నెఱుఁగవు. దైవము నీకుఁదోడగును గాక. నీవుమాత్రము బాగుపడఁదలంచితివేని యీరాక్షసుని వెంటనే యుఱిదీసి చంపింపుము. లేనిచో నీకితఁడు రాజ్యము దక్కనీయఁడు. నిన్నెట్టులైన నాశనముఁజేయక మానఁడు. నా మాటవినుము. ఇందుకు సందేహములేదు. కొంతకాలము స్వామిభక్తుఁడని పేరుపొందినందున నిప్పుడిట్టి దుష్కార్యముఁ జేసినను జనులు నమ్మరను ధైర్యముతో నీతఁడింత ద్రోహమొనరించెను. నాకంతమునఁ బ్రాణమున్నంత కాలము నేనికమీఁద మీస్వాధీనమందుండెదను. న్యాయ మాలోచించి మీకు ధర్మమని తోచినయెడల నన్నిప్పు డురిదీయించినను నేను వలదనను. ఇట్టి యధముని నమ్మినందుకు నాకుఁదగిన శిక్ష కావలసినదే ఇట్టిరాజద్రోహి న్యాయాధిప యైనచో న్యాయము దొరకునా?"

అని చెప్పి తనవద్దనున్న తక్కిన యుత్తరములు గూడ వాని కొసంగెను. చంద్రగుప్తుఁడును బాహురాయణుఁడును ఆయుత్తరము చదివిరేమియుననక యూరకుండిరి రాక్షసుఁడేమి చెప్పునో యనివినుటకు కుతూహలురైయుండిరిగాని యతఁడేమియు మారుపలుకలేదు. ఏమిసమాధానముఁ జెప్పుటకును వానికేమియుఁ దోపలేదు. తనకంతటి యపకీర్తి తెచ్చినవాఁ డెవఁడైయుండునా యనియతఁడు దీర్ఘాలోచనము సేయుచుండెను. తనసేవకులు పర్వతేశ్వరున కనుకూలురై యిట్టి దొంగయుత్తరములు గల్పించితనకపగింపఁ దెచ్చిరనిచెప్పి తప్పించుకొనవలయునని మొదట నాలోచించెను గాని యాతఁడు సత్యవ్రతుఁడగుటచే మరలనిట్టి యనృతమాడుటకు సాహసింపక పోయెను.

"ఔరా! ఎంత ద్రోహము జరిగినది? నాకింతటి యపకీర్తిఁదెచ్చినరాజద్రోహి యెవఁడై యుండును? నిష్కారణముగ నిప్పుడపరాధినిఁ గావలసి వచ్చెనుగదా? ఇది యంతయు నింద్రజాలము వలెనున్నదే. అహో! ఎంతయంధకారమునఁ బడియుంటిని? నేనీయుత్తరములు వ్రాయలేదని చెప్పిన వీరునమ్మెదరా? అందుకు నిదర్శనములు జూపుమనిన నాకేమియాధారమున్నది? వీనిమాటలే యందరునమ్మెదరు గాని నన్నెట్లువిశ్వసింతురు? అయ్యో! ఇంత కాలము నుండి యార్జించుకొనిన నాకీర్తి యంతయు నిముసములో నశించిపోయెను గదా?"

అని రాక్షసుఁడు కొంతవరకుఁ దనలో విచారించి విచారించి క్రొత్త ధైర్యమును దెచ్చుకొని, చంద్రగుప్తునిఁజూచి "కుమారా! చంద్రగుప్తా! ఏ కారణముచేతనైన నేమి నేనే యీయుత్తరములు వ్రాసినట్లు పర్వతేశ్వరుఁడు చెప్పుచున్నాడు. దైవసాక్షిగ నేనిందేపాపము నెఱుఁగకపోయినను నానేరమును దప్పించుకొనుటకుఁ దగిన యాధారములేమియు నాకుఁ గానరానందున నేనిప్పు డూరకుండవలసి వచ్చినది. పర్వతేశ్వరుఁడు ప్రతిమాటయుఁ దగిన నిదర్శనములతోఁ జెప్పుచున్నాడు మొత్తముపై సారాంశము నేనేయపరాధినని తేలుచున్నది. కావున నే నింక నీన్యాయపీఠముపైఁ గూర్చుండ నర్హుఁడను గాను. నీవే దీనిపైఁగూర్చుండి న్యాయాన్యాయముల స్వయముగ విచారింపుము. మగధసింహాసనముపైఁ గూర్చుండి యింక నీవే రాజగుదువు. ఇందుకు సందియములేదు. కాని నీవుఁ బరమమిత్రుఁడగు పర్వతరాజునుగూర్చి యెట్టియేర్పాటు చేసెదవో నన్నుఁగూర్చికూడ నట్లేచేయుము. నాయెడజాలి దలంప నవసరలేదు. ఇదివరకనేక స్వామిద్రోహుల శిక్షించిన నేనే యిప్పుడు స్వామిద్రోహినని మీదండననంగీకరించెదను. నందవంశమును నేనే నాశనముఁజేసినట్లును, శత్రువుల కుత్తరములువ్రాసి నేనే కోటపైకిఁ దెప్పించినట్లును స్థిరపడినది. ఈరెండు నేరములు నాపైని మోపఁబడినవి. నాకు యోగమున్నచోఁ ద్వరలోనే ముక్తిఁజెందెదను.

లేదా యాత్మనుండి ముక్తిసంపాదించెదను. ప్రస్తుతముమాత్రము నన్నుఁ గారాగృహమునఁ బెట్టింపుఁడు."

అని పలికి వెంటనే యాసనముపైనుండి క్రిందికి దిగిపోయెను. తరువాత పూర్వముకన్న వానికిప్పుడు ధైర్యము గలిగినది. రాక్షసుఁడు భయపడి తనతప్పులు క్షమింపుమని ప్రార్థించునని మొదటనూహించెను కాని యిట్లు శాంతముగఁ దన్ను శిక్షింపుమని యడుగునని చంద్రగుప్తుఁడను కొనలేదు. నిక్కముగ రాక్షసుఁడే నందవంశమును నశింపఁజేసెనని ప్రజలకు నమ్మకము గలిగినట్లు చాణక్యుఁడు గ్రహించెను. అందుచేవాని నెక్కువగా విచారణ సేయించుట వానికిష్టములేదు. రాక్షసునే చంద్రగుప్తునకు మంత్రిగాఁజేసి వారిరువురిచేతను గ్రీకులను బారఁదోలింపవలెనని కదా చాణక్యుని కోర్కె. అందుచేత నే విచారణ అంతతో నిలుపుచేయించెను. ఇంతియకాక ఎక్కుడుగ విచారణఁజేసినచో రహస్యము లన్నియు నొక్కొక్కటి బైటబడకమానవు, అప్పుడు తప్పక మోసము సంభవించును. రాక్షసుఁడు నందవంశ భక్తుఁడగుటచే నెన్నాళ్ళకైన నీతంత్రమును గనిపట్టకమానఁడు అందుచే వానిని విచారణచేయుటగాని, శిక్షసేయుటగాని, పనికిరాదు. కాఁబట్టి యెట్లులైన వానినొప్పించి వానిచేఁ జంద్రగుప్తునకు సేవఁజేయించుటయే చాణక్యుని ప్రయత్నము. చంద్రగుప్తుని సింహాసనముపైఁ గూర్చుండఁబెట్టి తాను హిమవత్పర్వమునకుఁబోయి తపస్సుఁజేసి కొనవలసియున్నది. గాన వానిని రాక్షసున కప్పఁజెప్పి ధననందునిఁ గొల్చినట్లే భక్తి విశ్వాసములతో వీనినిఁగూడఁ గొల్చెదనని వానిచేఁ బ్రమాణముఁ జేయించి తరువాత బయలు దేర వలయునని చాణక్యుఁడు జూచుచుండెను. అందుకుఁ జంద్రగుప్తుఁడు నందవంశజుఁడే యని చెప్పినమ్మించి రాక్షసుని మనసు త్రిప్పవలసియున్నది. రాక్షసుని మనసు త్రిప్పుట ప్రపంచమును దల్లక్రిందఁజేయుటయే ఎట్లులైన నీకార్యము సాధింపకపోనని చాణక్యుఁడు మాత్రము నిబ్బరముతోనే యుండెను. తన పని పూర్తియైన దాకవానికి నిద్రపట్టను కదా?

చాణక్యుఁ డీయేర్పాటులన్నియు ముందేచంద్రగుప్తునకు బోధించెను. అందుచేఁ జంద్రగుప్తుఁ డంతతో విచారణ ముగించి రాక్షసుని మరల గద్దెపై కెక్కించి "ఆర్యా! అమాత్యరాక్షసా! పర్వతరాజు చెప్పిన సంగతులన్నియు విన్నారముగదా? తమబోటి రాజభక్తులు ఇట్టి ఘోరకృత్య మొనర్తురన్న మేము నమ్మఁజాలకున్నారము. మేమేకాదు మీసంగతి యెఱిగినంతవరకెవ్వరును నమ్మరు. కలలోనైనఁ దమరిట్టి యుత్తరమును వ్రాసి శత్రువుల రప్పింతురా! ఎవఁడో తమముద్ర నపహరించి యిట్టి దొంగ యుత్తరమును వ్రాసియుండును. వానిని మనము దొలుతఁ బట్టుకొనవలసి యున్నది."

"కుమారా! నిక్కముగ నేనిందేపాపము నెఱుఁగను. నావిషయమై నీవేమి యాలోచించినను నేనేమియును జేయలేను. ఆయుత్తరములలో నాముద్ర యుండుటయే నాయపరాధమునకుఁ గారణము. కాఁబట్టి నాయెడ విశ్వాసమూని యీమిత్రద్రోహము నెవరుచేసిరో కనుఁగొని నాయపనిందఁ దొలంగింప వేఁడుకొనుచున్నాను."

అది విని బాహురాయణుఁడు చిరునవ్వుతో "ఆర్యా! తమరు లేకున్నచో నేకార్యమును గాఁజాలదు. కావున నాయుత్తరములు గైకొని పర్వతరాజును పంపివేసి పూర్వమువలె మీరు మంత్రిత్వమును నేను సేనాధిపత్యమును వహించి చంద్రగుప్తునిఁ గొల్చుచుండిన బాగుండును".

"ఛీ! ఛీ! ఛీ! బాహురాయణా నందవంశ పక్షపాతియైన యీ రాక్షసున కట్టిమాటలు చెప్పకు. ఎక్కడనుండియో వచ్చిన యీబాలునకా మగధరాజ్యాధికారము? నీనాలుకఁగోసినను బాపమున్నదా? ఛీ! మీరందరును నీచప్రవర్తనులు మీకపట నాటకము నే నెఱుఁగ నను కొంటివారేమి? అయినను మీకుట్రలు కనుఁగొనుట గొంచెమాలస్యమైనది అందుచేతనే మీరందరిట్లు నిర్భయముగ మాటాడఁగల్గిరి. కార్యము మించిపోయినదికదా? ఇంకేమిలాభమున్నది?"

ప్రకరణము. 7.

ఇంకొక సమాచారము.

రాక్షసునకుఁ బ్రత్యుత్తరమిచ్చుట బాహురాయణునకిష్టములేక పోయినను మాటాడ కూరకుండినచోఁ దనపైనిందబడునని యెంచి

"అయ్యా! ఎందుకీమాటలు? ఏమిచెప్పఁ దలఁచితిరో చెప్పుఁడు. దాచిన నేమిలాభమున్నది?"

"బాహురాయణా! నీవు సేనాపతివై చంద్రగుప్తునకు రాజ్యమొసంగుటకే యింతపరకుఁ జేసితివి. మనకు గృహశత్రువులే కాని యితర శత్రువు లెవ్వరును లేరు. మిమ్మందరి నమ్మినందుకు నాకైన శిక్ష బాగా నేయున్నది. నాకింకేమియు నవసరములేదు. మీరందఱు రాజద్రోహులు నీచులు మీమొగములు జూచిన పాపము సంభవించును. పెక్కుసంగతులు చెప్పవలసియున్నవిగాని నేనేయపరాధినని తేలుటచే మాటాడుటకు వీలులేక పోయినది. మీరు గావించు శిక్షకు నేను సిద్ధముగానే యున్నాను. కాని మఱియొకసంగతి నలువురిలోఁ బెట్టి యల్లరిసేయుట ధర్మముగాదు. పౌరులమనస్సు లెప్పటి కెట్లుండునో తెలియదు. మీకెట్లు తోఁచిన నట్లు చేయవచ్చును. ఇంక మీయవసరమును మీసాహాయ్యమును నాకక్కఱలేదు. నన్నుఁ గాపాడుఁడని మిమ్ము బ్రార్థింపను. మీతో నాకింకేమిపని యున్నది? మీరెట్టిశిక్ష విధించినను నేనందుకుఁ బాత్రుఁడనయ్యెదను గాని నందవంశభక్తుఁడనగుట, చంద్రగుప్తుని రాజరికమున కంగీకరించి యాతనిని సేవింతునను మాట కలలోనివార్త."

అని కోపముతో గద్దిచి పలికెను. వానిసాహసమున కాశ్చర్యమెందుచుఁ జంద్రగుప్తుఁడును బాహురాయణుఁడును నేమియు ననకుండ నూరకుండిరి. ఇట్టిసమయములో నెక్కడనుండియో యొకసేవకుఁడు పరుగుపరుగున నచ్చటికివచ్చి బాహురాయణుని చెవిలో నేమియో రహస్యముగఁ జెప్పెను. అదివిని యాతఁడులికిపడి,

"ఏమిరా! ఏమి చెప్పుచున్నావు? రాజఘాతముఁ జేసినవాఁడు దొరకెనా! ఆద్రోహియెవఁడో చెప్పు చెప్పు."

"అయ్యా! ఆఘాతకుఁడు చందనదాసు. అమాత్య రాక్షసునకుఁ బ్రాణస్నేహితుఁడు".

"ఈకార్యమునం దాతఁడెట్లు పనిఁజేసెను. ఆతఁడు అమాత్యశేఖరునకుఁ బ్రాణమిత్రుఁడు కదా!"

అనిపలుక వారిమాటలు విని మంత్రి మిక్కిలి కోపము వహించెను. ఏమి తంత్రము జరిగినదో వానికేమియును తెలియలేదు కాని చందనదాసు మాత్రము చాణక్యునకనుకూలుఁడయ్యెనని గ్రహించి, యన్నియునిట్లువ్యతిరేకముగ జరుగుటచేతనే నందవంశమునిర్మూలము గావలసి వచ్చెనని రాక్షసుఁడూరక విచారింపఁదొడంగెను. సేనాపతి యింకను సేవకునితో రహస్యముగా సంభాషించుచుండెను. అప్పుడే చంద్రగుప్తుఁడు మగలఁ బర్వతరాజును కారాగృహమునకుఁ బంపించి సభముగించుటకు సిద్ధముగనుండెను. వెంటనే సేనాపతి రాక్షసునిఁజూచి "అయ్యా! తమచిత్తవృత్తి మిక్కిలి యుద్భ్రముగనున్నది. తమరింక నెక్కడికిపోయినను పోవచ్చును. ఏమి చేసినను చేయవచ్చును. మాయభ్యంతరములేదు" అని పలుకరాక్షసుఁడు తిరస్కారభావముతో వానికేమియును బ్రత్యుత్తరమీయలేదు. తనకుఁ దెలియకుండ నింతమోసమెట్లు చేసిరోయని తనలో వగచుచు నతఁడు వెంటనే రాజసభవిడిచి బైటకువచ్చి

"ఓహో! సంగతులన్నియు నల్లకల్లోలముగ నున్నవే! నాప్రాణమిత్రుఁడగు చందనదాసు నన్నుఁ జూచుటకు రాకున్నవాఁడేమి? అయ్యో! అతఁడుగూడ వీరి కుట్రలలోఁ బడిన నింకేమియున్నది? అయ్యో! దుర్మార్గులు. వాని కట్టిమోసముఁ జేసియుందురో కదా! ఇప్పుడెచ్చటికి నేను బోవలసియున్నదో తెలియదు. ఏమిచేయఁగలనో అంతకన్నఁ దోపకున్నది. నా భార్యాపుత్రులు చందనదాసింటిలో భద్రముగ నున్నవారు కదా? వారి కేయపాయమును గలుగకుండ మొట్టమొదట వారినిఁ బుట్టినింటిలో దిగపెట్టి వచ్చినచో ఇంక నాకతి యేమైనను విచారములేదు. తరువాతఁ జేయవలసినకార్యము వేరువిధముగ నున్నది. ధననందుని తండ్రియగు మహానందుఁ డింకను వనములోఁ దపముఁ జేసికొనుచున్నవాఁడట. వానినిఁ గలసికొని అన్నిసంగతులును మాటాడి వానిసాహాయ్యమున నుపరాజుల సాహాయ్యమునను, చంద్రగుప్తాదులఁ బోకార్చి, ఆనాఁడే మహానందుని సింహాసనముపైఁ గూర్చుండఁ బెట్టెదను. ఛీ ఛీ! నాకింత యపనింద గల్పించి జనులకు నాపై ద్వేషముఁ బుట్టించి నన్నింత యల్లరిపెట్టిన యీదుర్మార్గులలో నేనింక నుండరాదు. చందనదాసుని నమ్మి నాభార్యాపుత్రులను వాని కప్పగించుట గూడ నాకిష్టము లేకున్నది. ఎంతటి ప్రాణబంధువులైన నమ్ముటకు వీలులేని దుష్కాలము వచ్చినది. ఏయాపదయు సంభవింపక మునుపే మావారిని రక్షింపవలయును. నాకుటుంబమును జాగ్రత్తగ నుంచుకొనినచో నేనొక్కఁడ నెక్కడికిపోయినను ఏమిచేసినను విచారముండదు ముందుసంగతులు తరువాత నాలోచించెదను."

అని తనలో ననుకొనుచు రాక్షసుఁ డెక్కడికో బయలుదేరెను. తన్నుఁ బలుకరించినవారెవరితో మాటాడక, గమ్యస్థాన మేర్పఱచుకొనక, యూరక పట్టణములోనుండి నడచిపోవుచుండుటచే వానినిఁ జూచిన వారందఱు రాక్షసునకు వెఱ్ఱెత్తినదని యనుకొనుచుండిరి. అతఁడట్లు పోయి పోయి కొంతసేపున కొకచిన్నయరణ్యములోఁ బ్రవేశించెను. అప్పటికిని దేనప్రయాణ మాతఁడు మానలేదు. వానిహృదయ మింక నేమేమియో

దూరముగ నాలోచించుచునేయున్నది. అట్టిసమయమున వానిప్రయాణమునకును, వాని కార్యాలోచనమునకును, భంగము గలుగునట్లు లెక్కడనుండియో యాకస్మికముగ "హా! మిత్రమా చందనదాసా! రాక్షసుని కుట్రలలోఁ జేరి నీప్రాణముమీదికే తెచ్చికొంటివా? నాయనా! నిన్ను రాజభటులు బలవంతముగ నురిదీయుచుండ నేనెట్లు భరింపఁగలను? నీయట్టి మిత్రుఁడు నాకింకెట్లు దొరకును? నిన్ను విడిచి నేను బ్రతుకఁజాలను నేనును నీవెంటనే వచ్చెదను" అను రోదన మాతనికి వినంబడెను. ఆధ్వని రాక్షసుఁడు విని భయపడి "అరే! ఈనిర్జనారణ్యమునఁ జందనదాసునిఁగూర్చి యెవఁ డేడ్చుచున్నవాఁడు? వానిని రాజభటు లురిదీసెదరా? ఎందుచేత? నాకుట్రలలోఁబడియా యాఁతడు మోసపోయెను? దీనికి నాకర్థము దెలియకున్నది? వాని నెవరు మోసపుచ్చిరి? ఇప్పుడే అన్నిసంగతులు గనుంగొనెదను" అని యారోదనము వినవచ్చుచుండిన ప్రదేశమునఁ బోయి అచ్చట నొకచెట్టుక్రిందఁబడి యూరక యేడ్చుచుండిన పురుషు నొకనిఁగాంచి వానితో నిట్లు సంభాషించెను.

"ఓరీ నీవెవఁడవు? నీమిత్రుఁడగు చందనదాసు నెవ్వ రెందు కురిదీయుచున్నారో చెప్పు! చెప్పు."

"అయ్యో! నాకన్నులు గానరాకున్నవి. మీరెవ్వరో నే నెఱుఁగను. నన్నేమియును మీరడుగవద్దు. నేనుగూడ నామిత్రునితో నాప్రాణములు విడిచెదను."

"లేదు లేదు. నేనాటంకము జెప్పను. ఒక్కనికే గాదు. చందనదాసు నాకుఁగూడ ప్రాణమిత్రుఁడే. వాని చావునకు నేనుఁగూడ వగచుచున్నాను. అయినను రాజభటులు వానినెందు కురిదీయుచున్నారో చెప్పుము. మన మిరువురమును కలసియే వానివెంటఁ బోవుదము."

"అయ్యో! చందనదాసు మీకుఁగూడ హితుఁడేనా? అయ్యో! పాపమాతనిని రాజభటులు నిష్కారణముగ నురిదీయుచున్నారు. ఒక్కవానినే కాదు. నందవంశ నాశనమునకు రాక్షసుని కుట్రలలోఁ జేరిన వారందరినిఁ జంపివేయుచున్నారు."

"బాగుగానే యున్నది. కాని చందనదాసుపై నేమి దోషమును మోపి యురిదీయుచున్నారో చెప్పు."

అయ్యా ఇంకేమి కావలెను! చందనదాసు గృహమునుండి రాజమార్గమున కొక సొరంగము భూమిలోనుండి త్రవ్వఁబడియున్నది. ఆగోతిలోనేపడి రాజును, అతనిసమీపులును పడిరి. మంత్రి వ్రాసిన యుత్తరముఁ జూచి చందనదాసా! సొరంగమును దనయింటినుండి త్రవ్వుట కంగీకరించెనట"

"మంత్రియే యుత్తరము వ్రాసెనా! ఏమని వ్రాసెను?"

"ఏమని వ్రాసెనా! నా మనుష్యులు కొందఱు నీయింటినుండి యొక సొరంగమును భూమిలోనుండి త్రవ్వెదరుగావున, నీవభ్యంతరముఁ జెప్పక యీ కార్యమునకు శ్రద్ధగా నుండవలయుననియు, రహస్యముగ నుంచవలయుననియు వ్రాసెను. వాని దొంగతనమిప్పుడు బైటఁబడినందున రాజశాసనానుసారముగ వానికురి శిక్ష విధింపఁబడినది."

"ఏమి విచిత్రము? మంత్రి యిట్టి యుత్తరము వ్రాసియుండునా? ఆహా! ఎన్ని కల్లజాబులు? ఎన్నితంత్రములు? పాటలీపుత్ర మంతయుఁ జాణక్యుఁ డింద్రజాలమయ మొనర్చెనుకాఁబోలు? హా! చందనదాసా! అట్టి దొంగజాబును నీవెందుకు విశ్వసించితివి? వెంటనేవచ్చి నన్ను నడుగలేక పోయితివా? ఓ,యీ తరువాత తరువాత?" "అయ్యా! తరువాతఁ జందనదాసు తానీ నేరమెట్లు తప్పించుకొనవలయునోయని విచారించుచుండ నాకస్మికముగ వానిపై మరియొక నేరము మోపఁబడెను."

"అదేమి? అదేమి? చెప్పు! చెప్పు."

"మరణశిక్షకాతఁడు భయపడి మంత్రితో మొఱపెట్టుకొనవలయునని యాతనికై వెదకుచుండ వానినిఁ బట్టించి రాక్షసుని భార్యాపుత్రులెక్కడనున్నారో కొనివచ్చి తనకప్పఁజెప్పవలయునని చంద్రగుప్తుఁడు వానిని నిర్బంధింపసాగెను. కాని చందనదాసు, తనప్రాణమిత్రుఁ డగు మంత్రికుటుంబమును చేతులార శత్రువులకప్పగించుట యిష్టములేక తానేసంగతియుఁ జెప్పనని భీష్మించెను మంత్రిసంసార మెక్కడనున్నదో చూపినచో నీకీమరణశిక్షఁ దప్పించెదమనియు, లేకున్న నురిదీయింపక మానమనియు వారెంతబోధించినను, ఆతఁడు వినలేదు. అందుచే రాజభటులిప్పుడు వాని నీచెంతనుగల శ్మశానమునకుఁ గొనివచ్చిరి. చంపుదురో చంపివేసిరో తెలియదు"

అదివిని రాక్షసుఁడు మిక్కిలి వగచి, వానిచేయిఁ బట్టుకొని
"ఓరీ! నీవు భయపడకు నీపేరేమి?"

"నాపేరు శకటదాసు."

"మంత్రికుటుంబ మాతఁ డెచ్చటదాచెనో నీవెఱుఁగుదువా?"

"అయ్యా! నేనెఱుఁగుదునుగాని చెప్పను. చెప్పవలదని నామిత్రుఁడు నాకుఁ గఠినముగ నాజ్ఞాపించెను. లేకున్నచో నారహస్యముఁ జంద్రగుప్తున కెఱింగించి వాని ప్రాణములు గాపాడలేక పోవుదునా? అయ్యో! మంత్రి మాకెంతద్రోహముఁ జేసెను? ఎక్కడ దాగియుండెనో కానరాఁడు."

"శకటదాసా! విచారింపకుము. నీవాత్మహత్యఁ జేసికొననవసరములేదు. చందనదాసువద్దకు నన్నుఁ గొనిపొమ్ము. ఏరాక్షసునికొఱకు దన ప్రాణముల నాతఁడు విడువనున్నాడో ఆరాక్షసుఁడను నేనే! ఇంకఁ బోదమురా."

ప్రకరణము. 8.

ప్రతిజ్ఞాభంగమా? మిత్రభంగమా?

మంత్రి తానే రాక్షసుఁడని చెప్పినతరువాత శకటదాసు తనకు మిక్కిలి యాశ్చర్యము జనించినట్లు నటింపఁజొచ్చెను. రాజవంశము నాశనమైనందున రాక్షసుఁ డిక్కడనుండుట కిష్టపడకున్నవాఁడని శకటదాసు గూడ నెఱుఁగును. కాని వానిగురించి తనకేమియుఁ దెలియనట్టులే నటించుచు రాక్షసునిఁజూచి "అయ్యా! తమరు నిజముగ మంత్రియే యైనచో నిప్పుడే చందనదాసును జూపెదను. అయ్యో! మనము పోవుసరి కాతఁడు బ్రతికియుండిన బాగుండును. లేకున్నచో నాకుఁ గూడ మరణము దప్పదు. ఇంక మాభారమంతయుఁ దమదే! తమరేమి చేసినను చేయుఁడు" అని యేడ్చుచు మంత్రినిఁ దిన్నఁగ గంగాతీరమునకుఁ గొనిపోయెను. అచ్చట నొక ప్రదేశమునఁ జందనదాసు నురిఁదీయుటకు ఏర్పాటు చేయఁబడెను. చందనదాసున కొడలెల్లఁ జేగురుఁబూసి యెఱ్ఱనిబట్టలుగట్టి తలారులు వానిని ఉరికొయ్యలదగ్గర నిలువఁబెట్టియుంచిరి. అతనిభార్యయు, నేడెనిమిదేండ్ల ప్రాయముఁగల ఒక కుమారుఁడును, ఏడ్చుచు వానిచెంతనే యుండిరి. ఆబాలుఁడు తనతల్లి యేడ్చుచున్నందునఁ దానుఁగూడ నేడ్చుచుండెనుకాని, కారణముమాత్రము వానికిఁ దెలియలేదు. మాటిమాటికతఁడు తల్లిని పిల్చుచు "అమ్మా! బాబయ్యగా రెక్కడకి పోయెదరో చెప్పు! మని పీడించుచుండెను. కుమారుని యవస్థఁ జూచిన పాపము చందనదాసు భార్య మరింత ఘొల్లున రోదనము సేయుచుండెను. తాను గతించినచోఁ దనభార్యా పుత్రుల గతియేమగునోయని చందనదాసు యేడ్పునకు మితియే లేకుండెను. ఆ ప్రదేశమంతయు మొత్తము మీద

రోదనధ్వనులతో నిండియుండెను. భీకరాకారులై ఖడ్గపాణులైన తలారులు మాటిమాటికిని చందనదాసును భయపెట్టుచు "చందనదాస్! నిష్కారణముగ నెందుకు జచ్చెదవు? ఒక్కమాటఁ జెప్పినచో నీ కీకఠిన మరణదండన దప్పునుగదా? కావున నింకమూర్ఖపుపట్టు విడిచి మంత్రి కుటుంబ మెక్కడదాచితివో చెప్పి నీప్రాణములను దక్కించుకొనుము. చంద్రగుప్తుఁడు దయాశీలుఁడు. వాని భార్యాపుత్రుల కెట్టి యాపద రానీయఁడు. వాని నెట్టులైనఁ దనకు మంత్రిగాఁ జేసికొనవలయుననియే వాని ప్రయత్నము. మామాట విని ఇంకఁ జెప్పుము." అని యెన్నివిధముల బోధించినను వినక చందనదాసు "ఛీ! ఛీ! మీవలె నేను స్వామిద్రోహముఁ జేసెద ననుకొంటిరా? జాగ్రత్తగఁ గాపాడవలయునని మంత్రి వానికుటుంబమును నా కప్పఁజెప్పఁ జేతులార నితరులకెట్లు దక్కింపఁగలను? వాని భార్యాపుత్రాదుల నెచ్చట దాచితినో నాప్రాణముండునంతవర కెవ్వరికి నెఱింగింపను" అని ధైర్యముతో వారికిఁ బ్రత్యుత్తర మిచ్చుచుండెను.

మీద వివరించిన సంగతులన్నియుఁ గనిపెట్టిన తరువాత, రాక్షసుని మనసు ఎంతయో సంతాప మొందుచుండెను. ప్రాణమిత్రుఁడై తనయెడ నింత విశ్వాసము వహించిన చందనదాసు తనకారణముననే నిష్కారణముగఁ జావనున్నాడుకదాయని విచారించి మెల్లఁగఁ దలారుల యొద్దకుఁ బోయి, "అరే తలారులారా! ఎవ్వని భార్యా పుత్రులకొఱకు చందనదాసును మీరు చంపనెంచితిరో, ఆమంత్రియే వీఁడు? వానిని విడిచిపెట్టి నన్నుఁ దెగటార్పుఁడు. నేను సిద్ధముగనున్నాను. నావలెనే యీతఁడు గూడ దుష్టులగు చాణక్య చంద్రగుప్తుల వలలోఁజిక్కెను. వారి మోసము నీతఁడు కనుఁగొనఁ జాలకపోయెను. అంతియకాని పాపమీతఁ డెట్టి యపరాధముఁ జేసి యెఱుఁగఁడు" అని పలుక తలారులు గొంచెము దూరముగ నిలిచి,

"అయ్యా! మావలన నేమియునుగాదు. మంత్రి కుటుంబము నెక్కడదాచెనో ఆప్రదేశమును జూపినఁగాని వీని విడువవలదని చంద్ర

గుప్తమహారాజుగారు మాకాజ్ఞాపించియున్నారు. మేమేమిచేసెదము?" అని చందనదాసుని జూచి "ఓయీ చందనదాస్! నీకుఁ బ్రాణములపై నాశ లేదా? ఇంకనైన మామాటవిని ఎక్కడ దాచితివో చెప్పుము నిన్నిప్పుడే విడిచెదము" అని పలుక చందనదాసు వారిమాటలు లక్షింపక యమాత్యునిఁ జూచి విచారముతో,

"ప్రాణమిత్రా! నిశ్చయముగఁ దమ యాజ్ఞయైన దనుకొని యా కపటలేఖనుజూచి మోసమని గ్రహింపనేరక నాయింటనుండి సారంగమును ద్రవ్వించుట కంగీకరించితిని. తరువాత మిమ్ముఁ గలిసికొని మాటాడగలయునని యనుకొంటిని గాని నాబుద్ధి నన్నువిడిచిపోయినది. నాకన్నులకుఁ జీకటి గప్పినది. నన్ను బ్రతికించుటకు మీరు శ్రమపడవలదు. తమరు నాదగ్గరకు వచ్చినచోఁ దమకుటుంబ మెక్కడనుంచితిరో రహస్యముగ నెఱింగించెదను. నావిషయమై మీరేమియును బ్రయత్నింపకుఁడు. మీకుఁ గూడ నాపద రాఁగలదు. మొదటనే తమ దగ్గరకువచ్చి మాటాడియుండినచో నింతవరకు రాకపోను. నేను కేవలము మూర్ఖుఁడనైతిని. మిమ్ము నడుగకుండ సారంగమును ద్రవ్వించి నేను రాజద్రోహిని కావలసివచ్చినది. ఏమిచేయఁగలను?"

రాక్షసుఁడు వానిమాటలు విని మిత్రప్రాణరక్షణము కన్నఁ దన కింకఁ గర్తవ్యమేమియు లేదని యెంచి తన యితరవిచారము లన్నియు విడిచి,

"చందనదాస్! గడచిన సంగతులతో నిప్పుడేమిపని యున్నది. నీప్రాణమున కెంతమాత్రమును భయములేదు. కాని నేను చెప్పినట్లు నీవు చేయవలెను. నాకుటుంబము నెక్కడ దాచితివో చంద్రగుప్తున కెఱింగింపుము. నాభార్యాపుత్రుల నాతఁడేమిచేయ సాహసించునో చూచెదను. తలారులారా! వానినింక విడువుఁడు. ఆప్రదేశమిప్పుడే చూపుచున్నారము."

అందుకుఁ దలారులు

"అయ్యా! రాజాజ్ఞ యెట్లో అట్లేచేసెదము. వారి సెలవుఁబొందకుండ నెట్లు విడువనగును."

"సరే! చంద్రగుప్తుఁ డెక్కడ నున్నవాఁడు? నే నిప్పుడే పోయి వాని సెలవుఁగొని వచ్చెదను."

"అందు కభ్యంతరమేమి? అమాత్యరాజా!"

"ఛీ! యెందుకురా? నామంత్రిత్వము? నేను కేవలము గ్రుడ్డివాఁడనైతిని. హా! కైలాసనాథా! యెన్నికష్టములు దెచ్చిపెట్టితివి."

అని వగచుచు రాక్షసుఁడు బయలుదేరుటకు సిద్ధముగ నుండెను. భార్యాపుత్రు లేమైనను లక్షింపక తనమిత్రుని ప్రాణములు రక్షించుటయందు మిక్కిలి దీక్షవహించి తనకుటుంబమును దానే చంద్రగుప్తున కప్పగించి వానియొద్దనుండి సెలవుఁగైకొని రావలయునని నిశ్చయించుకొని మఱియొకసారి తలారులను జూచి "తలారులారా! మీరుమాత్రము నాకొకయుపకారమును జేయవలసియున్నది. నే నాజ్ఞఁగైకొని వచ్చినదాక చందనదాసునుమాత్రము మీరు చంపవలదు. నే నిప్పుడే వచ్చెదను" అని చెప్పి వారి నొప్పించి, శకటదాసుతో "శకటదాస్! ఇదివరకుఁ జెప్పిన ప్రకారము నేను చందనదాసు ప్రాణములు రక్షించెదను నీవింక విచారింపకుము. నే నిప్పుడే నాభార్యాపుత్రులను చంద్రగుప్తున కప్పగించెదను. నీవు కూడ నావెనువెంట రమ్ము" అని పలుక శకటదాసు "అమాత్యరాజా! ఇంతకన్న నాకు సంతోషమేమున్నది? కాని దేవా! తమరా చంద్రగుప్తుని "చంద్రగుప్తా" యని యనక "చంద్రగుప్త మహారాజా!" అని పిలువవలసియుండును. లేకున్నచో నాతఁడు క్షమింపఁడు. పిదప దేవరచిత్తము" అని వేడుకొనెను. అది విని రాక్షసుఁడసహ్యముతో ఛీ! ఛీ! నాజిహ్వ కోసినను అట్టిమాట నానోటనుండిరాదు. అంత పేరునకాతఁడు తగఁడు"

అని నిర్లక్ష్యముగఁ బలికెను. అప్పుడు చందనదాసుభార్య ఘొల్లున రోదనము సేయుచువచ్చి తన కుమారుని రాక్షసుని పాదములపైఁ బడవైచి తానుఁగూడ సాష్టాంగపడి "నాయనా! అమాత్యరాజా! రక్షింపుము. రక్షింపుము. నీకుఁ జెల్లెలువంటి దానను నాకుఁ బతిభిక్ష పెట్టుము. తండ్రీ! నాకింకెవ్వరును దిక్కులేరు. నాపతి గతించినచో నాకుమారుతో నేనుగూడ నీకన్నులయెదుటనే యీగంగానదిలోఁబడి ప్రాణములు విడిచెదను. చంద్రగుప్తుని రాచరికము నీకిష్టములేక పోయినను మమ్ముఁగాపాడుటకైన నాతనిని మహారాజా! యని పిలువుము. లేకున్నచో నాతఁడు మమ్ము క్షమింపఁడు."

అని రోదనము సేయుచు బ్రతిమాలఁ జొచ్చెను. అప్పుడు శకటదాసు మరల రాక్షసునిఁ జూచి,

"అమాత్యరాజా! తమకోపమును జాలింపుఁడు. దురాగ్రహమెప్పుడును శ్రేయస్కరముగాదు. అట్లు పిలుచుటకు మీకిష్టమే లేనిచో చందనదాసు మరణమునకు వగచుటెందుకు? మీరూరకుండుఁడు? మేమందఱముఁగూడ వానితోఁ బ్రాణములు విడిచెదము."

"ఛీ. ఆమాటలు నాయెదట ననకు."

"అందుకు నిష్టములేక యిందుకు నిష్టములేనిచోఁ గార్యమెట్లు జరుగును?"

అని యింక నేమేమో మాటాడుచుండ నింతలో "జయజయ చంద్రగుప్తమహారాజా!" అను శబ్దములు వినవచ్చెను. వెంటనే చంద్రగుప్తుఁడును బాహురాయణుఁడు మొదలు కొందరు వచ్చి రాక్షసునియెదుట నిలువఁబడిరి. రాక్షసుఁడు చంద్రగుప్తుని మొగముఁజూడక మాఱుమొగ మిడికొనెను. చంద్రగుప్తుఁ డది కనిపట్టి వానితో నేమియు మాటాడక తలారులను జూచి,

"ఓమూర్ఖులారా! ఈరాజద్రోహినిఁ గడతేర్పక యింకనేల యాలస్యముఁ జేయుచున్నారు? సత్వరముగ నాకన్నులయెదుటనే మీరీకార్యమును నెరవేర్పుఁడు" అనఁ దలారులు "మహారాజా! క్షమింపుఁడు. మాకార్యమునందు మేమప్రమత్తులమై యుండ మంత్రిగారువచ్చి ఆటంకపఱచి తమయొద్దనుండి సెలవుఁగైకొని యిప్పుడే వచ్చెదనని చెప్పినారు? ఇంతలోఁ దమరే దయచేసితిరి."

అది విని చంద్రగుప్తుఁడు,

"ఓహో! అమాత్యశేఖరా! తమరిక్కడనే యున్నారా?"

"ఔను నేనిక్కడనే యున్నాను. నాభార్యను బిడ్డలను మీకు స్వాధీనముఁ జేసెదను. నేనుఁగూడ స్వాధీనమయ్యెదను. నీవీ చందనదాసునింక విడిపింపుము."

"ఏమనెదరు! చందనదాసును విడువుమనియా? ఇట్టి క్షమాపణములు మ్లేచ్ఛరాజునకుఁదప్ప మాకుఁ జేతకావు. వీఁడు పర్వతరాజుతో నేకీభవించి, తనయింటనుండి రాజమార్గమున కొక సొరంగముఁ ద్రవ్వినాడు. పర్వతేశ్వరునివలెనే యీతఁడుగూడ మీపేరే చెప్పుచున్నాడు. ఎట్లు విడువఁగలము? కాని తమకుమాత్ర మిందెట్టి కర్మము నెఱుఁగరని మేము మొదటనే చెప్పితిమి కదా? నిష్కారణముగ మీపేరుచెప్పి మిమ్ము మోసపుచ్చినట్లు వీఁడు మీకుటుంబమునుగూడ నేమిచేయునో యను ననుమానమును వహించి వీని నిట్లు నిర్బంధించుచున్నారముగాని మఱియొకటికాదు. ఆతఁ డెక్కడ దాచెనో యింకను చెప్పకున్నవాఁడు."

"ఛీ! ఛీ! అతఁడట్టివాఁడు కాడు. చందనదాసు స్వామిభక్తుఁడు. వానికా దొంగయుత్తరమున నాముద్ర వైచి యెవరో పంపియుందురు కావున నామనవి వినుఁడు."

"అమాత్యరాజా! మనవికాదు. నాకిదియాజ్ఞ."

ఇంతలో సేనాపతికూడ ముందునకువచ్చి మంత్రితో

"అయ్యా! తమరుపక్షాభిమానమును విడిచి రాజ్యభారమును మరల వహింపుఁడు. మేమీచందనదాసును విడచెదము."

"బాహురాయణా! ఎన్నిమారు లడిగెదవు! ఒకమారు చెప్పినఁ జాలదా? నాప్రతిజ్ఞ యేమో యెఱుంగుదువా? అందునకు భంగమను మాట కలలోనివార్త సుమీ."

"అట్లయినఁ జందనదాసుని చంపకుండ విడచుటగూడఁ గలలోని వార్తయే"

ఆమాటలువిని చందనదాసు వానిభార్యయుఁ గుమారుడు నొక్కమారుగ మరల రోదన మారంభించి రాక్షని పాదములపైఁబడిరి.

ప్రకరణము. 9.

రాక్షసుని నిశ్చయము.

తనపైఁబడి వారందరు రోదనముసేయుచున్నందునఁ బాపము రాక్షసునకుఁగూడ దుఃఖము జనించినది. చందనదాసు నెట్లయిన బ్రదికించెదనని శకటదాసునకు మాటయిచ్చెనుగాని, రాక్షసునకిప్పుడు సందేహము గలిగినది. అందుకేమి యుపాయమును వానికిఁ దోపలేదు. బాహురాయణుని

యుద్దేశముఁజూడ వేరువిధముగ నున్నదికదా? అందుకు రాక్షసునకెంత మాత్రము నిష్టములేదు. చంద్రగుప్తుని మహారాజని పిలిచినఁగాని చందనదాసునకు మరణముఁ దప్పదు. ఒక్కచందనదాసునకే కాదు. వానిచావు వాని భార్యాపుత్రుల మరణమునకును, శకటదాసు మరణమునకును గూడ గారణమగునని రాక్షసుఁ డెఱుంగును.

"అయ్యో! నానుండి యెందరిప్రాణములకు భంగము గలుగుచున్నది. చేతులార వీరందరినిఁ జంపుకొందునా? లేక చంద్రగుప్తుఁడు మహారాజని యంగీకరింతునా? ఇదివరకుఁ జేసినప్రతిజ్ఞ రద్దుఁజేసి, చంద్రగుప్తుని సేవ కంగీకరించిన నాకేమి లాభమున్నది? ఇంతమాత్రమున జనులకు నాపైఁగల ద్రోహచింత తప్పిపోవునా? వారునన్ను నమ్మెదరా? రావలసినయపకీర్తి యెట్లులును వచ్చినది. నందవంశమంతటిని నేనే నశింపఁజేసితినని జనులు దృఢముగ నమ్మియున్నవారు. ఇట్టిస్థితియందుండి నామిత్రుని ప్రాణములకొఱకు నేనానీచుని ఎట్లు సేవింతును? ఇంతకన్న నధర్మమున్నదా? మేకలను దెగఁగోసినట్లు నందులనందఱి నీమందబుద్ధులు ఖండించిరికదా? ఎంత ఘోరమెంతఘోరము! అట్టి కఠినచిత్తులకుఁ జందనదాసునిఁ జంపుటయన్న నేపాటికార్యము? గుడి మ్రింగినవానికి గుడిలోని లింగమొక లెక్కయా? ఇంక నామిత్రుని బ్రతికించుటకు రెండవయుపాయ మేమియును లేదు. ఇష్టమైనయెడల బాహురాయణుఁడు చెప్పినట్లు చేసి తీరవలయును. అట్లు చేసినఁగాని చందనదాసు కష్టములు గట్టెక్కవు వానికొఱకు నాప్రతిజ్ఞాభంగముఁ జేసికొనవలసియున్నది. కావున ప్రతిజ్ఞాభంగమా? లేక మిత్రభంగమా? ఈరెండింటియందు పెద్దదాని నాచరింపవలయును? ఛీ! కొండంత ప్రతిజ్ఞాభంగముఁ జేసికొని చండాలుర నెట్లు సేవింతును? వలదు వలదు లోకములు తల్లక్రిందగుఁగాక. దివాకరనిశాకరబింబములు రెండును మార్గములు దప్పునుగాక. ఇంక నెట్టి యుపద్రవమైన సంభవించునుగాక. కంఠమందూపిరియుండునంతదాక రాక్షసుఁడు తాను చేసిన ప్రతిజ్ఞాభంగముఁ జేసికొనునా? ఒక్కచందనదాసే కాదు. ఒక్కశకటదాసే కాదు. వాని భార్యాపుత్రులును,

వీనిభార్యాపుత్రులును, కడకీ పాటలీపుత్రమునఁగల జనులందఱు, నీగంగానదిలోఁబడి చచ్చినను నాప్రతిజ్ఞ నేను విడువను. తెల్పినది తెలిసినది. రాజనీతికోవిదుండనియు, సకలకలావిశారదుండనియు, ధర్మమార్గానువర్తియనియు, న్యాయైకశీలుఁడనియు దేశదేశంబులయం దెల్లవారిచే విఖ్యాతిఁగాంచిన చండశాసనుండగు నీరాక్షసుని వశపఱచుకొనుటకా వీరి ప్రయత్నము?

అని మండిపడుచు, క్రోధారుణితలోచనుండై యొడలుమఱచి,

“ఓరోరిమూర్ఖా! చందనదాసా! నీమృత్యువును దప్పించుటకు నాకిప్పుడు వీలులేదు. నీయొక్కని ప్రాణములను గాపాడుటకై నేనీనీచులనాశ్రయించి సేవింపఁ జాలను. ప్రాణమిత్రుఁడవగుట నాకపకీర్తివచ్చిన నీకుఁగూడ వచ్చినట్లే! నేడు తప్పినను మరియొకప్పుడైన నీకుఁ జావుతప్పదు. నిక్కమైన స్వామిభక్తుఁడవేయైనచో, నీకు స్వామినైన నాకొఱకు నీప్రాణములను వీరికర్పింపుము. నేనుఁగూడ నీభార్యాపుత్రుల వెంటఁబెట్టుకొని నీవెనువెంటనే వచ్చుచున్నాను. మనమందరమును వీరస్వర్గమునఁ గలసికొందము. ఇంతకాలమునుండి నేను నందవంశమును సేవించుచుండినను నేనింకను ఋణవిముక్తుఁడను కాలేను. ఆవంశమునుగూర్చి నేనింకను పాటుఁబడవలసియున్నది. అరటిచెట్లు ఛేదించినట్లు ఛేదించి నందవంశము నింతహీనదశకుఁ దెచ్చిన యీదుర్మార్గులను, స్వామిద్రోహులను, చండాలురను నేనెట్లు పరిభవించెదనో చూచుటకు నీకదృష్టములేదు. పో పో! ఇతరవిచారములు విడిచి కైలాసనాథుని స్మరించుకొనుము. కన్నులుండియు గ్రుడ్డివాఁడవై రాజద్రోహుల మోసమునఁ జిక్కినందుకు నీకీశిక్ష కావలసినదే!”

అనిధారాళముగఁబలికెను. అప్పుడు రాక్షసుఁడు నిక్కమైనరాక్షసునివలెనే యందరికినిదోఁచెను. వాని భయంకరాకారములను జూచి చంద్రగుప్తుఁడును బాహురాయణుఁడును మాఱు మాటాడలేక పోయిరి. పాపమువారి యుద్దేశము నెరవేరినదికాదు. ఇంకమంత్రిని వశపఱచుకొనుట

తమకసాధ్యమని వారునిశ్చయించుకొనిరి. చాణక్యుని ప్రయత్నములన్నియు నీవిషయమున వ్యర్థములైనవి. యెన్నిప్రయత్నములు జేసినను ఒకటియైనఁ గొనసాగదయ్యె. రాక్షసుఁడు గాని పాటలీపుత్రమును విడిచి యావలకుఁ బోయెనా చంద్రగుప్తుడొక్క క్షణమైన గద్దెపైగూర్చుండలేడు. కావున వానినెందును బోనీయకుండ జాణక్యుఁడేర్పాటుచేసెను. అమాత్యరాక్షసుఁడేకమార్గప్రవర్తియనియు, సత్యనిష్ఠాపరుఁడనియు, లోకములు తల్లక్రిందైనను ఆడినమాట తప్పఁడనియుఁ, జాణక్యుఁడు పూర్ణముగ గ్రహించెను. మగధరాజ్యము యొక్క ముఖ్యప్రాణము రాక్షసునియరచేతియందే యుండెను. చంద్రగుప్తున కొకరాక్షసుఁడు తోడుగనుండినఁ జాలును. తానింక మగధరాజ్యమున నుండనవసరములేదని చాణక్యుని నమ్మకము. కానిరాక్షసుని మెడవంచుట కెన్నిగతులఁ బ్రయత్నించినను కార్యములేకపోయినది. తుట్టతుదకుఁ జాణక్యుఁడు గల్పించిన చందనదాసునిమరణముగూడ వానికి లక్ష్యములేకపోయినది. ఇంకేమిచేయవలెను ?

చంద్రగుప్తుఁడు తనకింకనేమి యుపాయమును దోపనందున వెంటనే తలారులను కనుసంజ్ఞలనూరకుండుఁడనియాజ్ఞాపించి చందనదాసుని విడిపించి” ఓయీచందనదాస్ అమాత్యరాక్షసుని యనుగ్రహమున నీవు బ్రతికితివి. పో! నిన్నుక్షమించితిమి. కాని మారాజ్యమునం దింకమీద నీవుండఁగూడదు. మేము పిలిచినప్పుడు నీవురావచ్చును. పాటలీపుత్రమును విడిచి నీవు దూరముగఁబొమ్ము” అని వానిని విడిపించెను. తోడనేచందనదా సమంతానందమొంది, రాక్షసుని పాదములపైఁబడి” మహాత్మా! మీయనుగ్రహమున నాచావుదప్పినది మూర్ఖుఁడనైమీతో స్వయముగ నాలోచింపక ఆకపట యుత్తరమును నమ్మికొనినందున నింతఘోరము జరిగినది. తమరింకఁగరుణించి మాయింటికి దయచేయవలెను. తమభార్యతమకొంతయో విచారించుచుండెను.” అని చెప్పి వెంటనే వానినిఁ గొనిపోవుచుండెను. చంద్రగుప్తుఁడును, రాక్షసుఁడు పాటలీపుత్రము నెప్పుడు విడిచి

పోవునోయని వానిప్రవర్తనమునుఁ గనుగొనుచుండుటకై కొందరు గుప్తసేవకుల నియమించెను.

ఆనాటినుండియుఁ జందనదాసునకును రాక్షసునకును మైత్రి మరింత యధికమయ్యెను. చందనదాసు గృహమునఁ బ్రవేశించిన తరువాత, సావకాశముగఁ గూర్చుండి జరిగినకుట్రలన్నింటినిఁగూర్చి రాక్షసుఁడు జాగ్రత్తగా నాలోచింపఁ దొడంగెను. తానపరాధియని కావలసినన్ని నిదర్శనములతో స్థిరపడినను, తన్నేమియును జేయఁజాలక విడిచిపెట్టినందున, చంద్రగుప్తుఁడును బాహురాయణుఁడును ధైర్యహీనులని వానికిఁదోచెను.

“నేనింక పాటలీపుత్రము నింతలో విడువరాదు. ఇక్కడనే యుండి సంగతులన్నియు సావకాశముగ గనుఁగొనుచుఁ దగినప్రయత్నములను జేయుచుండవలెను. ఈయపకీర్తిఁ బాపుకొనకయే నేను బయలుదేరితినేని, నాకెక్కడకి బోయినను గౌరవముండదు. జనులు నన్ను మరింతచులకన జేసి హేళన మొనర్చెదరు. ఆలోచింపవలసిన విషయము లనేకము లున్నవి. అందు మొదటిది. నాకుఁ దెలియకుండ నా కన్నులలో మన్నుఁ గొట్టి, యిట్టి భయంకరకృత్యములను జేసిన వాఁడెవఁడు? ఆసంగతి విచారింపవలయును. రెండవది పర్వతరాజు జూపిన యుత్తరములో నాముద్ర యెట్లున్నది? ఒకవేళ హిరణ్యగుప్తుఁడు నాముద్ర నెవరికైన నిచ్చియుండునా? లేనియెడల వానికెట్లు లభించును? హిరణ్యగుప్తుఁ డట్టివాఁడు కాఁడే? ఒకవేళ నామందబుద్ధి నాముద్ర నెక్కడనైన మఱచియుండవచ్చును. అప్పుడు దాని నెవరో అపహరించియుందురు. అపహరించినవారు దాని యవసరముఁగోరి అందుకొరకుఁ బ్రయత్నించుచుండిన వారే? లేకున్నచో నితరులకు నాముద్రతో నేమి యవసరమున్నది? ఇన్ని దారుణకృత్యములు రహస్యముగఁ జేసినవారు నాముద్రనుమాత్రము సంపాదింపలేరా? ఆముద్రయే పర్వతేశ్వరునిఁ దెప్పించినది. ఇందుకు సందేహములేదు. ముద్రకావలసిన వారికి హిరణ్యగుప్తుఁడు వశమైనఁ గావలయును. లేదా

వారు దొంగలించియైన యుండవలెను. ఈరెండువిధములలో నేదో యొక విధముచే వారు నాముద్రను సంపాదింపఁగలిగిరి. నాముద్ర యెల్లప్పుడును హిరణ్యగుప్తుని వద్దనే కదా యుండుచుండెను? వానివలననే అది యితరులకుఁ జేరినది. అయినను హిరణ్యగుప్తుఁడే యిట్టికార్యమును జేసినచో నాకుఁ దెలియకుండునా? నాముద్రఁ గావలసినవారు హిరణ్యగుప్తునకు ధనమోహమో స్త్రీమోహమో కల్పించియుందురు. వానికి స్త్రీమోహ మెక్కుడిది! ....శబాస్! తెలిసినది? ఇది నేను మొదట ననుకొనినదే కాని క్రొత్తదికాదు. కడకట్టులే జరిగినది. నేను నమ్ముకొనిన దుష్టదాసియైన యాసుమతియే యింతవరకుఁ జేసినది! దానినిఁబట్టియే యీకపట నాటకమంతయు జరిగినది. ఆమె మోహమే హిరణ్యగుప్తుని మోసపఱచి వశముఁ జేసికొనెను. అని ఆలోచించి రాక్షసుఁడు చాణక్యుని రహస్యము నిన్నాళ్లకుఁ గనుఁగొనఁ గలిగెను.

ప్రకరణము. 10.

చాణక్యుని విచారము.

“ఎంతచిత్రకథ? ఈకథనంతయుఁ జమత్కారముగ నొకగ్రంథరూపమున వ్రాసిన బాగుండును? వ్రాసి? యాగ్రంథమున కేమిపేరు పెట్టవలయును? చాణక్య విజయమా? లేక చంద్రగుప్త విజయమా! కథా నాయకుఁడు చంద్రగుప్తుఁడే యైనను కష్టముమాత్రము చాణక్యునదే కాదా? చాణక్యుఁ డెంతకష్టపడినను కథానాయకుఁడు చంద్రగుప్తుఁడే కావున, జంద్ర

గుప్త విజయమను పేరే సరిగానున్నది. సరే గ్రంథము తరువాత వ్రాయ
వచ్చునుగాని విజయ మీ సరికి చాణక్య చంద్రగుప్తులలో నెవ్వరికిని లేదు
కదా? రాక్షసుఁడు వశుఁడైనచో నప్పుడే చంద్రగుప్తునకు విజయము!
ఎన్ని విధముల బ్రయత్నించినను అతఁడు నాకు వశ్యముగాకున్నవాఁడు. వాని
సత్యనిష్ఠయు, వాని నందవంశభక్తియే నా ప్రయత్నములు భంగమగుటకుఁ
గారణములు! ఎన్ని విధముల యత్నింపవలయునో అన్ని విధముల యత్నించి
తిని. కాని కార్యము లేకపోయినది. ఇంక ముందేమి చేయవలయును?
మొట్టమొదటఁ బాటలీపుత్రమును దాటి వాని నావలకుఁ బోకుండఁ జేయ
వలయును. అట్లు చేయకున్నఁ జంద్రగుప్తున కెట్టి యాపదయైన రావచ్చును
సందేహములేదు. చంద్రగుప్తు నెట్టులైన మోసపుచ్చి పారఁదోలి యెక్క
డనో యరణ్య మధ్యమునఁ దపోనియతియందున్న మహానందునిఁ గొనివచ్చి
వానిని సింహాసనముపైఁ గూర్చుండఁ బెట్టవలయునని రాక్షసుని యుద్దేశము
కావున నందవంశము నాశనముఁ జేయుటకు నే నెంతఘోరముఁ జేసితినో
మౌర్యవంశమును నాశనముఁ జేయుటకాతఁ డంతఘోరము జేయకమానఁడు
కాఁబట్టి యిందు కేదైన నుపాయము నాలోచించి త్వరపడవలయును.
ప్రస్తుతము రాక్షసుఁడపకీర్తిపాలై యున్నవాఁడు కదా? కార్యసాధనమునకై
రాక్షసునకును బాహురాయణునకును మొకటవైరముఁ గల్గించితినిగాని యిప్పు
డట్టి వైరమెంతమాత్రమును పనికిరాదు. మరల వారిరువురకును మైత్రిఁ గలప
వలసియున్నది. ఎట్లు కలుపవలయును? ఏమిచిత్రమో కాని దేనినిఁ గూర్చి
ప్రయత్నించినను రాక్షసునెడ నన్నియు విఫలములగుచున్నవి. వాని మన
స్సునెట్లు ద్రిప్పవలయునో తెలియకున్నది? ఇందుకుఁ బెద్దయాటంకము
చంద్రగుప్తుఁడు హీనవంశజుఁడని రాక్షసున కనుమానము పుట్టుటయే!
ఇంతియకాక నందవంశ నాశమునందు చంద్రగుప్తుఁడుగూడఁ బనిజేసెనని
యాతఁడెఱుంగును అందుచేతనే చంద్రగుప్తుఁ డన్న వానికంత తలదిమ్ము!
అట్టివానికిఁ జంద్రగుప్తు నప్పుఁజెప్పి నేనెట్లు పోఁగలను? వానిపైఁగల మః
ఖముచే రాక్షసుఁ డేమిచేయునో? పర్వతేశ్వరుని కుమారుఁడగు మలయ

కేతుఁ డొకడున్నవాఁడు కదా? చంద్రగుప్తుని జయించుట వానికొక్కనికే
శక్యముకాదు; కాని రాక్షసుఁడు మాత్రము వానికి సాహాయ్యము చేయ
కుండునా? మగధరాజ్యమునుగూర్చి యింకను పెక్కుచిక్కులున్నవి. కాని
చంద్రగుప్తుని సింహాసనముపైఁ గూర్చుండఁబెట్టిన తరువాత వానినన్నింటిని
తెగగొట్టక తీరదు. ఔను ఎన్నాళ్లీ కార్యాలోచన? జపతపాదుల నన్నిం
టిని విడిచి, ఎంతకాల మిట్లు పాటలీపుత్రమున నేనుండఁగలను? ఏదియెట్టు
లైనను చంద్రగుప్తుని రాజ్యపరిపాలనకు, మంత్రి మంత్రిగానుండక తీరదు.
నేటివరకుఁ జంద్రగుప్తుఁడు రాజనుమాట వానినోటనుండి రాకున్నది. మొట్ట
మొదట రాక్షసునిఁగూడఁ జంపించుట కేర్పాటుచేసితిని గాని తరువాత
దూరమాలోచించి యతఁడు లేకున్న రాజ్యమేలుట చంద్రగుప్తునకుఁ గష్ట
సాధ్యమని తలచి యాప్రయత్నమును రద్దుపరచి మంచిపనియే చేసితిని.
అబ్బా! వానిదెంత పట్టుదల! తనభార్యాపుత్రుల నప్పగించుటయే కాక
ప్రాణమిత్రుని మరణమున కంగీకరించుటయేకాక, కడకు దనచావునకు
గూడ సిద్ధపడెనుగాని తనప్రతిజ్ఞమాత్రము విడువలేదు. వానిప్రతిజ్ఞ చాణక్య
ప్రతిజ్ఞయే. పట్టుదలయందు మేమిరువురమును సమానులమగుటచేతనే యె
దిరిపంతమును ఈసరికి నెగ్గకున్నది. ఆఁ అట్టులననేల? రాక్షసుఁ డెంతవాఁ
డైనఁ గావచ్చునుగాని, చాణక్యుని జయింపఁగలఁడా? కావున నింక నేనే
స్వయముగఁ బ్రయత్నించి వానిని లొంగించుకొనవలయును. ఈకార్యమిత
రులకు నియోగించిన లాభములేదు. వాఁడు స్థిరచిత్తుఁడు. సామాన్యముగ
వశముగాఁడు. వానికి నేనే తగినవాఁడను. నేను పాటలీపుత్రమునఁ బ్రవేశిం
చినతరువాత ధనమిచ్చి కొందఱిని స్త్రీమోహమునఁ బడద్రోసి, కొందఱిని
మంచిమాటలచేఁ గొందఱిని సూక్ష్మముగ వశపఱచుకొంటిని. ఎవరెవరి కేయే
రోగములున్నవో వారివారికి తగిన యౌషధముల నిచ్చితినిగాని మంత్రిరోగ
మునకుమాత్రము మందులేదు. అట్టివానిని భయపెట్టి లొంగించుకొనఁ బ్రయ
త్నించుట వట్టి నిరర్థకము. కావున నింక మంచిమాటలాడి కార్యమును
కొనసాగించుకొనవలయును. అతఁడు సత్యనిష్ఠాపరుఁడు గావున వానియె
డలఁ గపటమెంతమాత్రమును పనికిరాదు. ఔను అందరియెడలఁ గపట

వర్తనము సాగునా? ఇంక నిర్మలహృదయముతో వానియెడ సంచరించి జరిగిన సంగతులన్నియుఁ వానికిఁ జెప్పివేసి చంద్రగుప్తునకు రాజ్యభిక్ష పెట్టవలయునని బ్రతిమాలుటయే యుత్తమము. యవనులు మొదలైన శత్రువులెందఱో మగధరాజ్యమువంకఁ గన్నెత్తి చూచుచున్నారు గావున రాజ్యమును నిష్కారణముగ నన్యదేశీయుల కప్పగింపకుమని వాని నిర్బంధింపవలసియున్నది. రాక్షసునియొద్దకుఁబోయి భిక్ష మెత్తుటతప్ప రెండవయుపాయేమియును నాకుఁ దోపలేదు. ఇంతమాత్రమున నాకవమానము గూడ లేదు. చంద్రగుప్తుని రాజ్యాధిపత్యమున కంగీకరించితి నని యతఁడు మాటయిచ్చెనా ప్రపంచముతల్లక్రిందైనను మఱలుగు వాఁడు కాఁడు...... కాని నాకింకొక యుపాయము దోచుచున్నది. అట్లుచేసిన నింతకన్న బాగుండునేమో? రాజ్యభిక్ష పెట్టుమని చంద్రగుప్తుఁడే ప్రార్థించిన నంతసరసముగనుండునా?......... వద్దు! వద్దు! ఆభిక్షమునకు నేనే బయలుదేరవలయును. నందవంశ నాశమునకు నేనే కారకుఁడను గాని, చంద్రగుప్తుఁడు గాని బాహురాయణుఁడు కాని యెంతమాత్రమును కారని చెప్పి, యొప్పించి వానికిరువురిపైఁగల యనుమానమును తొలంగింపవలయును. లేకున్నచోఁ గార్యము కానేరదు. జరిగినదేదో యిదివఱకే జరిగెనుగాన నాపంతమును విడువకున్న రాజ్యము ధ్వంసమగునని చెప్పినచో నాతఁ డంగీకరింపక పోఁడు. ఇంకమీఁదఁ గపటవర్తనములు, దొంగ యుత్తరములు, అబద్ధములు పనికిరావు"

అని చాణక్యుఁడు తన యాశ్రమమునఁ గూర్చుండి తనలో దీర్ఘాలోచనముఁ జేయుచుండెను. పర్వతరాజు నిదివఱకే చెఱపట్టియున్నవారు గావున నాకారణమున గ్రీకువారు మగధరాజ్యముపై నేమేమికుట్రలు బన్నుచుండిరో యని చాణక్యుఁడు కొంత యనుమానమును వహించెను. పర్వతేశ్వరుఁడుగూడ వారిలో నొకఁడేకదా. అందుచే వారూరకుండెదరా? తనతండ్రి చెరలోఁ బడెనని తనకు దెలిసినప్పుడే మలయకేతుఁడు విచారించి చంద్రగుప్తునిపై దాడివెడలుటకు సిద్ధపడెను. కాని తనకు జయ

ము గలుగునో కలుగదో యని వానికి సందేహముగా నుండెను. అందుచే అలిక్సందర షాహుషాకు ప్రతినిధి యైనశల్యూకసునకు మలయకేతుఁ డొక్కయుత్తరమును వ్రాసెను. ఆయుత్తరములో "మాతండ్రి యైనపర్వతేశ్వరుని నిష్కారణముగఁ మోసముఁజేసి చెరలో బెట్టించిరి. కావున నేనిప్పుడు పాటలీపుత్రముమీదికి దాడివెడలుచున్నాను. కావున దయార్ద్రహృదయులగుతమరు మా కీకార్యమున సాహాయ్యముఁ జేయకతప్పదు" అనుసంగతులు తప్ప నింతకన్న నధిక మేమియును లేవు. ఇట్టికార్యములన్న శల్యూకసునకు బెనుపండుగయే కదా? సాధ్యమైనంతవఱకు ఆర్యావర్తదేశము నాక్రమించుకొనవలయు ననియే వానిముఖ్యోద్దేశము. కాని యమాత్యరాక్షసుఁడున్నంతకాలము మగధరాజ్యమునుమాత్రము జయింపఁజాల నని యతఁడు నిశ్చయముఁ జేసికొనెను. అలిక్సందరునకు (అలగ్జాండరు) వలెనే వీనికిఁగూడ రాజ్యతృష్ణ విపరీతముగ నుండెను. అందుచే భరతఖండమంతయుఁ బరిపాలింపవలయు నని వానియభిప్రాయము. అందులో నందరాజ్యముపై వానికి మక్కువ యెక్కువ. అలిక్సందర్ పాదుషా అదివఱకే సింధు గాంధార కాంభోజదేశములను జయించి తన కప్పగించెను గావున గ్రమక్రమముగ గంగాతీరమునఁ గలమగధ మొదలైనరాజ్యము లన్నియు జయించి పాటలీపుత్రమును రాజధానిగఁ జేసికొని గ్రీకుసామ్రాజ్యమును స్థాపించవలయు నని శల్యూకసు విశ్వప్రయత్నము సేయుచుండెను. అందుచే మలయకేతుఁడు తనకు వ్రాసినయుత్తరము జూచి శల్యూక సెంతయో సంతసించి వానిని వెంటనే కలసికొని చాలదూరము వఱకు సంభాషించెను. ఆసంభాషణములో యుద్ధమునకు బయలుదేరవలెనా? లేదా? — లేక పర్వతేశ్వరుని విడువవలయు ననియు, నట్లు విడువకున్నఁ గోట ముట్టడించెదమనియుఁ గబురంపవలెనా? — అను రెండువిషయములను గూర్చియు వారు చాలదూరమువఱకు నాలోచించిరి. ఆకస్మికముగ నిట్టి కబురంపినచో ఆకోపముచేత పర్వతేశ్వరుని వారు బలవంతముగఁ జంపించెదరేమో యని మలయకేతున కొకసందేహము గలిగెను. అందు కేమియును భయములే

దని శల్యాకసు ధైర్యముఁ జెప్పెనుగాని మలయకేతుఁడు వినక "నాతండ్రి చచ్చినచో నాకేమి లాభమున్నది. అతఁడు బ్రతికియుండిన నిప్పుడు గాకపోయినను మఱియొకప్పు డైనను మగధదేశము సంపాదింపవచ్చు" నని చెప్పి కడ కొకరాయభారినిఁ బంపనెంచెను. అందుకు మాయలు మర్మములును బాగుగ నెఱింగిన సారంగుఁడను నొకబ్రాహ్మణుఁ డేర్పడియెను. పర్వతేశ్వరునిగూర్చి చంద్రగుప్తునితో సంభాషించి యెట్టులైన వానిని విడిపించి, క్రొత్తరాజునుగూర్చి బాటలీపుత్రపౌరుల యుద్దేశము లెట్లున్నవో రహస్యముగఁ గనుంగొని, నా కెవరైనఁ దనకుఁ దోడగుదు రేమో యడిగి శుభవర్తమానమును గొని శీఘ్రముగ రావలయు నని మలయకేతుఁడు వానిని బాటలీపుత్రమునకంపెను. తనపట్టణములోనికి నూతనపురుషు లెవరైన వచ్చినచోఁ దనయొద్దకుఁ గొనిరావలయు నని చంద్రగుప్తుఁడు తాను రాజైనతరువాత క్రొత్తగా నొకశాసనము నియమించెను. అందుచే రాజభటులు సారంగునిఁ బట్టి రాజునెదుటకుఁ దీసికొని పోవలయును గదా ? అట్లు గొనిపోఁబడినతరువాత నతఁడు చంద్రగుప్తునితో నెంత యుక్తిగా మాటాడెనో ఏమేమితంత్రములు జేయనెంచెనో చదువరు లీ ముందుప్రకరణములోనే తెలిసికొనఁగలరు.

ప్రకరణము. 11.

సంవాహకుఁడు.

మలయకేతునిచేఁ బాటలీపుత్రమునకుఁ బంపఁబడిన సారంగుఁడు సామాన్యుఁడు కాఁడు. తా నేపనిమీఁదవచ్చెనో ఆపనియేకాక యితరవిషయములుగూడ రహస్యముగఁ గనుఁగొనుచుండెను. నందవంశము నాశనమైనందునఁ జంద్రగుప్తుని పట్టాభిషేకమునుగూర్చి జను లేమి యనుకొనుచున్నారో ఆసంగతి ముఖ్యముగ గనుఁగొనవలెనని సారంగుఁడు మిక్కిలి కుతూహలముతో నుండెను. తా నేపనిమీఁదవచ్చెనో ఆపనికిఁ జంద్రగుప్తుఁ డంగీకరింపఁ డని యతఁడు నిశ్చయించుకొనెను. ఔను చేతఁజిక్కిన శత్రువు నూరకవిడిచెదరా ?

పర్వతేశ్వరుని విషయమై యాతనికుమారుఁ డొకరాయభారిని బంపె నని తెలియఁగానే చంద్రగుప్తుఁడు వానికొక బసయిప్పించి గౌరవించి యందుంపించెను. నేఁటిదినమున రాజసభకువచ్చినచో అన్నిసంగతులును మాటాడవచ్చునని చంద్రగుప్తుఁడు కబురంపెనుగాని సారంగుఁడందు కంగీకరింపక తాను చాలదూరమునుండి మిక్కిలిప్రయాసతో నడచివచ్చినందునఁ గొంచెము జ్వరము తగిలినదనియు, రెండుమూఁడుదినములు పోయినఁగాని రాజసభకు రానేరననియుఁ బ్రత్యుత్తరమంపి యానాఁడు రాజసభకుఁ బోవుట మానివేసెను. తాను పాటలీపుత్రమునఁగల రహస్యములను గనుఁగొనుటకై వచ్చియున్నాఁడు. కావున, నానాఁడే రాజసభకుఁబోయి వచ్చినపని పూర్తిఁజేసికొనినయెడల నింక నాటుటునాఁడు తన్నానగరమునందుండ నీయరని సారంగుఁ డీ యుక్తిపన్నెను. చాణక్యుఁడు వానిప్రవర్తనమును

గనిపట్టి వానివిషయమై జాగ్రత్తతోనేయుండెను. అతఁడెక్కడెక్కడికిఁ బోవునో యెవరెవరితో మాటాడునో యేయేపనులు గావించునో రహస్యముగఁ గనిపట్టుచుండవలయునని యాతఁడు కొందఱు శిష్యులకు నియమించి పంపించెను.

సారంగుఁడు పాటలీపుత్రమునఁ బ్రవేశించిననాఁడుమాత్రము బస విడిచి యెచ్చటకునుబోలేను. బసలోఁ బ్రవేశించినతరువాత స్నానముఁజేసి వంటఁజేసికొని భోజనమైన తరువాత, వీధిచావడిలోఁగూర్చుండి తాంబూలము నములుచు దనకార్యక్రమము నాలోచించుకొనుచుండెను. అప్పుడొక సంవాహకుఁడు వానిచెంతకువచ్చి నమస్కరించి వినయముతో "అయ్యా! తమరెంతోదూరమునుండి ప్రయాసపడి వచ్చిరనియు నందుచేఁ దమకు జ్వరముచ్చినదనియుఁ దెలిసి మాచంద్రగుప్తమహారాజుగారు తమసేవ చేయవలయునని నన్నుఁ బంపించిరి. తమకు ఏమేమి కావలయునో సెలవిచ్చినచోఁ దీసికొనివచ్చి యిచ్చెదను. మర్దనముసేయుటయందు నాయట్టి నేర్పుగల మంగలి యింకొకఁడులేడు. నేను తమకుఁ గావలసిన యుపచారములను జేసెదను" అని పలుక సారంగుఁడు సంతసించి వానినెట్టులైన మంచి చేసికొనినచోఁ గొన్ని సంగతులైనఁ గనుఁగొనవచ్చునుగదా యని నిశ్చయించి తానప్పుడే యొకచాఁపపైఁ బరుండి యొడలుపట్టుమని చెప్పెను. సంవాహకుఁడు తనచాతుర్యమంతయుఁజూపుచు వానియొడలు పిసుకుచుండ, నాతఁడు హాయి హాయి యని వానిపనికి మెచ్చుకొనుచుండెను. అప్పుడు వారిరువురకు నీక్రిందిసంభాషణము జరిగినది.

"అయ్యా! తమరు బ్రాహ్మణులు. తమసేవ లభించుటచే నాకెంతయో సంతోషముగనున్నది. అప్పుడప్పుడు నాసేవకు ధననందమహారాజు గూడ మెచ్చుకొనుచుండెను. నేనొడలుపట్టినచో మురాదేవిచేతికన్న నాచేతియందే యెక్కుడు సుఖముండునట పాపము మురాదేవియే వానినింత హీనస్థితికిఁ దెచ్చినది. నందవంశనాశనమున కామెయే కారణము. అతఁడనంత

టినిఁజెప్పుట కొకగొంజుచాలదు. అందరినిఁ జంపి కడకుఁ దానుఁగూడఁ జచ్చెను."

అనిచెప్పి పెద్దనిట్టూర్పువిడిచి దుఃఖమభినయించుచు నాతఁడూరకుండెను. తనపని కదియే యుచితసమయమని యెంచి సారంగుఁడు,

"నీపేరేమి? మర్దకుఁడా?"

"అవును! నాపేరు మర్దకుఁడు. నాపని మర్దనసేయుట."

"అందుచేతనే నాకింతసుఖము గల్గించుచుంటివి? రాజగృహములో నీయట్టివారే యుండవలయును."

"ధననందునివంటి గుణవంతుఁడుండినఁగదా మాబోటి సేవకులకు దిక్కు?"

"అట్లైనచో అంతమంచివానికింత ఘాతమెట్లు జరిగినది? జనులు నిద్రపోవుచున్నారాయేమి? రాజుపై వారికసూయయట నిజమేనా?"

"నిజమే ఎవఁడైనఁ గట్టిరాజొకఁడుండువఱకు జనులసంతాపము తక్కదు. వారిదుఃఖమంతకంత కధికమగుచున్నది."

"అబ్బా! అంతవిరోధమా?"

"విరోధమన్న విరోధమా? చెప్పలేము. సేనాపతిచంద్రగుప్తునిచేతిలోఁ జిక్కినాడు. అందుచే జనులకుఁ బరసైన్యముల సాహాయ్యమవసరమై యున్నది."

"ఏకారణములేకుండ నితరులెందుకు వచ్చి తోడుపడెదరు?"

"అంతయదృష్టమా? అట్లు జరిగిన నదృష్టవంతులమే."

"ఏమిరా? నీవు కడుఁజతురుఁడవే? ఎవరైన వచ్చినచో మీరు సాహాయ్యముఁ జేసెదరా?"

"చేసెదము గాని లోపులేమనెదరో యని భయముగానున్నది."

"అబ్బా! నీవు రాజనీతికూడ నెఱుఁగుదువా? ఇదిగో నీసేవకు నేను సంతసించితిని. ఈబహుమానమును గైకొనుము."

అని తనవ్రేలినున్న యుంగరమును దీసి వానికిచ్చివేసెను. సంవాహకుఁడు మొదట వద్దువద్దని నియోగమును జూపెనుగాని యుంగరమును మాత్రము విడువలేదు. అప్పుడు సారంగుఁడు,

"నీబుద్ధికి నేను సంతసించితిని. ఎవరైన సాహాయ్యమువచ్చిన మీరందఱు నేకమై తోడుపడెదరా? సంశయింపక నిజము జెప్పుము."

"అయ్యా! నన్నిట్టిసంగతు లడుగకుడు. గోడలకుఁ జెవులుండును. ఎవరేమి సంగతులు మాటాడుకొనినను కొందరు దుష్టులుగ్రహించి యాదుష్టచాణక్యునితోఁ జెప్పుచుందురు."

"భయమేందుకు? ఇక్కడ మనమిద్దరమేయున్నాముకదా?"

"అయ్యా! రాక్షసుఁడు మిక్కిలి గొప్పవాఁడు. అతఁడు మీపక్షమున నున్నచో మీకార్యము తప్పక జయమగును. వానికి తెలియకుండఁ బర్వతేశ్వరునిఁ జంపించి వానిపై నిష్కారణమపనింద మోపిరి. అందుచే వాని హృదయమిప్పుడు కేవలము మారియున్నది. జనులందరు వానినే నిందించుచున్నవారు. ఇప్పుడు మీరేమాత్రము ప్రయత్నించినను రాక్షసుఁడు మీకు స్వాధీనుఁడగును. చాణక్యుని తంత్రములన్నియు నిప్పుడిప్పుడే బైటఁబడుచున్నవి. కాఁబట్టి మీరొకసారి మంత్రినికలసికొని మాటాడవలసియున్నది."

"అవును కాని వానిదర్శనము నాకు లభించుటెట్లు?"

"ఇందుకేమి యాటంకమున్నది? అతఁడీయూరిలోనే యున్నవాఁడు. చాణక్యచంద్రగుప్తులపైఁ గోపముచేఁ బిచ్చివానివలెఁ దిరుగుచున్నాఁడు.

మీకిష్టమైనచో వానిదర్శనము మీకు లభించునట్లు నేనేర్పాటు చేయఁగలను."

"ఇంతకన్న నాకింకేమి కావలయును?"

మొత్తముమీద సారంగుఁ డేపనిమీదవచ్చెనో అపనికాలేదు. చంద్రగుప్తుఁడు పర్వతరాజును విడువఁడనియు, నొకవేళ విడిచినచోఁ గష్టమైనసంధి యేర్పఱుచుననియు, మలయకేతుఁడింక యుద్ధమునకు రాకమానడనియు నతఁడు నిశ్చయముఁ జేసికొనెను. ఇట్టిసమయమున మంత్రిని కలసికొని యన్నిసంగతులు మాటలాడి వానిని వశపఱచుకొనినచోఁ దమకింక జయముగల్గునని సంతసించి, సంవాహకుని మరింత మంచిమాటలాడుచుండెను. మలయకేతుఁడు తన్ను శీఘ్రముగ రమ్మనిచెప్పుటచే సాధ్యమైనంత వేగముగానే రాక్షసునితోఁ బ్రసంగించి శుభవర్తమానమును గొని బయలుదేరవలయునని సారంగుఁడు తొందరపడుచుండెను. అందుచే సంవాహకుని పిలిచి "సంవాహకా! నీవుమాత్రము నన్నువిడిచి పోవలదుసుమా! నీయవసరము నాకుఁ దఱుచుగ నుండుచుండును. నీదయయున్నచో మాకు జయముగల్గుటయందు సందేహములేదు. నన్నింక మంత్రివద్దకుఁ గొనిపోవుభారము నీదియే" అనిపలుక సంవాహకుఁడు "చిత్తము. చిత్తము. మనమిప్పుడే బయలుదేరుదము కాని తమరుగూడ నావలె మంగలివేషమును వేసికొనిరావలయును. రాక్షసుఁ డిప్పుడు బ్రాహ్మణుఁడన్న వాని నమ్మకున్నవాఁడు" అనిపలుక తానుత్తమబ్రాహ్మణుఁడైయుండి మంగలివేషమును ధరించుట, తన కవమానకరమేమోయని సారంగుఁడు తలపోయఁజొచ్చెను. ఎట్టకేల కతఁడందులకు సమ్మతింపక తీఱినదికాదు. అతఁడు మంత్రియొద్దకు బయలుదేరినతరువాత, మంత్రికిని వానికిని జరిగిన సంభాషణములో రాక్షసుఁడు నిక్కమైన ధర్మవర్తనుఁడని సారాంశము తేలఁగలదు.

ప్రకరణము. 12.

సారంగుని పరాభవము.

అమాత్యరాక్షసుఁ డింకను పాటలీపుత్రమును విడువలేదు. అతఁడు తనకుటుంబముతోఁ దనయింటనే కాలముఁ గడుపుచుండెను. తనకు వెఱచి చందనదాసు నింక చంద్రగుప్తుఁడు చంపింపఁడని వానికి ధైర్యముఁ గలిగినది. పౌరులెల్లరు వాని విషయమై యొక్కొక్కక్షణమున కొక్కొక్కతీరున సంభాషించుచుండిరి. పాటలీపుత్రమును తానిట్టి స్థితిలో విడిచిపోయిన జనులు తనపై మరింతయనుమానము కహించెదరని, యాప్రయత్నమును విడిచి యెచ్చటనైన నందకులమునఁ బుట్టిన చిన్నమొలక దొరకినచోఁ గొని వచ్చి పట్టాభిషేకముఁ జేయవలయునని యతఁడు చూచుచుండెను. తనచుట్టు నెవ్వరినిఁ జేరనీక యతఁడు తన వ్యవహారములను గడుజాగ్రత్తతోఁ జేసికొనుచుండెను. హిరణ్యగుప్తుఁడు ప్రస్తుతము వానిక్రిందఁ బనిసేయలేదు. వానినిఁ బిలిపించి జరిగినసంగతులన్నియు నడిగి తెలిసికొనవలయునని రాక్షసునకుద్దేశము గలదుగాని, యాతఁ డెచ్చటను గానరాలేదు. హిరణ్యగుప్తుఁ డెక్కడికిఁ బారిపోయెనో వానికి తెలియదు. తనముఖ్యసేవకులే తనకు విరోధులై యింతద్రోహముఁ జేసిరికదాయని సారెసారెకును కొనుచు రాక్షసుఁడు విచారించుచుండెను.

అచ్చట సంవాహకుఁడును సారంగుఁడును బయలుదేరి మంత్రిగృహమునకువచ్చిరి. త్రోవలో సంవాహకుఁడు వానిని గాంచి "అయ్యా ఒకసంగతిఁ జెప్ప మఱచితిని. చంద్రగుప్తుఁడుగాని చాణక్యుఁడుగాని తమ సేవకొఱకు నన్నుఁ బంపిరనిమాత్రము రాక్షసునితోఁ జెప్పవలదు. అట్లు

చెప్పినచో నాతఁడు మీతో మాటే యాడఁడు. జాగ్రత్త" అనిచెప్ప నాతఁ డట్లేయని యాదుకు సమ్మతించెను. తనయింటి కెవరైనఁ గ్రొత్తవారు వచ్చినచోఁ దనయాజ్ఞలేనిదే లోనికిఁ దీసికొనిరావలదని రాక్షసుఁడు తన సేవకుల కాజ్ఞాపించినందున సారంగ సంవాహకు లిరువురును లోనికిఁ గబురంపి రాక్షసుని సెలవునకై కొంతవరకు వేచియుండవలసి వచ్చినది. తరువాత వారిరువురును లోనఁ బ్రవేశించినంతనే రాక్షసుఁడు వారలనుజూచి,

"నిజముగ మీరిరువురును మంగలివాండ్రే యైనచో మిమ్ము నేను గౌరవింప నక్కరలేదు. కాని మారువేషధారులైనచోఁ గూర్చుండుఁడని మాత్రము జెప్పుచున్నాను. మీసంగతి నాకుఁదెలియదు. నేను మీకేమి యునుపకారమును జేయఁజాలనుగాని యేకార్యముకొఱకు వచ్చిరో అది మాత్రము వినఁ గుతూహలముతోనున్నాను."

అని యుక్తిగ బలుక సారంగుఁడు

"చిత్తము. చిత్తము. నేనెంత మారువేషమును ధరించినను మీయొద్ద దాపరికముండునా? ఎంతోసేపువరకు మీతో మాటాడను. బహిరంగముగ నేను మీయొద్దకు వచ్చుటకు వెఱచి మామంగలివానితోఁగూడ నీవేషమున వచ్చితిని. తమరు నాయెడ దయయుంచవలయును."

"మీ దేదేశము? ఎందుకువచ్చిరి! రాజపుత్రులా."

"ఔను! రాజపుత్రుఁడనే స్వామికార్యార్థము వచ్చితిని."

"రాజపురుషులే యైనచో మీస్వామి యెవరు? నిజము జెప్పుఁడు."

"నేను పర్వతేశ్వరుని కుమారుఁడగు మలయకేతుని యాశ్రితుఁడను. తనతండ్రినిఁ జెఱపట్టించి తమరుచెఱలో నుంపించిరని విని సంతాపపడి యతఁడు నన్నుఁ బంపించెను."

"ఛీ! ఛీ! అట్టిమాటలాడవలదు. ఈపని నేను జేసినదికాదు."

"ఔను ఆసంగతి నేనిదివరకే విన్నాను."

"ఎవరివలన విన్నారు?"

"నేను వచ్చినతరువాత సంగతులన్నియుఁ జూడ పర్వతేశ్వరునిఁ జంద్రగుప్తుఁడే మోసపుచ్చి, ఆయపనింద మీపైఁబెట్టించెనని అందరు ననుకొనుచున్నట్లు నాకుఁదెలిసినది."

"ఏమేమీ! పాటలీపుత్ర ప్రజలకు నేను రాజద్రోహినైతినే! వారు నాయపనిందఁ దొలఁగించి నన్నెట్లు విశ్వసించిరి? అట్టి ధర్మమూర్తు లిందెవ్వరును లేరే."

"ఒక్కఁడా అనేకులున్నారు. తమచేత నిట్టికార్యము లెన్నఁడును జరిగియుండవని పలువురనుకొనుచున్నారు. వారందఱికి మీపై చాలభక్తి గలదు."

"ఇంకను నాయెడ విశ్వాసమున్నదా!"

"ఆహా! తమకెంతమాత్రమును సంబంధము లేనిదే యీ యపనింద మోపినందునఁ దమకాగ్రహము వచ్చినదని నెఱిఁగి, దానిని తీర్చుకొనుటకు మీరర్హులని యిచ్చటికి వచ్చితిని."

"నాకోపము నేను దీర్చుకొనుటకు మీరాకయెందుకు? ఇందులో మీకేమైన సంబంధమున్నదా?"

"ఔను. నేను మలయకేతుని యొద్దనుండి చంద్రగుప్తున కొకసందేశమును గొనివచ్చితిని?"

"ఏమని?"

"పర్వతేశ్వరుని విడిచెదవా? లేక యుద్ధమునకు సిద్ధపడెదవా యని"

"ఏమేమీ? మలయకేతుఁడా? చంద్రగుప్తునితో యుద్ధమా? తన యంతర మెక్కడ? వానియంతర మెక్కడ! ఇట్టిసాహసమును వహించుటకు వాని కెవరైన సాహాయ్యమున్నారా యేమి?"

"ఆసాహాయ్యము కొఱకే యిప్పుడు మీవద్దకు వచ్చితిని తమరు తోడుగనున్న మాకింకేమి కావలయును."

"ఔను. నావలన నేమిసాహాయ్యమగును?"

"కార్యమంతయు మీవలననే కావలసియున్నది ఇందఱిలోఁ దమకు విరోధముండ నేపనిఁ జేయలేరు?"

"బాగుగా నేయున్నదికాని మలయకేతున కింకెవ్వరైనఁ దోడుగనున్నారా."

"ఉన్నాడు. ఆతఁడు శల్యూకస్. వెలుపలనుండి యాతఁడును లోపలినుండి మీరును సాహాయ్యముఁ జేసిన, నిముసములో మలయకేతునకు మగధరాజ్యము చేఁజిక్కును. తమశత్రువులును తమకు వశులయ్యెదరు. చాణక్య చంద్రగుప్తులమీఁదఁగల మీపగనంతటిని మీరు దీర్చుకొనవచ్చును."

"శల్యూకసు మలయకేతునకుఁ దోడగుట కేమికారణము?"

"ఏమియునులేదు. కేవలము మైత్రియే"

"శల్యూకసును, మలయకేతుఁడెట్లు విశ్వసింపఁగలడు? ఆతఁడు గూడ మగధరాజ్యముపైఁ గన్నువేసియున్నవాఁడుకదా? మలయకేతునకుఁ దక్కనిచ్చునా?"

"అమ్మమ్మమ్మా! ఎంతమాట యెంతమాట? శల్యూకసట్టివాఁడు కాఁడు. వారిరువురకు నెంత స్నేహమనుకొంటిరి!"

"ఎంతస్నేహముండిన నేమి! మీకుఁ బిచ్చిపట్టినది. రాజ్యకాంక్ష స్నేహమును దలపనిచ్చునా? సకలార్యావర్తమును బరిపాలింపవలయునని, శల్యూకసు దీక్షవహించియున్నవాఁడుకదా? కావున నీయుపాయము నాకిష్టములేదు."

"ఎందుకిష్టము లేదు? మీరేమనెదరు!"

"మొదట మలయకేతునకు సాహాయ్యముగావచ్చి కార్యానంతరమున మగధరాజ్యముం దానాక్రమింపక మానఁడు."

"సరే! ఈసంగతి నిట్లుండనిచ్చి, రెండవ యుపాయ మేమైననున్నదా? సెలవిండు."

"మీరే సెలవిండు."

"తమసాహాయ్యము మాట యేమనెదరు."

"నావలన నేమియునుగాదు. చాణక్య చంద్రగుప్తులపై నాకుఁ బగయున్నది. నిజమే మఱియొకవిధమున వారికిఁ బ్రాయశ్చిత్తముఁ జేసెదనుగాని రాజ్యమును బాడుచేసెదనా! శివ! శివ! అట్టిమాటలు నాతోఁ జెప్పవద్దు."

"అయ్యా! నామాట మన్నింపుఁడు. మీకింతటి ద్రోహ మొనర్చిన చంద్రగుప్తునకా యీరాజ్య మప్పగించెదరు?"

"కాక? పరదేశీయులగు గ్రీకువారికా యప్పగించ మనెదరు. అంతకన్న నిదియే బాగున్నది."

తమరిట్లు సెలవిచ్చెదరని నే ననుకొనలేదు. తమరు సాహాయ్యముఁ జేసెదరని కొండంత యాసతో నుంటిని."

"ఆకొండంత యాసయు నిప్పుడు బెండువలె నెగరఁగొట్టుఁడు. పరదేశీయులగు మ్లేచ్ఛులకుఁ జేతులార సామ్రాజ్యము నప్పగించుటకు నేనంత మూర్ఖుఁడను గాను."

"అయ్యా! తమరు నందభక్తులు నందవంశమును నాశనముఁజేసి తమకింత యపకీర్తిఁ దెచ్చిన చంద్రగుప్తుని సేవించుట తమకు ధర్మముగాదు. ఆలోచింపుఁడు.

"నన్నుఁ బరీక్షించుటకా వచ్చితిరి? నాకంఠమునఁ బ్రాణముండ నీరాజ్య మేస్సైనను మ్లేచ్ఛులకుమాత్రము దక్కనీయను. తమరింక దయచేయవచ్చును."

"తమయాశ మాకింకేదియును లేదా?"

"ఛీ! ఛీ! మాల నదేమాట? చాణక్య చంద్రగుప్తాములపై నెంత ద్వేషముండినను రాక్షసుఁడు మాత్ర మెన్నఁడును మాతృదేశమునకు ద్రోహమొనర్చునా? మీరింక నిచ్చట నుండఁదగరు. వేవేగ లెండు."

ప్రకరణము. 13.

బలే! రాక్షసా! బలే!

చాణక్యుఁడు తనశిబిరమునఁ గూర్చుండి పైనుండి తన గుప్తశిష్యులు తెచ్చిన సమాచారములు గనుఁగొనుచుండెను. శిష్యులందఱు వాని చుట్టును గుమిగూడి యుండిరి. అప్పుడు చాణక్యుఁడు,

"విశారదా! నీపనియేమైనది."

అని యడుగ విశారదుఁడు ముందునకువచ్చి

"స్వామీ! తమరు చెప్పుచున్న మాటలన్నియుఁ జంద్రగుప్తునితోఁ జెప్పితిని. అతఁడు తమ దర్శనమునకు వచ్చుటకు సిద్ధముగనున్నాఁడు."

"సరే! పో! వేగశిలా నీవేమందువు? నేనుచెప్పిన చోటికిఁ బోయితివా?"

"చిత్తము. చిత్తము. ఆగొల్లవానిని నేను వెంటఁ బెట్టుకొనియే వచ్చితిని."

"బాగున్నది! వీరవ్రతా!"

"దేవా సిద్ధముగనున్నాను."

"సరే నాతోఁజెప్పకుండ నీ వెచ్చటికినిఁ బోకుము తరువాత మందపాలా నీవు మందబుద్ధివి. ఏమైనది? చూచివచ్చితివా లేదా?"

"స్వామీ! నేనెంత ప్రయత్నించినను బాహురాయణుఁడు నాకుఁ గనఁబడలేదు. తిరుగలేక నాకాళ్లు పట్లుపట్టినవి.

"ఛీమూర్ఖా! మొద్దువలె నేపనియు నీకుఁ జేతగాదు. తిండికిఁ దిమ్మరాజు, పనికిఁ బోతరాజు. ఛీ!......సరే! సిద్ధార్థా! నిద్రపోవుచున్నావా యేమి?"

"స్వామీ లేదులేదు. వేషము విప్పివేసి కొనుచున్నాను."

"ఏదీ? నీవేషము నొకసారి నన్నుఁజూడనిమ్ము."

అనిపలుక సిద్ధార్థుఁడు నవ్వుచు వానిముందునకు వచ్చి నిలిచెను చాణక్యుఁడు వానినిఁ జూచి,"

"వాహ్వా! సిద్ధార్థా నిజముగ సంవాహకుని వలెనే యున్నావురా! సరే మంత్రినిఁ గలిసికొంటివా? అతఁడు నిన్నుఁ బోల్చుకొనలేదు కదా?"

"లేదులేదు. సారంగుఁడును మంత్రియు మాటాడుచున్నప్పుడు నేనేమియు నోరెత్తలేదు. ఒకమూలఁ గూర్చుంటిని."

"సరే రాక్షసుని యుద్దేశ మెట్లున్నదో మొదటఁ జెప్పు. వారిరువురకు నేమి సంభాషణము జరిగెను?"

అని యడుగ, సిద్ధార్థుఁడు మంత్రికిని సారంగునకును జరిగిన సంభాషణ మంతయుఁ బూసగ్రుచ్చిన ట్లామూలాగ్రముగఁ జాణక్యున కెఱింగించెను. ఆమాటలన్నియు వినినతోడనే చాణక్యుఁడు త్రుళ్లిపడిలేచి బిగ్గరగ

"బలే రాక్షసా! బలే! నిక్కముగ రాజభక్తుఁడవన్న నీవే! సకల నీతిశాస్త్రపారంగతుఁడవై, భూలోకమంతయు రారాజులవలెఁ బరిపాలింప దక్షుండవు నీవే! శత్రుమిత్ర భేదమీషణ్మాత్రమైనలేక, న్యాయవర్తనమే ముఖ్యవ్రతముగాఁ గల మహానుభావుఁడవు నీవే! త్రినేత్రుఁడైననావంతయు సరకుఁ గొనక, భూలోకము దల్లక్రిందైనను భీతిల్లక, పట్టినపట్టుగలనైన విడువని రాజెట్టి దిట్టవు నీవే. సకలారాతికుల కాంతారంబునకుఁ బ్రచండ వీతిహోత్రుండవై, అపరిమిత రాజ్యతృష్ణాపీడితులైన గ్రీకువారికి మగధరాజ్యమును దక్కనీయక, మాతృభూమియగు నార్యావర్త దేశమునంతటిని నుద్ధరించిన దేశబాంధవుఁడవు నీవే! యెట్టి యపనింద తలపైఁ బడినను, ఇంచుకైనలక్షింపక, పెట్టరాని కష్టములెన్ని పెట్టినను గాదనక, భార్యాపుత్రుల నప్పగించుటకైన నంగీకరించి, ప్రాణమిత్రుని మరణమునకైన సహించి, ఆత్మహత్యకుఁగూడ సిద్ధపడి కడకు నిజకృత ప్రతిజ్ఞా పరిపూర్తి యొనర్చుకొనిన ధైర్యవంతుఁడవు నీవే! ధైర్యవంతులలో నగ్రగణ్యుఁడై స్వప్రతిజ్ఞా నిర్వహణమునకై యతిచాతుర్యమున నిముసమాత్రములో నందకులమును రూపుమాపిన చండశాసనుండగు నీచాణక్యుని, ముప్పతిప్పలుపెట్టి కటకటలాడించిన యసహాయశూరుండవు నీవే! ఇట్టి నీయెడ నాకపట మెంతమాత్రమును పనికిరాదు. ఆహా! రాక్షసా ఎంతయదృష్టవంతుఁడవు? ఎంతధన్యుఁడవు? ఇంద్రజాల మహాత్మ్యము వలె లోకమంతటిని మోసపుచ్చిన చాణక్యుఁడు నీకు దాసానుదాసుఁడయ్యెను గదా? చంద్రగుప్తునెడ నెట్టిద్రోహముఁ దలపెట్టెదవో యని నేనింతకాలము సందేహించుచుంటిని గాని, నీనిర్మల హృదయము నేటికి వెల్లడియైనది. ఇంక రాజ్యభారమంతయు నీపైఁబెట్టి చంద్రగుప్తుని నీకప్పగించి, నేను హాయిగ హిమవత్పర్వతమునకుఁబోయి తపస్సుఁ జేసికొనెదను. నాకింక నెట్టివిచారములును లేవు?"

అని సంతోషముతోఁ బలుకుచుండ సిద్ధార్థుఁడు,

"స్వామీ! మమ్ముం బతిని విడిచి తమరు హిమవత్పర్వతమున కెట్లు పోయెదరు? చంద్రగుప్తుని విడుచుటకుం దమకెట్లు బుద్ధిపుట్టును?

"బాబా ఏమిచేయు మనెదవు? నీకేమియును తెలియదు. నేనే ప్రతిజ్ఞ జేసితినో ఆప్రతిజ్ఞ పూర్తియైనది. చంద్రగుప్తునకు రాజ్యము స్థిరపడువరకు నేనిందే యుండెదను. ఉత్తమ బ్రాహ్మణుండ నయ్యు, నేను చేయరాని ఘోరకృత్యములను జేసితిని. అందుకు బ్రాయశ్చిత్తము కొండ గుహాలలో మునివృత్తిని గాలముం గడపుటయే. అట్లు చేసినంగాని యీ ఘోరపాపము నన్నువిడువదు. ఛీ! ఛీ జరిగిన దేదియో జరిగినది. ఇంక నేమియు నాకనసరములేదు. ఒకటియా రెండా? ఎన్ని దారుణము లొనర్చితిని? రాజహత్య - శిశుహత్య - స్త్రీహత్య - అసత్యము - అధర్మము - కాపట్యము. అబ్బా! జరిగినవన్నియుం దలంచుకొనినచో నాగుండె బ్రద్దలగుచున్నది. ఒక్క మ్లేచ్ఛహరణము దప్పచేయవలసిన వన్నియును జేసితిని. ఆకార్యము నేనే చంద్రగుప్తునిచేం జేయించెదను. రాక్షసునకు నిజమైన భక్తియున్నది.

"ఆర్యా తమరు చేసిన దానికింత పశ్చాత్తాపమొందనేల? ఎచ్చటికో పోయి కొండగుహాలలో నెట్లు నివసింపంగలరు? ఇంతకన్నం దమరు బౌద్ధమతమును స్వీకరించిన బాగుండును. భగవాన్ వసుభూతి తమకుపదేశింపంగలండు. బృందమాల కూడ సంసారముపై విరక్తిచే మొన్ననే బుద్ధభిక్షుని యయ్యెను. మనము జేసిన పాపము హరించుట కిదియే తగునుపాయము. ఇదియే నిర్వాణప్రాప్తికిం గారణము."

ఆమాటలు వినినవెంటనే చాణక్యునకు నవ్వువచ్చెను. పైని జరిగిన సంగతులను బట్టి యీసిద్ధార్థుండే సంవాహకవేషమున సారంగుని గుట్టు గనుంగొనుటకుం జాణక్యునిచేం బంపంబడెనని వేరుగ వ్రాయ నవసరము లేదు. చంద్రగుప్తునిపై రాక్షసుం డెట్టి ద్రోహచింతతో నుండెనో కనుం

గొన వలయునని చాణక్యుండు చేసిన యుక్తి యిది. మలయకేతు ననుసరించి యమాత్యుండు చంద్రగుప్తునకును మగధరాజ్యమునకును దురాగ్రహమున నెట్టి కీడుతలపెట్టునో యని చాణక్యుం డూరక యనుమానించుచునే యుండెను గాని, సిద్ధార్థుండు చెప్పినసంగతులు వినిన తరువాత వాని కాశంక నిర్మూలమైనది. రాక్షసుండు గొప్పరాజభక్తుండనియుం దనకనుకూలుండు గాకపోడనియు, సిద్ధార్థుండు చెప్పిన మాటలవలనం దెలిసికొనిన తరువాత, నాతనికిం బశ్చాత్తాపమారంభమయ్యెను. నందవంశమునకుం గాలవశమునం దానింతఘోరముం జేయవలసివచ్చెను. గదా యని వానిమనసు మిక్కిలి నొప్పి పెట్టుచుండెను. అందుచే నింక నెంతోకాలము పాటలీపుత్రమున నుండుటకు వానికిష్టము లేకపోయినది. ఎట్టులైన రాక్షసునొప్పించి చంద్రగుప్తుని వానికప్పగించి తా నరణ్యావాసమునకు బయలుదేర నిశ్చయించుకొనెను. చంద్రగుప్తుని దిగ్విజయవార్తలు తాను తపస్సుం జేసికొనుచు నప్పుడప్పుడు తెలిసికొనవచ్చునని చాణక్యుని యభిప్రాయము.

ప్రకరణము. 14.

వాఁడే వీఁడు.

"దైవమా! ఎంత యంధకారమునం బడవైచితివి? కన్నులతో జూచుచుండియు గ్రుడ్డినై యెదుటనే జరిగిన భయంకరకృత్యమును గనుంగొనం జాలనైతినిగదా? ఓరాక్షసా! నీచాకచక్యమంతయు నెందు బోయినది? నీతెలివి తేటలన్నియు నేమైనవి?........ఔరా! నాయంతవానినే కన్నుం బ్రామి యింతటి విపరీతకృత్య మొనరించిన వాఁ డెంతచతురుఁడు కావలయును? ఎంతజాణయై యుండవలయును? నాకింతటి మహాపరాధ మొనరించినను పక్షపాతహీనుండనై యాధైర్యవంతుం డపారశేముషీ

శ్రేయుండని శంకింపక తప్పదుకదా?........అయ్యయ్యో! నంద వంశమున కింతటిహీనగతి వచ్చుటకుఁ గారణము గయ్యాళిగఁ బేరైన యమ్మురయే! శ్రీహరీ! చంచలచిత్తలైన స్త్రీల నెన్నఁడును నమ్మరాదు. వారిహృదయములు పయోముఖవిషకుంభములు. వారిపలుకులు తేనెబూసిన కటారులు. వారిచేతలు ప్రతికార్య విఘాతములు. ఏనాఁడా రక్కసి మురను చెరలోనుండి తప్పించెనో ఆనాఁడే ధననందుఁడు తనకొంపఁ దాను త్రవ్వుకొనెను? ఏనాఁడా చండాలి మందిరమునఁ బ్రవేశించెనో ఆనాఁడే యాతఁడు మృత్యుముఖమునఁ బ్రవేశించెను. కలలోనైన నింత యుపద్రవము సంభవించునని మందమతినై యెఱుంగనైతిని?........అయ్యో! ఇఁక ముందేమిచేయవలెను? నేటివరకును మ్లేచ్ఛులమూకల నీమగధరాజ్యముయొక్క పొలిమేరనైనఁ ద్రొక్కనీకుండఁ జేసితిని. కాని యికముందుమాత్రము నాకీ విషయమున సందేహముగనే యున్నది. నాకింతటి యపకీర్తిఁ దెచ్చినదుష్టులకుఁ దగిన ప్రాయశ్చిత్తముఁ జేసి నాదారిని నేనుపోయినంతనే యుత్తరక్షణమునందే శత్రువులు పాటలీపుత్రముపైఁ బడక మానరు. పాటలీపుత్రమున కీగుండెబెదురే నాటికిని లేకుండఁ జేసిపోవుదమన్నఁ జాణక్యుని దుర్మంత్రమున బాహురాయణుఁ డొకఁడు రాజభక్తినుండి తొలఁగియున్నవాఁడు. అందుచే నాకీకార్యమున బాసటగనుండువారెవ్వరు? అతఁడులేకున్న నాకీకార్యము సాధ్యమగునా?........ఛీ! ఛీ! అదినాకెంతమాత్రమును సమ్మతములేదు. నాకు శక్తిలేనిచో మగధరాజ్యమేమైపోయినను పోనిమ్ము. హీనవంశజాతుఁడగు చంద్రగుప్తునిసేవకుమాత్రము నేనంగీకరింపను. ఆకార్యమెన్నటికిని నాచేతఁగాదు. రాజ్యసంరక్షణమునుగూర్చి యింకేవిధముననైన, నుపాయమాలోచింపవలయును. ఊరక యిట్లు కాలయాపనమొనర్చినచో నింతలో మలయకేతుఁడు సామ్రాజ్యము నాక్రమింపకమానఁడు. వానికి మ్లేచ్ఛుల సాహాయ్యము గుడిభుజమువలె నున్నది. అందుచేతనే యామూర్ఖుఁడూరక పేరాసఁగొని విఱ్ఱవీగుచున్నవాఁడు. కావుననే నింకఁ ద్వరపడవలసియున్నది."

అని రాక్షసుఁడొకనాఁడు తనమందిరమున నొంటరిగఁ గూర్చుండి తనలోఁదానె వితర్కించుకొనుచుండెను. ఇంతలో నొకసేవకుఁడు వాని చెంతకువచ్చి యెవరోవచ్చి ద్వారమున వేచియున్నారని పలుక నతఁడాతురతతో "ఎవరావచ్చినవా" రని యడుగ ఒకబ్రాహ్మణోత్తముఁడని బదులు చెప్పెను. ఆబ్రాహ్మణుఁ డతిథియనితలంచి రాక్షసుఁడు వెంటనే వానిని లోనికిఁ గొనిరమ్మని యానతీయ నాసేవకుఁడు వీధిలోనికిఁబోయి కొంతసేపునకు వానిని లోనికిఁగొనివచ్చెను. చాణక్యుఁడు మిక్కిలి తేజస్వియనియు, రూపసియనియు రాక్షసుఁడదివరకే వినియున్నవాఁడు కావున నాబ్రాహ్మణుని యాకారముఁజూచి యాతఁడే యీతఁడేమోయని శంకవహించెను. కాని చాణక్యుఁడు తనవద్దకు వచ్చుటకేమి కారణమున్నదని మరలఁదానే సమర్థించుకొని యిట్లు ప్రసంగించెను.

"విప్రశ్రేష్ఠా! తమకేవిధమైన సేవచేయవలెనో నాకుఁ దెలియదు. తమరేకార్యముమీద నీరాక్షసుని యింటికివచ్చితిరి?"

"అమాత్యశేఖరా!..........."

"అయ్యా! క్షమింపుఁడు. ప్రస్తుతము నేనమాత్యపదవియందు లేను. ఆయుద్యోగము నాకిష్టములేక నేనేవిడిచిపెట్టి కొంటిని. కొన్నిదినములక్రిందటఁ బాటలీపుత్రమున జరిగిన యక్రమము నెఱిఁగియు నన్నిట్లు పిలుచుచున్నారేల?"

"అదేమది? అద్భుతముగ నున్నది? మీమంత్రిత్వమున కేమియును భంగములేదే? అదియునుగాక యెప్పటికయినను పాటలీపుత్రసింహాసనామాత్యోద్యోగము మీకేయంకితమైయున్నది. కావున మిమ్మునేనిట్లేపిల్చెదను. అయినను మీకపకీర్తి వచ్చినమాట గూడ నిశ్చయమే! ఇదంతయుఁ జాణక్యుఁడు చేసినమాయయే కాని వేరొండుకాదు. జరిగిన దానినిఁగూర్చి మీరెంతమాత్రమును విచారింపకుఁడు. తమరులేకున్నచో మగధరాజ్యముని

మిసమైననిలువఁజాలదు. ఆవిషయమును గూర్చి మిమ్ము బ్రతిమాలుటకేయిప్పుడు చాణక్యుఁడు నిర్మల హృదయుఁడై తమదర్శనమునకు వచ్చియున్నవాఁడు."

ఈమాటతోఁ దనతోసంభాషించుచున్నవారెవరో రాక్షసునకుస్పష్టమయినది. నందకులమంతయుఁ జిందర వందరఁ జేసి తనకింతటి యపకీర్తి దెచ్చిన శత్రువుతోమాటాడుటకు వానికసూయపుట్టినను, బ్రాహ్మణుఁడగుట నేమియుఁ ననఁజాలక రాక్షసుఁడు ప్రత్యుత్తరమీయ కూరకుండెను. అప్పుడు మెల్లఁగఁ జాణక్యుఁడు

"అమాత్యరాజా! ఇప్పుడు మీయెడ యదార్థవాదినై యున్నాఁడను. నేను జేసినయపరాధముల క్షమింపుఁడు. నిండోలగంబున నందరాజుచేఁ బూర్ణముగ నవమానింపఁబడి వానివంశమును నాశనముఁ జేసెదనని ప్రతిజ్ఞ పట్టినందున నేటికి నేనింతవరకుఁ జేయవలసివచ్చినది. మీరు నందభక్తు లయినను తమభక్తినంతయు నిప్పుడు చంద్రగుప్తున కర్పింపవలసియున్నది."

ఆమాటలు విని రాక్షసుఁడు మొగమువాల్చుకొని చేతితోఁ దలపైఁ గొట్టుకొనుచుఁ గొంతసే పూరకుండి తరువాత,

"చాణక్యా! ...."

"ఇంక నాపేరు చాణక్యుఁడు గాదు. విష్ణుగుప్తుఁడు. నందవంశము నాశనముఁ జేయుదాక నే నీక్రొత్తపేరు వహించియుంటిని."

"ఏమీ? నందకులమంతయు నాశనముఁజేసి యెచ్చటనుండియో వ్యాధపుత్రుఁడగు చంద్రగుప్తునిఁ గొనివచ్చి వానికి రాజ్యమీయఁ దలంచిన కపటచాణక్యుఁడవు మీరేనా? లేకున్నచో నాయింటికివచ్చి నాయెదుట నే యింతనిర్భయముగ మాటాడువాఁ డింకెవ్వఁడు? అయ్యో! ఇంక నావిషయ

మై మీరేమియును మాటాడుకుడు. ఇంత ఘోరమొనరించి నన్నుఁ దెప్పటా కావచ్చితివి? బాగుబాగు. ఇంత యనుభవించి ఇంకను మంత్రినై గోతిలోఁ బడుట కంతయంధుఁడను గాను. నీ వెందుకువచ్చితివో నే నెఱుఁగుదును. నీ కింత యపకీర్తి నేనే తెచ్చితినని నీవే చెప్పుచున్నావా? నన్నవమానించుట కా నూయింటికి వచ్చితివి? అయ్యో! ఇట్టిమాటలాడి నన్నుమోసపుచ్చుట నీకు భావ్యముగాను. ప్రత్యేకముగవచ్చి నన్నధిక్షేపింప నక్కఱలేదు. నాయపనింద నేనేవెల్లడిజేసికొనెదను. నాకు సిగ్గులేదు. దాని నిదివరకే విడిచిపెట్టుకొంటిని."

"అమాత్యరాజా! ఇంక మీనిష్ఠురోక్తులేటికి? నిన్ను నిందించుటకు నేనురాలేదు."

"అట్లయిన నింతశ్రమపడి మరెందుకు వచ్చినావో?"

"చంద్రగుప్తునిసేవ కంగీకరించి మగధరాజ్యచక్రమును జక్కఁగఁ ద్రిప్పుచుఁ బూర్వముకన్న నెక్కుడుగఁ బరిపాలింప వలయునని చెప్పుటకు వచ్చితిని."

"ఓహో! ఎన్నటికిని జరుగనేరని పనికొఱకా నీరాక?"

"ఎందుకుజరుగదు? మగధరాజ్యము మ్లేచ్ఛుల పాలఁబడకుండ గాపాడుభారము దైవము మీయందే పెట్టియున్నాడు. ఇది తప్పదు. ప్రస్తుతము శత్రువులు యుద్ధసన్నద్ధులైయున్నవారు. ఆసంగతిమీకుఁ దెలిసియే యున్నది. కావున నిట్టి తరుణమునఁ దమరు మంత్రిపదవి నంగీకరించి పనిచేయక తీరదు."

"అయ్యో! నన్నేమి చేయుమనెదవు? నందులకుఁ దప్ప యితరులకు సేవఁజేయునని యీరాక్షసుని ప్రతిజ్ఞ, ఇందుకు తిరుగులేదు."

"ఔను. మగధరాజ్యమునకు సేవఁజేయుదురా లేదా? యవనులువచ్చి పైఁబడిన నూరకుండెదరా? ఇట్టి నిరర్థకమైన ప్రతిజ్ఞ నెందుకుఁ జేసిరి?"

"ఇంకను నేమికారణము కావలెను?"

"అట్లుకాదట్లుకాదు. మొన్నటిదినమునఁ దమరు మలయకేతుని వద్దనుండి వచ్చిన సారంగునితో........"

"ఏమేమీ? వానితో నేనేమి మాటాడితినో నీ కెట్లు తెలిసినది? ఆతఁడు మీతోఁ జెప్పెనాయేమి?"

"ఆతఁడేవచ్చి చెప్పనక్కఱలేదు. వానివెంటఁ దమయొద్దకువచ్చిన సంవాహకుఁడు. మారువేషధరుండగు నాశిష్యుఁడే!"

"అట్లయిన నీశిష్యులు మారువేషములనూని నాయింటిలోఁగూడ సంచరించుచున్నారా యేమి? ఆహా! చాణక్యా!"

"లేరులేరు. తమయింటిలో నట్టివారెవ్వరును లేరు. మీరావిషయమై యనుమానింప నక్కఱలేదు. సారంగునితోఁ దమయొద్దకు వచ్చినవాఁడు నాశిష్యుఁడే. కాని యాబ్రాహ్మణుఁ డేసంగతి నెఱుంగనేయెఱుఁగఁడు."

"అయ్యో! తమకైంద్రజాలవిద్యయం దేమైనఁ బ్రవేశమున్నదా?"

"అహాహాహా! తమరిట్లు సెలవిచ్చుట ధర్మముగాదు. ఆసంగతి నట్లుంచి, తమరింక జరిగిన దానిఁగూర్చి యింకవిచారింపకుఁడు. పూర్వాధికారమును వహించి చంద్రగుప్తునిఁ జేరఁదీయుఁడు. మీవిషయములో జనులెల్లరు నిర్మలబుద్ధితోనే యున్నారు. వారెవ్వరికిని మీపై నెంతమాత్రమనుమానములేదు. నందరాజు నాకొనరించిన పరాభవము వలన నేనింత సాహస మూనవలసివచ్చినది. కాని యింతమాత్రమున మగధరాజ్యమున కేవిధమైన ద్రోహము జరుగలేదు. తమరు పూర్వమువలె నమాత్యపదవి నంగీ

కరించినచోఁ దక్షణమ నేను హిమాలయపర్వత గుహాలలోనికిఁబోయి యచ్చట తాపసవృత్తినిఁ గాలముఁగడుపుచుండెదను. నాకింక నెట్టికోరికలును లేవు. ప్రస్తుతము యవనసేన పాటలీపుత్రముపైకి దాడివెడలుటకు సిద్ధముగ నున్నది. చంద్రగుప్తుఁడు మిక్కిలి శూరుఁడేయైనను మీసాహాయ్యముఁ గూడ నుండినచో నిమిసమాత్రమున నాశత్రులఁ బొగరడపఁగలఁడు. మీరింక సంశయింపకుఁడు. జనులెల్లరు మీపైసదభిప్రాయముతోడనే యున్నారు."

"అయ్యో! స్వామిఘాతకునితో మాటాడుట నాకిష్టములేదు. ఇంతవరకుఁ బ్రసంగించినదే చాలుచాలు. ఇంక నేటికిట్టి పొల్లుమాటలు? మ్లేచ్ఛుల సంహరించి మగధరాజ్యమును గాపాడుటయందు మీకు నేనెంత మాత్రమును అభ్యంతరము గల్గింపను. మీకార్యములకు నేను విఘ్నముఁ దలపెట్టను. నేనుమంత్రి పదమంగీకరింపనిచో మ్లేచ్ఛులఁగూడి మీకెట్టి యాపదఁదెచ్చెదనో యను భయము మీకక్కఱలేదు. నేనట్టి మూర్ఖుఁడను గాను, ఇంతకన్న నింకేమి చేయఁగలను నావలన నింకెట్టి లాభమును మీరు పొందఁగలరు?"

"అమాత్యరాజా! మీరట్లు సెలవిచ్చుట న్యాయముగాదు. నేను మిమ్ములను మోసపుచ్చినను మీ మర్యాదయు మీ యోగ్యతయు నెఱింగి యెంతయో సంతసించి నిర్మలహృదయుఁడనై స్వయముగ మాటాడవలెనని తమదర్శనమునకు నేనేవచ్చితిని. హిరణ్యగుప్తుఁడు, బాహురాయణుఁడు, చందనదాసు మొదలగు వారినందరిని సులభముగ లొంగించుకొంటినిగాని మిమ్ము వశపఱచుకొనుట యెంతప్రయత్నించినను నాకు వీలైనదికాదు. అందుచేఁ దమయుద్దేశ మెట్టిదియో కనుంగొనవలయునని సారంగునివెంట నాశిష్యుని తమయొద్దకుఁబంపి మిమ్ముఁబరీక్షించితిని. మగధరాజ్యముపై నత్యంతమైన యభిమానమును, యవనసేనపై నత్యంతమైన ద్వేషమును తమరు వహించియుండుటెఱింగి, తమకుఁజేసిన యపరాధమునకుఁ బశ్చాత్తాప మొం

దుచు సిగ్గువిడిచి నిష్కపటచిత్తుఁడై యీచాణక్యుఁడు తమపాదము చెంతకువచ్చి యున్నాడు. ఇంక నా ప్రార్థనమాలకించి చంద్రగుప్తునిఁ జేరఁదీసి రక్షింపుఁడు.''

"అయ్యా! ఎన్నిమారులు చెప్పవలయును మరలమరల నన్నెందు కడిగెదరు? స్వయంకృత ప్రతిజ్ఞాపరిపూర్తికన్న నితరము లెట్టివైన నాకక్కరలేదు. నన్ను క్షమింపుఁడు నేను నందవంశమునకు భక్తుఁడను. వారి సేవతప్ప నితరులను సేవింపనని నాదీక్ష.''

"అమాత్యరాజా! మీరెవరిని సేవించినను మగధరాజ్యమును గాపాడు భారము మాత్రము మీరు వహింపకతప్పదు. సరేకాని నందకులసంజాతు నెచ్చటనుండియైనఁ గొనివచ్చినచో వానిసేవఁజేయుట కంగీకరించి మీ మంత్రిత్వమును మీరు వహించెదరా?''

"నేనుచేసిన ప్రతిజ్ఞయే యది! వేరుగనడుగనేల? నందుఁడెవఁడైననున్నచోఁ దప్పక వానిని బాగుఁజేసెదను. బ్రాహ్మణోత్తమా! మీరు మాత్రము రాజనీతి యెఱుంగరా? మీరు నాకెంతటి ద్రోహమొనర్చినను మీబుద్ధి విశేషమునకు నేనెంతయో సంతసించితిని. మగధరాజ్యముపై మీకు మిక్కిలి యభిమానముగలదు. కావున నింక వృథాసంభాషణమును గట్టిపెట్టి, నందవంశాంకుర మెచ్చటనైన నున్నచో వెదకివెదకి కొనిరండు. మనోవాక్కాయ కర్మముల వానిని బాగుఁజేసి నేనుపట్టాభిషేకముఁ జేసెదను. చంద్రగుప్తుని పాటలినుండి గెంటించి పూర్వమువలె రాజ్యముపై నాయభిమానమును రాజభక్తియుఁ జూపెదను.''

ఆమాటలకుఁ జాణక్యుఁడు నవ్వెను. అది జూచి రాక్షసుఁడు

"ఎందుకు నవ్వెదరు? నన్నుఁ బరిహాసమాడుటకా?''

"కాదు కాదు. నిజముగ నట్లు జరిగి తీరును కదాయని నవ్వుచున్నాను. నేను తప్పక నందవంశోద్భవు నొకనిఁ గొనివచ్చెదను.''

"ఔనుకాని, మిమ్ములను నమ్ముటకు నాకు శక్యము గాకున్నది ఏమో.''

"లేదులేదు. నేను నిజమే చెప్పుచున్నాను. కాని మీరుమాత్ర మాడినమాటఁ దప్పఁగూడదు జాగ్రత్త.''

"ఆడినమాట తప్పుట మావంశమున నెందునులేదు. ఇప్పుడు క్రొత్తగనెట్లు వచ్చును?''

"సరే! అమాత్యరాజా! తమరు చంద్రగుప్తునకు సేవఁజేయ నక్కరలేదుకాని యీ రక్షాబంధమును చిత్తగింపుఁడు. ఇది నందవంశములోనిదేనా? ఇందుపైన నందుని ముద్రయున్నదా? దీనినిఁ జూచినట్లు మీకెన్నఁడైన జ్ఞాపకమున్నదా?''

రాక్షసుఁడు కొంతవరకు దానినిఁ బరికించి

"అయ్యా! ఔనౌను జ్ఞప్తికివచ్చినది. ఈ రక్షాబంధమును నేను జక్కఁగ నెఱుఁగుదును. మానందవంశములోని వారిట్టివియేకాని తమబాలకులకు నితరముల నెన్నఁడును గట్టలేరు? ఇది మీకెట్లువచ్చినది?''

"ఎట్లువచ్చినదో నేనుచెప్ప నక్కరలేకుండ మీరే తెలిసికొనఁగలరు. కావున నాసంగతి నట్లుండనిండు...... (ప్రక్కకుఁజూచి) శారద్వహా! ఇటురా''

వెంటనే యొకబాలుఁడువచ్చి వానియెదుట నిలిచెను. అప్పుడు చాణక్యుఁడు,

"అమాత్యరాజా! ఇంక నీబాలునిఁగూడఁ గొంతపరీక్షింపుఁడు. వీని హస్తమునఁగల శుభరేఖల నవలోకింపుఁడు. ముఖలక్షణములఁ గొంచెము విచారింపుఁడు. వీనికిఁ జక్రవర్తి చిహ్నలున్నవా లేవా? వీఁడుచక్రవర్తి కాఁగలవాఁడా కాఁడా? మీరే ఆలోచింపుఁడు. సామాన్యున కిట్టి చక్రవర్తిలక్షణము లుండునా?''

మంత్రి కేమి చెప్పుటకును దోపనందున మారుమాటాడక, ఆబాలుని మొగముఁ జూచుచు నూరకుండెను. అందుచే చాణక్యుఁడు,"

"అమాత్యరాజా! ప్రతిజ్ఞాభంగముఁ జేసికొనకుము. నందవంశాంకురమును గొనివచ్చి యిప్పుడే నీకుఁ బ్రత్యక్షముగఁ జూపితిని. ఈబాలుని చరిత్ర మతివిచిత్రమయినది. వీని జననకాలమున గ్రహసంచారము యుక్తరీతి నేయుండెను కాని, యొకదుష్టగ్రహమువలన నీతఁడు మహారణ్యమున నష్టకష్టము లొందవలసివచ్చెను. వీనితల్లి కిరాతమహారాజు కుమారిక. సేనాపతి అతని కుమారికను గొనివచ్చి మనధననందున కర్పింప నతఁడు గాంధర్వవివాహమున నామెను జేపట్టెను. కొంతకాలమునకు భగవదనుగ్రహమున నీబాలుఁడామె గర్భమునుండి యుద్భవించెను. ఈబాలుని గ్రహదోషమువలన బలవంతముగఁ జంపుటకై యడవికిఁ బంపుట తమకుఁ గొత్తవిషయము కాదు. కాని తరువాత వృత్తాంతము మాత్రము తమరెఱుఁగరు. వీనియదృష్టవశమునఁ దలారులు వీనినిఁ జంప నేరక యరణ్యమున విడిచిపెట్టి పోయిరి. తరువాత నతఁడొక పసులకాపరికి దొరకనాతఁడు తన సంతానముతోఁ బాటు వీనినిఁ గొంతకాలము పెంచి తరువాత నాకప్పఁ జెప్పెను. నేనీబాలకుని నాదరించి సమస్తవిద్యలు నేర్పి నాప్రియశిష్యునిగాఁ జేసికొంటిని. వీనివిషయమునఁ దమప్రతిజ్ఞ నిప్పుడు పరిపూర్తిఁ జేసికొన వలసియున్నది."

ఆమాటలు వినినంతనే మంత్రికి శరీరముపై స్మారకము దప్పి యొక్కింతసేపు, నలుకును బలుకును లేక, అట్లేయుండిపోయెను. అదికనిపెట్టి చాణక్యుఁడు,

"అమాత్యరాక్షసా! ఇంకను సంశయమెందుకు! ఈబాలుఁడు, ధననందుని ముద్దులభార్యయైన మురాదేవి కుమారుఁడే యనుటకును, చక్ర

వర్తి కాఁగలడనుటకును, వీనిముఖలక్షణములే స్పష్టముగ సాక్ష్యముఁ జెప్పుచున్నవి."

"చాణక్యా! ఈపిల్లవానికిఁ జక్రవర్తి లక్షణములుండుట వాస్తవమే! యీగతిబంధము నందులదే కాని యితరుల వస్తువుగాదు."

"అట్లయినయెడల నింకను సంశయమెందుకు?"

"లేదు కాని, యీతఁడు ధననందుని కుమారుఁడా? చంపఁబడినవాఁడు మరల నెట్లు బ్రతికి వచ్చెను?"

"లేదు లేదు. ఈతఁడు చంపఁబడలేదు. ఇందుకుఁ బంచఘాతములును సాక్షులైయున్నవి. ఈబాలునిఁ బెంచిన గొల్లవాఁడిక్కడనే యున్నవాఁడు వలయునేని మీరు వాని నడుగవచ్చును."

అని ప్రక్కకుఁ జూడ నదివరకే ద్వారము వద్ద వేచియున్న యొక వృద్ధగోపాలుఁడు లోనికివచ్చి మంత్రికి నమస్కరించి యేమేమో కొన్ని మాటలను జెప్పెను. అంతపై రాక్షసుఁడు"

"ఆర్యా! చాణక్యా! నిష్కారణముగ నేనుష్టస్త్రీ నందరాజును గోరికోరియాపుమాపెనో, అట్టి మురకుమారుని నేనెట్లు చేరఁదీయఁగలను? వీఁడుదక్క నందాంకుర మింకెక్కడనైన లేదా?"

"లేదు లేదు. భూనభోంతరాళముల నెచ్చటవెదకినను కార్యము లేదు."

"అట్లయిన నేనిప్పుడేమి చేయవలెను?"

"ఏమిచేయవలయునో మీరెఱుఁగరా?"

"నాకేమియును దోపలేదు. మీరే చెప్పుడు."

" మారుమాటాడక వీనిని సింహాసనము నెక్కింపుఁడు."

" ఇది నాకుఁ దప్పదు కాఁబోలు ?"

" తప్పదు. తప్పదు. ఎట్లును తప్పును ?"

" అదేఆలోచించి చెప్పుఁడని కోరుచున్నాను."

" అట్టులైనచో నేను జెప్పినట్లు చేసెదరా ?"

" అయ్యా! దయచేసి సెలవిండు. ఆముష్టురాలి కుమారునికన్న నింకే విధమైన యాధారమును లేదా ?"

" లేకేమి ? తమ ప్రతిజ్ఞాభంగముఁ జేసికొని యితరుల సేవించినచో మీకీ బాలుని సేవచేయు భారము దప్పును చంద్రగుప్తుఁడొకడు"

" ఛీ! ఛీ! ప్రతిజ్ఞాభంగమా ? ఈ బాలుఁడెట్టివాఁడైనను నందవంశాంకురమగుట వీనినే సేవించెదను గాని యితరులఁ గన్నెత్తి చూతునను కొంటివా? ఆహా! చాణక్యా! చంద్రగుప్త పక్షపాతమున నీవింకను విడువకున్నావు కదా?"

" ఆర్యా! లేను లేను విడిచిపెట్టితిని తనుకిష్టములేని కార్యము నేను జేసెదనా? వీనిని మీరింక గద్దెపై కెక్కించి పట్టాభిషేకోత్సవము మహోత్సాహమునఁ గావింపుఁడు.".

" చాణక్యా! నాకెవ్వరును సాహాయ్యముగ లేరే? నాకీకార్యమెట్లు సాధ్యమగును? బాహురాయణుఁడు మొదలగువారందరు"

" అబ్బా! వారల సంగతులెందుకు? వారందరును మీకు దాసానుదాసులయ్యెదరు. నేనుకావలసినంత సాహాయ్యముఁ జేసెదను."

" సరే! కానిచాణక్యా! ఇంతకాలమునుండియుఁ జంద్రగుప్తునకే రాజ్యమిప్పించుటకుఁ బ్రయత్నించుచుంటిరే! వీని నెందుకుగొని వచ్చితిరి? చంద్రగుప్తునకును మీకును ఈమధ్య నేమైనజగడమువచ్చినదా యేమి ?"

" (నవ్వుచు) లేదు లేదు."

" లేకున్న చో వానినేమి చేసెదరు ?"

" వాఁడే వీఁడు."

ప్రకరణము. 15.

సమాప్తి.

చదువరులారా! ఇంతతో మనకథ సమాప్తికివచ్చినది. చాణక్యుఁడు చంద్రగుప్తునకు మాయవేషముచేసి తనశిష్యుఁడనిచెప్పి రాక్షసునియొద్దకుఁ గొనివచ్చెను. చంద్రగుప్తుఁడు నందకుమారుఁడేయని తెలిసిన తరువాత రాక్షసుఁడు మిక్కిలి ఆశ్చర్యమునొంది చాణక్యుననేకవిధములఁ గొనియాడెను. అమాత్యుఁ డుత్కృష్టమైన రాజభక్తినవహించి బ్రతికియున్నంత కాలమునుఁ జంద్రగుప్తుని విడువలేదు. కార్యానంతరమునఁ జాణక్యమహిమచే బాహురాయణ ప్రముఖులందఱు రాక్షసునకు మఱల వశులైరి. మలయకేతుఁడు తరువాత నాయులక్షల సైన్యమును సిద్ధముఁ జేసికొని చంద్రగుప్తునిపైదాడి వెడలెను. కొనిపూర్ణమైన పరాభవముతో నతఁడు తానువచ్చిన త్రోవనే పోవలసివచ్చినది. రాక్షససాహాయ్యమున మనచంద్రగుప్తుఁడు గ్రీక్కువారినిఁ గూడ నోడించి, సింధు గాంధార కాశ్మీరాది దేశము లన్నియుఁ దనవశముఁ జేసికొని, శల్యూకసువలనఁ గప్పమును బొందుచుండెను. శల్యూకసు తనకుమారి కనుగూడఁ జంద్రగుప్తున కొసంగి వివాహముఁ జేసెను. తరువాతఁ జంద్రగుప్తునకు బిందుసారుఁడను నొకకుమారుఁ డుదయించెను.

పర్వతరాజు చెఱనుండి విడువఁబడి యప్పటినుండియుఁ జంద్రగుప్తునకాప్తుఁడయ్యెను. చంద్రగుప్తుఁ డొకటి రెండుసారులు శల్యూకసును జయించినతరువాతఁ జాణక్యుఁడు తపోనియమునకై హిమాచలమునకేఁగెను. చంద్రగుప్తుఁడు తనసహాధ్యాయుల నందఱిని రప్పించి తనసైన్యములో నుంచుకొని యాదరించుచుఁ దన్నరణ్యములోఁ బెంచిన గొల్లవాండ్రనెల్లఁ జేరఁదీసి వారినిఁ గూడఁ బోషించుచుండెను. సుమతియు బృందమాలయు వసుభూతివలన బౌద్ధమతమును స్వీకరించిరి. అందువలనఁ గ్రమక్రమముగ నామతము ప్రబలినదని చెప్పవచ్చును.

ఆంధ్రగ్రంథరత్నమాల.

మ॥ స్థిరబుద్ధిన్ బనిఁబూని తల్లిఋణముల్ దీర్పంగ నూహించినన్
శరణంబిచ్చి యథావిధిన్ మనము భాషాసేవ సేయన్ వలెన్
సరసాగ్రేసరులార! కావున స్వభాషాకాంత కర్పింప స
త్వరముం జేకొనరయ్య! మత్ప్రకటితాంధ్రగ్రంథ రత్నంబులన్ ॥

ఇందు సం॥ 1-కి 8 గ్రంథముల చొప్పున వెలువడుచుండును. పద్యగ్రంథములు, గద్యగ్రంథములు, నాటకములు, నవలలు, దేశచరిత్రలు, అవకాశమున్నయెడల మహనీయులజీవితములు, ఇంతియకాక ఆంధ్రదేశోపకారకరములై చదువరుల కుల్లాసముఁ గల్గించు నుత్కృష్ట గ్రంథములు ఈ గ్రంథమాలయందు చందాదారులైనవారికి మిక్కిలి తక్కువ వెలలకు లభించును. ప్రస్తుత మాంధ్రలోకమున కత్యావశ్యకములగు నవలలే యిందుఁ దఱుచుగఁ బ్రకటించుచుందుము. సాధారణముగఁ జరిత్రవిషయిక గాథలేకాని పురాణగాథ లంతగా నుండవు.

చందా సం॥ 1-కి 2 రూపాయిలు మాత్రమే. ఈసొమ్ము ముందుగాఁగాని యొక్కమారుగాఁగాని మాకీయనక్కరలేదు. ప్రకటింపఁబడిన ప్రతిగ్రంథమును తమకుఁ జేరినవెంటనే దానివిలువ నొసంగి పుచ్చుకొనవచ్చును. అనఁగా ఒకసంవత్సరములో మేము ప్రకటించు 8 గ్రంథములును 2 రూపాయిలకన్న నెక్కుడువెల కానేరవు. చందాదారులు కాఁగోరువారు 2 అణాలు ప్రవేశరుసుము చెల్లింపవలెను.

మా గ్రంథమాలకు 5 గురు చందాదారులను జేర్చినవారికి యిదివరకుఁ బ్రకటింపఁబడిన కృష్ణాకుమారి యనుగ్రంథ ముచితముగ నిచ్చెదము. 15 గురు చందాదారులను జేర్చినవారికి శాశ్వతముగ మా గ్రంథము లుచితముగ నిచ్చెదము.

N. భాగీరథి.

కార్యదర్శి,

ఆంధ్రగ్రంథరత్నమాలా కార్యస్థానము, బరంపురము.

ఇదివరకుఁ బ్రకటింపఁబడిన గ్రంథములు 1.

కృష్ణాకుమారి.

ఇదియొక చరిత్రవిషయిక ప్రబంధము. 1792-వ సం॥ లో రాజస్థానమునజనించి సాహసౌదార్యములయందు చిత్తూరు పద్మినీదేవిని ధిక్కరించి పౌరుషపరాక్రమాదులయందు సంయుక్తాదులకు మిన్నయై విద్యాలంకారయై నేటివరకును రజపుత్రులచే భవానీదేవివలెఁ బూజింపఁబడుచున్న కృష్ణాకుమారి విచిత్రచరిత్ర మిందుచక్కఁగ వ్రాయఁబడినది. అత్యద్భుతము మృదుశైలి మనోహరమైన పద్యములు. గ్రంథకర్త భోగరాజు. నారాయణమూర్తి.

చందాదారులకు (పోస్టేజీసహా)	వెల 9 అణాలు.
ఇతరులకు (పోస్టేజికాక)	వెల 12 అణాలు.

2-వ గ్రంథము.

లతాంగి.

ఇది చరిత్రాత్మకమగు చిత్రనాటకము. అక్బరుసేనానియగు జయచంద్రునిభార్య నర్మద చిత్తూరువారినిఁ గూర్చి భర్తతోఁ గలహించుటయు, ప్రతాపసింహుని పౌరుషమును, వీరాభాయి యుద్ధనైపుణ్యమును, లతాంగీ ప్రతాపుల యనురాగమును, అనేకమారు వేషములదాల్చి యష్టకష్టములొంది నర్మద తనభర్తను రణరంగమునఁ గాపాడిన విధమును, లతాంగినిఁ జేపట్టుటకు ప్రతాపుని కష్టములును ఇందత్యంత వినోదముగ వర్ణింపఁబడినవి. గ్రంథకర్త: భోగరాజు. నారాయణమూర్తి.

చందాదారులకు (పోస్టేజీసహా)	వెల 9 అణాలు.
ఇతరులకు (పోస్టేజికాక)	వెల 12 అణాలు.

3-వ గ్రంథము.

చంద్రగుప్త.

ఇదివరకెన్నఁడును మనయాంధ్రభాషలో నెవ్వరునుజూచి యెఱుఁగని యద్భుతమైన యీచరిత్రవిషయికనవల మనయాంధ్రభాషాయోషామణికి నూతనాలంకారమని చెప్పవలసియున్నది. మగధేశ్వరుఁడగు ధననందునిచేఁ జాణక్యుఁడను నొకబ్రాహ్మణుఁడు పరాభవమొంది నందవంశము విధ్వంసమొనర్చెదనని ప్రతిజ్ఞఁబూనుటయు, మగనిచే నవమానింపఁబడిన మురాదేవి దుఃఖమును, చంద్రగుప్తుని సుగుణపరాక్రమములును, చండశాసనుండగు చాణక్యుఁడు చంద్రగుప్తునిఁ జక్రవర్తినిఁ జేయుటకై పాటలీపుత్రమునకు వచ్చిచేసిన మాయలు, మంత్రములు, తంత్రములు, కుట్రలును, మురాదేవి సవతులపై రాజునకీర్ష్యఁబుట్టించు విధములును, ఆమెయెడ రాజునకుఁ గలమోహమును, చంద్రగుప్తుఁడు చక్రవర్తియగుట కంగీకరింపని రాక్షసామాత్యుని పట్టుదలయు, సత్యనిష్ఠయు, చాణక్యుఁడు వానికిఁ బెట్టిన కష్టములును, చంద్రగుప్తుని రాజుగాఁ జేసినవిధమును ఈనవలయందు మిక్కిలి చక్కఁగవర్ణింపఁబడె. గ్రంథమంతయుఁ గొనవరకుఁ జూచినదనుక విడువబుద్ధిపుట్టదు. గ్రంథకర్త: భోగరాజు. నారాయణమూర్తి.

వెల (పోస్టేజితో) చందాదారులకు రు. 1-0-0

ఇతరులకు (పోస్టేజికాక) రు. 1-4-0

4-వ గ్రంథము. (అనుబంధము.)

తలవెండ్రుకలా? కమలా ఫలమా?

ఇయ్యది బరంపుర వాస్తవ్యులును కల్లికోట రాజావారి కాలేజీలో నుపాధ్యాయులు నగు మ-రా-రా-శ్రీ ఉన్నవ. వేంకటవరహాబుచ్చి రామలింగము పంతులు, బి. ఏ., యల్. టి., రచియింపఁబడిన మనోహరమగు చిన్న నిరూపక కథ. (Detective tale) చదువుచున్నంత సేపును నవ్వుపుట్టించుటయేకాక మిక్కిలి వినోదమును గల్గించును.

చందాదారులకు ఉచితము.

ఇతరులకు (అంచెకూలికాక) 2 అణాలు.

మా గ్రంథమాలలో నే గ్రంథమును దెప్పించుకొనినను, ఇతరులకుఁగూడ దీని నుచితముగ నిచ్చెదము.

మా గ్రంథమాలలో

క్రొత్త చందాదారులను చేర్చినవారికి బహుమతులు.

I. 15-మంది క్రొత్త చందాదారులను సంపాదించినవారిని మా గ్రంథమాలకు శాశ్వతపు చందాదారులుగా గణించి వారికి మా గ్రంథములన్నియు నుచితముగ నిచ్చుచుందుము. ఆ 15 మంది చందాదారులును మేము పంపు పుస్తకములను వెంటనే తీసికొనువారుగా నుండవలయును. కాని వారు మేముపంపు వి. పి. లను త్రిప్పివేయరాదు.

II. 8-గురు చందాదారులను జేర్చువారికి మా గ్రంథరత్నమాలలోఁ బ్రఖ్యాతివహించిన చంద్రగుప్తయను నత్యద్భుతమగు నవల నుచితముగ నిచ్చెదము.

III. 10-మంది చందాదారులను జేర్చినవారికి 2 సంవత్సరములవరకు మా గ్రంథముల నుచితముగ నిచ్చుచుందుము.

VI. 50-మంది చందాదారులను జేర్చినవారికి మేలైన బంగారు పతకమును బహుమానముగా నిచ్చెదము.

కార్యదర్శి,

ఆంధ్రగ్రంథ రత్నమాల,

బరంపురము.

మా గ్రంథములన్నియు

మీకుఁ జౌకగాఁ గావలయునా?

మా గ్రంథములన్నియు మీకుఁ జౌకగాఁ గావలయునేని తక్షణమే మా గ్రంథమాలలో శాశ్వతపు చందాదారులగుట యుత్తమము. అట్టి శాశ్వతపు చందాదారులు పోస్టేజికాని, వి. పి. ఖర్చులుకాని పెట్టుకొనవలసిన యవసరములేదు. వారికి పుస్తకములను పంపునపుడీ ఖర్చులన్నియు మేమే భరించెదము. ఇదియుఁగాక ఇతరులకు 9 అణాల కిచ్చెడు పుస్తకము నట్టివారికి 6 అణాలకే యిచ్చెదము.

శాశ్వతపుచందాదారులనగేమి?

శాశ్వతపుచందాదారులనఁగా మేము ప్రకటించుపుస్తకములన్నియుఁ గొనుట కంగీకరించినవారు. వారు చందాధనమంతయు నొక్కమారీయ నక్కరలేదు. ఒక్కొక్క పుస్తకము వచ్చినప్పుడు దానివెల యిచ్చి పుచ్చుకొనవలయును. అట్లు శాశ్వతపు చందాదారులు కాఁగోరువారీక్రిందివిలాసమునకు దరఖాస్తులు పంపవలెను.

N. భాగీరథి,

కార్యదర్శి.

ఆంధ్రగ్రంథరత్నమాలా కార్యస్థానము

బరంపురము (గంజాం).

[illegible]గ్రంథరత్నమాల రాఁబోవు గ్రంథము.

కోకిలావసంతము.

ఇయ్య[illegible]నవలము పద్యమయ మగు నొకనవల. భార్యా[illegible]దయాదిత్యుఁడు తన పట్టణపుదేవిని నానాకష్టములఁ బెట్టుటయు, తండ్రి యాజ్ఞానుసారముగ జగదేవుడును వీరమతియు సమస్తరాజ్యమును విడిచి, శ్రీరామచంద్రునివలెఁ గాంతారభూముల కేఁగుటయు, మార్గమధ్యమున దురాత్మురాలైన రాణి వారికిఁ గల్గించిన యాపదలును, మంత్రికుమారుఁడొనర్చిన సాహాయ్యమును, వసంతకుమారునిజననము, విద్యాభివృద్ధి, సుగుణసంపద, మృగయావినోదమును, అరణ్యమధ్యమునఁ గాంతారక్షణమునఁ జూపినధైర్యమును, కుమార్తైకై పట్టణేశ్వరుని సంతాపమును, జగదేవవీరమతుల కుమారాన్వేషణమును, దండనాథుని దుర్నీతియు నిందు గడుమనోహరముగ 430-పద్యములలోఁ వర్ణింపఁబడినవి. శైలిమృదుమధురతరము కొలఁది దినములలోనే వెలువడును.

గ్రంథకర్త:—

భోగరాజు. నారాయణమూర్తి.

END OF
TITLE